స్ఫూర్తికులు

# సాధకుడు

ఎం. నాగశేషకుమార్

**తెలంగాణ హిందీ జర్నలిస్ట్స్ అసోసియేషన్**
హైదరాబాద్ 500 060

# స్వాప్నికులు – సాధకుడు

ఎం. నాగశేషకుమార్, సీనియర్ జర్నలిస్టు

**ప్రచురణ**

ప్రథమ ముద్రణ : 2021

ప్రతులు : 1000

వెల : రూ. 300/–

డిటిపి : గిరి

ప్రతులకు

ఎం. నాగశేషకుమార్

ప్లాట్ నెం. 602, శ్రీకృష్ణా ప్యారడైజ్

గంగా హాస్పిటల్ దగ్గర, సత్యనారాయణపురం

చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ 500 060

మొబైల్ నెం. 9849486750

ప్రచురణ :

**తెలంగాణ హిందీ జర్నలిస్ట్స్ అసోసియేషన్,**

ప్లాట్ నెం. 102, రవి రెసిడెన్సి

రోడ్‌నెం. 4ఎ, శారదానగర్, సరూర్‌నగర్

దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ 500 060



# అంకితం

తెలంగాణ ప్రజల ఆకాంక్ష పూర్తి కోసం, ఆదివాసీల జిల్లా ఆదిలాబాద్‌లో నాయకత్వం వహించి, టిఆర్ఎస్ తూర్పు ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, పేద ప్రజలకు అండగా నిలుస్తూ, బ్రాహ్మణ బంధువుగా నిరంతర సేవలు కొనసాగిస్తూ, అనతికాలంలోనే జిల్లా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సాధించిన మా ప్రియతమ నాయకుడు, ఎం.ఎల్.సి. పురాణం సతీష్‌కుమార్ దంపతులకు.

# కృతజ్ఞతలు

భారతదేశ స్వతంత్ర సంగ్రామాన్ని మించిన తెలంగాణ ఉద్యమానికి అక్షరరూపం ఇచ్చే ఈ మహాయజ్ఞంలాంటి కార్యానికి సహకరించిన మిత్రులు, పాత్రికేయులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ముఖ్యంగా పుస్తక రచనకు స్ఫూర్తినిచ్చిన ప్రజానాయకుడు పురానం సతీష్‌కుమార్‌కు, సహకరించిన పాత్రికేయుడు కిరణ్, మిత్రుడు రాజబాబు, ఎంపిడివో ఆర్.మహేందర్, పేజీ డిజైనర్ గిరి, ప్రచురణకు సహకరించిన మా తమ్ముడు ఎం.శ్రీనివాస్‌లకు హృదయపూర్వక ధన్యవాదాలు.

# 'చంద్రు'నికో నూలుపోగు... ఈ పుస్తకం..

ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల పోరాటాల తరువాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ ప్రజల కల ఫలించింది. తెలంగాణ తొలి దశ ఉద్యమం గురించి, తెలంగాణా సాయుధ పోరాటం గురించి కథలు కథలుగా వినడం, చదవటం తప్ప నేను ప్రత్యక్షంగా చూసింది లేదు. కాని పాత్రికేయుడిగా సుదీర్ఘ ప్రయాణంలో సీమాంధ్ర నాయకత్వంలో జరిగే ఎన్నో అన్యాయాలు నా రక్తాన్ని మరిగించేవి. తెలంగాణాకు జరుగుతున్న అన్యాయాన్ని అవకాశం వచ్చినప్పుడు స్నేహితుల వద్దనో, లేక మరోచోట చర్చల్లో వ్యతిరేకించి, నిరసన తెలపటం చేయడం తప్ప నేనేం చేయలేక పోయా, అయితే తెలంగాణా భాషన్నా, యాసన్నా ఆంధ్రులు విమర్శించే సమయంలోనే తెలంగాణా యాసలో 'చాయ్-పానీ' అనే పేరుతో ఆర్టికల్స్ రాసి రాజకీయ దివాలాకోరును ఎప్పటికప్పుడు విమర్శించాను. ఆ తరువాత మలి దశ తెలంగాణ ఉద్యమాన్ని పాత్రికేయుడిగా దగ్గరగా చూసే అదృష్టం నాకు దక్కింది. తెలంగాణా మలిదశ ఉద్యమ నాయకుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, తెలుగుదేశం పార్టీని వీడి జలదృశ్యంలో తన శాసన సభ్యత్వానికి, ఉప సభాపతి పదవికి రాజీనామా చేసేటప్పుడు ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మొదటి వరుసలో కూర్చున్న నేను, ఆయన సుదీర్ఘ పోరాటంలో ఎదుర్కొన్న ఒడిదడుకులకు నేను ప్రత్యక్ష సాక్షిని. పదిహేనేళ్ళ అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, పరాయిపాలన నుంచి విడిపోయి స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్న నాకు ఉన్నట్టుండి ఒక రోజు ఓ ఆలోచన వచ్చింది. ఎన్నో ఆరోపణలు ఎదుర్కొన్నా, ముఖ్యమంత్రి పదవి చేపట్టి చంద్రశేఖర రావు (కేసీఆర్) బంగారు తెలంగాణా నిర్మాణానికి అహర్నిశలు కృషి చేస్తున్న వైనం చూసి ఆయన కృషిని, తపనను మన రాష్ట్ర ప్రజలకే కాదు యావత్ భారత ప్రజలకు తెలయ చెప్పాల్సిన అవసరం ఉందని అనిపించింది. అందుకోసం ఓ పుస్తకం రాయాలని, అసలు తెలంగాణ సాధించుకోవడాని తెలంగాణ ప్రజల కష్టాలు, కన్నీళ్ళు అవమానాలు, బాధలు ఉత్తర భారతానికి పూర్తిగా తెలియదని, అందుకని అక్కడి బహుజనుల భాష, జాతీయ భాష అయిన హిందీలో రాయాల్సిన అవసరముందని అనిపించింది. అంతే కాకుండా

కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయాలు గురించి, కేసీఆర్ ప్రవేశ పెట్టిన ఎన్నో ప్రజారంజక పథకాల గురించి వారికి తెలియాలంటే మరింత ప్రచారం అవసరం అనుకున్నాను. అయితే, నేను వెంటనే అసలు తెలంగాణ తొలి దశ ఉద్యమం నుండి మలిదళ ఉద్యమం వరకు వివిధ రచయితలు, ప్రముఖులు రాసిన పుస్తకాలు చదివాను. కాని నాకు తెలంగాణ మలి దశ పోరులో అమురులైన ఎందరో త్యాగమూర్తుల గురించే కాకుండా తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొ.జయశంకర్ తో పాటు, తెలంగాణకు జాతి పిత లాంటి కేసిఆర్ చేసిన ఉద్యమ తీరు, బంగారు తెలంగాణ ఏర్పాటుకు పడుతున్న కష్టాన్ని తరువాత తరం వారికి అందించాలని కూడా అనిపించింది. తెలంగాణ ఏర్పాటుపై కలలు కన్న జయశంకర్ సారు– తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర సాధనలో చంద్రబాబు నాయుడు, వైయస్ రాజశేఖర రెడ్డి, రాజగోపాల్ లాంటి వారి కుట్రలు కుతంత్రాలు వల్ల ఎన్నో కష్టాలను ఎదిరించి రాష్ట్ర ఏర్పాటును సాధించిన కేసీఆర్ ల పై ఓ పుస్తకం రాయాలని దానికి స్వాప్నికులు – సాధకుడు పేరు సరిపోతుందని అనుకున్నాను. అందుకే చంద్రునికో నూలు పోగన్నట్లు నా వంతు ధర్మంగా వివిధ సందర్భాలలో వివిధ పత్రికలు, పుస్తకాల(ఆయా రచయితలకు ఈ సందర్భంగా సవినయంగా కృతజ్ఞతలు చెప్పుకుంటూ) లో వారి గురించి తెలుసుకున్న నిజాలు సంఘటనలు, సమాచారం. ఆధారంగా తెలుగు, హిందీ భాషల్లో చిన్న పుస్తకం రాయాలని సంకల్పించాను. నా ప్రయత్నాన్ని వెన్ను తట్టి ప్రోత్సహించి, సహకరించిన అందరికీ ఇవే నా నమస్సుమాంజనులు.

**ఎం.నాగ శేష కుమార్, సీనియర్ జర్నలిస్టు**

# ముందుమాట....

తెలంగాణ ... తెలంగాణ..... తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాకారం కావడానికి కొన్ని వేల గొంతుకలు ఒక్కటి కావాల్సి వచ్చింది. రోజులు..కాదు.. ఏండ్లు పోరాడాల్సి వచ్చింది. ఒక తరం కాదు..కనీసం నాలుగు తరాల పాటు పోరాటం సాగింది. ఎంతో మంది యువకులు తమ ప్రాణాలు బలి చేయాల్సి వచ్చింది. ఆంగ్లేయుల కబంద హస్తాలనుంచి, భారతీయులందరూ ముక్త కంఠంతో స్వతంత్రం కోసం నడుం కట్టి ఎలా పోరాడారో, అలాగే తెలంగాణా ప్రజలందరూ ఏకమయ్యారు. భారత దేశం స్వాతంత్రం పొందాలంటే 400 ల సంవత్సరాలకు పైగా కాలం ఎలా పట్టిందో.. అలాగే తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు కావటానికి 60 ఏండ్లకు పైగా సమయం పట్టింది. భారత దేశ స్వాతంత్రం కోసం ఎందరో నాయకులు తమ తమ పద్ధతుల్లో పోరాడారు. ముఖ్యంగా గాంధీజీ నాయకత్వాన్ని ఆమోదించిన వారు అహింసా వాదమంటూ పోరాడితే....సుభాష చంద్రబోస్ నాయత్వాన్ని స్వాగతించిన వారు 'దెబ్బకు దెబ్బే' పరిష్కారమన్నారు. మరికొందరు జన సమీకరణ కోసం, ప్రజా చైతన్యం కోసం కళా సాహిత్య రంగాలను ఎన్నుకున్నారు. భారత స్వతంత్ర పోరాటం ఎన్నో ఎత్తు పల్లాలను ఎలా ఎదుర్కొందో? ఎంత మంది జైళ్ళపాలయ్యారో ఎంత మంది ప్రాణాలు ఫణంగా పెట్టారో ?....కొందరి త్యాగం గుర్తించ బడ్డది. మరెందరి త్యాగాలో చరిత్రలో మరుగున పడ్డాయి. అలాగే తెలంగాణా ప్రజలు తమ ప్రాంతం వివక్షతకు గురౌతున్నదని, అభివృద్ధి ఫలాలను, వలస పాలకులు గద్దల్లా తన్నుకు పోతున్నారని తమ నిరసనలు తెలిపారు. ఈ నేపథ్యంలో మన రాజకీయ నాయకులు అమ్ముడుపోయారేమో?, కాని ప్రజల్లో మాత్రం తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావాలన్న కోరక ఏమాత్రం తగ్గలేదు. ప్రజల నాడిన తెలిసిన రాజకీయనాయకులు పలు సార్లు తెలంగాణా పేరును అడ్డం పెట్టుకుని రాజకీయ పార్టీలు, ప్రజా సమితులు ఏర్పాటు చేసి తమ పబ్బం గడుపుకున్నారు. బాగు పడ్డారు. కాని చరిత్రలో ద్రోహులుగా మిగిలి పోయారు. ఈ నేపథ్యంలో తెలంగాణా ప్రజల చిరకాల వాంఛను సాధించటంలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) కృతకృత్యులయ్యారు. ఆయనా ఎన్నో విమర్శలను, కష్ట నష్టాలను, రాజకీయ ఒడిదడుకులను ఎదుర్కొన్నారు. తెలంగాణ కోసం తన ప్రాణాలను ఫణంగా పెడతానంటూ ఆమరణ నిరహార దీక్ష ప్రారంభించారు. అయితే ఆరోగ్యం విషమించి ఆమరణ దీక్షను విరమించనున్నట్లు వార్తలు రావడంతో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల ఆగ్రహానికీ గురికాక తప్పలేదు. అంతలోనే

తేరుకోవడం, కేంద్ర ప్రభుత్వం తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం తో ఆ గొడవ సద్దుమణిగింది . అయితే ఆ తరువాత జరిగిన రాజకీయ రగడే కేసీఆర్ ను మరింత పరిణతి చెందిన రాజకీయ నాయకుడిగా నిలబెట్టింది. భారత స్వతంత్ర పోరాటానంతరం దేశమంతా గాంధీజీని ఎలా మూల పురుషుడిగా జాతిపితగా కొలుస్తున్నారో.... అలాగే ఆరు దశాబ్దాల తెలంగాణ రాష్ట్ర పోరాటానికి అంతిమ నాయకుడిగా ప్రజలు ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టారు. తొలి తెలంగాణ ముఖ్యమంత్రిగా దళితున్ని చేస్తానన్న తన హామీ ఊసెత్తక పోయినా, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తెలంగాణా పోరాటంలో కెసీఆర్ చూపిన నిబద్ధతే ఇందుకు తోడ్పడిందని చెప్పవచ్చు. డా. చెన్నారెడ్డి నుంచి ఎందరో నాయకులు ప్రతిసారీ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసమంటూ రాజకీయ పార్టీలు, ప్రజా సమితులు స్థాపించి లక్ష్య సాధనలో విఫలమవటం, కొందరు తమ పార్టీలను ఇతర పార్టీలలో విలీనం చేసి ద్రోహం చేయడం లాంటి చేదు అనుభవాలను చవి చూసినారు కాబట్టే, కేసీఆర్ హామీని అమలు చేయకపోయినా ఫరవాలేదులే, అని సరిపెట్టుకున్నారు. మరో వైపు తెలంగాణా రాష్ట్ర అభివృద్ధి పట్ల ఇంకొకరికి ఆయన కంటే ఎక్కువ అవగాహన ఉండదనుకున్నారు. అలాగే బంగారు తెలంగాణా ఏర్పాటు చేస్తానని, వృద్ధులకు, వికలాంగులకు వేయి రూపాయల పింఛను పథకాలతోనూ, మరీ ముఖ్యంగా డబల్ బెడరూం పథకం పట్ల చాలా ఆకర్శితులైనారు. మరో వైపు ప్రభుత్వ (తెలంగాణ) ఉద్యోగుల సంపూర్ణ మద్దతు వల్ల తొలితెలంగాణ ఎన్నికల్లో మెజార్టీ సాధించారు.

ఏది ఏమైనా తెలంగాణా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా గుడి కట్టున్నారంటే అతిశయోక్తి కాదు. కొందరైతే కేసీఆర్ ను తెలంగాణా జాతి పితగా, మరో గాంధీగా కొనియాడారు. వారి అభిప్రాయం ప్రకారం అది అతిశయోక్తి కూడా కాదు. భారత దేశ స్వతంత్ర పోరాటంలో ఎందరో వీర మరణం పొంది అసువులు బాసినా, జైలు ఊచలు లెక్కబెట్టినా, సుభాష్ చంద్ర బోసు లాంటివారు అడ్రసులే గల్లంతైనా గాంధీజీని మన దేశం జాతి పితగా వేనోళ్ళ కొలుస్తుంటే మన రాష్ట్రంలోనే రెండవ నాగకరికుల్లా, అడగడునా అన్యాయానికి గురౌతూ, అన్ని రంగాలలో వెనకబడ్డ తెలంగాణా ప్రజల చిరకాల వాంఛ 'ప్రత్యేక రాష్ట్ర' ఏర్పాటు కావడంలో కీలక పాత్ర పోషించి, తన రాజకీయ చతురత తో ఎత్తుకు పై ఎత్తులు వేసి ఆంధ్రులకు ఎదురొడ్డిన కేసీఆర్ ను 'తెలంగాణ జాతిపిత'గా తప్పకుండా కీర్తించాల్సిందే. ఈ నేపథ్యంలో కొందరు విమర్శించినా పెద్దగా పట్టించుకోనవసరం లేదు.

# విషయ సూచిక

పార్ట్–1


1. తెలంగాణ స్వాప్నికులు ఎందరో ...సాధకుడు కేసీఆర్ 17
2. సిద్ధాంతకర్త జయశంకర్ 18
3. తోట ఆనందరావు 20
4. ప్రొఫెసర్ కోదండరామ్ 20
5. సోనియా గాంధీ 22
6. ఎస్. జైపాల్ రెడ్డి 22
7. సుష్మా స్వరాజ్, 24
8. కే.కేశవ్ రావు, 25
9. శ్రీనివాస్‌గౌడ్ 27
10. స్వామిగౌడ్ 28
11. జానా రెడ్డి 28
12. దత్తాత్రేయ 29
13. కల్వకుంట్ల కవిత 30
14. కె.టి. రామారావు 30
15. హరీష్ రావు 32
16. అల్లం నారాయణ 33
17. గద్దర్ 33
18. రసమయి బాలకృష్ణ 34
19. గాదె ఇన్నయ్య 35
20. ఘంటా చక్రపాణి 36
21. ఉద్యమంలో మరెందరో... 37
22. జిట్టా బాలకృష్ణా రెడ్డి 37
23. విమలక్క 39
24. జి.కిషన్‌రెడ్డి 39
25. డిఎస్పీ నళిని 40
26. తెలంగాణ ప్రకాశ్ 41
27. మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి 42

28. ఉద్యమించిన ఉద్యోగ సంఘాలు 43
29. కొండా లక్ష్మణ్ బాపూజీ 44
30. పురాణం సతీష్ కుమార్ 45

పార్ట్ –2

తెలంగాణ సాధనలో ముఖ్య ఘట్టాలు– సంఘటనలు

1. విలీనం నుంచి విభజన దాకా 51
2. తెలంగాణ రాజకీయ సారధిగా కేసీఆర్ 54
3.తెలంగాణ వాదాన్ని రగిలించిన టిఆర్ఏస్ 54
4. విద్యార్ధుల్లో తెలంగాణా చైతన్యం 55
5.తండ్రి బాటలో కూతురు, కొడుకు 58
6. అన్నీ తానైన తన్నీరు హరీష్ రావు 59
7. సోనియా గాంధీని ప్రభావితం చేసిందెవరు 60
8.తెలంగాణా ఎం.పి.ల క్రియా శీలక పాత్ర 62
9. శ్రీకాంతా చారి బలిదానం 64
10. మలిదశ ఉద్యమాన్ని ఉరికించిన 14ఎఫ్' 65
11. బీజేపీ పాత్ర 65
12. పోరుబాటలో సీపీఐ 69
13. తెలంగాణ అస్తిత్వ ప్రతీక – తెలంగాణ తల్లి 70
14. తెలంగాణ తల్లి రూపం – నేపథ్యం 71
15. తెలంగాణ తల్లి తొలి విగ్రహాన్ని ఆవిష్కరించిన కె. సి.ఆర్. 73
16. తెలంగాణ తల్లి రూపంలోని ప్రత్యేకతలు 74

పార్ట్ 3

తెలంగాణ ఉద్యమ చరిత్ర

1. ఉద్యమాల ఖిల్లా...తెలంగాణ గడ్డ 77
2. నిజాం పాలన 79
3. స్వతంత్ర హైదరాబాద్ పోరాటం 79
4. హైదరాబాద్ విముక్తి పోరాటం 82
5. రాజకీయ పోరాటం 83

| | |
|---|---|
| 6. భారత దేశ స్వతంత్రం | 84 |
| 7. రైతాంగ పోరాటం | 85 |
| 8. ప్రత్యేక తెలంగాణా ఉద్యమాలు | 86 |
| 9. తొలి తరం తెలంగాణ ఉద్యమం | 87 |
| 10. తెలంగాణా సేఫ్ గార్డ్స్ డే | 87 |
| 11. ముల్కీ నిబంధనలు గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం | 88 |
| 12. తొలి అమరుడు శంకర్ | 88 |
| 13. ఉద్యోగ నాయకుడు ఆమోస్ అరెస్టు– బర్త్ రఫ్ | 89 |
| 14. తెలంగాణ పతాక దినోత్సవం | 89 |
| 15. మలిదశ  ఉద్యమం – మలుపు తిప్పిన కేసీఆర్ రాజీనామా | 90 |
| 16. జలదృశ్యంపై పోలీసుల దాడి | 91 |
| 17. నిజాం కాలం నుంచే ముల్కీ ఉల్లంఘనలు | 93 |
| 18. తెలంగాణ ప్రజా సమితి ఆవిర్భావం | 93 |
| 19. ఐక్యత చాటిన విద్యార్థి లోకం | 94 |
| 20. ఉద్యమంలోకి ఉద్యోగులు, టీచర్లు | 94 |
| 21. ఉల్లంఘనలకు ఆజ్యం పోసిన నీలం | 94 |
| 22. కాంగ్రెస్ తో టీఆర్ఎస్ పొత్తు | 96 |
| 23. కేసీఆర్ రికార్డ్ విజయం | 97 |
| 24. టీడీపీతో కూటమిగా | 97 |
| 25. చీలికలు, వైఫల్యాలపై రాజీనామాస్త్రం | 98 |
| 26. కాంగ్రెస్ వంచన బుద్ధులు | 99 |
| 27. కేసీఆర్ ఆమరణ దీక్ష | 99 |
| 28. మృత్యువును ముద్దాడిన కేసీఆర్ | 100 |
| 29. ఆ 11 రోజుల ఘట్టాల క్రమం ఇది | 101 |
| 30. జే.ఎ.సి. పాత్ర | 105 |
| 31. ఉద్యమంలో ఇంద్రారెడ్డి పార్టీ ఆరంగేట్రం | 107 |
| 32. కాంగ్రెస్ ఎమ్మెల్యేల లేఖాస్త్రం | 109 |
| 33. తెలంగాణ కోసం బి.జె.పి ప్రయత్నాలు | 110 |

| | |
|---|---|
| 34. టీఆర్ఎస్ తో రాజకీయ పునరేకీకరణ | 113 |
| 35. కరీంనగర్ "సింహగర్జన" సభ | 115 |
| 36. ఉద్యోగుల పోరుబాట | 119 |
| 37. తెలంగాణలో రాజకీయ పునరేకీకరణ | 119 |
| 38. చేనేత కార్మికుల కోసం బిక్షాటన | 121 |
| 39. తెలంగాణ జలసాధన సభ | 122 |
| 40. వెయ్యి కార్లతో ఢిల్లీ యాత్ర | 123 |
| 41. వరంగల్ జైత్రయాత్ర : | 124 |
| 42. వరంగల్ సభకు సైకిల్ పై కే.సి.ఆర్ | 124 |
| 43. రాజోలిబండ పాదయాత్ర | 125 |
| 44. నాగార్జున సాగర్ ఎడమ కాలువపై కెసిఆర్ పాదయాత్ర | 125 |
| 45. దేశంలో కొత్త రాష్ట్రాల కోసం జాతీయ ఫ్రంట్ | 126 |
| 46. జిఒ 610 అమలుకై టిఆర్ఎస్ ధర్నా, అఖిలపక్ష సమావేశం | 126 |
| 47. గోదావరి పుష్కరాలు | 127 |
| 48. 2004 ఎన్నికల కోసం టిఆర్ఎస్ సన్నాహాలు | 128 |
| 49. కేసిఆర్ వద్దకు సోనియా దూత ఆజాద్ | 129 |
| 50. పార్లమెంటులో తెలంగాణం | 132 |
| 51. ప్రణబ్ ముఖర్జీ కమిటీ | 133 |
| 52. లక్షలాదిమందితో వరంగల్‌లో సభ | 136 |
| 53. తెలంగాణ జాగరణ సేన | 138 |
| 54. జంతర్ మంతర్ వద్ద కేసీఆర్ నిరాహారదీక్ష | 138 |
| 55. కరీంనగర్ ఎంపీకి కెసిఆర్ రాజీనామా | 139 |
| 56. కరీంనగర్ ఓటర్లకు సోనియా ఇచ్చిన హామీ | 140 |
| 57. సిద్దిపేట 'సమర శంఖారావం | 141 |
| 58. నల్లగొండ "తెలంగాణ ఆత్మగౌరవసభ" | 142 |
| 59. నిజాం కాలేజిలో తెలంగాణ సంబురాలు | 142 |
| 60. నల్లగొండ నగారా | 143 |
| 61. సచార్ కమిటీ సిఫార్సుల అమలుకై | 144 |

| | |
|---|---|
| 62. సింగరేణి బొగ్గగని కార్మికుల సమస్యలపై | 145 |
| 63. ఓపెన్ కాస్టులపై సమరం | 145 |
| 64. నవ తెలంగాణా ప్రజా పార్టీ | 145 |
| 65. చేతులు కలిపిన చంద్రబాబు – మహాకూటమి ఏర్పాటు | 146 |
| 66. టి.ఆర్.ఎస్.లో విలీనమైన తల్లి తెలంగాణ పార్టీ | 148 |
| 67. అన్ని పార్టీల మేనిఫెస్టోల్లో తెలంగాణం | 148 |
| 68. మళ్ళీ కాంగ్రెస్ దే అధికారం | 148 |
| 69. తెలంగాణా విమోచన సమితి | 149 |
| 70. ఫ్రీ జోన్ కు వ్యతిరేకంగా పోరాటం | 150 |
| 71. ఉత్తమ్ కమిటీ | 151 |
| 72. సిద్ధిపేటలో తెలంగాణ ఉద్యోగ గర్జన సభ | 152 |
| 73. ఉస్మానియా విద్యార్థుల ఆందోళన | 153 |
| 74. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ కెసీఆర్ ఆమరణ దీక్ష | 153 |
| 75. విద్యార్థుల ఆత్మహత్యలు | 156 |
| 76. కెసిఆర్ ను నిమ్స్ కు తరలించిన పోలీసులు | 158 |
| 77. అపోలోలో మరణించిన శ్రీ కాంతాచారి | 159 |
| 78. పంజగుట్టలో విధ్వంసం | 159 |
| 79. క్షీణిస్తున్న కే.సి.ఆర్. ఆరోగ్యం | 160 |
| 80. మేధావుల పరామర్శ | 161 |
| 81. కొండా సురేఖ ఇల్లు ముట్టడి | 163 |
| 82. కరీంనగర్ లో ప్రజా ఉద్యమం | 164 |
| 83. విద్యార్థులచే సిటీ ఎం.ఎల్.ఏల ఇండ్ల ముట్టడి | 164 |
| 84. ప్రధానిని కలిసిన ఎం.పిలు | 165 |
| 85. కాంగ్రెస్ నేతలను ఒప్పించడానికి కె.కె. పాట్లు | 165 |
| 86. అధ్వానితో టి.ఆర్.ఎస్. నేతల చర్చలు | 165 |
| 87. సి.ఎం. ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం | 166 |
| 88. జయశంకర్ చిదంబరం చర్చలు | 166 |
| 89. చిదంబరం ప్రకటనలు | 167 |

| | |
|---|---|
| 90. డిసెంబర్ 23నా డు అటకెక్కిన ప్రక్రియ | 167 |
| 91. రాజకీయ ఐకాస ఆవిర్భావం | 168 |
| 92. సమైక్యవాదం – సీమాంధ్ర నేతల సాయం | 169 |
| 93. తెరమీదకు రాయల తెలంగాణ | 170 |
| 94. కేంద్రపాలిత ప్రాంతంగా హైదరాబాద్ | 170 |
| 95. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ | 171 |
| 96. ఉద్యమంలో ఉస్మానియా... | 171 |
| 97. గవర్నర్ నరసింహన్ పై విమర్శలు | 172 |
| 98. శ్రీకృష్ణ కమిటీ 8వ చాప్టర్ వివాదం | 172 |
| 99. రాజీనామాల తిరస్కరణ | 172 |
| 100. రాజ్యసభలో గందరగోళం | 173 |
| 101. ప్రొఫెసర్ జయశంకర్ మరణం | 173 |
| 102. తెలంగాణ ప్రకటనలు... సీమాంధ్రుల కుట్రలు | 173 |
| 103. ఢిల్లీ వేదికగా ఆల్ పార్టీ మీటింగ్... | 178 |
| 104. ఓయూ వేదికగా విద్యార్థి గర్జన | 181 |
| 105. రోడ్లపై వంట వార్పు | 181 |
| 106. శ్రీకృష్ణ కమిటీ తెలంగాణ పర్యటన | 182 |
| 107. దద్దరిల్లిన తెలంగాణ పార్లమెంట్ | 183 |
| 108. తెగువ చూపిన టీ కాంగ్రెస్ ఎంపీలు | 183 |
| 109. తెలంగాణ తర్వాతే ఏదైనా... | 184 |
| 110. ప్రత్యేక విమానంలో తెలంగాణ డ్రాఫ్ట్ బిల్లు | 185 |
| 111. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఉద్యమం | 186 |
| 112. తెలంగాణకు అసలైన పండుగ | 188 |
| 113. ముక్తాయింపు | 190 |

# స్వాప్నికులు - సాధకుడు

తెలంగాణ స్వాప్నికులు ఎందరో...

# సాధకుడు కేసీఆర్

**తె**లంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత ఆ ఫలితాలు పొందే ముందు మనం స్మరించుకోవాల్సిన వారెందరో ఉన్నారు అందులో అసువులు బాసిన వారే పైనుంటారు. అందులో సందేహం లేదు. కాని అసువులు బాసిన విద్యార్థులకు స్ఫూర్తిదాత, రాజకీయ నాయకులకు తెలంగాణాకు ప్రతి సంధర్భంలో జరిగిన అన్యాయాన్ని కళ్ళకు కట్టినట్లు వివరిస్తూ మేధావులను, రాజకీయనాయకులను చైతన్యపరిచి ఉద్యమ పంథా వైపు తన ఆలోచనలతో నడిపించడానికి ఆజ్యం పోసిన వారు జయశంకర్ సారే. అయితే ఆయన తన కలలను సాకారం కావాలనుకుంటే మలిదశ ఉద్యమంలో తన ప్రాణాలు ఫణంగా పెట్టి తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం మరణాన్ని సైతం ఆలింగనం చేసుకుని స్వరాష్ట్రాన్ని సాధించుకున్న సాధకుడు మన కేసీఆర్ అంటే కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు. రాష్ట్రం ఏర్పాటు తోనే తన బాధ్యత అయిపోయిందని ఇంట్లో కూర్చోకుండా, తెలంగాణా రాష్ట్ర మేర్పడితే తొలి ముఖ్యమంత్రిగా దళితున్ని చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చి ప్రజా మద్దతు కూడగట్టిన ఆయన, ఆ తరువాత తెలంగాణా ఏర్పాటుకు ఆంధ్రా పాలకులు సృష్టించిన అడ్డంకులు, ఆంధ్ర పాలకుల చేతుల్లో కీలు బొమ్మలుగా మారిన మన ప్రాంత నాయకులపైనా నమ్మకం లేక ప్రత్యేక రాష్ట్ర ఫలాలు ప్రజలకు అందాలంటే తానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాల్సిందేనని ఘంటాపథంగా, నిక్కచ్చిగా ప్రజలకు చెప్పిన ధీరుడు కేసీఆర్. ఎన్నికల్లో తెలంగాణా ప్రజలు ఆయనే ముఖ్యమంత్రి పదవి చేపట్టినా ఫరవాలేదు, మరొక పార్టీపై నమ్మకం లేదని ఖచ్చితమైన మెజారిటీనిచ్చి, ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టడానికి పచ్చ జెండా ఊపారు. దళితున్ని మొట్ట మొదటి ముఖ్యమంత్రిని చేస్తానని మోసం చేస్తున్నాడని విపక్షాలు మొత్తుకున్నా, ప్రజలు వారిని పట్టిచ్చుకున్న పాపాన పోలేదు. అంటే తెలంగాణా ప్రజలకు ఈ కాంగ్రెస్ నాయకులపైన తెలుగుదేశం నాయకులపైనా, వారి అధిష్టానాలు కొన్నేళ్ళుగా తెలంగాణా ఏర్పాటులో చేసిన మోసాలను మరిచిపోలేదన్నది నగ్నసత్యం. కాంగ్రెస్ వాళ్ళు రాష్ట్రం ఇచ్చింది మేమే అని చెప్పినా, ప్రజలు మాత్రం వారిని నమ్మకుండా, "మీరేం ఊరికే అడగంగానే ఇవ్వలేదు, మేమే పోరాడి సాధించుకున్నాం" అని నిర్ధాక్షణ్యంగా 'కర్రు' కాల్చి వాత పెట్టారు.

# సిద్ధాంత కర్త జయశంకర్

జయశంకర్ సార్.. తెలంగాణా సిద్ధాంత కర్త, తెలంగాణా తత్వ వేత్త, తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసి, ఆలోచనలు లేపిన అసామాన్యుడు. తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అవసరాన్ని, ఆంధ్ర పాలకుల అన్యాయాలు సామాన్యులకూ తెలియజేయాలన్న ఆలోచనలకు రూపునిచ్చిన కేసీఆర్ లాంటి మేధావులను, రాజకీయ దురంధులకు వెన్నుదన్నుగా నిలిచి, ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలతో ఉద్యమానికి కావలసిన ఆజ్యం పోసారు. ప్రొ. జయశంకర్ హన్మకొండలో ఉర్దూ మీడియంలో చదువుకున్న మంచి కవి కూడా. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ. డిగ్రీ చదివిన ఆయన, తరువాత బీ.ఈడి కూడా చేశారు. జహీరాబాద్ దగ్గర ఉన్న 'రంబోల్' లో ఉన్న బేసిక్ ట్రైనింగ్ స్కూల్ లో బీ. ఈడి పూర్తి చేసిన జయశంకర్ సారు, ఖమ్మం జిల్లా, మధిర లోని బీ.టీ.ఎస్.లో పనిచేశారు. ఆ తరువాత వరంగల్ బీ.ఈడి కాలేజీలో ట్యూటర్ గా పనిచేశారు. ఆ తరువాత బనారస్ యూనివర్సిటీలో ఎం.ఎ. ఎకనామిక్స్ లో చేరాడు. అక్కడనుంచి మళ్ళీ ఆలీఘడ్ యూనివర్సిటీలో చేరి మళ్ళీ ఎం.ఎ. ఎకనామిక్స్ చేశారు. హైదరాబాద్ లోని సిటీ కాలేజీలో లెక్చరర్ గా చేరారు. వరంగల్ లో సీకేయం కాలేజీలోనూ పనిచేశారు. అయితే జయశంకర్ సారు ఆ రోజుల్లోనే వివిధ సమస్యల పట్ల చురుగ్గా స్పందించేవారు. సామాజిక బాధ్యతతో స్పందించేవారు. నాయకత్వ లక్షణాలున్న ఆయన, సమస్యల పట్ల అవగాహన ఉండటంతో పలువురికి జరిగే అన్యాయాలను అందరికి వివరించి మద్దతు కూడగట్టడంలో ముందుండే వారు.

తెలంగాణ ఉద్యమ సూత్రధారులలో ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతకర్తగా అభివర్ణించాల్సిన వ్యక్తి. కెసిఆర్ కూడా అదే విధంగా గౌరవించేవారు. జయశంకర్ యుక్త వయసు నుంచే ప్రత్యేక రాష్ట్రానికి ఉద్యమిస్తున్నారు. 1953లో హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంతో విలీనం చేయాలన్న ప్రతిపాదనను అప్పుడే వ్యతిరేకించారు. ఆ తర్వాత 1969లో జరిగిన ఉద్యమంలో ఆయన పాత్ర గురించి పెద్దగా ప్రచారం లేకపోయినా ఆయన ప్రత్యేకవాద ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ముల్కి ఉద్యమంలో కాని, ఇడ్లి, సాంబార్ గోబ్యాక్ ఆందోళనలలో కాని, తెలంగాణకు వివిద రంగాలలో జరుగుతున్న అన్యాయం గురించి కాని ఆయన

నిరంతరం ప్రచారం చేశారు. నిధులు, నీళ్లు ఉద్యోగాల నినాదానికి ఆయనే సృష్టికర్తగా చెప్పాలి. 1991-94 లో కాకతీయ యూనివర్శిటీకి కాంగ్రెస్ హయాంలో వీసీగా ఉన్నా ఆయన, 1999లో తెలంగాణ అభివృద్ధి ఫోరంను అమెరికాలో ఏర్పాటు చేయడానికి ఆయన ముఖ్య పాత్ర పోషించారు. జయశంకర్ తో కెసిఆర్ పలుమార్లు సంప్రదింపులు జరిపారు. ఆ తర్వాత వారిద్దరు కలిసి అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు సమయంలో కాని, పార్టీ ఆఫీస్ లో జరిగే ప్రధాన కార్యక్రమాలలో కాని జయశంకర్ తప్పనిసరిగా పాల్గొని తెలంగాణ రాజకీయాలకు దిశానిర్దేశం చేసేవారు. తెలంగాణ రావడం ఖాయమనే విశ్వాసాన్ని అన్ని వర్గాల్లో కల్పించడంలో ఆయన మాటలే కీలకం. సౌమ్యుడుగా ఉంటూ తన అభిమానులతో జయశంకర్ సార్ అని పిలిపించుకునే ఆయన తెలంగాణ ఉద్యమానికి ఊపిరి అయ్యారు. 2004లో టిఆర్ఎస్ కేంద్రంలోను, రాష్ట్రంలోను ప్రభుత్వంలో ఉన్నప్పుడు జయశంకర్‌ను కూడా కేంద్ర స్థాయి పదవిలో కెసిఆర్ నియమించారు. కేంద్ర కార్మిక సలహా మండలి చైర్మన్ గా కొంతకాలం ఉన్నారు. కేంద్ర స్థాయిలో ఆయా రాజకీయ పార్టీల నేతలను కలవడంలో కాని, వారికి వినతిపత్రాలు తయారు చేయడంలో కాని వారి నుంచి తెలంగాణ అనుకూల పత్రాలు పొందడంలో కాని కెసిఆర్ తో పాటు జయశంకర్ కీలక పాత్ర పోషించారు. 1952 నుంచి తెలంగాణ ఆకాంక్షతో ఉన్న జయశంకర్ ఆ కల నెరవేరకుండానే 2011 లో కన్నుమూశారు. కాకపోతే 2009 డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన వచ్చినప్పుడు ఆ సంతోషంలో ఆయన పాలు పంచుకున్నారు. అప్పుడు నిమ్స్ లో నిరాహార దీక్షలో ఉన్న కెసిఆర్ కు నిమ్మరసం ఇవ్వడం ద్వారా దీక్షను విరమింపచేశారు. ఆనాటి ముఖ్యమంత్రి రోశయ్య వచ్చి కెసిఆర్ కు నిమ్మరసం ఇస్తారని భావిస్తే, తెలంగాణ వాదులు జయశంకర్ ద్వారా ఆ కార్యక్రమం పూర్తి చేశారంటే ఆయనకు ఎంత గౌరవం ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. జయశంకర్ స్వీయ రాజకీయ అస్తిత్వం సూత్రాన్ని ఆయన ప్రతిపాదించారు. అలాగే యాచనతో కాదు శాసనంతో స్వరాష్ట్ర సాధన జరగాలని ప్రసగించేవారు. తెలంగాణ ఏ ఏ రంగాలలో ఎలా వివక్షకు గురైందన్న విషయాలను గణాంకాలతో సహా వివరించి అందరికీ అర్థమయ్యేలా మెదళ్లకు ఎక్కించేవారు. టీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణరావు రాసిన ఒక వ్యాసంలో జయశంకర్, కెసిఆర్ లను కృష్ణార్జునులతో పోల్చారు. జయశంకర్ టిఆర్ఎస్ కు

సన్నిహితంగా ఉన్నా, ఎన్నడూ పార్టీ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం జయశంకర్ గొప్పతనమే. కెసిఆర్ అనేక సందర్భాలలో జయశంకర్ కు పాదాభివందనం చేసేవారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆయన పేరును వ్యవసాయ యూనివర్శిటీకి పెట్టారు.

## తోట ఆనందరావు

తెలంగాణ మేథావులలో ప్రొ. జయశంకర్ సార్ తర్వాత సమకాలీకుడిగా తోట ఆనంద్ రావు ఉంటారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా హైదరాబాద్ ఉర్దూపై మంచి పట్టు ఉండేది. ఆ కారణంగానే ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుపై ఫజల్ ఆలీ నేతృత్వంలో సాగిన ఎస్ఆర్సీ బృందం తెలంగాణ ప్రాంతంలో పర్యటిస్తోంది. ఈ సమయంలో తెలంగాణ ఇబ్బందులు, ఉమ్మడి రాష్ట్ర అవతరణతో తలెత్తే సమస్యలు, ఇక్కడ ప్రజలకు, విద్యార్థులకు కలిగే నష్టాలను ఆయన ఉర్దూలో ఫజల్ ఆలీకి వివరించారు. వృత్తిరీత్యా టీచర్ కావడం, విషయాన్ని కూలంకషంగా చర్చించడంలో ప్రావీణ్యం ఉన్న ఆనంద్ రావు, ఫజల్ ఆలీతో రెండు రోజుల పాటు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా ఈ ప్రాంతానికి ఇక్కడి ప్రజలకు జరిగే నష్టాన్ని అరటిపండు వలిచినట్లు సులభంగా వివరించారు. అయితే అప్పటికి ఫజల్ ఆలీ కమిషన్ ను కలిసిన ఉస్మానియా విద్యార్థుల బృందంలో జయశంకర్ ఒకరు కాగా, అప్పటికే టీచరైన తోట ఆనంద్ రావు వేర్వేరుగా చర్చించారు.

## ప్రొఫెసర్ కోదండరామ్

ఆదిలాబాద్ జిల్లా నెన్నెల మండలంలో పుట్టిన కోదండరామ్ వరంగల్ లో పెరిగారు. ఆ తర్వాత వృత్తి రీత్యా ప్రొఫెసర్గా హైదరాబాద్ లో ఉంటున్నారు. వామపక్ష, పౌర ఉద్యమాలలో కాళోజీ, బాలగోపాల్, జయశంకర్ వంటి వారితో సాన్నిహిత్యం కలిగి ఉన్నారు. ఎస్.ఆర్. శంకరన్, కన్నాబిరాన్ వంటి పౌర హక్కుల నేతలతో కలిసి వ్యవసాయ రైతు సంబంద ఉద్యమాల నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు. తెలంగాణ ప్రకటన వెలువడి, ఆ తర్వాత ఆగిపోవడంతో కెసిఆర్ స్వయంగా కాంగ్రెస్ మంత్రి జానారెడ్డి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ లోని తెలంగాణ ముఖ్యులతో సమావేశమయ్యారు. వారు తీసుకున్న నిర్ణయం ప్రకారం 2009 డిసెంబర్ 24

కళింగ భవన్ లో అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలతో ఒక సమావేశం నిర్వహించారు. అందులో ఆయా పార్టీల నేతలు చెన్నమనేని విద్యాసాగరరావు, మధుయాష్కి, జీవన్ రెడ్డి, నాగం జనార్ధన్ రెడ్డి తదితరులతో పాటు కెసిఆర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో ఒక జెఎసి ఏర్పాటు చేయాలని నిర్ణయించి, ప్రొఫెసర్ కోదండరామ్ ను చైర్మన్ గా ప్రకటించారు. కాంగ్రెస్, టీఆర్ఎస్, టిడిపి, బిజెపి, సిపిఐ, సిపిఐ ఎమ్ఎల్ న్యూడెమొక్రసి, లతో పాటు సుమారు అరవై సంఘాలు కూడా ఇందులో భాగస్వాములయ్యాయి. దీనికి ఉద్యోగ సంఘాల నేత స్వామి గౌడ్ ను కన్వీనర్ గా ఎంపిక చేసుకున్నారు.

ఇందులో అన్ని రాజకీయ పార్టీల సభ్యులతో కలిసి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. తెలంగాణ విద్యా వంతుల వేదిక నుంచి మల్లేపల్లి లక్ష్మయ్యను వైస్ చైర్మన్ చేశారు. ఆ తర్వాత పరిణామాలలో తెలంగాణ వాదులు కాంగ్రెస్ అదిష్టానంపై విరుచుకు పడటంతో కాంగ్రెస్ పార్టీ జెఎసి నుంచి బయటకు వెళుతున్నట్లు ప్రకటించింది. అయితే జానారెడ్డి, కేశవరావుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు సొంతంగా ఒక వేదిక ఏర్పాటు చేసుకున్నారు. ఆ తర్వాత టిడిపి బయటకు వచ్చింది. ఆ సమయంలో టిడిపి నేతలు కోదండరామ్ ను తీవ్రంగా విమర్శించేవారు. రాయల తెలంగాణ ప్రతిపాదన వచ్చినప్పుడు జెఎసి గట్టిగా వ్యతిరేకించింది. ఒక దశలో కెసిఆర్ మెత్తపడ్డారన్న ప్రచారం జరిగినా, జెఎసి మాత్రం వ్యతిరేకించింది. జెఎసి సొంతంగా నిర్ణయాలు చేయడానికి ప్రయత్నించింది. కెసిఆర్ పట్టు నుంచి బయటపడడానికి ప్రయత్నం చేసిందన్న విశ్లేషణలు వచ్చాయి. కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ఉద్దేశంతో మిలియన్ మార్చ్ ను జెఎసి ప్రకటించడం టిఆర్ఎస్ తో విభేదాలకు కారణమనే ప్రచారం జరిగింది. ఈజిప్టు తెహరీక్ ఉద్యమ స్ఫూర్తితో ఇది జరిగింది. అప్పుడు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆంక్షలు విధించినా, కొన్ని వేల మంది టాంక్ బండ్ పైకి చేరుకోవడం, కొన్ని విగ్రహాల ధ్వంసం వరకు పరిస్థితి వెళ్లింది. అప్పుడు కాంగ్రెస్ నేతలు మధుయాష్కి, కేశవరావు వంటివారు సైతం ఆందోళనకారుల నిరసనను ఎదుర్కోగా, కెసిఆర్ కూడా వచ్చి కొద్ది సేపు ఉండి వెళ్ళిపోయారు. ఆయన కుమార్తె, తెలంగాణ జాగృతి నేత కవిత కూడా అలాగే వెళ్లిపోయారు. ఉద్యమం మిలిటెంట్ల చేతులలోకి వెళుతోందన్న భావన కలిగింది. ఈ ఘటనలతో టిఆర్ఎస్ మాత్రమే ఉద్యమ రూపం అనుకున్నవారు జేఏసీనీ

ప్రత్యామ్నాయంగా చూడడం ఆరంభించారు. క్రియాశీలకం చేయడంలో కోదండరామ్ సమన్వయంగా వ్యవహరించారని ఆయనతో కలిసి పనిచేసిన అద్దంకి దయాకర్ వంటివారి అభిప్రాయంగా ఉంది. ఆ తర్వాత సహాయ నిరాకరణ, సకల జనుల సమ్మె, సడక్ బంద్, సాగర హారం, సంసంద్ యాత్ర, సకల జనభేరీ వంటి ఆందోళనలను జెఎసి రూపొందించింది.

## సోనియా గాంధీ

ఎంతో మంది ఆత్మ బలిదానాలను చలించిపోయి కాంగ్రెస్ పార్టీ రాజకీయ, ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ ఏర్పాటుకు యుపిఎ ఛైర్‌పర్సన్‌గా సోనియా నిర్ణయం తీసుకుంది. అయితే తెలంగాణ అనుకున్నంతా సులభంగా కాకపోయినా, ప్రజల కోరికను గుర్తించి రాజకీయ ప్రయోజనాల కంటే తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యతనివ్వాలని భావించిన తెలంగాణకు పురుడు పోసిన వారిలో సోనియా గాంధీ ఒకరు. నెహ్రూ నుంచి రాహుల్ గాంధీ వరకు గాంధీ కుటుంబం ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు, ఆంధ్ర పాలకుల దోపిడీ రాజకీయాలపై స్పష్టమైన వైఖరితో ఉన్నా.... పెట్టుబడిదారి ఏపీ నేతల రాజకీయాల ముందు తొలి తెలంగాణ ఉద్యమం నిలబడలేకపోయింది. మలి దశ ఉద్యమంలో 2004లో యూపీఏ చైర్ పర్సన్ గా నియామాకం తర్వాత తెలంగాణ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని స్పష్టంగా ప్రకటించి, ఆమె దిశానిర్దేశంలో టీఆర్ఎస్ సభ్యులను జాతీయ రాజకీయాల్లో భాగస్వామ్యం చేశారు. ఆమె పుట్టిన రోజు కానుకగా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన తర్వాత జరిగిన రాజకీయ పరిమాణాలు, ఏపీలో కాంగ్రెస్ పతనం దిశగా పయనిస్తున్నా... తెలంగాణకు ఇచ్చిన మాట కోసం కట్టుబడి ఉన్నారు. పార్లమెంట్ వేదికగా ఏపీ కాంగ్రెస్ నేతల కుయుక్తులను సైతం పక్కనపెట్టి, తెలంగాణ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నారు.

## జైపాల్ రెడ్డి

తెలంగాణ ఉద్యమంలో కనిపించని హీరో జైపాల్ రెడ్డిగా చెప్పవచ్చు. తెలంగాణ ప్రజల దశాబ్దాల నాటి కల సాకారం కావడంలో జైపాల్ రెడ్డి చేసిన కృషి, త్యాగం.. తెర వెనుకే ఉండిపోయింది. ఎందరో యోధులు తెర ముందు కనిపించినా.. ఎందరో

పోరాట యోధులు తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు, ప్రొఫెసర్ కోదండరామ్‌ల సారథ్యంలో ఈ ఉద్యమం పతాక స్థాయికి చేరింది. ఇప్పుడు కాకపోతే ఇక ఎప్పుడూ సాధ్యం కాదు అనే నినాదేం వారిద్దరూ ఉద్యమాన్ని ముందుకు నడిపించారు.

జైపాల్ రెడ్డి పాత్ర ఎంత? తెలంగాణ కోసం ఉద్యమకారులు చేపట్టిన ఆందోళనలు, ఉద్యమ నేతలు చేసిన పోరాటాలు ఒక ఎత్తయితే.. తెర వెనుక ఉండి తెలంగాణ కోసం పావులు కదిపిన ఘనత జైపాల్ రెడ్డిది. తెలంగాణ అంటే ఒంటికాలిపై లేచే సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ వంటి నేతలను ఒప్పించడానికి జైపాల్ అసమాన రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శించారని అంటుంటారు. ఆయన సన్నిహితులు. ఓ దశలో ఆయన స్వపక్షంలో విపక్షంలా మారారు. ఈ క్రమంలో సొంత పార్టీ కాంగ్రెస్ నేతలు శతృవుల్లా చూస్తున్నా పట్టించుకోలేదు. ఉక్కు మహిళగా పేరున్న సోనియాగాంధీని ఒప్పించగలిగారు. ట్రబుల్ షూటర్‌గా పేరున్న ప్రణబ్ ముఖర్జీని ఢీ కొట్టారు. తెలంగాణ ఏర్పాటు విషయంలో ఆయన ప్రణబ్ ముఖర్జీ వంటి కీలక నేతలతో చాలా సందర్భాల్లో వాదులాటకు దిగారు.

నిజానికి రాజకీయంగా జైపాల్ రెడ్డిలో ఉన్నది కాంగ్రెస్ రక్తం కాదు. ఆయన జనతాపార్టీ నేత. ఆ పార్టీ ముక్కలైన తరువాత కాంగ్రెస్‌లో చేరారు. తెలంగాణ కాంగ్రెస్‌కు చుక్కానిలా మారారు. కేసీఆర్ నేతృత్వంలో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర సమితిని గానీ, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్న గానీ ఆయన పెద్దగా పట్టించుకోలేదని చెబుతుంటారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ 2004లో ఎన్నికల సందర్భంగా టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవడాన్ని జైపాల్ రెడ్డి వ్యతిరేకించారు కూడా. టీఆర్ఎస్‌తో పొత్తు వల్ల రాజకీయంగా ఎంతమాత్రమూ ఉపయోగం ఉండబోదని ఆయన కాంగ్రెస్ అధిష్ఠానానికి అప్పట్లో స్పష్టం చేశారు. ఫలితంగా– తెలంగాణ సమాజం నుంచి విమర్శలను ఎదుర్కొన్నారు.

ఉద్యమం చివరి అయిదేళ్ల కాలంలో జైపాల్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. తన సొంత రాష్ట్రంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను గ్రహించారు. విద్యార్థుల ఆత్మహత్యలతో అట్టుడుకుతున్న పరిస్థితుల్లో తెలంగాణ సాధన ఒక్కటే ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చుతుందని భావించారు. క్రమంగా తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్టు అధిష్ఠానానికి వివరించే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో జైపాల్

రెడ్డి.. తన తోటి లోక్‌సభ సభ్యుడు మధుయాష్కీ గౌడ్ సహకారాన్ని తీసుకున్నారు.

తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించాలంటూ స్వరాష్ట్ర కాంగ్రెస్ నేతల నుంచి ఒత్తిళ్లు వచ్చినప్పటికీ.. జైపాల్ రెడ్డి అంగీకరించలేదు. దీనికి కారణం.. జాతీయ నేతగా ఆయనకు గుర్తింపు ఉండటమే.. ఈ ఉద్యమాన్ని అడ్డుగా పెట్టుకుని ప్రత్యర్థులు జాతీయ నేతగా ఉన్న తనను ప్రాంతీయ భావాలు ఉన్న నాయకుడిగా చిత్రీకరిస్తారనే ఆవేదన ఉండేదని సన్నిహితులు తెలిపారు.

తెలంగాణ ఎందుకు ఇవ్వాలన్న సోనియా, మన్మోహన్‌లతో పోరు.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఎందుకు ఇవ్వాలి? దాని వల్ల పార్టీకి కలిగే ప్రయోజనాలేంటీ? అని కాంగ్రెస్ లెక్కలు వేసుకుంటుంటే కాంగ్రెస్ పెద్దలను ఒప్పించడానికి జైపాల్ రెడ్డి అసామాన్య పోరాటాన్ని చూపారు. సొంత పార్టీలోనే విపక్షంలా మారారు. ప్రత్యేకించి– ప్రణబ్ ముఖర్జీని ఒప్పించడం జైపాల్ రెడ్డి చూపిన తెగువకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా దిగ్విజయ్ సింగ్‌ను రప్పించడం వెనుక జైపాల్ రెడ్డి కృషి చాలా ఉంది. అప్పటికే– మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటంలో కీలక పాత్ర పోషించారు దిగ్విజయ్ సింగ్. అలాంటి అనుభవం ఉన్న నాయకుడిని ఇన్‌ఛార్జిగా నియమించడం వెనుక జైపాల్ రెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారు. దిగ్విజయ్ సింగ్ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమితులైన తరువాతే తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ఊపందుకున్నది.

సూదిని జైపాల్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మాడుగులలో 1942 జనవరి 16న జన్మించారు. 18 నెలల వయసులో ఉండగానే పోలియో కారణంగా వైకల్యానికి గురయ్యారు. కానీ, అది ఆయన రాజకీయ జీవన ఆరోహణకు ఎన్నడూ అవరోధం కాలేకపోయింది. పలు మార్లు కేంద్ర మంత్రిగా, ఐదు సార్లు లోక్‌సభ సభ్యుడిగా, రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పని చేసి సుదీర్ఘ రాజకీయ అనుభవం గడించారు. జైపాల్ రెడ్డి 2019, జూలై 28 న మరణించారు

## సుష్మా స్వరాజ్

ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రాంతీయులతో సమానంగా ప్రాంతీయేతరులు కూడా భాగస్వాములయ్యారు. అలాంటి వారిలో బీజేపీ పార్టీకి చెందిన సుష్మా స్వరాజ్ ఒకరు. తెలంగాణ చిన్నమ్మగా తనను తాను అభివర్ణించుకుని, రాష్ట్ర సాధనకు కృషి

చేశారు. తెలంగాణ ఉద్యమంలో అసువులుబాసిన అమరుల ప్రాణ త్యాగాలకు చలించి బీజేపీ పార్టీ తరుపున పార్లమెంట్ లో గళమెత్తారు. తెలంగాణకు చెందినవారు కాకపోయినా, ఒక్క ఓటు, రెండు రాష్ట్రాల నినాదానికి కట్టుబడి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పార్లమెంట్ లో మద్ధతు పలికారు. 2009లో ఓయూ విద్యార్థులు నిజాం కాలేజీ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని ఆమె ప్రసంగంతో యావత్ యువకులను ఆకట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేయకపోయినా, అధికారంలోకి వచ్చే బీజేపీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తోందని ప్రకటించారు. తనకి తానుగా చిన్నమ్మగా అభివర్ణిస్తూ 2017లో జరిగిన అంతర్జాతీయ బిజినెస్ సదస్సులో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని కొనియాడారు. తెలంగాణ ముసాయిదా బిల్లు పార్లమెంట్ కు వచ్చిన సందర్భంలో ప్రతిపక్ష నాయకురాలిగా ఉన్న ఆవిడ తెలంగాణ ఉద్యమంపై సుదీర్ఘమైన ప్రసంగం చేశారు. రాజకీయవేత్తగా కంటే మంచి వక్తగా, తెలంగాణ ప్రాంతీయుల ఆకాంక్షలను భావోద్వేగంతో అర్థం చేసుకున్నారు. ఆంధ్రానాయకుల పాలనలో తెలంగాణ ఎలా వెనకబడిందో లెక్కలతో సహా పార్లమెంట్ లో ప్రసంగించారు. ఆమె ఉత్తేజకరమైన ప్రసంగాలతో తెలంగాణ సార్వభౌమాధికారాన్ని, ఆవశ్యకతను చాటిచెప్పారు. 2014 సాధారణ ఎన్నికలతో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమిలో కేంద్రమంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. అయితే పార్టీలకతీతంగా ఆమె మరణాన్ని తట్టుకోలేక, తెలంగాణ చిన్నమ్మ ఇకలేరని కంట తడి పెట్టుకున్న వారిలో తెలంగాణలో కూడా ఎంతోమంది ఉన్నారంటే, ఆమెకు తెలంగాణ ప్రాంతంతో అంతలా అనుబంధాన్ని పెంచుకున్నదో మనం అర్థంచేసుకోవాలి.

## కె.కేశవరావు (కెకె)

కంచెర్ల కేశవ రావు కేకేగా ప్రాచుర్యం పొందిన సీనియర్ నాయకులు. కాంగ్రెస్ పార్టీలో సాధారణ కార్యకర్త నుంచి సోనియా ప్రధాన అనుచర బలంలో చేరిన రాజకీయ నేత. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆయన వామపక్ష భావజాలంతో జర్నలిస్టుగా కెరీర్ ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ చీఫ్, కేబినెట్ మంత్రిగా, ఇతర రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంఛార్జ్‌గా కొనసాగారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి ఎదురైన అవమానాలు, అన్యాయాలను నిలదీస్తూనే, రాష్ట్ర

ఏర్పాటుకు కృషి చేశారు. తెలంగాణ ఉద్యమంతో మారినరాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీకి విడిచిపెట్టారు. ఆ తర్వాత టీఆర్ఎస్ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతుండగా, ప్రస్తుతం ఆ పార్టీ వ్యవహారాల్లో కీలకనేత గా కొనసాగుతున్నారు. భద్రుకా కాలేజీ లో బి.కామ్ చేసిన ఆయన, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ. ఆ తర్వాత పి.హెచ్.డి పూర్తి చేశారు.

కాంగ్రెస్ పార్టీ పెద్దలను తెలంగాణకు అనుకూలంగా ఒప్పించడంలో కీలకపాత్రను పోషించారు. ముఖ్యంగా తనకున్న రాజకీయ చతురతతో, అన్ని రాష్ట్రాల నేతల దృష్టికి విభజన అంశంపై అవగాహన కల్పించేలా కృషి చేశారు. వామపక్ష భావాలు కలిగిన గొప్ప రాజకీయవేత్త. ప్రత్యేక రాష్ట్రం తెలంగాణను ఏర్పాటు చేసే అంశంపై ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టకపోవడంతో... పార్టీకి రాజీనామా చేశారు. ఆయనను తెలంగాణ రాష్ట్ర సమితి సెక్రటరీ జనరల్‌గా, దాని జాతీయ వ్యవహారాల ఛైర్మన్‌గా పార్టీలో రెండవ స్థానంలో నియమించారు. డాక్టర్ రావు 2014 లో టిఆర్ఎస్ పార్టీ నుండి ఆరేళ్ల కాలానికి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 12 మంది సభ్యులతో పార్లమెంటులో ఎనిమిదవ అతిపెద్ద పార్టీగా ఉన్న టిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ చైర్మన్ (నాయకుడు)గా ఆయన ఎంపికయ్యారు.

తొలి నాళ్లలో జర్నలిస్టులుగా కెరీర్ మొదలుపెట్టి హైదరాబాద్ నుండి పబ్లిష్ అయ్యే ది డైలీ న్యూస్ ఎడిటర్ స్థాయికి ఎదిగారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, విజయవాడ, ది పేట్రియాట్‌లో ఢిల్లీలో అప్రెంటిస్ పొందాడు. ఆయన రచనలకు మంచి ఆదరణ లభించింది. అతను అత్యవసర పరిస్థితిని (1975-77) వ్యతిరేకించాడు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత అనేక రాజకీయ బాధ్యతలను భుజానా వేసుకున్నారు. ఉన్నత పదవుల్లో కొనసాగుతూనే, 2005లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పగ్గాలను దక్కించుకున్నారు. తరువాత 2009 లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (AICC) లో సభ్యుడిగా కొనసాగారు. పశ్చిమ బెంగాల్, జార?ండ్, అస్సాం మరియు అండమాన్ & నికోబార్ దీవులు నాలుగు రాష్ట్రాలలో పార్టీ వ్యవహారాల బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో వరుసగా మూడు ప్రభుత్వాలలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు, విద్య, పరిశ్రమ మరియు కార్మిక వంటి ముఖ్యమైన శాఖలను నిర్వహించారు. అంతకుముందు కేశవరావు ఏపీ శాసనమండలి చైర్మన్ గా, గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుండి రెండు పర్యాయాలు శాసనమండలికి ఎన్నికయ్యారు. కనీస వేతనాల బోర్డు

ఛైర్మన్‌గా, క్యాబినెట్ ర్యాంకుతో రాజీవ్ గాంధీ టెక్నాలజీ మిషన్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

## శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగ సంఘాల తరుపున చురుకైన పాత్రను పోషించారు. మహబూబ్నగర్ జిల్లా, అడ్డాకల్ మండలం, రాచాల గ్రామంలో జన్మించాడు. 1988 లో మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్స్ పెక్టర్ గా ఉద్యోగంలో చేరాడు. అతి తక్కువకాలంలో ఉన్నతాధికారుల మన్నలను అందుకొని 1991 లో ఫుడ్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతిని పొందాడు. అనంతరం వికారాబాద్, అల్వాల్, కూకట్ పల్లి, కాప్రా మున్సిపాల్టీలలో కమిషనర్ గా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జాయింట్ కమిషనర్ గా పని చేయగా... మలిదశ తెలంగాణ ఉద్యమంలో 2004 నుంచి ముందుండి పోరాడారు. నీళ్లు, నిధులు, నియామాకాలే ప్రధాన అజెండాగా సాగుతున్న ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగులు కోల్పోతున్న అవకాశాలు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తారు. ఉద్యోగ సంఘాల హక్కుల సాధనకు పోరాడుతూనే, తెలంగాణ సాధనకు ముందుండి నడిపించారు. 2006లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏర్పాటైన తెలంగాణ రాజకీయ జేఏసీకి కో ఛైర్మన్ గా కూడా వ్యవహరించాడు. గల్లీ నుంచి ఢిల్లీ స్థాయిలో జరిగిన ఉద్యమ వేదికలపై ఉద్యోగ సంఘాల గొంతుకను వినిపించారు. ముఖ్యంగా 14ఎఫ్ రద్దు, ఢిల్లీలో జరిగిన ఆల్ పార్టీ మీటింగ్ లో ఉద్యోగ నాయకులతో కలిసి ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఉద్యమించారు.

తెలంగాణ ప్రజల చిరకాల కోరిక 2014లో నెరవేరిన తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి మార్చి 13న టీఆర్ఎస్ పార్టీలో చేరాడు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచాడు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయనను పార్లమెంటరీ సెక్రటరీగా నియమించాడు. 2018లో తెలంగాణ అసెంబ్లీకి జరిగిన ముందస్తు ఎన్నికల్లో మహబూబ్ నగర్ నుండి మరోసారి పోటీచేసి గెలిచాడు. 19

ఫిబ్రవరి 2019న కేసీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి కెసీఆర్ రెండవ మంత్రివర్గంలో ఎక్సైజ్, క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రిగా ఉన్నాడు.

## స్వామిగౌడ్

కనకమామిడి స్వామిగౌడ్. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని కిస్మత్ పూర్ గ్రామానికి చెందినవారు. సాధారణ ఉద్యోగి నుంచి తెలంగాణ రాష్ట్ర తొలి శాసనమండలి చైర్మన్ స్థాయికి ఎదిగారు. తొలి దశ ఉద్యమంలో పాల్గొని బుల్లెట్ గాయాలపాలయ్యారు. ఉద్యమ ప్రస్థానంలో టిఎన్జీవో మాజీ అధ్యక్షుడిగా, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ గా పనిచేశాడు. తెలంగాణ రాష్ట్ర సమితి పొలిట్ బ్యూరో సభ్యుడిగా పని చేశాడు. రాజేంద్రనగర్ లోని గ్రామపంచాయతీ కార్యాలయంలో అటెండర్ గా ఉద్యోగాన్ని ప్రారంభించారు. 1969 ఉద్యమం నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర సాధనలో పాల్గొన్నారు. ఇక మలిదశ తెలంగాణ ఉద్యమంలో టీఎన్జీవో నాయకుడుగా, తెలంగాణ ఉద్యోగ సంఘాలను ఏకతాటిపైకి తీసుకురావడంలో సారథ్యం వహించారు. ఏపీ ఉద్యోగ సంఘాలు చేసిన కుట్రలు, అవతవకతలను నిలదీశారు. ప్రభుత్వోద్యోగులు చేసిన 42 రోజుల సమ్మెకు సకల జనుల సమ్మెగా పేరు పెట్టి ముందుండి నడిపించాడు. 2012 జూలైలో పదవీ విరమణ చేసి, నవంబరులో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరి, పొలిట్ బ్యూరో సభ్యులుగా నియమితులయ్యారు. కరీంనగర్ జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం నుండి తెలంగాణ శాసన మండలికి ఎన్నికయ్యారు. టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో 2014, జూలై 2న తెలంగాణ శాసన మండలి తొలి ఛైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయంలో జరిగిన ఉద్యమంలో పోలీసు దెబ్బలను ఎదుర్కొని రాష్ట్ర సాధనకు కృషి చేశారు.

## కె. జానారెడ్డి

తెలంగాణ ప్రాంతంలో 30 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ పొలిటికల్ నేతలలో జానారెడ్డి ఒకరు. నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ ప్రాంతానికి చెందిన జానారెడ్డి, జయప్రకాష్ స్థాపించిన జనతా పార్టీ నుంచి 1978లో నాగార్జున సాగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి క్రియాశీలక రాజకీయాల్లో

కొనసాగుతూనే ఆంధ్రా సీఎం వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో తెలంగాణ హక్కుల కోసం ఆకాంక్షించారు. జనతా పార్టీ నుంచి టీడీపీలో చేరి పలు పోర్టుపోలియోలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించగా, మలిదశ తెలంగాణ ఏర్పాటు ఉద్యమానికి తనవంతుగా, కాంగ్రెస్ అధిష్టానంపై ఒత్తిడి చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. మంత్రి వర్గంలో కొనసాగుతూనే తెలంగాణ సాధన ఆవశ్యకతను చాటిచెప్పారు. విభజన అంశంలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నాయకులు రెండుగా చీలిన సందర్భంలో కాంగ్రెస్‌కు ఇక్కడ నుంచి ప్రాతినిథ్యం వహించారు.

## బండారు దత్తాత్రేయ

బీసీ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ ప్రాంత ప్రముఖ రాజకీయ నాయకుడు బండారు దత్తాత్రేయ. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి నాయకుడి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారు. 3సార్లు సికింద్రాబాదు లోకసభ నియోజకవర్గం నుంచి పార్లమెంటుకు ఎన్నికైనారు. అటల్ బిహారీ వాజపేయి హయంలో కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. నరేంద్ర మోడి ప్రభుత్వంలో కేంద్ర కార్మికశాఖ మంత్రిగా, 2019లో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బండారు దత్తాత్రేయ పదవీ బాధ్యతలను స్వీకరించారు. విద్యార్థి దశ నుంచి ఎదిగిన బండారు దత్తాత్రేయ దత్తన్నగా రాజకీయవర్గాలకు సుపరిచితుడు. అద్వానీ హయాం నుంచి బిజెపి పార్టీని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మద్ధతు తెలిపేలా కృషి చేశారు. తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను బీజేపీ జాతీయ నాయకత్వానికి తెలిసే విధంగా అప్పటి సీనియర్ నాయకులను సహకరించేలా క్రియాశీలకంగా వ్యవహరించారు. ప్రధానంగా ఆర్ఎస్ఎస్ అధినాయకులు, సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ, ఎల్ కే అధ్వాన్నీ లాంటి అగ్రనాయకులతో సమావేశాలు నిర్వహించడంలో ముఖ్యపాత్ర వహించారు. ఇక తెలంగాణ సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ, తెలంగాణ ఔనత్యాన్ని దేశం నలుదిశలా చాటిచెప్పేలా దసరా పండుగ మరుసటి రోజున ఆలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. హైదరాబాద్ వేదికగా జరిగే ఈ కార్యక్రమానికి రాజకీయాలకతీతంగా పార్టీల నాయకులు, మేధావులు, కార్యకర్తలు, కళాకారులు హాజరవుతారు. ఈ కార్యక్రమం కూడా తెలంగాణ సంస్కృతికి ఎంతో గుర్తింపును తీసుకువచ్చింది.

## కల్వకుంట్ల కవిత

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటినవారిలో కల్వకుంట్ల కవిత ఒకరు. తెలంగాణ ఉద్యమంలో తండ్రి పోరుబాటలో, అమెరికాలో ఉద్యోగాన్ని వదిలి మలి దశ ఉద్యమంలో చేరారు. బతుకమ్మతో ఊరురా తిరుగుతూ బతుకమ్మ పండుగలో పాల్గొంటూ అన్ని వర్గాలను ఉద్యమంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలను జాగృతం చేశారు. కళలు, సాహిత్యం, సంస్కృతిని ప్రపంచ వ్యాప్తం చేయడానికి తెలంగాణ జాగృతిని ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా బతుకమ్మ పండుగతో అందరికి చేరువయ్యారు. కేసీఆర్ కూతురుగా కంటే తెలంగాణ జాగృతి సంస్థ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగే బతుకమ్మ పండుగతో తెలంగాణలోని ప్రతి ఇంటికి ఆడపడుచు అయ్యారు. 2007 జాగృతి సంస్థ పేరిట స్కిల్ డెవలప్ మెంట్, కళలు, సాహిత్య పరిరక్షణకు పూనుకున్నారు. ఇక తెలంగాణ ఉద్యమంలో మహిళలు, యువతను భాగస్వామ్యం చేయడంలో కవిత నూతన ఒరవడిని సృష్టించగలిగారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం ప్రత్యక్ష రాజకీయాల్లో (2014)లో అడుగుపెట్టి, నిజామాబాద్ ఎంపీగా గెలిచారు. ✓ పార్లమెంట్ లో పలు కమిటీలకు ప్రాతినిథ్యం వహించారు. కామన్ వెల్త్ పార్లమెంట్ అసోసియేషన్ కు కూడా పనిచేశారు.

## కె.టి.రామారావు (కేటీఆర్)

తెలంగాణ ఉద్యమం తీవ్రరూపం దాల్చుతున్న తరుణంలో అప్పటివరకు విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న కేటీఆర్ ఉద్యోగాన్ని వదిలేసి ఉద్యమంలో భాగస్వామ్యమయ్యారు. అనతి కాలంలోనే తెలంగాణ యాస, భాష, భావన, ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలపై అవగాహన పెంచుకోవడమే కాకుండా మంచి వక్తగా, చారిత్రక నేపథ్యంలో ఉన్న తెలంగాణ ప్రాంతంలో అన్యాయాలపై ఉద్యమంలోకి దూసుకువచ్చారు. విద్యార్థి, ఉద్యోగ, ఐటీ రంగంలోని నిపుణులను ఏకతాటిపై తీసుకువస్తూ, టీఆర్ఎస్ పార్టీలో కీలక బాధ్యతలను నిర్వహించారు.

ఉద్యమం తీవ్ర రూపం దాల్చిన తరుణంలో 2008లో తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పార్టీ వ్యవహారాలను చక్కబెట్టే బాధ్యతలను భుజాన వేసుకున్నారు. ఆ వెంటనే వచ్చిన 2009లో తొలిసారి సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఒక్క ఏడాది గడవక ముందే రాజీనామా చేసి,

మరోసారి అదే నియోజకవర్గానికి భారీ మెజార్టీతో తిరిగి కేకే మహేందర్ రెడ్డి పై గెలిచారు. తెలంగాణ సాధనలో ఉద్యమకారులతో పాల్గొంటూనే తన వంతు పాత్రను పోషించారు.

కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, శోభ దంపతులకు తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధిపేటలో జన్మించారు. రెండేళ్లపాటు కరీంనగర్ లో చదువుకుని హైదరాబాదులోని సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్ లో పాఠశాల విద్యను పూర్తిచేశారు. అమెరికాలోని సిటీ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్‌లో ఎంబీఏ పూర్తిచేసి ప్రైవేట్ కంపెనీలో ఐదేళ్ల పాటు ప్రాజెక్ట్ మేనేజర్‌గా ఉద్యోగం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భాగం అయ్యేందుకు అమెరికాలో ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చాడు. 2006లో జరిగిన పార్లమెంట్ ఉప ఎన్నికలో బరిలో నిలిచిన కేసీఆర్ కు మద్ధతుగా 2లక్షల పైచిలుకు మెజార్టీతో గెలిపించడంలో కేటీఆర్ చురుకైన పాత్ర పోషించాడు. 2008లో మరోసారి కేసీఆర్‌తో పాటు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఉప ఎన్నికల బరిలోకి దిగినప్పుడు సిరిసిల్ల నియోజకవర్గంలో విస్తృత స్థాయిలో ప్రచారం చేసి తనదైన ముద్ర వేసుకున్నాడు.

2009 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి తొలిసారిగా పోటీచేసి, తన సమీప ప్రత్యర్థి స్వతంత్ర అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 171 ఓట్ల మెజార్టీతో గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టాడు. తెలంగాణ కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, తిరిగి 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 68,219 ఓట్ల భారీ మెజార్టీతో రెండోసారి గెలుపొందాడు.

విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం, పలు ప్రైవేటు కంపెనీల్లో పనిచేసిన అనుభవంతో ఇంగ్లీష్, హిందీ భాషాలలో ప్రావీణ్యంతో 2014లో తొలి ఐటీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే అంతర్జాతీయ వేదికలపై తన భాషా ప్రావీణ్యంతో, ఆయా రంగాలపై తనకున్న అనుభవాన్ని జోడించి ప్రసంగించి అందరినీ ఆకట్టుకొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఐటీ రంగంలో మరింత అభ్యున్నతి దిశగా రూపొందించిన ఐటీ పాలసీ, గ్రిడ్ పాలసీ, మున్సిపల్ యాక్టు సవరణ చట్టం, టీఎస్ బీపాస్ సంస్కరణలను పక్కాగా అమలు చేయడంలో కార్పొరేట్ అవసరాలు, పారిశ్రామిక అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై అవగాహన పెంచుకున్నారు కేటీఆర్.

## హరీష్ రావు

తెలంగాణ సాధకుడు కేసీఆర్ కు స్వయానా మేనల్లుడైన హరీష్ రావు... అయితే తన వ్యక్తిగత, వ్యవహార శైలితోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుని తెరాసలో ట్రబుల్ షూటర్గా గుర్తింపు తెచ్చుకున్నారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి కీలక బాధ్యతలను నిర్వర్తించారు. సాధారణ కార్యకర్త నుంచి సిద్దిపేట శాసనసభ నియోజకవర్గం శాసనసభ్యుడిగా, మంత్రిగా కీలక పదవుల్లో కొనసాగుతున్నారు. ఇక ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమకారులను ప్రోత్సాహించడంలో... కుల, ఉద్యోగ, విద్యార్థి సంఘాలను నడిపించడంలో ముఖ్య పాత్రను పోషించారు.

ఈయన మెదక్ జిల్లా, సిద్దిపేటలో సత్యన్నారాయణ, లక్ష్మీబాయి దంపతులకు జన్మించాడు. ఈయన తెలంగాణ రాష్ట్ర సమితి వ్యవస్థాపకులు, తెలంగాణ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారి మేనల్లుడు. ఈయన సిద్దిపేటలో పట్టభద్రుడైనాడు.

హరీశ్ రావు 2004 లో తొలిసారిగా సిద్దిపేట శాసనసభ నియోజక వర్గం నుంచి శాసన సభ్యునిగా ఎన్నికయ్యాడు. వై.ఎస్. రాజశేఖర్రెడ్డి కేబినెట్లో యువజన సర్వీసులు, ప్రింటింగ్ స్టేషనరీ శాఖ మంత్రిగా పనిచేశాడు. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు సిద్దిపేట శాసనసభ, కరీంనగర్ పార్లమెంటు స్థానాలకు ఎన్నికైనందున సిద్దిపేట స్థానాన్ని ఆయన ఖాళీ చేయవలసి వచ్చింది. ఆ ఖాళీ స్థానంలో జరిగిన ఉప ఎన్నికలో హరీశ్ రావు ఎన్నికైనారు. హరీశ్ రావు అప్పటికి విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి నేరుగా రాజకీయాలలోనికి అడుగిడినారు. ఆతర్వాత మంచి నాయకునిగా ఎదిగి నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. ఆయన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు అవిశ్రాంతంగా విశేషమైన ఉద్యమాలు నడిపారు.

తెలంగాణ కోసం రాజీనామా చేసి సిద్దిపేట శాసన సభ స్థానానికి 2004 అక్టోబర్లో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి 24827 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిపై 58935 ఓట్లతో రికార్డు స్థాయి మెజార్టీతో గెలుపొందాడు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 64014 ఓట్లలతో గెలిచాడు. 2010 మొదట్లో యు.పి.ఎ ప్రభుత్వం 2009 డిసెంబరు 9 లో ప్రకటించినా,

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకియ నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవడానికి నిరసనగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశాడు. తిరిగి 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో 95858 ఓట్లతో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొంది 2009 లో వై.యస్.రాజశేఖరరెడ్డి పులివెందుల నియోజక వర్గంలో సాధించిన 68,681 ఓట్ల రికార్డును తిరగరాశాడు.

2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గం నుంచి 93328 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి, ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గంలో నీటి పారుదల, మార్కెటింగ్, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు.

## అల్లం నారాయణ

సాహిత్యానికి వంశపారంపర్యంగా తొణికిపుచ్చుకున్న అల్లం నారాయణ ప్రముఖ జర్నలిస్టు. సమైఖ్య పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారిన మీడియాకు తెలంగాణ జవసత్వాలను నింపారు. కరీంనగర్ నుంచి వెలువడిన జీవగడ్డ పత్రిక నుంచి జర్నలిస్టుగా కెరీర్ ప్రారంభించారు. ఆయన రాసిన కాలమ్స్ కు విశేష ఆదరణ వచ్చేది. జగిత్యాల పల్లె కవితా సంకలనాలను వెలువరించారు. ఉస్మానియా వర్సిటీలో సోషియాలజీ చదివిన అల్లం నారాయణ సామాజిక ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించారు.

ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి,  ఆంధ్రా పాలిటిక్స్. కామ్ న్యూస్, ప్రజాతంత్ర, నమస్తే తెలంగాణ వ్యవస్థాపక సంపాదకుడిగా ఉమ్మడి రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టుగా సేవలు అందించారు. ఉద్యమానికి ఆంధ్రా యాజమాన్యాలను ఎదురించి జర్నలిస్టులను ఐక్యం చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. తెలంగాణ జర్నలిస్ట్స్ ఫోరం ఏర్పాటు చేసి ఉద్యమానికి ఊపిరి పోశారు.

## గద్దర్

అసలు పేరు వేరయినా గద్దర్‌గా పేరుగాంచిన గుమ్మడి విఠల్ రావు ఉద్యమ గళంగా గుర్తింపుపొందారు. కవి, గాయకుడు అయిన గద్దర్ గతంలో పీపుల్స్ వార్‌లో పనిచేశారు. ప్రజా గాయకుడుగా గద్దర్ పాటలకు విస్తృతమైన ఆదరణ వచ్చేది.

గద్దర్ పై కాల్పులు జరిగిన క్రమంలో అదృష్టవశాత్తు ఆయన బయటపడ్డారు. ఇప్పటికీ వెన్నులోనే బులెట్ ఉంది. గతంలో భువనగిరిలో జరిగిన తెలంగాణ జన సభలో 'గద్దర్ పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో పలు ఎన్ కౌంటర్‌లు జరగ్గా, టిఆర్ఎస్ రాజకీయ పార్టీగా అవతరించడంతో వామపక్ష తీవ్రవాదులపై ప్రభుత్వ దాడి తగ్గిందన్న అభిప్రాయం కొందరిలో ఉంది. ఆ క్రమంలో గద్దర్, గూడ అంజయ్య, గోరేటి వెంకన్న, అందెశ్రీ వంటి కళాకారులు ప్రజలలో విస్తృతంగా తిరిగారు. గద్దర్ మీటింగ్ లకు రావాలంటే భయపడే పరిస్థితి నుంచి తెలంగాణ కోసం గద్దర్ పాడుతుంటే జనం గొంతు కలిపే దశ వచ్చింది. కరీంనగర్ ఉప ఎన్నికలో కేసీఆర్ కు మద్దతుగా గద్దర్ సభలలో పాల్గొన్నారు. దళిత, ముస్లిం, గిరిజన సంఘాలు ఏర్పాటు చేసిన సమావేశాలలో సామాజిక తెలంగాణ వాదాన్ని గద్దర్ వినిపించేవారు.

కెసిఆర్ నిరాహార దీక్ష విరమించి, జ్యూస్ తాగినట్లు జరిగిన ప్రచారం పై ఉస్మానియా విద్యార్థులు నిరసన ప్రదర్శన చేయడంతో గద్దర్ కు మళ్లీ తెలంగాణ ఉద్యమ తెరపై ప్రాముఖ్యత పెంచాయి. కెసిఆర్ వదలివేస్తే, తాను విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తానని గద్దర్ నినాదం ఇచ్చారు. ఈ సందర్భంలో విద్యార్థి జెఎసి, ప్రజా సంఘాలు గద్దర్ కు మంచి మద్దతు ఇచ్చాయి.

కొన్నాళ్లు కెసిఆర్ దీక్ష కొనసాగించిన తర్వాత గద్దర్ తోనే కెసిఆర్ దీక్ష విరమింప చేయాలన్న ఆలోచన కూడా వచ్చింది. తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ ను విమర్శిస్తూనే మరోవైపు సహకరిస్తూ సాగారు. తదుపరి సామాజిక తెలంగాణ నినాదంతో వివిధ సంఘాలతో కలిసి గద్దర్ తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఏర్పాటు చేశారు. అదే క్రమంలో ఆయన పాదయాత్ర కూడా నిర్వహించారు. ఒక దశలో గద్దర్ ను కూడా జెఎసిలో భాగస్వామిని చేయాలని ప్రతిపాదన వచ్చింది. కాని కెసిఆర్ అందుకు ఒప్పుకోలేదు. మొత్తం మీద గద్దర్ ఒక విలక్షణ భూమిక పోషించాడని చెప్పాలి.

## రసమయి బాల్‌కిషన్

పేద, దళిత కుటుంబం నుంచి వచ్చి, తెలంగాణ ఉద్యమానికి తన ఆటపాటలతో ప్రజలను ఆకర్షితులను చేసిన కళాకారులలో రసమయి బాలకిషన్ ఒకరు. తెలంగాణ

భాష, యాస, కళలకు జరుగుతున్న అన్యాయాలపై తనదైన శైలిలో జానపద కళను అస్త్రంగా చేసుకుని గళమెత్తారు. కాలికి గజ్జె కట్టి ఊరురా తిరుగుతూ ఉద్యమానికి ఉ రకలెత్తించారు. కళాకారులతో ఏర్పాటైన తెలంగాణ ధూంధాం వేదికను స్థాపించి కన్వీనర్ గా వ్యవహారించారు.

ఆంధ్ర పాలకుల కుయుక్తులను కైగట్టిన పాటలతో ఎండగట్టారు. అణచివేతకు గురైన తెలంగాణ సాహిత్యానికి ధూంధాం వేదిక ద్వారా, రాజకీయ పార్టీలకతీతంగా పోరాడారు. అదే ఆయన్ను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత చట్టసభలకు తీసుకెళ్లగలిగింది. తొలిసారి కళాకారుడిగా తెలంగాణ అసెంబ్లీలో అడుగుపెట్టారు. మానకొండూరు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఏర్పాటైన రాష్ట్ర సాంస్కృతిక కౌన్సిల్ కు చైర్మన్ గా వ్యవహారించారు. గుర్తింపు లేకుండాపోయిన కళాకారుల పక్షాన పోరాడారు.

సిద్ధిపేట్ జిల్లా రావురుకులా గ్రామానికి చెందిన రసమయి బాలకిషన్ 1995లో టీచర్ ఉద్యోగంతో కెరీర్ ప్రారంభించారు. విద్యాబోధన చేస్తూనే వంశపారంపర్యంగా వస్తున్న జానపద కళలతో సామాజిక ఉద్యమాలలో భాగస్వామైయ్యారు. తెలంగాణ ఉద్యమంలో చారిత్రత్మక వేదికగా ధూం ధాం నిలపడంలో బాలకిషన్ కృషి చేశారు.

## గాదె ఇన్నయ్య

తెలంగాణ ఉద్యమం సామాజిక, పౌర హక్కుల నేతలతోనే ఏళ్ల పాటు మనుగడ సాగించింది. చారిత్రక నేపథ్యాన్ని, ఉమ్మడి రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను ప్రపంచానికి చాటిచెప్పడంలో కవులు, కళాకారులు, పౌరహక్కుల నేతలే ముఖ్య భూమికను పోషించారు. రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం నుంచి విద్యార్థులు ఆత్మ బలిదానాలు చేసుకున్న మలి దశ ఉద్యమం వరకు అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకురావడంలో తెలంగాణ పౌర సమాజానిదే ప్రధాన పాత్ర. అలాంటి వారిలో గాదె ఇన్నయ్య ఒకరు. సామాజిక ఉద్యమాలతో తెలంగాణ సిద్ధిస్తుందని బలంగా నమ్మి, ఎన్నో ప్రజా సంఘాలతో కలిసి పోరాటం చేశారు.

విద్యార్థి దశ నుంచి వామపక్ష భావజాలానికి ప్రభావితమై వరంగల్ లో 1982లో జైలు జీవితాన్ని అనుభవించారు. అప్పటి నుంచి పీపుల్స్ లిబరేషన్ అనుబంధ సంఘాలు, ప్రజాసంఘాలతో కీలకంగా వ్యవహారిస్తూ తెలంగాణ సాధనకు తనవంతు కృషి చేశారు. స్టూడెంట్ ఎన్నికల్లో జైలు లో ఉండి కాలేజీ స్టూడెంట్ యూనియన్

నాయకుడిగా నిలిచారు. అప్పటి నుంచి ప్రజా జీవితంలో అలుపెరగని పోరాటం చేస్తూనే తెలంగాణ రాష్ట్ర సమితి, తెలంగాణ రాష్ట్ర పార్టీలలో వ్యవస్థాపక సభ్యులలో ఒకడిగా ఉన్నారు. కేవలం రాష్ట్రాన్ని సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజాసంఘాలతో గొంతు కలుపుతూ తెలంగాణ ఉద్యమంలో ఉన్నారు. 2002లో తెలంగాణ రాష్ట్ర పార్టీని స్థాపించి ఊరూరా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ఆ తర్వాత 2004లో తెలంగాణ రాష్ట్ర సాధన ఫ్రంట్ లో బాధ్యతలు నిర్వర్తించారు. ఇక టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులలో ఒకడిగా కేసీఆర్ వెన్నంటి ఉంటూనే, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలు, ఆంధ్రుల దోపిడీ రాజకీయాలకు ప్రజా ఉద్యమాలతో సమాధానం చెప్పారు.

## ఘంటా చక్రపాణి

దళిత మేధావి, తెలంగాణ రాష్ట్రంలో తొలి టీఎస్పీఎస్సీ చైర్మన్ గా ఘంటా చక్రపాణి పనిచేశారు. జీవగడ్డ పత్రికకు అల్లం నారాయణతో కలిసి సుదీర్ఘకాలం పాటు జర్నలిస్టుగా సేవలందించారు. ఆంధ్రా పెత్తనంలో అణగారిపోతున్న తెలంగాణ ప్రయోజనాల కోసం ఉద్యమించారు. ఆ తర్వాత 1990లో జర్నలిస్టు నుంచి టీచింగ్ వైపు అడుగులు వేసి, కాకతీయ వర్సిటీలో సోషియాలజీ ప్రొఫెసర్ గా చేరారు. ఆ తర్వాత 1994లో బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరి వైస్ ఛాన్సలర్ స్థాయికి ఎదిగారు. తెలంగాణ ఉద్యమ కాలంలో టీవీ చర్చాగోష్టులలో పాల్గొంటూనే సామాజిక, ఆర్థిక పరమైన అంశాలలో తెలంగాణకు జరిగిన అన్యాయాలపై గొంతెత్తారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో సీఎం కేసీఆర్ కు సన్నిహిత వర్గంలో చేరి, రాష్ట్ర ఏర్పాటు తర్వాత టీఎస్పీఎస్సీ తొలి చైర్మన్ గా 2014లో పనిచేశారు. నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన అజెండాగా ఉద్యమించిన తెలంగాణ సమాజానికి, కేసీఆర్ మార్గనిర్దేశనంలో పనిచేశారు. ఉమ్మడి కరీంనగర్ లో జన్మించిన ఘంటా చక్రపాణి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ సోషియాలజీ, జర్నలిజంలో పట్టభద్రుడయ్యారు. ఆ తర్వాత జర్నలిస్టుగా, పొలిటికల్ అనలిస్టుగా, వక్తగా గుర్తింపు తెచ్చుకున్నారు.

## ఉద్యమంలో మరెందరో

ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థిగా అడుగుపెట్టిన ఈటెల రాజేందర్, మలి దశ ఉద్యమంలో టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ గా ఉమ్మడి రాష్ట్రంలో కమలాపూర్ నియోజకవర్గం నుంచి గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. కరీంనగర్ జిల్లాకు చెందిన ఈటెల రాజేందర్ ఉమ్మడి రాష్ట్రంలో తొలిసారిగా 2004లో ఎమ్మెల్యేగా గెలిచి టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ గా బాధ్యతలు స్వీకరించారు. 2009లో వచ్చిన ఎన్నికల్లోనూ మరోసారి హుజురాబాద్ నియోజకవర్గం నుంచి గెలిచారు. ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో తీవ్రంగా ఉన్న ఉద్యమ కాంక్షల మేరకు టీఆర్ఎస్ లో క్రియాశీలకంగా వ్యవహారించారు. కేసీఆర్ కు ప్రధాన అనుచరుడిగా అనతికాలంలోనే గుర్తింపు తెచ్చుకున్నారు.

బీసీ సామాజిక వర్గానికి చెందిన ఈటలకు సామాజిక ఉద్యమాలపై మంచి పట్టు ఉండేది. ఇదే తెలంగాణ ఉద్యమంలో బీసీ కుల సంఘాలను ఉద్యమంలోకి అడుగుపెట్టేలా చేసింది. బీసీ సామాజిక రాజకీయ నేతగా అన్ని వర్గాలను ఉద్యమంలోకి తీసుకురావడానికి కృషి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రా పాలకుల ఒత్తిళ్లకు తలొగ్గి, అసెంబ్లీ వేదిక అవహేళన చేసినా, ఉద్యమ సమయంలో ఎంతోమంది బడుగు బలహీన వర్గాల నాయకులు, ప్రజలను చైతన్య పరచడంలో కేసీఆర్‌కు వెన్నంటి ఉన్నారు. తెలంగాణ సాధనయే తమ అంతిమ లక్ష్యమని చాటిచెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలి ఆర్థిక మంత్రిగా ప్రాతినిథ్యం వహించారు.

## జిట్టా బాలకృష్ణారెడ్డి

యువజన నాయకుడిగా పలు సామాజిక కార్యక్రమాలలో క్రియాశీలంగా ఉండే జిట్టా బాలకృష్ణా రెడ్డి "మలిదశ తెలంగాణ"ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసారు. మొదట్లో కేసీఆర్ నాయకత్వంలో పనిచేసినా తరువాత ఆయన స్వంతంగానే తెలంగాణ సంస్కృతిని ప్రజల్లోకి తీసుకు వెల్లడంలో ఎంతో కృషి చేశారు.

వలసపాలనలో మరుగున పడిన మన యాస,భాష, కట్టు,బొట్టు, వంటకాలను, జీవన శైలిని ప్రతిభింభించే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి మరోసారి పరిచయం చేయాలని 2007 మార్చి 3 నుండి మార్చి 5 వరకు 3 రోజుల

పాటు భువనగిరిలో ఏకశిలగా ఉన్న భువనగిరి ఖిల్లాను అద్భుతమైన లైటింగ్ తో అలంకరించి తెలంగాణ జాతరను ప్రతిష్టాత్మకంగా జిట్టా బాలకృష్ణా రెడ్డి నిర్వహించారు. అదే స్ఫూర్తితో హైదరాబాద్ నిజాం కళాశాల మైదానంలో 2007 మార్చి 23 నుండి మార్చి 27 వరకు 5 రోజుల పాటు తెలంగాణ సంబురాలు పేరుతో నిర్వహించి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రపంచానికి మరోసారి ఎలిగెత్తి చాటారు.

ఢిల్లీలోనూ తెలంగాణ సంబురాలు నిర్వహించి కేంద్ర నాయకుల దృష్టిని ఆకర్శించారు. కొద్ది కాలం తెరాస అధ్యక్షుడు కె.చంద్రశేఖర రావు నాయకత్వంలో ఉద్యమంలో పాల్గొన్నా, ఆ తరువాత సొంత కుంపటి పెట్టుకుని ఉద్యమంలో స్వతంత్రంగా కొనసాగారు.

2010 నుండి ఉధృతంగా జరిగిన తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించి “యువ తెలంగాణ”పేరుతో అనేక రకాల ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు,సదస్సులు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తూనే, జె.ఎ.సీ. చేపట్టిన అనేక రకాల ఆందోళనలలో యువతను భాగస్వాములు అయ్యేటట్టు చేశారు.

స్వామి వివేకానంద స్ఫూర్తితో ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని యువతను కదిలించిన సామాజిక సేవ తత్పరిత కల వ్యక్తి జిట్టా బాల కృష్ణారెడ్డి. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసే కార్యక్రమాలతో పాటు, సామాజిక కార్యక్రమాల వైపు శ్రీ జిట్టా బాలక్రిష్ణా రెడ్డి నాయకత్వంలో 1992 లో “వివేకానంద యువజన సంఘం” స్థాపించారు. ఆ తరువాత రాష్ట్రం లోని యువజన సంఘాలన్నింటిని కలిపి 2000 సంవత్సరంలో రాష్ట్ర స్థాయి లో యువజన సంఘాల సమితి గా ఏర్పాటు చేశారు.

యువజన సంఘాల సమితి ద్వారా చేసిన అనేక సేవ కార్యక్రమాలకు గాను భారత ప్రభుత్వం నుంచి జిట్టా బాలక్రిష్ణా రెడ్డి జాతీయ ఉత్తమ యువజన సేవ పురస్కారం అందుకున్నారు. 2003 వ సంవత్సరం లో అమెరికాలో స్థిరపడిన వారి మేనమామ డాక్టర్ చిలుముల రామచంద్రా రెడ్డి గారి సహకారంతో అధునాతన సౌకర్యాలతో కోటి 20 లక్షల రూపాయలతో భువనగిరి లో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించారు.

## విమలక్క

జనశక్తి గ్రూప్ నేతలు అమర్, కూర రాజన్నల రాజకీయ వారసత్వంతో విమలక్క తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నేతగా ఆమె గాయకురాలిగా ప్రాచుర్యంలో ఉన్నారు. నల్గొండ జిల్లా ఆలేరు, వలిగొండ ప్రాంతాలకు చెందిన ఆమె పీపుల్స్ వార్, జనశక్తి చర్చల సమయంలో జనజీవన స్రవంతిలో కలిశారు. వామపక్ష భావజాలంతో, సామాజిక న్యాయ ఎజెండాతో కొంత దూకుడుగా ఉద్యమించడానికి ప్రయత్నించారు. హైదరాబాద్ లాంకో హిల్స్ పై దాడి చేయడం, కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహాన్ని దహనం వంటి ఘటనలలో ఆమె వర్గం ప్రమేయం ఉందని అంటారు. లాంకో హిల్స్ లో ఆమె స్వయంగా ఆందోళన నిర్వహించి అరెస్టు అయ్యారు.

## జి. కిషన్ రెడ్డి

రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన బీజేపీకి తెలంగాణ ప్రాంతంలో జవసత్వాలు నింపడంలో కిషన్ రెడ్డి బాధ్యతలను భుజనా వేసుకున్నారు. సాధారణ కార్యకర్త నుంచి తెలంగాణ వాణిని ఉమ్మడి రాష్ట్రంలో వినిపించారు. పార్టీని ధిక్కరించకుండానే విద్యార్థి సంఘాలను ఉద్యమంలో కార్యోన్ముఖులను చేయడానికి కషి చేశారు.

1964లో రంగారెడ్డి జిల్లా తిమ్మాపురం గ్రామంలో జన్మించిన కిషన్ రెడ్డి సాధారణ కార్యకర్త నుంచి 2010లో భారతీయ జనతా పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. 1980లో పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న కిషన్ రెడ్డి.. 2004 శాసనసభ ఎన్నికలలో తొలిసారిగా హిమాయత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యాడు. ఆ తర్వాత 2009లో అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి రెండోసారి ఎన్నికయ్యారు.

సీఎం వైఎస్ఆర్ హయాంలో తెలంగాణ ఉద్యమాన్ని అణగదొక్కే ప్రయత్నాలు జరుగుతుంటే... జాతీయ స్థాయిలో బీజేపీ స్టాండ్ ను తెలంగాణ వ్యాప్తం చేయడానికి సిద్ధమయ్యారు. దీనికోసం 2012లో తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ పోరు యాత్ర పేరిట ఉద్యమాన్ని తలపెట్టారు. క్షేత్రస్థాయిలోని బీజేపీ అనుబంధం సంఘాలు, తెలంగాణ వాదాన్ని బలపరచడంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా ప్రచార

బాధ్యతలను భుజనా ఎత్తుకున్నారు. దాదాపు 22 రోజులు పాటు 986 గ్రామాల్లో పర్యటించి గ్రామాల్లో రాష్ట్ర ఏర్పాటుకు బీజేపీ శ్రేణులను సంసిద్ధం చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన ఎన్నికల్లో మూడోసారి అంబర్ పేట్ నియోజకవర్గం నుంచి గెలిచి బీజేపీ శాసనసభ పక్ష నేత వ్యవహారించారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను, అసెంబ్లీ వేదికగా బీజేపీ గొంతుకను వినిపించారు. 2019 భారత సార్వత్రిక ఎన్నికలలో సికింద్రాబాదు లోకసభ నియోజకవర్గం నుండి పార్లమెంటు సభ్యునిగా ఎన్నికై, కేంద్ర హోంమంత్రి బాధ్యతలను నిర్వర్తించారు.

## డీఎస్పీ నళిని....

ఉమ్మడి పాలకుల కుట్రలు, తెలంగాణ వాదులపై జరుగుతున్న కక్ష రాజకీయాలు, విద్యార్థుల బలిదానాలను కళ్లాలారా చూసి కష్టపడి సాధించిన డీఎస్పీ ఉద్యోగాన్ని తృణప్రాయంగా విడిచిపెట్టారు. నళిని. డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా... అడుగడుగునా తెలంగాణ వాదాన్ని అణచివేయాలనే ఆంధ్ర పాలకులకు తొత్తులుగా మారడం ఇష్టం లేక, తెలంగాణ ఉద్యమానికి సంకెళ్లను వేయలేక పోలీసు ఉన్నతోద్యోగాన్ని వదిలిసే తెలంగాణ పోరు బాటలో తాను సైతం అంటూ అడుగులేశారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ప్రజా ప్రతినిధులు రాజీనామా చేస్తామని కొందరు.. చేశామని మరికొందరు. రాజీనామా లేఖను స్పీకర్ ఫార్మాట్ ఇవ్వని వారు కొందరైతే, ఉద్యమ సెగను తట్టుకోలేక విదేశాలకు పారిపోయిన నాయకులు తెలంగాణలో ఉన్నారు. ఈ సమయంలో భావోద్వేగానికి గురైన కొందరు యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతంటే. డీఎస్పీగా కొనసాగుతున్న నళిని.. 2009లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. అప్పట్లో ఇది సంచలనంగా మారి, ఉద్యమానికి కొత్త ఊపిరినిచ్చింది. ఆమె రాజీనామా చేసిన విషయంపై చాలా మంది బాధపడ్డారు. ఇలాంటి పని ఎందుకు చేశారంటూ కొందరు బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఎందరో సూచనలు, సలహాల మేరకు ఆ తర్వాత కొద్ది రోజులకే ఉద్యమకారుల సలహాలతో నళినిని మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. ఆ తర్వాత కూడా పదవికీ రాజీనామా చేసిన తర్వాత ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో తెలంగాణ కోసం దీక్ష చేశారు. ఆత్మ బలిదానాల కంటే తన ఉద్యోగమేమి గొప్పది కాదంటూనే తెలంగాణ కోసం ఉద్యమించారు.

## తెలంగాణ ప్రకాష్...

పుట్టింది ఉమ్మడి వరంగల్ జిల్లా... గల్లీ నుంచి ఢిల్లీ వరకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మేధావులను ఐక్యం చేయడం రాష్ట్ర సాధనకు మేథోమదనం చేయడంతో ఆయన ఇంటి పేరుగా తెలంగాణ మారిపోయింది. లాయర్ వి. ప్రకాష్ కంటే తెలంగాణ ప్రకాష్ పేరుతోనే విస్తృతమైన ప్రాచుర్యంలోకి వచ్చారు. విద్యార్థి దశ నుంచి తెలంగాణ తొలి పోరాటం నుంచి మలి దశ ఉద్యమం వరకు ఎన్నో సంఘాలు, సంస్థలతో కలిసి పనిచేస్తూనే స్వరాష్ట్ర సాధనే తన అజెండాగా కృషి చేశారు. ఇక తెలంగాణ ఏర్పాటు తర్వాత పాలనపరమైన అంశాల్లో కీలక పదవుల్లో కొనసాగారు. తెలంగాణ వాటర్ రిసోర్సెస్ కార్పొరేషన్ ఛైర్మన్ గా తెలంగాణ ఇరిగేషన్ రంగానికి పనిచేశారు.

1958లో జన్మించిన వీరమల్ల ప్రకాష్ రావు, 8వ తరగతిలో వచ్చిన తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పాల్గొన్నారు. అప్పటి నుంచి వివిధ దశల్లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో కీలకమైన బాధ్యతలను భుజాన వేసుకున్నారు. రాజకీయ అజెండాతోనే తెలంగాణ రాష్ట్ర సాధన వీలవుతుందని నమ్మిన ప్రొ. జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి వారిలో ప్రకాష్ ఒకరు.

విద్యార్థి దశ నుంచి ఉద్యమంలో ఆసక్తి చూపిన ప్రకాష్ తొలిసారిగా ప్రత్యేక తెలంగాణ పోరాటంలో ఎనిమిదవ తరగతిలో పాల్గొన్నారు. ఎమర్జెన్సీ తర్వాత రాడికల్ విద్యార్థి ఉద్యమాలపై ఆకర్షితుడయ్యారు. ఆ సమయంలోనే పీపుల్స్ వార్స్ వ్యవస్థాపకులు కామ్రేడ కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి విధానాలను పీపుల్స్ వార్ అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా వ్యతిరేకించేవారు. తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర్రావు ప్రారంభించిన డెమెక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ లో చేరి కార్యదర్శి స్థాయి వరకు ఎదిగారు.

1981లో రైతు ఉద్యమంలో ప్రాతినిథ్యం వహించారు. స్టేషన్ ఘన్ పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మల్కాపూర్ లో రైతులు, రైతు కూలీలను మొబిలైజ్ చేయడంతోపాటు ఉద్యమాన్ని తీవ్ర స్థాయికి తీసుకెళ్లడంతో కీలక పాత్రను పోషించారు. ఆ తర్వాత డీవీ రావు పిలుపు మేరకు హైదరాబాద్ కు మకాం మార్చారు. సాహిత్య, సాంస్కృతిక మంత్లీ మ్యాగజైన్ వడిశెలతో జర్నలిజంలో అడుగుపెట్టారు. ఏడాది

పాటు బాధ్యతలను నిర్వర్తించారు. డీవీ రావు మరణం తర్వాత 1987లో ములుగు కోర్టులో అడ్వకేట్ గా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. అనతి కాలంలోనే ప్రముఖ వకీల్ గా గుర్తింపు రావడంతో సామాజిక ఉద్యమాల్లో భాగస్వామ్యమయ్యారు. గిరిజన గ్రామాల్లో వయోజన విద్యపై అవగాహన కల్పించారు. కోర్టు సమయం ముగిసిన తర్వాత రాత్రి పదింటి వరకు గిరిజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో జడ్జీలు, మెజిస్ట్రేట్ల నియామాకాల్లో అంతా ఏపీకి చెందినవారే ఉండేవారు. ఆ క్రమంలోనే అవినీతి ఆరోపణలు ఉన్న మేజిస్ట్రేట్ విషయంలో బట్టబయలు చేసినందుకు ఆయనపై కోర్టు ధిక్కరణ కేసు 1996లో నమోదు కావడంతో అడ్వకేట్ వృత్తి నుంచి తప్పుకున్నారు. ఈ సమయంలోనే కాకతీయ వర్సిటీ మాజీ వర్సిటీ ప్రో. జయశంకర్ ను కలిసి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుగ్గాగా పాల్గొన్నారు.

## మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతచారి

మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతచారి. తెలంగాణ సాధనకు 25ఏళ్ల వయసులోనే ఆత్మబలిదానం చేసుకున్నారు. డిసెంబర్ 3న 2009లో జరుగుతున్న ఒంటి నిండా పెట్రోల్ పోసుకుని బలిపీఠమెక్కారు. శ్రీకాంతచారి మరణం తెలంగాణ ఉద్యమానికి మరింత భావోద్వేగాలను ప్రేరేపించింది. నల్గొండ జిల్లా మోత్కురు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన వెంకటాచారి, శంకరమ్మల పెద్ద కొడుకు శ్రీకాంత్. కుల వృత్తి చేస్తూ కన్న కొడుకును ప్రయోజకుడిని చేయాలని ఉస్మానియా వర్సిటీకి పంపించారు.

మలిదశ ఉద్యమం శిఖరానికి చేరుతున్న వేళ, పీజీ చేస్తూ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. తెలంగాణ ఉద్యమకారులపై ఏపీ పాలకుల దమనకాండను చూసి తట్టుకోలేక, కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఆత్మ బలిదానానికి ఒడిగట్టారు. 2009 నవంబర్ 29న ఎల్బీనగర్ చౌరస్తాలో కేసీఆర్ అరెస్టుకు నిరసనగా జరిగిన ధర్నాలో ఒంటి మీద పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. ఉద్యమ జ్వాలను రగల్చి, తెలంగాణ సాధనలో మలి దశ విద్యార్థి ఉద్యమంలో తొలి అమరుడయ్యారు. నాలుగు రోజుల పాటు మృత్యువుతో పోరాడుతూనే బతికితే తెలంగాణ రాష్ట్ర సాధన వరకు చచ్చేంత వరకు ఉద్యమిస్తానంటూనే కన్నుమూశారు. శ్రీకాంత చారి మరణం యావత్ తెలంగాణ లోకాన్ని ఉద్వేగానికి గురిచేసింది.

## ఉద్యమించిన ఉద్యోగ సంఘాలు

తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగ సంఘాల పాత్ర అత్యంత కీలకం. ఏ ఆందోళన చేయాలన్నా ఉద్యోగుల సంఘాలు ముందుకు వచ్చేవి. 1969 లో ఉద్యోగుల డిమాండ్ల మీద విద్యార్థుల ఉద్యోగ అవకాశాల కోసం ఖమ్మం జిల్లా పాల్వంచలో తెలంగాణ నిరసన మొదలైనా, హైదరాబాద్ కేంద్రంగా ఉద్యోగ సంఘ నేత కె ఆర్ ఆమోస్ నాయకత్వం లో జరిగిన ఉద్యమం చరిత్రలో నిలిచిపోయింది. కెసిఆర్ వ్యూహాత్మకంగా ఉద్యమం ఆరంభం అయినప్పటి నుంచి తగు ప్రణాళికలు రూపొందించి ఉద్యోగులను భాగస్వాములను చేశారు.

ప్రత్యేకించి హైదరాబాద్ లో ఫ్రీజోన్ అంశం 14 ఎఫ్ రద్దు పేరుతో చేసిన పోరాటంలో ఉద్యోగ సంఘాల నాయకులు స్వామిగౌడ్, శ్రీనివాస గౌడ్, దేవీ ప్రసాద్, విఠల్ ల సహకారం తీసుకున్నారు. అప్పటి వరకు రాజకీయ నేతల ఎజెండాతో వెళు తున్న కేసీఆర్ కు ఫ్రీ జోన్ తో విద్యార్థుల, ఉద్యోగుల ఉద్యమంగా మార్చగలిగారు. ఎన్.జి.ఓ సంఘం అధ్యక్షుడుగా ఉన్న స్వామి గౌడ్ ను రిటైర్ మెంట్ తర్వాత టిఆర్ఎస్ లోకి తీసుకు వచ్చారు. దేవీ ప్రసాద్ స్వయంగా సిద్దిపేట వాసి. ఉద్యోగుల ఆకాంక్షలను ఆకళింపు చేసుకోవడంలో దిట్ట అయిన కెసిఆర్ చలో సిద్ధిపేట ఆందోళనతో ఉద్యోగ వర్గాలను బాగా ఆకర్షించగలిగారు. అలాగే తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్థాపించడంలో స్వామిగౌడ్, విఠల్ కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలో శ్రీనివాసగౌడ్ కూడా ఉద్యమంలో ముందు భాగాన ఉన్నారు. భావ సారూప్యత కోసం నిరంతరం వారితో చర్చలు జరిపేవారు.

అలాగే ఈ నలుగురికి ప్రాధాన్యత ఇస్తూ గ్రామ పంచాయతీ స్థాయి నుంచి గ్రూప్ ఒక స్థాయి వరకు ఉద్యమాన్ని చేర్చడంలో కెసిఆర్ సక్సెస్ అయ్యారు సహాయ నిరాకరణ ఆందోళన చేసినా, సకలజనుల సమ్మె చేసినా, ఏ ఇతర ఆందోళన చేసినా ఈ ఉద్యోగ సంఘాల నాయకత్వంలో ఉద్యోగులు పాల్గొనేవారు. సకలజనుల సమ్మెను నలభై మూడు రోజుల పాటు నిర్వహించడంలో వీరి పాత్ర ప్రముఖమైనది.

వీరితో పాటు తెలంగాణ విద్యుత్ సంఘాల జెఎసి నేత రఘు, తెలంగాణ మజ్దూర్ యూనియన్ నేత అశ్వద్ధామ రెడ్డి, టీచర్ల సంఘం నేత మాణిక్యరెడ్డి, అడ్వేకేట్స్ జెఎసి నేత రాజేందర్ రెడ్డిల, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నేత జ్ఞానేశ్వర్,

పలువురు అత్యంత క్రియాశీల పాత్ర పోషించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక నేతలుగా మల్లెపల్లి లక్ష్మయ్య, పిట్టల రవీందర్ తదితరులు భావజాల వ్యాప్తికి కృషి చేశారు. డాక్టర్ల జెఎసికి నర్సయ్యగౌడ్ నాయకత్వం వహించారు. ఇక సింగరేణి జెఎసి అయితే కోల్ బెల్ట్ ను ఏకతాటిపై తెచ్చి ఉద్యమంలో పాల్గొనేలా చేసింది. సింగరేణి ఉద్యమాన్ని మరో జర్నలిస్టు పిట్టల రవీందర్ సమన్వయం చేశారు. అలాగే ఐఎఎస్ ఆఫీసర్లు రమణాచారి, గోయల్, రామలక్ష్మణ్ వంటి వారు రిటైరయ్యాక టిఆర్ఎస్ లోకి తీసుకు వచ్చారు. కేంద్ర జల సంఘంలో పనిచేసిన విద్యాసాగర్ రావును కూడా భాగస్వామ్యం కల్పించారు. తెలంగాణ వచ్చాక స్వామి గౌడ్ శాసనమండలి ఛైర్మన్ అయితే, విఠల్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు అయ్యారు. ఆత్మహత్యల నివారణ కమిటీ కన్వీనర్ గా తెలంగాణ ఉద్యమంలో బాధ్యతలు నిర్వహించిన చక్రపాణికి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బాధ్యతలు అప్పగించారు. శ్రీనివాస గౌడ్ మహబూబ్ నగర్ నుంచి ఎమ్మెల్యే అయ్యారు. దేవీ ప్రసాద్ కు ఎమ్మెల్సీగా హైదరాబాద్ నుంచి పోటీ చేయించినా ఓటమి పాలయ్యారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ దీక్ష

తెలంగాణ ఉద్యమంలో మరో ప్రముఖుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 96 ఏళ్ల వయసులో రాష్ట్ర ఏర్పాటు కోసం నిరాహార దీక్ష చేసి చరిత్రలో నిలిచారు. బాపూజీ 1969 నాటి ఉద్యమ సమయంలో ఆనాటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో సభ్యుడిగా ఉండేవారు. తెలంగాణ తొలి ఉద్యమం తీవ్రమైన సమయంలో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. దానికి కాసుతో వచ్చిన విభేదాలు కూడా కారణమని కొందరు చెబుతారు. వెనుకబడిన తరగతులకు చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆ తర్వాత కాలంలో రాజకీయంగా కొంత వెనుకబడి పోయారు.

2001 లో కెసిఆర్ తెలంగాణ రాష్ట్ర సమితిని ఆరంభించినప్పుడు హుస్సేన్ సాగర్ ఒడ్డున ఉన్న తన ఇంటిని పార్టీ ఆఫీస్ నిమిత్తం ఇవ్వడం ద్వారా ప్రత్యేక ఉ ద్యమానికి తన వంతు ప్రోత్సాహం ఇచ్చారు. ఆ తర్వాత కాలంలో అది ప్రభుత్వ స్థలంగా కోర్టు తీర్పు ఇవ్వడంతో దానిని ఖాళీ చేయవలసి వచ్చింది. ఆ తర్వాత ఆయన రాజకీయంగా యాక్టివ్ గా లేకపోయినా, 2009 లో తెలంగాణ ప్రకటన

వచ్చి, తిరిగి ఆగిపోయిన తర్వాత కొంత చురుకుగా ఉన్నారు. తెలంగాణ జెఎసి నుంచి తెలుగుదేశం పార్టీ బయటకు వచ్చిన తర్వాత ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన ఒక పోరాట వేదికకు కొండా లక్ష్మణ్ బాపూజీకి  నాయకత్వం అప్పగించారు. ఒక సందర్భంలో ఆనాటి విజయవాడ ఎంపీ లగడపాటి రాజగోపాల్ ఇంటికి వెళ్లి ప్రత్యేక ఉద్యమంపై చర్చలు జరపడం ఒక ఆసక్తికరమైన ఘట్టం. తెలంగాణ కోసం ఢిల్లీలో దీక్ష చేసి దేశ దృష్టిని ఆకర్షించడానికి ఆయన ప్రయత్నించారు. ప్రధానంగా ఆయన 96 ఏళ్ల వయసులో ఆ దీక్ష చేయడం విశేషం. కాని తెలంగాణ సాకారం కావడానికి ముందే బాపూజీ 2012 లో కన్నుమూశారు. తాను 1969 లో మంత్రి పదవి వదలుకుని జైలుకు వెళ్లినా, దశాబ్దాల తరబడి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం పోరాడుతున్నానని, అయినా కల నెరవేరలేదని దీక్ష సందర్భంగా వ్యాఖ్యానించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తెలంగాణ. ఉద్యానవన యూనివర్శిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టారు.

## పురాణం సతీష్ కుమార్

ఆదిలాబాద్ జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకుల్లో పురాణం సతీష్ కుమార్ ఒకరు. ఆయన టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా. పోలిట్ బ్యూరో మెంబర్ గా పనిచేశారు. తెలంగాణ మలి దశ ఉద్యమ సమయంలో 18 రోజులు జైలు జీవితం గడిపారు.  ఆదిలాబాద్ తూర్పు జిల్లా అధ్యక్షులుగా, చెన్నూరు, మంచిర్యా పార్టీని, కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేసి టీఆర్ఎస్ ని బలోపేతం చేసి కేసీఆర్ మన్ననలను పొందారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కోల, బెల్లంపల్లి, సిర్పూరు ఆసిఫాబాద్ నియోజక వర్గాలల్లో తెలుగుదేశం వ లక్ష్మి,బెల్లంపల్లి నియోజకవర్గంలో చిన్నయ్య ను లను టిడిపి నుంచి టీఆర్ఎస్ లోకి తీసుకువచ్చారు. ఆ తరువాత వారిని ఎమ్మెల్యేలుగా గెలిపించటంలో అన్నీ తానై కీలక పాత్ర పోశించారు. ఆదిలాబాద్ తూర్పు జిల్లాలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నాయకలను, కార్యకర్తలను టిఆర్ఎస్లోకి తీసుకువచ్చారు. ఉమ్మడి జిల్లాను బలోపేతం చేశారు, పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. కష్టకాలంలో టీఆర్ఎస్ ను వెన్నంటి ఉన్నందుకు, ఆయన కష్టాన్ని కేసీఆర్ గుర్తించి, 2016 లో ఎంఎల్సీగా టికెట్ ఇచ్చారు.. కేసీఆర్ ఆయుత చండీయాగంలో బృహత్తరమైన బాధ్యత అప్పంగించారు. ఋత్వికులకు భోజన

సదుపాయాలు కల్పించే బాధ్యతలు నిర్వహించే కేసీఆర్ ప్రశంసలు పొందారు. ఉద్యమం జరుగుతున్న సమయంలో అప్పటి కాంగ్రెస్ ఎంఎల్సి ప్రేమ్ సాగర్ రావు ఉద్యమకారులను అణిచివేసి తీవ్ర నిర్బంధం విధించినా, పిడీ యాక్టు కింద కేసు పెట్టాలని ప్రయత్నించారు. ఆయన ఆధిపత్యాన్ని బద్దలు కొట్టారు. ఏ ఎన్నికలు జరిగినా టీఆర్ఎస్ కే విజయం సాధించేలా కృషి చేసారు. తెలంగాణ ద్రోహుల పట్ల సింహస్వప్నంలా వ్యవహరించారు.

అటు తన సామాజిక వర్గమైన బ్రాహ్మణులలో పేదలకు సంక్షేమ పరిషత్ క్రింద పలు పథకాల ద్వారా సహాయం అందించారు. కరోనా కాలంలోలాక్ డౌన్ సంధర్భంగా ఎవరూ ఇంటి బయటికి వెళ్ళలేని పరిస్థితుల్లో ఆదిలాబాద్ జిల్లా లోని పేద బ్రాహ్మణులందరికీ ఓ నెల గ్రాసం అందించి ఆపత్బాంధవుడిగా మనసులు దోచుకున్నారు.

పురాణం సతీశ్ కుమార్ , ప్రస్తుత మంచిర్యాల జిల్లా , కోటపల్లి గ్రామంలో 1964, నవంబరు 9న పురాణం శ్యామసుందర్ రావు, శోభ దంపతులకు జన్మించాడు. ఆదిలాబాద్ లోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 1984లో పాలిటెక్నిక్ పూర్తి చేసారు. పురాణం సతీష్ 1987లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేశాడు. ఆయన 1995లో ఎంపీటీసీగా, 1997లో టీడీపీ జిల్లా కార్యదర్శిగా, 1998లో చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, టీడీపీలో ఆదిలాబాద్ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పని చేశాడు. పురాణం సతీష్ తెలంగాణ ఉద్యమ సమయంలో 2008, ఫిబ్రవరి7న తెలుగుదేశం పార్టీ కి రాజీనామా చేసి, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరాడు. ఆయన టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా, 2010 నుంచి ఆదిలాబాద్ తూర్పు జిల్లా అధ్యక్షుడిగా పని చేశాడు. ఆయన 2015లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

# తెలంగాణ సాధనలో ముఖ్య ఘట్టాలు సంఘటనలు

## తెలంగాణ విలీనం నుంచి విభజన దాకా.,

**1948:** నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రం (ప్రస్తుత తెలంగాణ) పోలీస్ చర్యతో భారత్‌లో విలీనం అయింది. అప్పటి నుంచి 8 ఏళ్ల పాటు హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగింది.

**1956:** ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలను కలిపి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఇరు ప్రాంతాల నేతలతో చర్చలు జరిపింది. పెద్దమనుషుల ఒప్పందం (జెంటిల్ మెన్ అగ్రిమెంట్)తో హైదరాబాద్ రాష్ట్రానికి కొన్ని ప్రత్యేక రక్షణలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది.

## తెలంగాణ ఉద్యమ క్రమం

**1969:** పెద్ద మనుషుల ఒప్పందంలోని రక్షణలు అమలు కావడం లేదని భావించిన తెలంగాణ ప్రజలు తొలిసారిగా ఉద్యమించారు. పోలీసుల కాల్పుల్లో 300 మంది చనిపోయారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా తెలంగాణ ప్రజాసమితి పార్టీ ఏర్పడింది.

**1973:** ఇరు ప్రాంతాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు నాటి ప్రధాన మంత్రి ఇంధిరా గాంధీ ఆరు సూత్రాల పథకాన్ని (సిక్స్ పాయింట్ ఫార్ములా) ప్రతిపాదించారు. దీనికి ఆంధ్రా, తెలంగాణ నేతలు అంగీకరించారు. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రాంతాల్లో ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన ఉద్యమాలు ఆగిపోయాయి.

**2001:** తెలుగు దేశం పార్టీ నుంచి బయటకు వచ్చిన ఆ పార్టీ శాసన సభ్యుడు కె.చంద్రశేఖర్ రావు.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని ఏర్పాటు చేశారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ తదితర మేధావులు కేసీఆర్‌కు మద్దతుగా నిలిచారు.

**2009:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఆయన దీక్షకు తెలంగాణ వాదులు, విద్యార్థులు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. తెలంగాణలో ఉద్యమం ఊపందుకుంది. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి శ్రీకాంతాచారి ఆత్మబలిదానం చేసుకున్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తెలంగాణ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని డిసెంబర్ 9 న కేంద్రం ప్రకటించింది.

**2010:** తెలంగాణ ఏర్పాటుపై ఆంధ్ర ప్రాంతం నుంచి వ్యతిరేకత రావడంతో తెలంగాణ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం జస్టిస్ శ్రీకృష్ణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రెండు ప్రాంతాలను సందర్శించి తన నివేదికలో ఆరు రకాల ప్రతిపాదనలు చేసింది.

**2011, 2012 :** శ్రీకృష్ణ కమిటీ రిపోర్టు ఇరుప్రాంతాలను సంతృప్తి పరచలేకపోయింది. ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో తెలంగాణ రాజకీయ ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఏర్పడింది. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు కలసి మిలియన్ మార్చ్, సాగర హారం, చలో అసెంబ్లీ, సకల జనుల సమ్మె తదితర రూపాల్లో నిరసనలు తెలుపుతూ ఉద్యమాలు చేశారు.

**2013:** హైదరాబాద్ రాజధానిగా పది జిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. సీడబ్ల్యూసీ నిర్ణయానికనుగుణంగా తెలంగాణ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది.

**2014:** అసెంబ్లీలో తెలంగాణ బిల్లుపై చర్చ జరిగింది. బిల్లును వ్యతిరేకిస్తూ అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానానికి శాసనసభ ఆమోదం తెలిపింది. కానీ, వివిధ పార్టీల మద్దతుతో రాజ్యసభ, లోక్‌సభల్లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందింది. జూన్ 2న ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది.

40 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం 2014లో తెలంగాణ ప్రజల ఆంకాంక్ష నెరవేరింది. ప్రజల సుదీర్ఘ ఆకాంక్ష, టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు వరకు జరిగిన సుదీర్ఘ పోరాటాల్లో కొన్ని ముఖ్య ఘట్టాలు ఇవే..

**నవంబర్29, 2009:** తెలంగాణ కోసం కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభం

**డిసెంబర్1, 2009 :** కేసీఆర్అరెస్ట్‌కు నిరసనగా తెలంగాణ వ్యాప్తంగా బంద్

**డిసెంబర్2, 2009:** కేసీఆర్‌కు మద్దతుగా అన్ని జిల్లాల్లో రిలే దీక్షలు ప్రారంభం.

**డిసెంబర్09, 2009:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కేంద్రం ప్రయత్నాలు ప్రారంభిస్తుందని కేంద్ర హెూంశాఖ మంత్రి చిదంబరం ప్రకటన.

**డిసెంబర్23,2009:** కేంద్ర హెూంశాఖ తెలంగాణ అంశంలో డిసెంబర్9వ తేదీన చేసిన ప్రకటన సవరించుకుంటూ తెలంగాణ అంశంపై మరింత విస్తృత స్థాయిలో సంప్రదింపులు కొనసాగుతాయని చిదంబరం మరో ప్రకటన చేశారు. ఆరోగ్యం సహకరించకున్నా కేసీఆర్హుటాహుటిన కాంగ్రెస్‌సీనియర్‌నాయకుడు జానారెడ్డి ఇంటికి వెళ్లి మంతనాలు జరిపి జేఏసీ ఏర్పాటు చేశారు.

## జేఏసీ తొలి సమావేశం..

**డిసెంబర్24, 2009:** కలింగభవన్‌లో తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలతో కలిసి జేఏసీ తొలి సమావేశం.

**జనవరి 5వ తేదీ 2010:** సీమాంధ్రలో సమైక్య కృత్రిమ ఉద్యమం నేపథ్యంలో రాష్ట్రంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కేంద్ర హెూంశాఖ ఢిల్లీలో సమావేశం.

**జనవరి 28, 2010** రాష్ట్ర పరిస్థితుల అధ్యయనానికి కమిటీ నియమిస్తున్నట్లు కేంద్ర హెూంశాఖ మంత్రి చదంబరం ప్రకటన.

**ఫిబ్రవరి 2, 2010** కమిటీ సారథిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్రీకృష్ణ, మరో నలుగురు సభ్యులు, కమిటీ విధివిధానాలు ఖరారు.

**డిసెంబర్30,2010** జస్టిస్శ్రీకృష్ణ కమిటీ తమ నివేదికను కేంద్ర హెూంశాఖకు సమర్పించింది. నివేదికలో ఆరు పరిష్కారాలను సూచించింది.

**జనవరి 6, 2011:** శ్రీకృష్ణ కమిటీ నివేదిక రాష్ట్రంలోని రాజకీయ పార్టీలకు తెలియజేసేందుకు కేంద్ర హెూంశాఖ ఆధ్వర్యంలో రెండో సారి అఖిలపక్ష సమావేశం. 8 పార్టీలతో సమావేశం, ఈ సమావేశానికి టీఆర్ఎస్, బీజేపీ పార్టీలు దూరంగా ఉన్నాయి.

**మార్చ్10, 2011: మిలియన్మార్చ్**

**సెప్టెంబర్13, 2011** నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని సకల జనుల సమ్మె ప్రారంభం. ఇది 42 రోజుల పాటు కొనసాగింది.

**డిసెంబర్28, 2012:** కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన 8 పార్టీలతో తిరిగి సమావేశం.

**జులై 12,2013:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన రోడ్మ్యాప్ ఖరారుకు ఏర్పాటు చేసిన కోర్కమిటీ సమావేశానికి రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రి కిరణ్కుమార్రెడ్డి, ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ హాజరు.

## టీడీపీ యూటర్న్..

**జులై 31, 2013:** ఢిల్లీలో యుూపీఏ మిత్రపక్షాల సమావేశం. హైదరాబాద్రాజధానిగా పది జిల్లాల తెలంగాణ ఏర్పాటు చేయాలని నిర్ణయం.

**అక్టోబర్3, 2013:** సీడబ్ల్యూసీ నిర్ణయానికనుగుణంగా తెలంగాణ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం.

**అక్టోబర్8, 2013 :** రాష్ట్ర విభజనపై కేంద్ర మంత్రులతో జీఎంవో ఏర్పాటు.

**2013 నవంబర్12, 13వ** తేదీల్లో రాష్ట్రంలోని ఎనిమిది పార్టీలతో జీఎంవో సమావేశం. అప్పటి వరకు తెలంగాణకు అనుకూలంగా ఉన్నామంటూ, లేఖ ఇచ్చామంటూ చెప్పిన టీడీపీ యూటర్న్. సమావేశానికి గైర్హాజరు.

**2013 డిసెంబర్12వ తేదీ:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్రం రూపొందించిన బిల్లుపై రాష్ట్ర శాసనసభ అభిప్రాయం సేకరించేందుకు రాష్ట్రపతి బిల్లు ప్రతులు అసెంబ్లీకి పంపారు.

## బిల్లుకు ఆమోదం.

**జనవరి 30వ తేదీ 2014:** అసెంబ్లీలో తెలంగాణ బిల్లుపై చర్చ పూర్తి, బిల్లును వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన తీర్మానానికి శాసనసభ ఆమోదం.

**ఫిబ్రవరి 13, 2014:** లోక్‌సభలో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రం

**ఫిబ్రవరి 18, 2014 :** లోక్‌సభలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు ఆమోదం.

**ఫిబ్రవరి 20, 2014:** రాజ్యసభలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు ఆమోదం.

**మార్చ్1వ తేదీ, 2014:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు రాష్ట్రపతి, భారత రత్న ప్రణబ్‌ముఖర్జీ ఆమోదం తెలిపిన రోజు.

**మార్చ్4వ తేదీ 2014:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు ప్రభుత్వ రాజముద్ర (గెజిట్)లో ప్రచురించిన రోజు..

**జూన్2వ తేదీ 2014:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవ దినోత్సవం.

## తెలంగాణ రాజకీయ సారథి కేసీఆర్

ప్రొఫెసర్ జయశంకర్ లాంటివాళ్లు వ్యాసాలు, పుస్తకాలతో తెలంగాణ వాదాన్ని వినిపించే ప్రయత్నిస్తున్న దశలో... రాజకీయ పార్టీల సమీకరణలకు అనుగుణంగా కార్యచరణ రూపొందించేందుకు కేసీఆర్ సారథిగా వ్యవహరించారు. అప్పటివరకు హిందుభావజాలం, బీజేపీ అనుబంధంగా పనిచేసిన ఆలె నరేంద్రతో కలిసి ప్రత్యేక రాష్ట్రం సాధించాలని నిర్ణయించుకున్నారు. ఈ దశలో కేసీఆర్ రాజకీయ పార్టీకి ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శనం చేశారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ జలదృశ్యం కేంద్రంగా 2001 ఏప్రిల్ 27న తెలంగాణ వాదుల సమక్షంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని కేసీఆర్ ఏర్పాటు చేశారు.

ప్రత్యేక రాష్ట్రమే ఏకైక అజెండాగా తమ పార్టీ పనిచేస్తుందని ప్రకటించారు. అప్పటి వరకు తాను ఉన్న టీడీపీ పార్టీ సభ్యత్వానికి, డిప్యూటీ స్పీకర్ పదవికి కేసీఆర్ రాజీనామా చేశారు. ఇకపై రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా టీఆర్ఎస్ కంటే ముందే అనేక పార్టీలు ఏర్పడిన అంతలోనే కనుమరుగైపోయాయి. మరికొన్ని కాంగ్రెస్‌లో కలిసిపోయాయి. టీఆర్ఎస్‌దీ అదే పరిస్థితి అనే విమర్శలు వచ్చాయి. మంత్రి పదవి ఇవ్వనందునే కేసీఆర్ పార్టీ పెట్టారని టీడీపీ నేతలు విమర్శల దాడి మొదలుపెట్టారు. టీఆర్ఎస్ పార్టీ పెట్టిన కొన్ని నెలలకే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలకు ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ ఊహించని స్థాయిలో సీట్లు గెలుచుకుంది. నిజామాబాద్, కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మన్‌పదవులు టీఆర్ఎస్ వశం అయ్యాయి. పార్టీని మరింత పటిష్టం చేసే దిశగా కేసీఆర్ తెలంగాణలోని పది జిల్లాల్లో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చెందేలా అన్ని వర్గాలను కలుపుకోని ముందుకు సాగారు.

## తెలంగాణవాదాన్ని రగిలించిన టీఆర్ఎస్

తెలంగాణ నినాదం, భావనను వ్యవస్థీకృతం చేయడంలో, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను వ్యాప్తి చేయడంలో టీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ వాదులు కీలకంగా వ్యవహరించారు. ఇందులో టీఆర్ఎస్ పార్టీ కంటే ముందు ఉన్న తెలంగాణ సాధన సమితి, తెలంగాణ రాష్ట్ర సమితిల కంటే ముందు తెలంగాణ పరిరక్షణ కమిటీలు, 1969లో మర్రి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ ప్రజా సమితిల కంటే

2001 కేసీఆర్, ప్రొ.జయశంకర్, తెలంగాణ మేధావుల సమన్వయంతో ఏర్పడిన టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సాధనలో ఎంతో కీలకంగా మారింది. ముఖ్యంగా రాజకీయ చతురతతోనే రాష్ట్రం సిద్ధిస్తుందని నమ్మిన సిద్ధాంతమే మూడున్నర కోట్ల ప్రజల ఆకాంక్షలను నేరవేర్చించింది. కవులు, కళాకారులు, మేధావులు తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేస్తూనే, ప్రత్యేక రాష్ట్ర సాధన రాజకీయ అజెండాగా వైపు వడివడిగా అడుగులు వేయడంలో టీఆర్ఎస్ విజయం సాధించింది.

## విద్యార్థుల్లో తెలంగాణ చైతన్యం

1969 ఉద్యమంలో తెలంగాణ విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని నష్టపోయారు. 369 మంది పోలీసు తుపాకీ తూటాలకు బలైనారు. వేలాదిమంది జైలు పాలైయ్యారు. ఉద్యమాన్ని పాలకులు అణచివేసిన తర్వాత అసంతృప్తితో రగిలిన యువకులు నక్సల్బరీ శ్రీకాకుళం సాయుధ పోరాట ప్రభావంతో అడవుల్లోకి వెళ్లిపోయారు. ఆయుధాలు పట్టినారు. ఈ దఫా తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కేసీఆర్ తరచుగా అంటుండేవారు. ఒక్క నెత్తురు చుక్క రాల్చకుండా, విద్యార్థులు ఒక్క విద్యా సంవత్సరాన్ని నష్టపోకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తామని తన ప్రసంగాల్లో చెప్పేవారు, ఉస్మానియా యూనివర్శిటీ విద్యార్థి నాయకుడు కొరడాల నరేష్ అధ్యక్షతన టి.ఆర్.ఎస్.వి పార్టీకి అనుబంధంగా విద్యార్థి విభాగం ఏర్పాటు చేసినా ఒక మిలిటెంట్ పోరాట సంస్థగా దాన్ని మలచలేదు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ టిఆర్ఎస్ నిర్వహించే కార్యక్రమాల్లో విద్యార్థులను సమీకరించేది, జిల్లా కేంద్రాలలో విద్యార్థులు సభలు నిర్వహించి నిర్మాణాన్ని పటిష్ట పర్చుకునేవారు ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల్లో టిఆర్ఎస్ విద్యార్థి విభాగం కార్యక్రమాలు వుంటుండేవి. 2007 ఆగస్టు నుండి టిఆర్ఎస్ విద్యార్థుల్లో తెలంగాణ చైతన్యాన్ని కలిగించి ఉద్యమంలో వారిని గతంకంటే మరింత ఎక్కువగా పాల్గొనేలా చర్యలు చేపట్టింది. విద్యార్థి ఉద్యమంలో ఎర్రోళ్ళ శ్రీనివాస్, బొంతు రామ్మోహన్, బాల్క సుమన్, గెల్లి శ్రీనివాస్ తదితరులు చురుకైన పాత్ర నిర్వహించారు. 2007 ఆగస్టు 11 నుండి 2007 డిసెంబర్ 29న నిజాం కళాశాలలో నిర్వహించిన 'విద్యార్థి గర్జన' సభ వరకు వేలాది మంది విద్యార్థుల్లో తెలంగాణ చైతన్యాన్ని కల్గించే ప్రయత్నం చేసింది. సుశిక్షితులైన క్రమశిక్షణ కలిగిన మహత్తర శక్తిగా విద్యార్థులను తెలంగాణ రాష్ట్రం తెచ్చుకునే దాకా అలుపెరుగని పోరాటయోధులుగా, భవిష్యత్ ఉద్యమ నేతలుగా

తీర్చిదిద్దే ప్రయత్నాన్ని టిఆర్ఎస్ చేపట్టింది. సుమారు 50 రోజులు 25 బృందాలకు శిక్షణా తరగతులను తెలంగాణ భవన్ లో నిర్వహించారు. 94 నియోజకవర్గాలకు చెందిన వేల మంది విద్యార్థులు ఈ తరగతులకు హాజరైనారు.

కెసిఆర్, ప్రొ. జయశంకర్, విద్యాసాగర్ రావు, ప్రొ. కోదండరామ్, మల్లేపల్లి లక్ష్మయ్య, వి.ప్రకాశ్, హరీశ్రావు, ప్రొ.లక్ష్మణ్, సి. విఠల్, దేశపతి శ్రీనివాస్, పద్మా దేవేందర్ రెడ్డి తదితరులు ఈ శిక్షణా తరగతుల్లో ప్రసంగించారు. మధుసుదనాచారి, పర్యాద కృష్ణమూర్తిల పర్యవేక్షణలో ఈ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులలో పాల్గొనలేక పోయిన విద్యార్థుల కోసం జిల్లాల్లో మరొక దఫా శిక్షణా తరగతులను టిఆర్ఎస్ నిర్వహించింది. విద్యార్థినుల కోసం 2007 డిసెంబర్ 18 నుండి 20వ తేది వరకు ప్రత్యేక శిక్షణా తరగతులను తెలంగాణ భవన్లో నిర్వహించారు. జంటనగరాలకు చెందిన 500 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

2008 జనవరి 2న మెదక్ లో విద్యార్థుల శిక్షణా తరగతులు నిర్వహించారు. జనవరి 7న వరంగల్లో 30వేల మంది విదారులు హాజరైనారు. 8న మంచిర్యాలలో 18 వేల మంది, అదే రోజు గోదావరిఖనిలో 12 వేల మంది, 9న వరంగల్ జిల్లా మహబూబాబాద్లో వేల మంది విద్యార్థులు హాజరైనారు. కరీంనగర్, కోరుట్ల, మెట్పల్లి, గద్వాల మొదలైన పట్టణాల్లో కూడా టిఆర్ఎస్ విద్యార్థుల శిక్షణా తరగతులను నిర్వహించింది.

ఈ శిక్షణా తరగతుల పాఠ్యాంశాలను కెసిఆర్ స్వయంగా రూపొందించారు. యాభై ఏళ్ల సమైక్య రాష్ట్రంలో తెలంగాణ వనరులు విధంగా దోపిడీకి గురైనవో గణాంకాలతో సహా కంప్యూటర్ ప్రజెంటేషన్, స్లైడ్ షోల ద్వారా తెరపై ఫోకస్ చేసి విద్యార్థులకు అర్థం అయ్యేలా వివరించారు. విద్యార్థులకు టిఆర్ఎస్ ఇచ్చిన శిక్షణ ఫలితమే తదనంతర కాలంలో తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ఎంతో చురుకుగా పాల్గొనడానికి దోహదపడింది. ఈ తరం విద్యార్థిలోకంలో 2008కి ముందు తెలంగాణ పట్ల కన్పించని చైతన్యం ఆ తర్వాత ఉద్యమ రూపంలో ముందుకు రావడం టీఆర్ఎస్ కృషి ఫలితమే నల్లగొండ నిరసన సభ. 2008 జనవరి 31న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జరుగుతున్న ఆలస్యానికి నిరసనగా "నల్లగొండ నిరసన సభ" నిర్వహించింది. ఫిబ్రవరి 2న కరీంనగర్ లో సింహగర్జన' టీఆర్ఎస్ ప్రారంభసభ జరిగిన ఎస్ఆర్ ఆర్ కళాశాల మైదానంలో బహిరంగసభ నిర్వహించింది.

కేసీఆర్ కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి కెసిఆర్ తాజా వ్యూహానికి తెరదీశాడు. టిఆర్ఎస్ పక్షాన గెలిచిన ఎంపిలు, ఎంఎల్ఎలు, ఎంఎల్సిలు అంతా రాజీనామా చేయాలని నిర్ణయించారు. కరీంనగర్ ఉప ఎన్నికల్లో వెల్లడైన తెలంగాణ ఆకాంక్షను, తమకందించిన ఘన విజయాన్ని తెలంగాణ వ్యాప్తంగా మరోసారి వెల్లడి చేయాలని ఈ నిర్ణయం తీసుకుని వుండవచ్చు. వై.ఎస్, కెవిపిల కుట్ర ఫలితంగా పదిమంది శాసనసభ్యులు తెలంగాణ ద్రోహులుగా మారిన వైనాన్ని, తెలంగాణ కష్టమని కాంగ్రెస్ అధిష్టానం మోసగించిన తీరును జనంలో ఎండగట్టాలని కెసిఆర్ రాజీనామాల వ్యూహాన్ని అనుసరించారు. 2008 మార్చి 3న నలుగురు ఎంపిలు రాజీనామా చేశారు. నరేంద్ర అంతకు ముందే కొన్ని ఆరోపణలపై టిఆర్ఎస్ నుండి సస్పెండ్ అయ్యారు. పార్టీతో నరేంద్ర సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. మార్చి 4న 16 మంది శాసనసభ్యులు, ముగ్గురు శాసనమండలి సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు.

ఈ రాజీనామాలకు ఒక్క రోజు ముందు (మార్చి 2న) ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కెసిజర్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. తెలంగాణ ఏర్పాటులో కేంద్రం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరికి నిరసనగా ఈ రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు సుమారు 3 నెలల క్రితమే తెలంగాణ భవన్లో జరిగిన మీడియా సమావేశంలో ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా “అవసరమైతే అందరం ప్రజాప్రతినిధులం రాజీనామాలు చేస్తం” అంటూ తెలంగాణ కోసం త్యాగాలకు వెనుకాడేది లేదని తేల్చి చెప్పారు. ఆ తరువాత కొద్ది రోజులకే కేంద్ర ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. ఫిబ్రవరి నెలాఖరులోపు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియ మొదలు పెడుతున్నట్లు ప్రకటన రాకపోతే రాజీనామాలు చేసి ప్రజాక్షేత్రంలోకి వెళ్తామని హెచ్చరించారు. ఫిబ్రవరి 24న ఆఖరిసారి తాము రాజీనామాలకు సిద్ధపడ్డట్లు మీడియాకు తెలిపారు.

టిఆర్ఎస్ నాయకత్వం అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదిది. ఎంతో ముందుగానే ఒక వ్యూహం ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నారు. పత్రికల్లో ఈ వార్తలు ప్రచురించినప్పుడు, మీడియా న్యూస్ ఛానెళ్లలో ఈ సమాచారం వెల్లడైనప్పుడు ఎక్కడ కూడా వ్యతిరేకత కనిపించలేదు.

తెలంగాణ వాదులెవ్వరూ కెసిఆర్ తో ఈ నిర్ణయంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేయలేదు. పార్టీ శాసనసభ్యులలో కొందరు ఎన్నికల ఖర్చును, వై.ఎస్, చంద్రబాబుల కుట్రలను

దృష్టిలో పెట్టుకుని ఈ రాజీనామాల అవసరం రాకుంటే బాగుండేమోనని సన్నిహితులతో అన్నారే తప్ప కెసిఆర్ తో చర్చించలేదు. నిర్ణయం అమలు జరిగింది. కే.సి.ఆర్. ఆదేశించగానే రాజీనామా లేఖను అందించిన తొలి ఎం.ఎల్.ఏ జడ్చర్ల లక్ష్మారెడ్డి, ఆ తర్వాత మిగిలినవారిచ్చారు. టిఆర్ఎస్ ఆవిర్భావం నుండి ఈ రాజీనామాల దాకా కెసిఆర్ ఎంతో ఆలోచించి పక్కా వ్యూహంతోనే ఏ నిర్ణయమైనా తీసుకునేవారు. తెలంగాణ ప్రజల “పల్స్” కెసిఆర్ కు తెలిసినంతగా మరొకరికి తెలియదు, తను తీసుకోబోయే నిర్ణయం మంచిచెడుల గురించి తన మస్తిష్కంలో తానే అంతర్మథనం చేసుకునేవారు.

రాజీనామాల వంటి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ముందు కొన్ని క్షణాలో, గంటలో కాదు. రోజుల కొద్దీ ఆలోచించి ముఖ్యులతో తెలంగాణ వాదులతో చర్చించి తన నిర్ణయాన్ని సరిచూసుకుని ఆ తర్వాతే బయటికి వెల్లడించే అరుదైన ఆలోచనాశైలి కెసిఆర్ దీ. అందుకే టిఆర్ఎస్ ఆవిర్భావం అంత అద్భుతంగా జరిగింది. ఆవిర్భావం నుండి తీసుకున్న నిర్ణయాలు, అనుసరించిన ఎత్తుగడలు వ్యూహం ఎప్పుడూ ఆశించిన ఫలితాలను అందిస్తూనే వచ్చాయి. కానీ ఈ ఉపఎన్నికల్లో రాజీనామా చేసిన 16 మంది సిట్టింగ్ ఎం.ఎల్.ఏలలో, టి.ఆర్.ఎస్. లెజిస్లేచర్ పార్టీ నాయకుడు డా. విజయరామారావుతో సహా 9 మంది ఓడిపోయారు. ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో రెండు లక్షలకు పైగా మెజారిటీ వచ్చిన కే. సి.ఆర్. కు ఈ ఎన్నికల్లో కేవలం 15 వేల మెజారిటీ మాత్రమే లభించింది.

పి.జె. ఆర్. మరణంతో ఖాళీ అయిన ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో ఆయన కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి ఎం.ఎల్.ఏగా ఎన్నికైనారు. కేసీఆర్ టి.ఆర్.ఎస్. అధ్యక్ష పదవికి రాజీనామా చేసారు. మూడు రోజుల తర్వాత ప్రొ. జయశంకర్ ఇతర పార్టీ నాయకుల వత్తిడితో మళ్ళీ ఆయన అధ్యక్షునిగా కొనసాగడానికి అంగీకరించారు. రాజీనామాను ఉపసంహరించుకున్నారు.

## తండ్రి బాటలో కూతురు, కొడుకు...

తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ కుటుంబం ఏదొక రూపంలో పాల్గొన్నారు. తొలుత కెసిఆర్ ఉద్యమంలోకి వచ్చినప్పుడు ఆయన కొడుకు కేటీఆర్, కవిత విదేశాల్లోనే విద్యా, ఉద్యోగాల్లో ఉన్నారు. ఉద్యమ తీవ్రత పెరగడంతో పార్టీలోకి ఎంట్రీ ఇచ్చారు. అయితే 2009 ఎన్నికల కంటే కేటీఆర్ అమెరికా నుంచి వచ్చి నేరుగా ఉద్యమంలో

చురుగ్గా వ్యవహారించారు. 2009 ఎన్నికలలో కెటిఆర్ కరీంనగర్ జిల్లా సిరిసిల్ల నుంచి పోటీ చేసినప్పుడు గట్టి పోటీ ఉన్నా తక్కువ ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆ తర్వాత 2009లో తెలంగాణ ప్రకటన రావడం, తిరిగి ఆగిపోవడం నేపథ్యంలో మారిన రాజకీయ పరిణామాలతో మిగిలిన ఎమ్మెల్యేలతో పాటు కెటిఆర్ కూడా రాజీనామా చేసి భారీ ఆధిక్యతతో విజయం సాధించారు. కేటీఆర్ వచ్చిన ఏడాదిన్నరకు ఇండియాకు తిరిగి వచ్చిన కవిత కళాకారులను జాగృతం చేసేందుకు కృషి చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణ జాగృతి పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి సాహిత్యం, కళా రంగాలతో పనిచేయడం మొదలుపెట్టారు. బతకమ్మ ఉత్సవానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో ఆమె చేసిన కృషి విశేషమైనదే. జానపద కళాకారులను సమీకరించడం మహిళలను బతకమ్మ ఉత్సవంలో భాగస్వాములను చేయడం, విస్తృతంగా ప్రచారా మాద్యమాలను వాడుకలోకి తీసుకువచ్చారు. అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహా ఏర్పాటులో క్రియాశీలక పాత్ర పోషించారు. 2014 లో నిజామాబాద్ నుంచి పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించి పార్లమెంటులో అడుగు పెట్టారు. అటు ఉద్యమంలోను, ఇటు ఎన్నికల రాజకీయాలలోను వీరిద్దరూ క్రియాశీలకంగా ఉండడం విశేషం. తండ్రి మాదిరే వీరిద్దరూ కూడా మంచి వక్తలు, బహుభాషలలో ప్రావీణ్యులు కావడం కూడా విశిష్టమైన అంశమే.

## అన్ని తానైన తన్నీరు

కెసిఆర్ మేనల్లుడు అయిన తన్నీరు హరీష్ రావుకు టిఆర్ఎస్ లో ప్రత్యేక స్థానం ఉంది. కెసిఆర్ కుమారుడు, కుమార్తె రాజకీయాలలోకి, ఉద్యమంలోకి రాకముందు నుంచి హరీష్ రావు పార్టీ వ్యవహారాల్లో కీలకమైన నేతగా ఎదిగారు. మేనమామ వెన్నంటి ఉంటూనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు, జనాల్లో ఆదరణ పెంచుకున్నారు. తెలంగాణ యాసలో పదునైన మాటలను సంధించడంలో దిట్ట. కార్యకర్తలను ఆకట్టుకోవడంలో, వారిని ఉద్యమ దిశలో నడిపించడంలో హరీష్ రావు ముందుభాగాన ఉండేవారు. ఏ రకమైన ఆందోళన అయినా, తెలంగాణ అంశానికి సంబందించినదైతే చాలు వెనుకాడకుండా అక్కడ ముందుండేవారు. కెసిఆర్ 2004లో కరీంనగర్ నుంచి లోక్ సభకు, సిద్దిపేట నుంచి అసెంబ్లీకి గెలిచాక ఖాళీ చేసిన సిద్ధిపేట సీటును హరీష్ రావుకు ఇచ్చారంటేనే ఆయన ప్రాధాన్యతను యావత్తు తెలంగాణకు చాటి

చెప్పారు. 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో టిఆర్ఎస్ చేరినప్పుడు హరీష్ రావు ఎమ్మెల్యే కాకపోయినా, ఆయనకు మంత్రి పదవిని కెసిఆర్ ఇచ్చారు. ఆ తర్వాత ఉప ఎన్నికలో గెలుపొందారు. తదుపరి రెండు సాధారణ, మరో రెండు ఉప ఎన్నికలలో గెలుపొందడం ఒక ఎత్తు అయితే, కెసిఆర్ కన్నా భారీ ఆధిక్యతలను తెచ్చుకుని సిద్దిపేటలో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. తెలంగాణ జెఎసి మిలియన్ మార్చి, సాగర హారం వంటి ఆందోళనలకు పిలుపు ఇచ్చినప్పుడు కొందరు టిఆర్ఎస్ నేతలు టాంక్ బండ్ పైకి రావడానికే సందేహించిన సందర్భంలో హరీష్ రావు, మరో ఎమ్మెల్యే రవీంద్ర రెడ్డితో కలిసి పోలీసుల కంట పడకుండా టాంక్ బండ్ చేరుకున్నారు. అలాగే జాతీయ రహదారి బంద్ వంటి ఆందోళనలలో కూడా చురుకుగా పాల్గొనేవారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో హరీష్ రావు పాత్ర ప్రత్యేకంగా ప్రస్తావనగా చెప్పాల్సిన నాయకుడిగా ఎంతో పరిణితి పొందారు. ఇక ఉమ్మడి రాష్ట్ర శాసనసభలో విజయరామారావు టిఆర్ఎస్ పక్ష నేతగా ఉన్నా, ఈటెల రాజేందర్ నాయకుడిగా ఉన్నా హరీష్ రావు తనదైన శైలిలో చురుకుగా ఉండేవారు.

కెసిఆర్ సిద్దిపేటలో 14 ఎఫ్ పై దీక్ష చేపట్టడానికి గాను కరీంనగర్ నుంచి బయల్దేరగా పోలీసులు అరెస్టు చేశారు. ఆ సమయంలో సిద్దిపేటలో పోలీసులకు వ్యతిరేకంగా హరీష్ రావు తనపై పెట్రోల్ పోసుకుని కలకలం సృష్టించారు. ఆ ఘటన తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున్న ఎగిసేలా చేసినా, ఉద్వేగాల దిశగా తీసుకెళ్లిందనే విమర్శలు ఉన్నాయి. దీంతో కొంతమంది విద్యార్థులు, తెలంగాణవాదులు ఆత్మహత్యలకు ఉసిగొల్పారనే ఆరోపణలు వచ్చాయి. తెలంగాణ ఉద్యమం సఫలం అయి టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి కెసిఆర్ ఈయనకు మంత్రి పదవి అప్పగించడమే కాకుండా, కీలకమైన నీటిపారుదల శాఖను కూడా అప్పగించడం విశేషం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జరిగిన మలిదశ ఉద్యమం నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు కేసీఆర్ కుటుంబం అన్ని ఉద్యమ వేదికలతో కలిసి నడవడంలో గొప్ప విషయమే.

## సోనియాగాంధీని ప్రభావితం చేసిందెవరు

తెలంగాణ ఏర్పాటులో ఇచ్చిన మాటకు కట్టుబడి సోనియా నూతన రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించినట్లుగా చెప్పుకున్నా... సోనియా గాంధీని ఏర్పాటు దిశగా

ప్రభావితం  చేయడంలో తెలంగాణ ఎంపీలతోపాటు కేంద్రమంత్రులు చిదంబరం, జైరామ్ రమేష్, అలాగే రాహుల్ గాంధీకి సన్నిహితుడైన కొప్పుల రాజు ఉన్నారనేది పార్టీలో జోరుగా చర్చ జరిగేది. ఐఏఎస్ బాధ్యతల నుంచి తప్పుకుని ఏఐసీసీలో ఎస్సీ సెల్ విభాగానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు.

ఎన్నికలకు ముందు తెలంగాణ ఇస్తే అధికారం వస్తుందని, ఎక్కువ సీట్లు వస్తాయని తెలంగాణ ఎంపీలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంలో సఫలమయ్యారు. కేంద్ర మంత్రి గా ఉన్న జైపాల్ రెడ్డి ఢిల్లీలో ఈ విషయంలో క్రియాశీలక పాత్ర పోషించారు. వైఎస్ఆర్ మరణం తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా, తెలంగాణ ప్రాంత నేతలను ఆకట్టుకోవడంలో సఫలం కాలేదు. జగన్ ఫ్యాక్టర్ కారణంగా ఏపీలో కాంగ్రెస్ కు సీట్లు రావన్న అభిప్రాయం అప్పటికే ఏర్పడింది.

సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై 1956 తర్వాత అనేక సార్లు రాష్ట్ర శాసనసభలో ఈ ప్రాంత శాసనసభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. 1972లో, 1987లో, 89లో, 1992లో, 96లో తెలంగాణకు జరిగిన అన్యాయాలపై శాసనసభ సుదీర్ఘంగా చర్చించింది. అప్పటి సీఎంలూ ఎన్టీఆర్, నేదురమల్లి జనార్ధనరెడ్డి, చంద్రబాబు నాయుడు ఈ అన్యాయాలను సవరిస్తామంటూ అనేక హామీలను గుప్పించారు. కానీ ఏ ఒక్కటి అమలు కాలేదు. మరోసారి 1997 ఫిబ్రవరి 26న శాసనసభలో జగిత్యాల ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఈ అంశాన్ని చర్చించారు. దీనికి సీఎం చంద్రబాబు వద్ద సమాధానం లేకపోగా, అవహేళన చేస్తూ జై తెలుగుదేశం అంటూనే అసెంబ్లీ సమావేశంలో సమాధానం ఇవ్వటం అప్పటి తెలంగాణ ఎమ్మెల్యేను అవమానించారు.

ఈ సభలో కాంగ్రెస్ పార్టీకి చెందిన జగిత్యాల శాసనసభ్యుడు టి.జీవన్ రెడ్డి చర్చను ప్రారంభిస్తూనే తెలుగుదేశం పార్టీని వైఖరిని ఎండగట్టారు. శాసన సభలో తెలంగాణ అనే పదాన్ని అనలేని పరిస్థితి ఉందని, వెనుకబడిన ప్రాంతంగా సంబోధించాల్సిన దయనీయంగా ఈ ప్రాంతం మారిందన్నారు. తన ప్రసంగంలో తెలంగాణకు వివిధ రంగాలలో జరుగుతున్న అన్యాయాలను గణాంకాలతో సహా వివరించారు. "రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంతవరకు అమలులో వున్న తెలంగాణ రీజనల్ డెవలప్ మెంట్ బోర్డుని రద్దు చేయడం వలన

తెలంగాణ ప్రాంతం వెనుకబడిపోయిందన్నారు. నా తెలంగాణను కోటి రతనాల వీణగా పొగడడం జరిగింది అటువంటి తెలంగాణలో అసలు ప్రజా ప్రభుత్వం ఉన్నదా? ఒక వైపు తీవ్రవాదులు మరో వైపు పోలీసు వర్గాలు రాజ్యమేలుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు తమ న్యాయమైన కోర్కెల కోసం ఆనాటి నుంచి ఈ నాటి దాకా పోరాటం చేయక తప్పడం లేదన్నారు. రాష్ట్రంలో అక్షరాస్యత శాతం 44.09 అని ప్రభుత్వం పేర్కొనడం జరిగింది. కాని తెలంగాణలోని ఏ జిల్లాలో 30 శాతం దాటలేదన్నారు. తెలంగాణ ప్రజలకు విద్య అవకాశాలు కల్పిస్తేనే అన్ని అభివృద్ధి చెందుతాయి.

ఉద్యోగాలు ఇస్తారో లేదో తెలియదు కానీ విద్యా అవకాశాలు పెంచితే ఇక్కడ విద్యార్థులకు ఉన్నతస్థానాలకు చేరుకుంటారన్నారు. 1988లో ఎన్.టి.రామారావుగారు ముఖ్యమంత్రిగా ఉండగా తెలంగాణ ప్రాంతానికి ఒక గ్రామీణ విశ్వవిద్యాలయం, ఒక మెడికల్ కాలేజ్, రెండు ఇంజనీరింగ్ కాలేజీలు, ఒక వ్యవసాయ కళాశాల, జిల్లాలో పీ.జి. సెంటర్లు నెలకొల్పుతామని శాసనసభలో ప్రకటించారు. ఈ 9 ఏళ్ళల్లో ఒక్క కళాశాల కూడా రాలేదు. 10 ఏళ్ల నుంచి హైదరాబాద్ నగరానికి కృష్ణా, గోదావరి జలాలను తెస్తామని కాలం వెళ్ళబుచ్చుతున్నారే తప్ప చర్యలు చేపట్టడం లేదు. మద్రాస్ నగరానికి మాత్రం మంచి నీరు ఇవ్వడానికి ఈ ప్రభుత్వం ఉత్సాహం చూపుతున్నది. అందులో 10వ వంతైన హైదరాబాద్ నగరంపై చూపించినా ఈ 40 ఏళ్లలో ఏపీ ప్రాంతాల కంటే తెలంగాణ మరింత అభివృద్ధి చెందేది అంటూ ఉద్వేగంతో ప్రసగించారు. ఈ చర్చలో తెలంగాణ ప్రాంత బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ, సీపై, సీపీఎం శాసనసభ్యులూ ఉన్నారు.

## తెలంగాణ ఎంపీల క్రియాశీలకపాత్ర

తెలంగాణ రాష్ట్ర సాధన, ఉద్యమంలోను, అలాగే సమైక్య రాష్ట్ర ఉద్యమంలోను కాంగ్రెస్ ఎంపీల పాత్రను ప్రస్తావించాల్సిన అంశం. ఎంపీలుగా ఉన్నా గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కి, గడ్డం వివేక్ వెంకటస్వామి, మందా జగన్నాదం, పొన్నం ప్రభాకర్, రాజయ్య, కోమటి రెడ్డి రాజగోపాలరెడ్డి లు ఒక బృందంగా తెలంగాణ సాధన కోసం విశేషమైన కృషి చేశారు. రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, రాపోలు ఆనంద భాస్కర్ లు కూడా సభలో తెలంగాణ అంశం వచ్చినప్పుడు బలంగా తమ గళం వినిపించేవారు. మరో నేత కేశవరావు కాంగ్రెస్ ఎంపీగా ఉన్నప్పుడు

సారధ్య సంఘానికి జానారెడ్డితో పాటు నాయకత్వం వహించారు. అయితే వీరెవ్వరూ తమ పదవులకు రాజీనామా చేయకుండా కాంగ్రెస్ లోనే ఒక టీమ్ గా ఒత్తిడి తెచ్చే పని చేసేవారు. ప్రత్యేకించి లోక్ సభ సభ్యులు గుత్తా సుఖేందర్‌రెడ్డి, వివేక్, పొన్నం, మందా జగన్నాథం, రాజయ్య, కోమటిరెడ్డి, మధుయాష్కీలు తెలంగాణ అంశంపై పార్లమెంటులో ఆందోళనకు దిగి సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత వారు పార్లమెంటు మెట్ల మీద కూర్చుని రోజుల తరబడి నిరసన తెలిపిన తీరు ఒక చరిత్రగా ఉంటుంది. అయితే వీరికి కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి మద్దతు ఉందనే వాదన ఉండేది.

ఆయనే ఎంపీలకు డైరెక్షన్ ఇచ్చేవారని, కేశవరావు, గుత్తా వంటి వారు ఆయనకు సన్నిహితంగా ఉండేవారు. అయితే మంత్రిగా తాను చేసేది చేస్తున్నానని జైపాల్ రెడ్డి చెప్పేవారు. 2009 డిసెంబరు 9న తెలంగాణ ప్రకటన వెలువడిన తర్వాత ఇందుకోసం తను చేసిన కృషిపై ప్రత్యేకంగా ప్రకటన చేశారు. అదిష్టానంపై ఒత్తిడి తేవడానికి ఎంతగానో పాటుపడ్డానని చెప్పారు. కడప కాంగ్రెస్ ఎంపీగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి మహబూబాబాద్‌కు ఓదార్పు నిమిత్తం వెళుతుంటే వి.హనుమంతరావు తదితర ఎంపీలు ఎక్కువగా హడావుడి చేశారు. రోశయ్యపై ఒత్తిడి తెచ్చి జగన్ ను అరెస్టు చేయించారు. ఉస్మానియాలో ఉద్యోగ పరీక్షలు జరుగుతుంటే గుత్తా తదితరులు అక్కడకు వెళ్లి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే క్వార్టర్లలో వీరు దీక్ష చేసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆ దీక్షకు తెలంగాణవాదులు మద్దతు పలికారు. కొద్ది రోజుల దీక్ష తర్వాత అప్పటి సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. ఇక ఆంధ్రకు చెందిన ఎంపీ లగడపాటి రాజగోపాల్ తో పలువురు తెలంగాణ ఎంపీలకు పెద్ద గొడవ అయింది.

సర్వే సత్యనారాయణ తెలంగాణ కోర్ ఎంపీల బృందంతో పెద్దగా కలిసేవారు కాదు. సికింద్రాబాద్ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్. మహబూబాబాద్ ఎంపీ బలరామ్ నాయక్ లు కొంత అంటి అంటనట్లుగా ఉండేవారు. తెలంగాణ ఇవ్వరేమోనన్న భావన ఉన్నప్పుడు సర్వే సత్యనారాయణ, బలరామ్ నాయక్ లకు మంత్రి పదవులు లభించాయి. ఆ తర్వాత తెలంగాణ అంశం వచ్చినప్పుడు పార్లమెంటులో మాట్లాడే అవకాశం సర్వే సత్యనారాయణకు

వచ్చింది. తెలంగాణ వాదాన్ని ఆయన మంత్రిగా ఉన్నా బలంగా వినిపించారు. ఇలా రకరకాల రూపాలలో ఈ ఎంపీలంతా విశేషంగా కృషి చేసినా చివరికి వీరిలో ఒక్క గుత్తా సుఖేందర్ రెడ్డి మాత్రమే 2014 ఎన్నికలలో తిరిగి గెలవగలడం విశేషం. పెద్దగా ఉద్యమంలో పాల్గొనని మరో రాజ్యసభ సభ్యుడు నంది ఎల్లయ్య నాగర్ కర్నూల్ నుంచి లోక్ సభకు అనూహ్యంగా గెలిచారు.

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వడం లేదన్న అసంతృప్తితో పార్టీకి గుడ్ బై చెప్పి వెళ్లిన ఇద్దరు ఎంపీలు వివేక్, మందా జగన్నాధంలు ఓటమి పాలయ్యారు. వివేక్ తెలంగాణ ఆవిర్భావం ప్రకటన తర్వాత తిరిగి కాంగ్రెస్ లోకి వచ్చి పోటీచేసి ఓడిపోతే, మందా జగన్నాధం టిఆర్ఎస్ పక్షాన పోటీచేసి ఓడిపోయారు. మిగిలినవారు ఎవరూ గెలవలేకపోయారు. చివరికి కేంద్ర మంత్రిగా ఉన్న జైపాల్ రెడ్డి కూడా ఓటమి చవి చూశారు. వీరిపై దాదాపు అన్నిచోట్ల టిఆర్ఎస్ అభ్యర్థులే గెలుపొందారు. మల్కాజిగిరి నుంచి టిడిపి అభ్యర్థి మల్లారెడ్డి, ఖమ్మం నుంచి వైఎస్ ఆర్ కాంగ్రెస్ అభర్ధి పొంగులేటీ శ్రీనివాసరెడ్డి గెలిచారు. ప్రత్యేక తెలంగాణ మావల్లే సాధ్యమైందని చెప్పుకున్నా బీజేపీ నుంచి ఒక్క బండారు దత్తాత్రేయ మాత్రమే గెలిచారు. కాగా మరో నేత కేశవరావు ఆ తన రాజ్యసభ సభ్యత్వం ముగిసేవరకు కాంగ్రెస్ లోనే ఉన్నారు. ఆ తర్వాత రెండోసారి అవకాశం రాలేదు. దాంతో ఆయన టిఆర్ఎస్ లో చేరారు. ఆ పార్టీ తరపున అనూహ్యంగా ఎంపీ అయ్యారు.

## శ్రీకాంతచారి బలిదానం

తెలంగాణ వ్యాప్తంగా నిరసన జ్వాలాలు ఓవైపు ఎగిసిపడుతున్న తరుణంలో నిధులు, నియామాకాల జరుగుతున్న అన్యాయాన్ని తట్టుకోలేక, ఓయూ విద్యార్థి శ్రీకాంతచారి ఆత్మ బలిదానం చేసుకున్నారు. ఎల్బీ నగర్ చౌరస్తాలో పెట్రోల్ మంటల్లో సగం ఉడికిన మాంసం ముద్దలే, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో నయవంచనకు గురిచేస్తున్న పార్టీలకు కొరివిపెట్టేలా చేశాయి. అప్పటివరకు ఒక్క తీరుగా జరుగుతున్న ఉద్యమ తీరు ఉద్రిక్తతంగా మారింది. ఢిల్లీలో సైదిరెడ్డి మరణం ఆ టైంలోనే జరిగిన, ఏపీ భవన్ కేంద్రంగా చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు తెలంగాణలోని అన్ని జిల్లాలకు దావానలం వ్యాపించింది.

## మలిదశ ఉద్యమాన్ని పట్టాలపైకి ఎక్కించిన 14ఎఫ్'

సుప్రీం ధర్మాసనం సి.ఎ. నెం. 5141-2002కు సంబంధించిన కేసులో 2009, అక్టోబర్ 9న సంచలనాత్మక తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వుల నుంచి మినహాయించిన 14ఎఫ్ హైదరాబాద్ సిటీ పోలీస్ ఉద్యోగ నియామకాల్లో స్థానిక రిజర్వేషన్ ఉండదు. ఈ ఉద్యోగాలకు స్థానిక, స్థానికేతర అభ్యర్థులందరూ అర్హులే.

ప్రతిభ ఆధారంగా ఆ కొలువుల భర్తీ జరుగుతుంది' అని ఆ తీర్పు సారాంశం. ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉండేవి. కేవలం రెండే రెండు డిపార్ట్మెంట్లలో ఒకటి ఉపాధ్యాయ రంగం, రెండోది పోలీస్ డిపార్ట్మెంట్ తెలంగాణలోని మొత్తం పోలీస్ డిపార్ట్మెంట్ ఉద్యోగాల్లో సగానికి పైగా ఉద్యోగాలు హైదరాబాద్ సిటీ పరిధిలోనే ఉంటాయి. ఈ తీర్పుతో హైదరాబాద్ సిటీ పోలీసుతో స్థానికులకు రిజర్వేషన్ లేకుండా పోవడం ఉద్యోగులను, నిరుద్యోగులను ఆందోళనకు గురిచేసింది.

దాంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు, రాజకీయపార్టీలు అన్నీ రాష్ట్రపతి ఉత్తర్వుల నుండి 14ఎఫ్ను తొలగించాలని డిమాండ్ చేశారు. సుప్రీం ధర్మాసనం తీర్పుతో ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు సంభవించాయి. ప్రత్యేకంగా తెలింగా రాష్ట్ర సాధన ఉద్యమం వేగం అందుకుంది. సిద్దిపేట ఉద్యోగుల గర్జన సభ తర్వాత కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టడం, అది అంతిమంగా డిసెంబర్ 2009లో చిదంబరం ప్రకటనకు దారితీసింది.

రోజు రోజుకూ ఉద్యమం 2011, మార్చి 10న నిర్వహించిన 'మిలియన్ మార్చ్ తో తారాస్థాయికి చేరుకుంది. ఉద్యమ తీవ్రతను గ్రహించిన నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రోశయ్య చొరవతో రాష్ట్ర అసెంబ్లీ రాష్ట్రపతి ఉత్తర్వుల నుంచి 14ఎఫ్ ను తేలిగ్గా ఏకగ్రీవ తీర్మానం చేసింది. అన్ని అనుమతులు పొంది కిరణకుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో 14ఎఫ్ అధికారికంగా రద్దయింది. దీంతో 14ఎఫ్ కథ ముగిసింది.

## బిజెపి పాత్ర

తెలంగాణ రాష్ట్ర సాధనలో భారతీయ జనతా పార్టీది ఒక రకంగా చెప్పాలంటే సహనటుడి పాత్ర అని చెప్పాలి. బిజెపి ఉమ్మడి రాష్ట్రంలో తన ఎదుగుదల కోసం

మొదట కాకినాడలో జరిగిన పార్టీ సమావేశంలో ఒక ఓటు, రెండు రాష్ట్రాల నినాదం ఇచ్చింది. 1998 లో అప్పట్లో ఏ పార్టీతో రాష్ట్రంలో బిజెపికి పొత్తు లేదు. అప్పట్లో టిడిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేసిన బిజెపి విభజన నినాదం ఇచ్చింది. అయినా ప్రజలు కాని, ఏ పార్టీకాని పెద్దగా సీరియస్ గా తీసుకోలేదు. ఆ తర్వాత పరిణామాలలో తెలుగుదేశం పార్టీతో పొత్తు కుదిరింది. కేంద్రంలో మెజార్టీ సాధనకు టిడిపికి వచ్చిన పన్నెండు లోక్ సభ సీట్లు అవసరం అవడం రాజకీయాలనే మార్చివేసింది. అంతవరకు యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్న చంద్రబాబు నాయుడు వామపక్షాలతో కలిసి కేంద్రంలో భాగస్వామిగా ఉన్న తన వైఖరి మార్చుకుని బిజెపికి మద్దతు ఇచ్చారు. యుఎఫ్ కు కన్వీనర్ గా ఉన్న చంద్రబాబు ఎన్.డి.ఏ వైపు మారారు. దాంతో వాజ్ పేయి ప్రభుత్వం నిలబడింది. స్పీకర్ పదవిని టిడిపి తీసుకుంది. ఆ తర్వాత ఒక్క ఓటు తేడాతో వాజ్ పేయి ప్రభుత్వం పడిపోగా, 1999 లో బిజెపి, టిడిపిలు పొత్తు పెట్టుకుని రాజకీయంగా లబ్ది పొందాయి. ఆ తరుణంలో చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. టిడిపికి ముప్పై లోక్‌సభ సీట్లు వచ్చాయి.

దాంతో బిజెపి ఒక ఓటు, రెండు రాష్ట్రాల నినాదాన్ని పక్కన బెట్టింది అప్పట్లో ఉత్తరాఖండ్, జార్ఖండ్, చత్తీస్ గడ్ రాష్ట్రాల ఏర్పాటు చేసినా వాజ్ పేయి ప్రభుత్వం ఎపి విభజన విషయం ప్రస్తావించలేదు. టిడిపి కూడా తమ రాష్ట్రం జోలికి రాకుండా ఉంటే చాలని భావించింది. అందుకు తగ్గట్లుగానే బిజెపి అగ్ర నాయకత్వం కూడా వ్యవహరించింది. ఒకసారి కేంద్ర హోం మంత్రి హోదాలో ఎల్.కె.అద్వాని హైదరాబాద్ వచ్చినప్పుడు తెలంగాణ గురించి ప్రశ్నిస్తే, హైదరాబాద్ రాజధానిగా ఉంటే, తెలంగాణ రాష్ట్రం ఎందుకు అని ప్రశ్నించారు. అలాగే కేంద్రంలోని నేతలు కూడా తెలంగాణ ఉద్యమంపై పెద్దగా స్పందించేవారు కాదు. తెలంగాణ బిజెపి నేతలలో కొందరికి ప్రత్యేక రాష్ట్ర కాంక్ష ఉన్నా, అప్పటి పరిస్థితిలో పెద్దగా మాట్లాడేవారు కారు. సీనియర్ నేత కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రిగా ఉన్న విద్యాసాగరరావు సమైక్య తెలంగాణ అనే కొత్త నినాదం ఇచ్చారు. బిజెపి నేతలు ప్రాజెక్టులు వంటివాటిపైనే డిమాండ్లు చేసేవారు. ఎస్.ఆర్.సి వంటి ప్రతిపాదనల జోలికి కూడా వెళ్లలేదు. కాంగ్రెస్ పార్టీ రెండో ఎస్ఆర్సి డిమాండ్ చేస్తే హోంశాఖ మంత్రిగా ఉన్న అద్వానీ తోసిపుచ్చారు. ఆ తర్వాత గుజరాత్ లో జరిగిన మారణ కాండ విషయంలో మోడీపై చంద్రబాబు పలు

విమర్శలు చేశారు. ఆయన పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. అయితే మోడీని బిజెపి తప్పిస్తుందన్న భావనతో చంద్రబాబు ఆ డిమాండ్ చేశారని అంటారు. కాని అనూహ్యంగా ఒక దశలో వాజ్ పేయి వ్యాఖ్యలు అలాంటి సంకేతాలు ఇచ్చినా, పార్టీ జాతీయ కార్యవర్గ మీటింగ్ లో అద్వాని, వెంకయ్య నాయుడు వంటివారు మోడీని తప్పించడాన్ని వ్యతిరేకించారు. దాంతో అది వాయిదా పడింది. ఆ మీదట టిడిపి ఎన్.డి.ఎ. నుంచి తప్పుకుంటుందా అన్న చర్చ జరిగింది. కాని అలా చేయలేదు. అంతలో ఆనాటి స్పీకర్ బాలయోగి అనూహ్యంగా హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంతో ఏర్పడిన ఖాళీకి తిరిగి టిడిపి కి ఇవ్వడానికి బిజెపి సిద్ధపడినా, చంద్రబాబు అంగీకరించలేదు. అయితే ఎన్.డి.ఎ. తోనే కొనసాగారు. కాని 2004 లో కేంద్రంలోను, రాష్ట్రంలోను బిజెపి, టిడిపి ఓటమి చెందాయి. ఆ తర్వాత చంద్రబాబు బిజెపితో పొత్తు పెట్టుకుని పొరపాటు చేశామని ప్రకటించారు. దాంతో మళ్లీ రెండు పార్టీల మధ్య అంతరం ఏర్పడింది. తిరిగి బిజెపి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వైపు వెళ్లింది. అప్పటికే తెలుగుదేశం నుంచి రాజీనామా చేసిన కెసిఆర్ సొంతంగా తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేశారు. ఎన్నికలలో కాంగ్రెస్, టీఆర్ఎస్‌లు పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చాయి. దాంతో బిజెపి మళ్లీ తెలంగాణ ఉద్యమం వైపు దృష్టిపెట్టింది. టిడిపితో విడిపోయాక బిజెపి కి ఈ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. ఎపిలో కూడా నేతలను అందుకు అనుగుణంగానే తయారు చేసుకున్నారు. దీనిపై కేంద్ర పార్టీలో తర్జనభర్జనలు సాగాయి. రాజ్ నాథ్ సింగ్ బిజెపి జాతీయ అధ్యక్షుడుగా ఉన్న మొదటి టర్మ్‌లో తాము తెలంగాణ రాష్ట్రానికి కట్టుబడి ఉన్నామని బిజెపి అధికారంలోకి వస్తే తెలంగాణ ఇస్తామని ప్రకటించారు. ఆ తర్వాత బిజెపి మరో అడుగు ముందుకు వేసి అధికారంలోకి వస్తే వంద రోజులలో తెలంగాణ ఇస్తామని ప్రకటించింది. ఒకప్పుడు "హైదరాబాద్ రాజధాని ఉన్నచోట ప్రత్యేక రాష్ట్రం ఏమిటి? అని వ్యాఖ్యానించిన అద్వాని సైతం దేశవ్యాప్త రథయాత్రలో భాగంగా తెలంగాణ జిల్లాలలో పర్యటించినప్పుడు ప్రత్యేక రాష్ట్రానికి బిజెపి కట్టుబడి ఉందని ప్రకటించారు. ప్రతి రాజకీయ పార్టీ కూడా తెలంగాణ విషయంలో అనేక పిల్లిమొగ్గలు వేసింది. బిజెపి కూడా అందుకు అతీతం కాదని చెప్పాలి. 2009 లో తెలంగాణ, ఎపిలలో ఒంటరిగానే పోటీలో ఉంది. కేవలం రెండు సీట్లనే గెలుచుకుంది. అవి కూడా తెలంగాణలోనే వచ్చాయి. వారిలో ఒకరు కిషన్ రెడ్డి (అంబర్‌పేట) కాగా, మరొకరు

ఎండల లక్ష్మీనారాయణ (నిజామాబాద్). 2009లో యుపిఎ ప్రభుత్వం తెలంగాణ ప్రకటించిన తర్వాత జరిగిన పరిణామాలలో లక్ష్మీనారాయణ టిఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి శాసనసభ్యత్వానికి రాజీనామా చేస్తే, కిషన్ రెడ్డి రాజీనామా చేయలేదు.

తదుపరి తెలంగాణ రాష్ట్ర ప్రతిపాదనను పెండింగులో పెడుతున్నట్లు యుపిఎ ప్రకటించడంతో బిజెపి ఆ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నం చేసింది. తెలంగాణ బిజెపి నేతలలో హైదరాబాద్ నగరానికి చెందిన ఆలే నరేంద్ర వాజ్ పేయి ప్రభుత్వంలో మంత్రి పదవి ఆశించారు. అలాగే బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి వస్తుందని అనుకున్నారు. కాని అది జరగలేదు. ఒక సందర్భంలో పోటీ పడినప్పుడు పార్టీలో మరో నేత అయిన చెన్నమనేని విద్యాసాగరరావు కి పార్టీ పగ్గాలు అప్పగించారు. అలాగే కేంద్రంలో మంత్రి పదవి కూడా ఆయనకే ఇచ్చారు. అలాగే మరో ఇద్దరు నేతలు బండారు దత్తాత్రేయ, బంగారు లక్ష్మణ్ లకు మంత్రి పదవులు అవకాశం వచ్చింది. ఈ నేపథ్యంలో నరేంద్ర బిజెపికి గుడ్ బై చెప్పి తెలంగాణ సాధన సమితి అనే ఒక సంస్థను సొంతంగా ఏర్పాటు చేసుకున్నారు. కాంగ్రెస్ మాజీ మంత్రి సమరసింహారెడ్డి తదితరులు అందులో భాగస్వాములు అయ్యారు. కాని అనతి కాలంలోనే నరేంద్ర టిఆర్ఎస్ లో చేరిపోయారు.

అక్కడ సెక్రటరీ జనరల్ పదవిని చేపట్టడమే కాకుండా ఎంపీగా, ఎమ్మెల్యేగా పోటీచేసి ఎంపీగా గెలిచి. ఎమ్మెల్యేగా ఓడిపోయారు. కెసిఆర్ తోపాటు కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎలో కొంతకాలం మంత్రి పదవి చేశారు. కాని అంతలో కెసిఆర్ తో ఆయనకు విబేధాలు, అదే సమయంలో ఆయన నకిలీ పాస్ పోర్టు కుంభకోణంలో చిక్కుకున్నారు. దాంతో కెసిఆర్ ఆయనను టిఆర్ఎస్ నుంచి బహిష్కరించారు. ఆ తరువాత ఆయన మెల్లగా కాంగ్రెస్ లో చేరారు. ఆ తర్వాత కాలంలో రాజకీయంగా వెనకబడిపోయారు. ఆయన జీవిత చరమాంకంలో తిరిగి బిజెపిలో చేరారు. చెన్నమనేని విద్యాసాగరరావు కూడా బిజెపిలో తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఆయన తన వంతు కృషి చేశారు. ఈ దిశగా పార్టీని కదల్చడంలో కాని తెలంగాణలో యాత్రలు చేయడంలో కాని, ప్రాజెక్టుల కోసం యాత్రలు చేపట్టడం కాని చేసేవారు. అయితే వాజ్ పేయి ప్రభుత్వంలో ఉన్నప్పుడు మాత్రం ప్రత్యేక తెలంగాణ గురించి అడిగారని చెప్పలేము. ఒక సందర్భంలో సమైక్య తెలంగాణ అన్న నినాదం ఇవ్వడం విశేషం.

కాని ఆ తర్వాత కాలంలో టీఆర్ఎస్ అదినేత కెసిఆర్ తో ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబందాలు నెరపి తెలంగాణ రాష్ట్ర దిశగా కేంద్రంలో బిజెపి అడుగులు వేసేందుకు ప్రయత్నించారు.

బిల్లు ఆమోదం పొందే సమయంలో సుష్మ స్వరాజ్ వద్దకు కెసిఆర్ తో కలిసి వెళ్లడం, అలాగే ఆయా నేతల వద్దకు తెలంగాణ వాదులను, జెఎసి నేతలను తీసుకు వెళ్లడానికి ఆయన కృషి చేసేవారు. బండారు దత్తాత్రేయ వంటి వారు అందరితో సఖ్యతతో ఉండే నేతలుగా గుర్తింపు పొందారు. వారు తెలంగాణకు అనుకూలంగా ఉన్న అదొక్కటే లక్ష్యం అన్నట్లుగా ఉండేవారు కాదని చెప్పాలి. బిజెపిలో కూడా హైదరాబాద్ నగరంలో ఉన్న నేతలకు, జిల్లాలలో ఉన్న నేతలకు మధ్య కొంత భిన్నాభిప్రాయం ఉండేది. ఉత్తర తెలంగాణలోని బిజెపి నేతలలో తెలంగాణ వాదం బలీయంగా ఉంటే, హైదరాబాద్ లో అంత తీవ్రంగా లేదని చెప్పాలి. బిజెపి ఎమ్మెల్యేలుగా ఉన్న ఎండల లక్ష్మీనారాయణ నిజామాబాద్ నియోజకవర్గ శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి తిరిగి ఉప ఎన్నికలో నిలబడితే కిషన్ రెడ్డి హైదరాబాద్ లోని అంబర్ పేట నియోజకవర్గానికి రాజీనామా చేయకపోవడం ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. అయితే కిషన్ రెడ్డి కూడా పార్టీ అధ్యక్షుడుగా, శాసనసభ పక్ష నేతగా తెలంగాణ వాదానికి మద్దతు ఇచ్చారు. పోరుయాత్ర నిర్వహించారు. జెఎసిలో భాగస్వామిగా తన వంతు పాత్రను బిజెపి పోషించింది.

## పోరుబాటలో సీపీఐ

తొలుత తెలంగాణకు ప్యాకేజీ ఇవ్వాలని కోరిన సిపిఐ ఆ తర్వాత పూర్తిగా తెలంగాణ రాష్ట్రానికి మద్దతు ఇవ్వాలని తీర్మానించింది. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం వివిధ పద్ధతుల్లో జరిగిన ఆందోళనలలో పాల్గొంది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ ఆద్వర్యంలో పోరు యాత్ర జరిగింది. ఆంధ్రప్రాంతం వాడు అయినా నారాయణ తెలంగాణ కోసం యాత్ర చేపట్టడం విశేషం. (ఆంద్ర ప్రాంత జర్నలిస్టులలో పొత్తూరు వెంకటేశ్వరరావు వంటి వారు మేధావులు గా పేరొందిన హరగోపాల్ తదితరులతో కలిసి తెలంగాణ కు సంబందించిన వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు.) హనుమకొండలో జరిగిన సిపిఐ పోరుయాత్ర ముగింపు సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి అయిన తెలంగాణ నేత సురవరం సుధాకరరెడ్డి హాజరయ్యారు

అన్ని పార్టీలు కోరుతున్నందున తెలంగాణ ఏర్పాటుకు ప్రత్యామ్నాయం లేదని ఆయన అన్నారు. శత్రువులుగా కాక, సోదరులుగా విడిపోవాలని సిపిఐ కోరుతోందని అన్నారు. పోరుయాత్ర రథసారధి నారాయణ మాట్లాడుతూ కేంద్రం వల్ల ఎనిమిది వందల మంది అమాయకులు ఆత్మహత్యలు చేసుకున్నారని విమర్శించారు. కేంద్రంపై హత్యానేరం కేసు పెట్టాలన్నారు. గాంధీ భవన్ లో కూర్చునే లగడపాటి ,టిజి వెంకటేష్, మధుయాష్కిలు అక్కడోమాట, ఇక్కడో మాట చెబుతున్నారంటే అక్రమ సంసారం చేస్తున్నట్లేనని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్, టిడిపీలు మూడు ప్రాంతాలలో మూడు మాటలు మాట్లాడుతున్నారని, సిపిఐది మాత్రం అన్ని చోట్ల ఒకటే మాట అని నారాయణ ప్రకటించారు.

## తెలంగాణ అస్తిత్వ ప్రతీక - తెలంగాణ తల్లి

భారతదేశ స్వాతంత్రోద్యమ కాలంలో ఈ దేశ అస్తిత్వ ప్రతీకగా "భారతమాత" భావనను ప్రచారం చేసి ఆ భావానికో రూపమివ్వడం జరిగింది. భారతదేశ దేవతామూర్తుల చిత్రాలను గీసి ప్రఖ్యాతి చెందిన రాజా రవివర్మ తొలిసారి "భారతమాత" చిత్రం గీసి దేశప్రజల ముందుంచారు. ఆ రూపమే స్థిరపడి స్వాతంత్ర్యోద్యమ కాలంలో సాహిత్య సృజనకు, సాంస్కృతిక కళారూపలకు మూలమైంది. మదరాసు ప్రెసిడెన్సీ నుండి తెలుగు ప్రాంతాన్ని వేరు చేయాలని సాగిన ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమం సందర్భంగా ఉద్యమానికి ప్రతీకగా "ఆంధ్రమాత" రూపాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఉద్యమ చైతన్యాన్ని రగిలించడానికి "ఆంధ్రమాత" సెంటిమెంట్ ను ఆంధ్రోద్యమకారులు బాగా వాడుకున్నారు. రచయితలు, కవులు "ఆంధ్రమాత"ను కీర్తిస్తూ ప్రజలను ఉ త్తేజితులను చేయడానికి ఎన్నో పద్యాలు, పాటలు, రచనలు చేసారు. అదే కాలంలో తెలంగాణ తల్లి భావనను తొలిసారి ప్రజల్లోకి తెచ్చారు. తెలంగాణ మహాకవి దాశరథి క్రిష్ణమాచార్య, "కోటి వెలుగుల బంగారు కొండ క్రింద, పరుచుకొన్నట్టి సరస్సులో పలవసించి, ప్రొద్దు ప్రొద్దున అందాలపూలు పూయు, నా తెలంగాణ తల్లి కంజాత వల్లి"

## మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ తల్లి భావన

2001 టి.ఆర్.ఎస్. పార్టీ ఏర్పాటు తర్వాత ఆ పార్టీ అధినేత కె. సి. ఆర్. "తెలుగుతల్లి" సెంటిమెంట్ను ఆంధ్రపాలకులు ప్రస్తావించిన సందర్భాలలో పలుమార్లు

"ఎవరితల్లీ-తెలుగు తల్లి?" అంటూ మీడియా సమావేశాల్లో, బహిరంగ సభల్లో ప్రశ్నిస్తూ వచ్చారు.

1975 ఏప్రిల్ లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మొదటిసారి "తెలుగుతల్లి" భావనకు విపరీత ప్రచారాన్ని కల్పించారు ఆంధ్ర పాలకులు. బహుశా 1969 ప్రత్యేక తెలంగాణ రాష్ట్రోద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని కావచ్చు, భవిష్యత్తులో మళ్ళీ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తలెత్తకుండా చేసే పథకంలో భాగంగానే "తెలుగు తల్లి" సెంటిమెంటును తెరపైకి తెచ్చారు ఆంధ్ర నాయకులు అప్పటిదాకా "ఆంధ్రమాత"గా ప్రసిద్ధి నొందిన తల్లి పేరు మార్చి "తెలుగుతల్లి"ని చేసి తెలుగు సెంటిమెంటును ప్రచారం చేసారు. శంకరం బాడి సుందరాచారి రాసిన "మా తెలుగుతల్లి కి మల్లెపూదండ" అంటూ ఆంధ్రుల ఘనకీర్తిని తెలిపే పాటను రాయించి ప్రచారంలోకి తెచ్చారు. రాష్ట్ర గీతంగా దాన్ని ముందుకు తెచ్చి ఆంధ్రప్రదేశ్ లోని స్కూళ్ళలో పాడాలని విద్యాశాఖాధికారులచే ఉత్తర్వులు, ఆదేశాలు జారీ చేయించారు. చిన్నతనాన్నే, ఊహ తెలుస్తున్న ప్రాయంలోనే "తెలుగు తల్లి" భావనను విద్యార్థుల్లో ప్రవేశపెట్టే ప్రయత్నాన్ని ఆంధ్ర పాలకులు చేసారు. ఈ గీతంలో కేవలం రాణీ రుద్రమదేవిని ఒక్క చోట ప్రస్తావించడం మినహా తెలంగాణకు సంబంధించి మరే అంశమూ "తెలుగు తల్లి" పాటలో కన్పించదు.

## తెలంగాణ తల్లి రూపం - నేపథ్యం

తెలంగాణ తల్లి భావన పూర్వం నుండి వున్నదే అయినా దీన్ని ఉద్యమ ప్రతీకగా ముందుకు తేవాలన్న ఆలోచన మాత్రం తెలంగాణ ఉద్యమ రథసారథి కల్వకుంట్ల చంద్రశేఖరరావుదే. పలుమార్లు "ఎక్కడిదీ తెలగుతల్లి, ఎవ్వరిదీ తెలుగు మాత ! " అని ప్రశ్నించడంతో మొదటిసారి ప్రముఖ తెలంగాణ రచయిత, తత్వవేత్త, బి. ఎస్. రాములు "తెలంగాణ తల్లి రూపాన్నిచ్చేందుకు బి.ఎస్.రాములు, ప్రొ గంగాధర్ ల కృషి చేశారు. ఈ ఆలోచన విషయం తెలిసి ఒక మిత్రుడు నిర్మల్ లో మట్టిబొమ్మలు తయారు చేసే శిల్పి బి.వి. ఆర్. చారిని హైదారాబద్ పిలిపించి బి.ఎస్. రాములుకు పరిచయం చేసారు. బి.ఎస్.రాములు ఆలోచనలు, సూచనల ప్రకారం మొదటిసారి కంప్యూటర్ పై తెలంగాణ తల్లికొక రూపం ఇచ్చారు బి.వి. ఆర్. చారి, సాధారణ స్త్రీ

వలె (తలపై కిరీటంగా ఆభరణాలు లేని) కొంగు నడుముకు చుట్టుకుని వున్న తెలంగాణ తల్లి" రూపాన్ని చారి చిత్రించారు.

ఇదే సందర్భంలో "తెలంగాణ తల్లి" విగ్రహాల ఏర్పాటు కోసం టి.ఆర్.ఎస్., అధినేత కె.సి.ఆర్. ఆలోచించారు. "తెలంగాణ తల్లి తామిచ్చిన రూపాన్ని బి.ఎస్. రాములు కె. సి. ఆర్. ముందుపెట్టగా ఆయన కొన్ని మార్పులు చేయాలని అన్నారు. తల్లి రూపం ఎలా ఉంటే బాగుంటుందో చర్చించడానికి కె.సి. ఆర్. తెలంగాణ భవన్లో రెండు సమావేశాలు నిర్వహించారు ఈ సమావేశాల్లో బి.ఎస్.రాములు, ఫైన్ ఆర్ట్స్ కాలేజీ ప్రొఫెసర్ గంగాధర్, గన్ పార్కులోని "1969 తెలంగాణ అమర వీరుల స్థూపం" సృష్టికర్త ఎక్కా యాదగిరి రావు, ప్రముఖ తెలంగాణ రచయిత, విశ్లేషకులు, దుర్గం రవీందర్, ప్రఖ్యాత తెలంగాణ చిత్రకారులు కాపు రాజయ్య, ఈతరం విశిష్ట చిత్రకారులు ఏలె లక్ష్మన్ లూ పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి వెనుకబడిన తెలంగాణ ప్రాంతానికి గుర్తుగా పేదరికంలో వున్న సాధారణ స్త్రీ రూపంలో ఎందుకు ఉండాలి" అని కే.సి.ఆర్. ప్రశ్నించారు. బి.ఎస్.రాములు ఆలోచనల్లోంచి బి. వి. ఆర్. చారి కంప్యూటర్ పై గీసిన చిత్రం ఆవిధంగానే ఉంది. తెలంగాణ ఎప్పటికీ వెనకబడి ఇలాగే ఉండదు కదా? ప్రత్యేకరాష్ట్రం ఏర్పడిన తర్వాత గొప్పగా, భారతావనికే తలమానికంగా, సంపన్న రాష్ట్రంగా, బంగారు తెలంగాణాగా మారుతుంది. రాజా రవివర్మ గీసిన దేవతల బొమ్మల స్ఫూర్తితో "భారతమాత చిత్రాన్ని రూపొందించారు. ఆ చిత్రాన్ని తలపించేలా "తెలంగాణ తల్లి"కి రూపాన్నివ్వాలన్నారు కేసీఆర్. దీనితో ఆయన సూచనల ప్రకారం బి.ఎస్. రాములుతో సహా ఆ సమావేశాల్లో పాల్గొన్న వారిచ్చిన కొన్ని సూచనలకు తగినట్లుగా ఈ చర్చలో పాల్గొన్న ప్రొ? గంగాధర్ ఇప్పటి తెలంగాణ తల్లికి రూపానిచ్చారు.

తొలిసారి క్యాలెండర్ లో రంగుల్లో ముద్రించి కె.సి.ఆర్. చేతులమీదుగా తెలంగాణ భవన్లో ఆవిష్కరించారు. ఆ సమావేశంలో కె.సి.ఆర్. మాట్లాడుతూ "తెలంగాణ తల్లికి చక్కని రూపాన్నిచ్చిన ప్రొ. గంగాధర్, బి.ఎస్.రాములు పేర్లు తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడతాయ"ని ఎంతో ఉద్వేగంగా అన్నారు. 2007లో నిజాం కళాశాలలో టి.ఆర్.ఎస్ నిర్వహించిన తెలంగాణ సంబురాల్లో కె.సి.ఆర్ సభావేదిక పైకి ప్రొ. గంగాధర్, బి.ఎస్. రాములును ఆహ్వానించి స్వయంగా వీరికి

"బంగారు కడియాలు" తొడిగి తగురీతిగా సత్కరించారు. కె.సి.ఆర్., ప్రొ? గంగాధర్, బి.ఎస్. రాములు ఆలోచనల ప్రకారం రూపుదిద్దుకున్న "తెలంగాణ తల్లి" తొలి విగ్రహాన్ని ప్రముఖ తెలంగాణ మహిళా ఉద్యమ నాయకురాలు నంది నిర్మల ప్రోత్సాహంతో సిద్ధిపేటకు చెందిన శిల్పి నర్సింహులు తయారు చేసారు. ఈ విగ్రహాన్ని ఎనిమిది అడుగుల పొడవు కలిగి చూపరులను ఆకర్షించేలా, నిండైన రూపంతో నర్సింహులు తయారుచేసారు. దీన్ని గోదావరి ఖని బస్టాండ్ ముందు (2007 తర్వాత) తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేతులు మీదుగా ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి తొలి విగ్రహాన్ని నర్సింహులు చేయడానికి కొద్ది రోజుల ముందు మట్టితో 12 ఇంచుల సైజుతో చిన్న విగ్రహాన్ని (బి.ఎస్.రాములు సూచనల ప్రకారం) తయారు చేసింది. బి.వి. ఆర్. చారి ఈ చిన్నసైజు తొలి విగ్రహాన్ని ఆయన బి.ఎస్.రాములుతో కలిసి తెలంగాణ భవన్ కు వచ్చి కె.సి.ఆర్ కు బహుకరించారు. కె. సి.ఆర్. ఆఫీసు టేబుల్పై తెలంగాణ భవన్లో ఈ చిన్న విగ్రహం ఇప్పటికీ ఉన్నది. విగ్రహాన్ని చూసిన కే.సి.ఆర్. "తెలంగాణ తల్లి" విగ్రహాలన్నీ ఒకే సైజులో వుండాలని, ఒకే రూపంలో అవే రంగులతో పెన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి. ప్రొ? గంగాధర్ శిష్యుడైన పసునూరి దయాకర్ చేతుల మీదుగా తయారు కావాలని ఆదేశించారు. దయాకర్ చేతులమీదుగా రూపుదిద్దుకున్న వందలాది విగ్రహాలు తెలంగాణలో ఏ దారిలో వెళ్ళినా దర్శనమిస్తాయి. తెలంగాణ తల్లి ఈ ప్రాంత ప్రజల సంస్కృతికి, భాషకు, ఆరాటాలకు, పోరాటాలకు, ఆశలకు, ఆకాంక్షలకు ఒక గొప్ప ప్రతీకగా నిలిచింది.

## తెలంగాణ తల్లి తొలి విగ్రహాన్ని ఆవిష్కరించిన కె. సి.ఆర్

పసునూరి దయాకర్ చేసిన "తెలంగాణ తలి" తాలి విగ్రహాన్ని 15-11-2007న టి.ఆర్.ఎస్. పార్టీ కేంద్ర కార్యాలయమైన తెలంగాణ భవన్లో తెలంగాణ ప్రముఖులు, నాయకుల ఆధ్వర్యంలో కె.సి.ఆర్ ఆవిష్కరించారు. 'ఇలాంటి విగ్రహాలనే అన్ని నియోజక వర్గాలలో ఆవిష్కరించాలని పార్టీ నేతలను ఆదేశించారు. తెలంగాణ అస్తిత్వ ప్రతీకగా ఈ "తెలంగాణ తల్లి" భావన. మలిదశ ఉద్యమ వ్యాప్తిలో ఎంతో దోహదపడింది.

## తెలంగాణ తల్లి రూపంలోని ప్రత్యేకతలు

కె.సి.ఆర్, బి.ఎస్.రాములు సూచనల ప్రకారం ప్రొ. గంగాధర్ రూపుదిద్దిన తెలంగాణ తల్లి కిరీటంలో వడ్డాణంలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రెండు తెలంగాణ వజ్రాలున్నాయి. ఇవి కోహినూర్ వజ్రం, జాకబ్ వజ్రం. ప్రపంచంలోని నాలుగు గొప్ప వజ్రాలలో ఈ రెండు వజ్రాలున్నాయి.

తెలంగాణ తల్లి ధరించిన పట్టుచీరె చూడగానే గద్వాల, పోచంపల్లి చీరలు గుర్తుకువస్తాయి. తెలంగాణ తల్లి ఒక చేతిలోని మొక్కజొన్న 50% తెలంగాణ ప్రాంత మెట్టపంటలకు సంకేతంగా నిలిస్తే మరో చేతిలోని బతుకమ్మ తెలంగాణకే స్వంతమైన ప్రపంచ ప్రఖ్యాతి నొందిన అతి గొప్పదైన మహిళా పండుగ.

తెలంగాణ తల్లి కాలిమట్టెలు ముత్తైయిదకు చిహ్నంగా నిండయిన రూపానికి సూచిక. వెండి మట్టెలు కరీంనగర్ 'ఫిలిగ్రీ' ఆభరణాలకు గుర్తు. వెండి ఫిలిగ్రీ ఆభరణాలు పూర్వకాలం నుండి కరీంనగర్ లో తయారు చేయబడడంతో 2007లో "జియోగ్రాఫికల్ ఇండికేషన్ రైట్స్" క్రింద "ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్" వెండి ఫిలిగ్రీ ఆభరణాలకు, కరీంనగర్‌కు దక్కాయి. తెలంగాణ తల్లి ధరించిన "గద్వాల్" "పోచంపల్లి" చీరెకు గుర్తు. వెండి ఫిలిగ్రీలో కరీంనగర్కు దక్కినట్లే 'ఇంటెలెక్చువల్ ప్రాపర్ధీరైట్స్ జియోగ్రాఫికల్ ఇండికేషన్ రైట్స్' (జి.ఐ) పోచంపల్లి మరియు గద్వాల చీరలకు లభించడం విశేషం.

తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఈ ప్రాంతంలో కళాకారులు, కవులు, గాయకులు, రచయితలు, మేధావులు, తెలంగాణ రాష్ట్ర సమితి, తెలంగాణ ధూం ధాం నిర్వాహకులు, తెలంగాణ తత్వవేత్త బి.ఎస్.రాములు, ప్రజాగాయకులు గద్దర్, విమలక్కతో గోరటి వెంకన్న, అందెశ్రీ, రసమయి బాలకిషన్, సుద్దాల అశోక్ తేజ, జయరాజ్, వరంగల్ శ్రీనివాస్ అంతడుపుల నాగరాజు మొదలైన వారంతా తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమాన్ని నడిపించారు

వందల యేళ్ళ నుండి ఈ ప్రాంతంలోని అణగారిన కులాలలోని అనేక ఉప కులాలకు చెందిన జానపద కళారూపాలు ఇప్పటిదాకా కాపాడుతూ వచ్చిన తెలంగాణ ఉద్యమ అవసరాలకు తగినట్లుగా మలచుకొని ప్రజల వద్దకు ఆట-పాట ద్వారా తీసికెళ్ళారు.

# తెలంగాణ ఉద్యమ చరిత్ర

# ఉద్యమాల ఖిల్లా...తెలంగాణ గడ్డ

## తెలంగాణ ప్రాంత పూర్వాపరాలు...

క్రీ.శ. 3 వ శతాబ్దంలో అశోక సామ్రాజ్యంలో ప్రస్తుత తెలంగాణ ప్రాంతం కూడా ఓ భాగంగా ఉండేదని, ఆ తరువాత శాతవాహనులు, కళ్యాణ చాళుక్యులు పాలించారని చారిత్రక ఆధారాలున్నాయి. వరంగల్ రాజధానిగా కాకతీయులు పాలించారు. విశాల సామ్రాజ్యంలో భాగంగా వారు మొదట హైదరాబాద్ వద్ద గొల్గొండపై కోట నిర్మించారు. కాకతీయ సామ్రాజ్యంపై కన్నేసిన ఢిల్లీ సుల్తాను మహమ్మద్ బీన్ తుగ్లక్ క్రీ. శ. 1321 లో కాకతీయ సైన్యాన్ని ఓడించి సామ్రాజ్యాన్ని సొంతం చేసుకున్నాడు. కొన్ని దశాబ్దాల పాటు బీదర్ రాజధానిగా పాలించి బహుమనీ సుల్తానులు, దక్కన్ మీద ఆధిపత్యం కోసం దక్షిణాన విజయనగర రాయలతోనూ, ఉత్తరాన మునుసూరి నాయకులతోనూ పోరాడి 15వ శతాబ్దంలో దక్కన్ రాజ్యాన్ని చేజిక్కించుకున్నాడు. ప్రజలు మరింత చైతన్యవంతులయ్యారు. దాంతో తిరుగుబాటు మొదలయ్యింది. క్రీ.శ. 1463 లో 'సుల్తాన్ మహ్మద్ షా బహుమన్' తెలంగాణ ప్రాంతంలో వచ్చిన తిరుగుబాటును అణచి వేయడానికి 'కులీకుతుబ్ షా ఉల్ ముల్క్ 'ను సుబేదారుగా నియమించాడు. ఆయన గోల్కొండ రాజ్యంలో వచ్చిన తిరుగు బాటును అణిచివేసి రాజ్యాన్ని మరింత విస్తరించాడు. ఆ తరువాత 'బహుమన్'తో విభేదాలు రావడంతో క్రీ.శ. 1518 లో గోల్కొండ రాజ్యానికి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు 'సుల్తాన్ కులీ కుతుబ్ షా' పేరుతో సింహాసనం అధిపించాడు. ఆయన పాలనలో గోల్కొండ ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందింది. ఇండో–ఇస్లామిక్ సంస్కృతి విస్తరించింది. అప్పుడే గోల్కొండ వజ్రాలకు, ముత్యాలకు, ఆయుధాలకు, అద్దకపు వస్త్రాలకు నిలయంగా, ప్రపంచంలోనే ఓ ప్రముఖ వ్యాపార కేంద్రంగా మారింది.

అసలు నిజంగా చెప్పాలంటే దక్కన్ భూమిగా పిలువబడే ఈ ప్రాంతం విభిన్న సంస్కృతులకి నిలయం. విభిన్న సంస్కృతులకు ఆలవాలమైన ఈ ప్రాంతంపై ఎంతో మంది దండయాత్రలు చేశారు. ఎంతో మంది శాసించారు. నాగరికత మొదలైన నాటి నుంచే, ఇక్కడ పోరాటాలు ప్రారంభమైనాయని చెప్పినా అతిశయోక్తి కాదు.

ఇక్కడ ఉన్న వనరులు, బలమైన ఆర్థిక మూలాలే ఎంతోమంది శాసకుల కన్నుకుట్టేటట్లు చేశాయి. ఈ ప్రాంతాన్ని ఎలాగైన తమ స్వాధీనంలోకి తెచ్చుకోవాలన్న పాలకుల కోరికలే దాడులకు మూలంగా చెప్పవచ్చు. అందుకే రాజులకు వ్యతిరేకంగా కూడా ప్రజలు తిరుగుబాటులు చేశారు. మొఘలులు కాలంలోనే కాక, బహుమనీ సుల్తానుల కాలంలోనూ, ఆ తరువాత నైజాం నవాబుకి కు వ్యతిరేకంగానూ, ఇక్కడి ప్రజలు ఉద్యమాలు చేసి తిరగబడ్డారు. ఆ తరువాత ఆఖరుకు ప్రజాస్వామ్య భారత దేశంలోనూ, పరాయి పాలకులైన సీమాంధ్రులకు వ్యతిరేకంగానూ సుధీర్ఘ పోరాటం చేసిన చరిత్ర కనబడుతూనే ఉంది. ముఖ్యంగా ప్రపంచం అత్యాధునిక జీవన విధానాలతో పరుగులు తీస్తుంటే తెలంగాణ ప్రజలు దాదాపు ఆరు దశాబ్దాలుగా, అంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి పోరు జెండాను విడిచి విరమించలేదని చెప్పవచ్చు.

ఒకసారి తెలంగాణ చరిత్ర పూర్వపరాల్లోకి వెళ్తే ఈ విషయాలు స్పష్టంగా తెలుస్తాయి. 17వ శతాబ్దంలో మొఘులు రాజకుమారుదు ఔరంగజేబు, దక్కన్ ప్రాంతాన్ని స్వాధీన పరుచుకోవాలని 17 వ శతాబ్దంలో ఎన్నో సార్లు యుద్ధం చేశాడు. 1686 లో ఔరంగ జేబు గోల్కొండను ముట్టడించాడు. కోట దుర్భేద్యంగా ఉండటంలో తన సేనతో తిరిగి వెళ్ళిపోయాడు. అయితే ఓ ఏడాది తరువాత మళ్ళీ ముట్టడించాడు. అయినా విజయం సాధించలేక పోయాడు. అప్పుడు ఎలాగైనా గొల్కొండను స్వాధీన పరుచుకోవాలని ప్రస్థుత లాల్ బహదూర్ స్టేడియం ఉన్న ప్రాంతంలో దాదాపు తొమ్మిది నెలలపాటు వేచి చూశాడు. గోల్కొండను స్వాదీనం చేసుకోవడానికి తన శక్తి చాలదని కుట్ర పన్నాడు. గోల్కొండ కోట ద్వారం వద్ద పహరా కాసే వారికి లంచం ఎరచూపి రాత్రిపూట కోట ద్వారాలు తెరిపించి, తన సేనలను గోల్కొండ కోటలోకి పంపించాడు. సుల్తాన్ 'అబుల్ హసన్ తానాషా'ను బందీని చేసి హైదరాబాద్ పై మొఘల్ సమ్రాజ్య జండాను ఎగరవేసాడు. ఆ తరువాత 1707 లో ఔరంగజేబు మరణం తరువాత మొఘల్ చక్రవర్తి నుంచి 'నిజాం ఉల్ ముల్క్' బిరుదు పొందిన అసఫ్ ఝా 1724 లో హైదరాబాద్ రాష్ట్రాన్ని దక్కించుకున్నాడు.

## నిజాం పాలన

నిజాం ఉల్ ముల్క్ అసఫ్ ఝా పాలనలో హైదరాబాద్ రాష్ట్రం ( స్టేట్) అనేక మార్పులు చేయబడ్డది. భారత దేశంలో వ్యాపార నిమిత్తం అడుగు పెట్టిన ఆంగ్లేయులతో స్నేహం చేస్తూ తమ అధికారాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు నిజాం. అయితే బ్రిటిష్ వారి రాజ్య కాంక్షను తెలుసుకున్న 'నిజాం' వారికి సహాయం చేస్తూ 'టిప్పు సుల్తాన్'ను ఓడించడంలో కీలక పాత్ర పోషించాడు. బ్రిటిష్ కాలంలో 'హైదరాబాద్ స్టేట్' దేశంలోని ఇతర సంస్థానాల కంటే పెద్దది. అంతేకాదు ఇంగ్లాండ్, స్కాట్లాండ్, వేల్స్ దేశాల కంటే పెద్దదిగా ఉండేది. ఇక్కడ హైదరాబాద్ స్టేట్ కి ప్రత్యేక కరెన్సీ, రైల్వే, తపాలా లాంటి అన్ని వ్యవస్థలు ఉండేవి. ఇక్కడ అసలు ఆదాయపు పన్ను ఉండేది కాదు. చివరి నిజాం రాజుగా ఉన్న 'మీర్ ఉస్మాన్ అలీ ఖాన్' ప్రపంచంలో అత్యంత సంపన్నుడిగా పేరొందాడు. బ్రిటిష్ పాలకులు భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించినపుడు నిజాం తన రాజ్యాన్ని( హైదరాబాద్ స్టేట్) భారత్ లో కలిపేందుకు నిరాకరించారు.

## స్వతంత్ర హైదరాబాద్ పోరాటం

భారత దేశానికి 1947 లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, హైదరాబాదు నిజాం ప్రభువుకు స్వతంత్రంగా హైదరాబాద్ రాష్ట్రాన్ని రూపొందించుకోవాలన్న దురాలోచన కలిగింది. అందుకు తగ్గట్లు ఇత్తెహాదుల్ ముసల్మీన్ సంస్థ రాష్ట్రమంతటా పెద్ద ప్రచార కార్యక్రమం చేపట్టింది. ఈ పోరాటానికి వ్యతిరేకంగా స్వామీ రామానంద తీర్థ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సత్యాగ్రహ కార్యక్రమాన్ని చేపట్టింది. ఏడెనిమిది వేల మంది సత్యాగ్రహంలో పాల్గొన్నారు. నిజాం రాష్ట్రంలోని జైళ్ళన్నీ నిండిపోయాయి. అయినా హైదరాబాద్ అంతా ప్రశాంతంగానే ఉందని, ఎలాంటి ప్రజావ్యతిరేకత లేదని బాహ్య ప్రపంచానికి చూపించడానికి ప్రయత్నించారు. కాని ఆ సమయంలో రజాకార్లు జిల్లాల్లో అత్యాచారాలు, ఆకృత్యాలు సాగించారు. హైదరాబాద్ స్టేట్ భారత యూనియన్ లో కలువదని ప్రకటించడంతో కొత్త సమస్యను నిలబెట్టాడు. అయితే హైదరాబాద్ స్టేట్ లో ని నవయువకులందరూ రజాకార్లను ఎదురొడ్డి నిలబడ్డారు. కాంగ్రెసీయులు ప్రారంభించిన ఈ పోరాటానికి ఆర్య సమాజీయులు

అగ్రభాగాన ఉండి పూర్తి మద్దతు ప్రకటించారు. రామానందతీర్థ, డాక్టర్ మెల్కొటే , శ్రీ క్రిష్ణాచార్య జోషి లాంటి కాంగ్రేసీయులు సుల్తాన్ బజార్ లో సత్యాగ్రహం చేసారు. అయితే వారిని నిజాం ప్రభుత్వం అరెస్టు చేసి జైళ్ళో పెట్టింది.

తిరుమల గిరి, బొల్లారంలో ఉన్న తమ సైన్యాలను భారత ప్రభుత్వం వాపసు పిలుచుకుంది. దాంతో నిజాం ప్రభుత్వానికి మరింత ధైర్యం వచ్చింది. పట్టపగ్గాలు లేకుండా వ్యవహరించింది. రజాకార్ల ఆగడాలు ప్రతి దినం పెచ్చు పెరిగి పోయాయి. మాన భంగాలు, గృహ దహనాలు, అత్యాచారాలు, హత్యలూ ఒకటేమిటి ప్రజల్లో రజాకార్లు భయ భ్రాంతులను సృష్టించారు. దాంతో ఆర్య సమాజీయులైన యువకులు సాయుధులై తిరగబడ్డారు. కొన్నిచోట్ల రజాకార్లను తరిమి కొట్టారు

నిజాం కు వ్యతిరేకంగా పోరాడిన వారిలో హైదరాబాద్ కు చెందిన నారాయణ పవార్, శ్రీ గండయ్య, ... పాత్రికేయుడు షోయబుల్లాఖాన్ లాంటి వారి గురించి ఇక్కడ తప్పని సరిగా చెప్పుకోవాలి. నిజాం ప్రభుత్వ అత్యాచారాలకు, అకృత్యాలకు వ్యతిరేకంగా అప్పుడే తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నారాయణ పవార్ నిజాం కారుపై బాంబు విసిరాడు. కాని దురదృష్టవశాత్తు అది గురి తప్పి నిజాం బ్రతికాడు. ఈ సంఘటనలో ఎంతో మంది యువ విప్లవకారులను నిజాం సర్కారు అరెస్టు చేసినా, నారాయణ పవార్, గండయ్యలకు మరణ శిక్ష విధించారు. కాని ఈ సంఘటనలో మరో ముద్దాయి 'జగదీష్' నిజాం పోలీసులకు దొరక్కకుండా తప్పించుకున్నాడు.

ప్రజాందోళనలకు తలొగ్గి  భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన బ్రిటిష్ సర్కారు తిరుగుముఖం పట్టినా, హైదరాబాద్ స్టేట్ లో మాత్రం ససేమిరా అన్నాడు. అప్పుడు ఎక్కడ చూసినా రజాకార్ల ఆగడాలు, నిజాం వ్యతిరేక ప్రజాందోళనల మధ్య భయాందోళనలతో ప్రజలు జీవిస్తుంటే నిజాం హైదారాబాద్ ను భారత యూనియన్ లో విలీనం చెయ్యకుండా ప్రత్యేక రాష్ట్రంగా ఓ ఫర్మానాలో ప్రకటించుకున్నాడు. దాంతో ఈ వార్త దావానంలా దేశమంతటా పాకిపోయింది. హిందువులు మేల్కొన్నారు. భారత ప్రభుత్వం సవాలుగా తీసుకుంది. దీన్ని ఓ కుట్రగా భావించింది. అయితే హైదరాబాద్ స్టేట్ లో విభిన్న సిద్ధాంతాలతో, అభిప్రాయాలతో ఉన్న వారందరూ ఒక్కటై నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని నిర్ణయానికి వచ్చారు.

1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న నానాపాటిల్ ను కలిసి ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన స్వతంత్ర పోరాటంలో పాటించిన వ్యూహాలను తెలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అతనితో సంప్రదింపులు జరిపారు. విప్లవ పంథాపై చర్చలు జరిపారు. అయితే ఆయన విప్లవ మార్గాలతో పాటు నిజాం పై తిరుగుబాటు చేయాడనికి చాలా సాహసం, ధైర్యమే కాకుండా జాగ్రత్తలు కూడా పాటించాలని హెచ్చరించారు. ఆయన అనుభవాలనుంచి నేర్చుకున్న పాఠాలతో వీరందరూ ఖిడకీ ( ఇప్పుడు శివాజీనగర్ గా పిలువబడుతుంది) వద్దకు చేరుకోవాలని నిర్ణయించుకున్నారు.

హైదరాబాద్, గన్ ఫౌండ్రీకి చెందిన రాజి రెడ్డి , ఆగాపురా కి చెందిన మాణిక్ రావులు ఓ రోజు ముందే అక్కడికి చేరారు. అక్కడ ఓ సైనికాధికారి సహాయంతో ఆరు చేతి బాంబులను సంపాదించి హైదరాబాదుకు చేరుకున్నారు. చేతిబాంబులను పండ్ల బుట్టలో దాచికుని తీసుకువచ్చారు. వీరిని తీసుకురావటానికి దేవయ్య ఆర్య గారి మోటరు, బేగంపేట స్టేషనులో వేచి ఉంది. అందులో కూర్చుని నేరుగా సుల్తాన్ బజార్ ఆర్యసమాజం కార్యాలయం చేరుకున్నారు. అంతకు ముందే నిర్ణయించున్న ప్రకారం నాలుగు బాంబులను మహారాష్ట్రకు పంపించారు. మిగతా రెండు బాంబులను సుల్తాన్ బజార్ ఆర్యసమాజ కార్యాలయంలోనే దాచిపెట్టారు. అయితే ఆ బాంబులను విసరడానికి ముందే ఆర్యసమాజీయుడు నరేంద్రజీని సీఐడీ ఇన్ స్పెక్టర్ ధరణి ప్రసాద్ అరెస్టు చేశాడు. ఆర్యసమాజ కార్యాలయంలో సేవకుడుగా పనిచేస్తున్న తులసీరాం నరేంద్రజీ గదిలో దాచి ఉంచిన రెండు బాంబులను నారాయణరావు పవార్ కు ఇచ్చాడు. అవే బాంబులు నారాయణరావు పవార్ కు నిజాం కారుపై విసడానికి పనికివచ్చాయి.

నిజాం బతికి బయట పడ్డాడు. కాని నారాయణ రావు పటేల్ పై కేసు నమోదు చేసి విచారణ జరిపి నిజాం ప్రభుత్వం ఉరిశిక్ష విధించింది. అయితే నిజాం కాలంలో ఉరిశిక్షలు పడ్డా ఆయన ఉరి శిక్షను తీసి యావజ్జీవ కారాగార శిక్షగా మార్చేవాడు.

హైదరాబాద్ కు చెందిన యువకులను విప్లవ మార్గంవైపు కార్యోన్ముఖులను చేసిన వారిలో ముఖ్యంగా స్వామి దయానంద సరస్వతిని చెప్పుకోవచ్చు. 1857 లో ఆయన నర్మదా నదీ తీరంలో తిరుగుతూ పరోక్షంగా విప్లవకారులను ప్రోత్సహించేవారు.

## హైదరాబాద్ విముక్తి పోరాటం

ఓ వైపు హైదరాబాద్ విముక్తి పోరాటం ఊపందుకుంటున్నా, మరోవైపు హైదరాబాద్ లో మజ్లిస్ ఇత్తెహాదుల్ ముసల్మాన్ సంస్థ దేశంలోని ముస్లింలీగు ఏ పని చేస్తూ ఉండేదో అదే చేస్తూ తన కార్యక్షలాపాలను ముమ్మరం చేసింది. బ్రిటిష్ పాలకులు తమ వ్యాపారాభివృద్ధికి, ఆ తరువాత అధికారాన్ని విస్తృతపరచడానికి పాటించిన 'ప్రజలను విభజించి పాలించు' సూత్రాన్ని ఇక్కడా అమలు చేసారు. దేశ విభజన తరువాత కూడా ద్విజాతి సిద్ధాంతాన్ని వీడలేదు. ముస్లింలలో తాము 'మైనారిటీ'లమనే భావనకన్నా, 'మేం ఇక్కడి పాలకులం' అనే భావన ఎక్కువగా ఉండేది, ఎమ్.ఐ.ఎమ్ సంస్థ ఆ భావనను మరింత పెంచి పోషించిందని చెప్పవచ్చు. రాష్ట్రంలో అధిక సంఖ్యాకులైన హిందువులపై అల్ప సంఖ్యాకులైన ముస్లింలు అత్యాచారాలు సాగించారు. వారిలో హైదరాబాద్ రాష్ట్రం ఇస్లాం రాష్ట్రమనే భావం ఉండేది. రాష్ట్ర ప్రభువు ముస్లిం కాబట్టి, ఆ మత సంబంధమైన భాంధవ్యం వల్ల ముస్లింలకు అధికారం పొందే హక్కు ఉందని భావించేవారు. రాజకీయాధిపత్యం నిజాం వ్యక్తిగతమైనదని, అది ముస్లింలకు ప్రతినిధిగా ఉన్నందుకే లభించిందని వారు వాదించేవారు. హైదరాబాద్ రాష్ట్రం దక్షిణ భారతంలో మధ్యలో ఉన్నందున పాకిస్థాన్ పాలకుల ఉద్దేశాలకు అనుగుణంగా వ్యవహరించాలనే దూరదృష్టితో ఈ పోరాటాన్ని కొనసాగించారు. అందువల్లనే ఈ పోరాటానికి ముస్లిం లీగ్ సహాయ సహకారాలు అందాయి. హైదరాబాద్ రాష్ట్రంలో హిందువులు 86 శాతం ఉండేది. కాశ్మీరు విషయంలో మాత్రం రాజు హిందువైనా హిందూరాజ్యం అనడానికి వీల్లేదని వాదించారు. బ్రిటిష్ రాజనీతి అనుసరించి, హైదరాబాద్ హిందూ ధర్మ ప్రచారం కోసం పాటుబడే ఆర్య సమాజాన్ని ముస్లింలీగు తమ శత్రువుగా భావించేది. ఎందుకుంటే ఇస్లాం మతంలో పరివర్తన (తల్లీగ్) సమయం నుంచి, స్వతంత హైదరాబాదు పోరాటం వరకు ఇస్లాం మత మౌఢ్య నాయకత్వాన్ని గట్టిగా ఎదిరిస్తూ వచ్చిన సంస్థ ఆర్య సమాజమే.

## రాజకీయ పోరాటం

హైదరాబాద్ స్టేట్ లో రోజు రోజుకు పరిస్థితులు మారిపోయాయి. రాజకీయ వాతావరణం మరింత ఉన్మాదంతో భయంకరంగా మారింది. అయినప్పటికీ ఆంధ్ర మహాసభ పేరిట తెలంగాణా ప్రాంతంలో రాజకీయ కార్యక్రమాలు జరుగుతుండేవి. మాడపాటి హనుమంతరావుగారు, వెంకట రంగారెడ్డి జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి తదితరులు ప్రముఖ పాత్ర వహించారు. ఇలాగే కర్ణాటక మహాసభలో జనార్ధన్ రావు దేశాయి, డాక్టర్ జి.ఎస్. మెల్కొటే, శ్రీనివాసరావు అఖేలీకర్ మొదలగువారు, మరోవైపు మహారాష్ట్ర మహా సభలో స్వామి రామానంద తీర్థ, కాశీనాధరావు వైద్య వినాయకరావు విద్యాలంకార్, గోవింద దాస్ షరాఫ్, బాబా సాహెబ్ హరాంజపే, శేషరావు వాఘ్ మారేలు ప్రముఖ పాత్ర వహించారు. వీరందరూ ప్రజల్లో చైతన్యంతో పాటు స్వాతంత్ర భావనను పెంపొందించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారు. అయితే అపుడే దిగంబర రావు బిందూ గారి సూచన మేరకు ఆంధ్రమహాసభ (బి)ని కూడా ఏర్పాటు చేసి దానికి రామానందతీర్ధను అధ్యక్షున్ని చేశారు. దీని కార్యకలాపాలు హైదరాబాద్, సికందరాబాద్, తిర్మలగిరి ప్రాంతాలకే పరిమితమై ఉండేవి. ఆ తరువాత స్థానిక సమ్మేళనాల అనంతరం స్టేట్ కాంగ్రెస్ సంస్థకు రూపమేర్పడింది. అయితే రామానంద తీర్థ ముఖ్యంగా సోషలిస్టు సిద్ధాంతాలను ప్రచారం చేశారు. ఆయన నిస్వార్థ వ్యక్తిత్వం, కార్యదీక్ష ఎంతో మందిని ప్రభావితం చేసింది. భారత దేశ స్వాతంత్ర పోరాటం గురించి ప్రచారం చేస్తూనే హైదరాబాద్ స్టేట్ లో కూడా ప్రజా ప్రభుత్వం ఏర్పాటు ఆవశ్యకతపై ప్రచారం చేస్తూ, దానికి అవసరమైతే ప్రజలందరూ త్యాగాలు చేయాలని పిలుపునిచ్చారు. స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 1938లో స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం ప్రారంభించింది. ఇందులో గోవిందరావు నావల్, రామకృష్ణభూత్, తరావి నారాయణ రెడ్డి, శ్రీనివాస రావు బోలేకర్ లు ముందున్నారు. సత్యాగ్రహం ఓ నెలరోజులు సాగిన అనంతరం గాంధీజీ గారి ఆదేశాల మేరకు నిలిపివేశారు. ఈ సత్యగ్రహంతో పాటే హిందూ మహాసభ, ఆర్యసమాజం ఆధ్వర్యంలో కూడా సత్యాగ్రహ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. ఈ సత్యాగ్రహ పోరాటాలు భారత దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. హైదరాబాద్ లో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా

జరుగుతున్న సత్యాగ్రహంలో పాల్గొనడానికి దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా, అంటే కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకున్న వివిధ ప్రాంతాలనుంచి యువకులు గుంపులు గుంపులుగా హైదరాబాద్ చేరుకుని రాష్ట్రంలోని జైళ్ళన్నింటినీ నింపేశారు.. హైదరాబాద్ పై పోలీసు చర్యల అనంతరం, సర్దార్ వల్లభాయి పటేల్ మాట్లాడుతూ, హైదరాబాద్ రాష్ట్రంలో అంతకుముందు ఆర్యసమాజం వారు భారీ సత్యాగ్రహం చేసి ఉండకపోతే మూడే మూజు రోజుల్లో విజయాన్ని సాధించి ఉండేవాళ్లం కాదన్నారు. హైదరాబాద్ రాష్ట్ర విముక్తి పోరాటంలో ఆర్యసమాజం వహించిన పాత్రకు ఈ వాక్యాలు అద్దం పట్టిట్లున్నాయి.

అయితే నిజాం ప్రభుత్వం 1938లోనే స్టేట్ కాంగ్రెస్ ను నిషేధించింది. దానికి వ్యతిరేకంగా రామానంద తీర్థ నాయకత్వంలో వ్యక్తిగత సత్యాగ్రహం జరిగింది.

## భారత దేశ స్వతంత్రం

భారతదేశానికి 1947 ఆగస్టు 14న అర్థరాత్రి స్వాతంత్ర్యం ప్రకటించబడ్డది. అదేరోజున పాకిస్థాన్ కూడా అవతరించింది. అయితే నిజాం ప్రభువు మాత్రం తాను ఎందులోను చేరనని, హైదరాబాద్ స్టేట్ స్వతంత్రంగా ఉంటుందని ప్రకటించుకున్నాడు, దేశమంతా స్వతంత్ర సంబరాలు చేసుకుంటుంటే హైదరాబాద స్టేట్ లో మాత్రం ప్రజల్లో నిజాం పాలనలో సాగాలన్న భావన వారిని మరింత అసంతృప్తి జ్వాలలను ఎగదోసింది.

ఈ పరిస్థితుల్లో ఎందరో స్వతంత్ర సమర యోధులు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలంటూ ప్రజలను చైతన్యపరిచారు. అయితే ఆరోజుల్లో హైదరాబాద్ స్టేట్ ను స్వతంత్రంగా ఉంచి మరో పాకిస్తాన్ గా తయారు చేయాలన్న కుట్రలు ప్రజలు గ్రహించారు. ఈ క్రమంలో ప్రజలను చైతన్య పరిచి అయ్యంగార్ కమీషన్ కు వ్యతిరేకంగా ఉపన్యసించి ఆర్యసమాజ మందిరానికి తిరిగి వెళ్తున్న నరేంద్రను సుల్తాన్ బజార్ పోలీసు ఇన్స్ పెక్టర్ అరెస్టు చేసి రాత్రికి రాత్రి చంచల్ గూడ జైలుకు తరలించారు. ఆ తరువాత కొద్ది రోజుల్లోనే రామానంద తీర్థ, డాక్టర్ మెల్కోటే, కృష్ణమాచార్య జోషి అడ్వకేట్లను అరెస్టు చేశారు. ఈ ముగ్గురూ సుల్తాన్ బజారులో జాతీయ పతాకాన్ని ఎగురవేసి అరెస్టయ్యారు. చూస్తుండాగానే అరెస్టయిన

వారితో చంచలుగూడ జైలు ఓ చిన్న బస్తీగా మారిపోయింది. సత్యాగ్రహం సమాప్తమయ్యే సమయానికి జైళ్ళో ఉన్నవాళ్ళలో బూర్గుల రామకృష్ణారావు, కాశీనాథరావు వైద్య, వినాయక రావు విద్యాలంకార్, హరిశ్చంద్ర హెడా, కొండా వెంకటరంగారెడ్డి, రామకృష్ణదూత్, డాక్టర్ చెన్నారెడ్డి, దత్తాత్రేయ ప్రసాద్, బి.యన్. మహదేవ్ సింగ్, ఎన్. వెంకటస్వామి, బి.వెంకటస్వామి, కాళీ చరణ్, బిర్డీ చంద్ చౌదరి, గంగారామ్ గణపతిరావు వైద్య మొదలైన వారందరూ ఉన్నారు.

పోలీసు చర్య తరువాత ప్రభుత్వం మొదటగా రామానంద తీర్థ, పండిత్ వినాయకరావు ను విడదల చేసింది. అధికార పిపాసతో కాశీం రజ్వీ, ఆయన అనుయాయులు రాష్ట్రమంతటా అల్లకల్లోలం సృష్టించారు. అయితే ఇస్లాం మత రాష్ట్రాధిపతిగా భావించబడుతున్న నిజాం ప్రభువు స్వయంగా రజ్వీ ముఠాకు బందీ అయినట్టుగా ఏమీ చేయలేని పరిస్థితుల్లో నామమాత్రపు స్వేచ్ఛతో ఉండవలసి వచ్చింది. రాష్ట్రంలో శాంతి భద్రతలను పునరుద్ధరించడం కోసం ముందుగా జైళ్ళో ఉన్నవారిలో రామానంద తీర్థ, వినాయకరావును విడుదల చేశారు

హైదరాబాద్ స్టేట్, స్వతంత్రంలో భాగమైన తరువాత స్టేట్ కాంగ్రెస్ అధ్యకుడైన స్వామి రామానంద తీర్థ అమన్ కమిటీ పేరిట శాంతి సంఘాన్ని నెలకొల్పారు. ఈ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని పలువురు ముస్లిం మత పెద్దలను కలిసి శాంతి స్థాపనకు కృషిచేసి, మామూలు పరిస్థితులు తీసుకురావడంలో సఫలీకృతులైనారు. అయితే వీరికి ప్రభుత్వం కూడా పూర్తి మద్దతు ప్రకటించింది. ఆ తరువాత 1953 లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభ, హైదరాబాద్ లో జరిగింది. దీని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ అధ్యక్షత వహించారు.

## రైతాంగ పోరాటం

ఆర్థికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందిన నిజాం ప్రభుత్వ హయాంలోనే ప్రజాపోరాటాలుకూడా ఎక్కువగానే జరిగాయి. నిజాం ప్రభుత్వంలో పెరిగిన అసంతృప్తి ఆ తరువాత తెలంగాణా రైతాంగ సాయుధ పోరాంటగా మారింది. 1946-51 కాలంలో కమ్యూనిస్టుల నాయకత్వంలో నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలికి వ్యతిరేకంగా

తీవ్ర ఉద్యమాలు జరిగాయి. గెరిల్లా యుద్ధతంత్రంలో నిజాం రాజు నుండి 3000 గ్రామాలు విముక్తి అయ్యాయి. ఈ పోరాటంలో 4500 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. అయితే అప్పటికే భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాని హైదరాబాద్ స్టేట్ ఇంకా నిజాం పాలనలోనే సాగుతున్నది. హైదరాబాద్ మినహా మిగతా సంస్థానాలన్నీ ఇండియన్ యూనియన్ లో కలిసాయి. హైదరాబాద్ కలవకపోవడంతో అప్పటి భారత హోం మంత్రి సర్దార్ వల్లభాయి పటేల్ ఆపరేషన్ పోలో పేరుతో సైనిక చర్యకు దిగారు. అయిదు రోజున అనంతరం 1948 లో హైదరాబాద్ భారత యూనియన్ లో విలీనమైంది. 1952 లో మార్చి 6 న బూర్గుల రామకృష్ణారావు నేతృత్వంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడింది.

## ప్రత్యేక తెలంగాణా ఉద్యమాలు - మూలం

భారత్ దేశ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పడ్డ మొదటి స్టేట్ రీ ఆర్గనైజేషన్ కమీషన్ ఆధారంగా భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనుకున్నారు. కాని ఆ కమీషన్ రిపోర్టులో హైదరాబాదును ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని సిఫారసు చేసినా అది అమలు కాలేది. ఆ తరువాత మద్రాసు నుండి ఆంధ్రప్రాంతం విడిపోయి కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్ర మేర్పడ్డది. అయినా అక్కడ గుడారాలు వేసుకుని పాలన సాగించాల్సి వచ్చింది. ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజా పాలనకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కూడా లేక చాలా ఇబ్బందులు పడాల్సివచ్చింది. ఈ పరిస్థితుల్లో ఆంధ్ర నాయకుల కన్ను హైదరాబాద్ స్టేట్ (తెలంగాణా ప్రాంతం) పై పడ్డది. ఏలాగైనా తెలంగాణాను ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేసుకోవాలని కుట్ర పన్నారు. ఆ తరువాతనే ఫజల్ అలీ కమీషన్ రిపోర్టు కు వ్యతిరేకంగా తెలంగాణా ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంలో కలుపుతూ నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగానే 1956 ఫిబ్రవరి, 20 న పెద్దమనుషుల ఒప్పందం జరిగింది. ఆ మేరకు 1956, నవంబర్ 1న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మేర్పడ్డది. ఆంధ్ర ప్రదేశ్ కు మొదటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి అయ్యారు

## తొలి తరం తెలంగాణ ఉద్యమం

పెద్దమనుషుల ఒప్పందంలో పేర్కొంటున్నట్లుగా ముఖ్యమంత్రి పదవి ఆంధ్ర వారికి ఉంటే, ఉప ముఖ్యమంత్రి పదవి తెలంగాణకు ఇవ్వాలి అని పేర్కొన్నారు. అలాగే తెలంగాణా వారు ముఖ్యమంత్రి పదవి అధిష్టించిన ఉప ముఖ్యమంత్రి పదవి ఆంధ్రావారికి ఇవ్వాలి. కాని పాలకులు తెలంగాణ వారికి ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదు. 1959 లో దామోదరం సంజీవయ్య సీఎం అయ్యాక డిప్యూటీ ముఖ్యమంత్రి పదవి తెలంగాణా కు చెందిన కొండా వెంకటరంగారెడ్డికి ఇచ్చారు. దాంతరువాత 1962 నుండి 1969 వరకు ఆ ఉసే లేదు. అప్పటికే ప్రజల్లో రగులుతున్న అసంతృప్తికి తోడు ఖమ్మంలో ఒక విద్యార్థి తెలంగాణకు పెట్టిన రక్షణలను అమలు చేయాలని కోరుతూ ఆమరణ నిరహార దీక్ష చేశారు. ఆ రోజున జరిగిన ఉరిగింపులో హింసాత్మక సంఘటనలు జరిగాయి. అయితే తెల్లవారేసరికి ఉద్యమం నిజామాబాద్ కు పాకింది.

## తెలంగాణా సేఫ్ గార్డ్స్ డే

ఆంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన వారు తెలంగాణలో సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, భాషా రంగాలలో ప్రజల్ని అనేక రకాలుగా అణగదొక్కుతూ, అన్ని రంగాలలో తెలంగాణ వారి అవకాశాలను కైవసం చేసుకుంటుండంతో ఉద్యోగ, విద్యార్థి రంగాలలో అసంతృప్తి పెరిగిపోయింది. అంతేకాకుండా తెలుగు సరిగా రాదని, పరిపాలనా కౌశల్యం లేదని అసమర్థులని, ఆచారాలన్నీ అనాగరికమైనవని అవమానించడంతో తెలంగాణా ప్రాంత ప్రజలను రెండవ తరగతి పౌరులుగా పరగణించడంతో 1968 లో జులై 10 నాడు "తెలంగాణా సేఫ్ గర్ల్స్ డే" గా పాటించి తమ నిరసన వ్యక్తం చేశారు.

ఆ రోజే తెలంగాణా ప్రజల న్యాయ సమ్మతమైన కోర్కెలు తీర్చకపోతే ఏదో రోజు తెలంగాణా ప్రాంతం ఆంధ్రా నుంచి విడిపోవాల్సి వస్తుందని పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు. అందులో ముఖ్యంగా కార్మిక సంఘ నాయకులు మహాదేవ్ సింగ్ ఒకరు.

## ముల్కీ నిబంధనలు గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం

నిజాం ప్రభుత్వంలో లాయక్ అలీ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసిన రామాచారి 1952లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన 1952, ఆగస్టులో తెలంగాణా హిత రక్షణ సమితి ని స్థాపించి గైర్ ముల్కీ గోబ్యాక్ అంటు పిలుపునిచ్చారు. వరంగల్ కు చెందిన ప్రముఖ నాయకుడు హయగ్రీవాచారి ఆయనకు మద్దతు పలికారు. అసలు అంతకు ముందే, అంటే 1952, జూన్ 26 నే విద్యార్థుల ఆధ్వర్యంలో వరంగల్లులోనే ఆ ఉద్యమం ప్రారంభమైంది. కాని ఆ ఇద్దరు నాయకుల మద్దతుతో ఆ ఉద్యమం ఊపందుకుంది. ఆ తరువాత హైదరాబాద్ సిటీ కాలేజీ విద్యార్థులు సెప్టెంబర్ 4 న తెలంగాణాలో ముల్కీలు కాని వారికి ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వవద్దంటూ గైర్ ముల్కీ గో బ్యాక్ అంటూ ర్యాలీ తీసారు. ఆ ఊరేగింపులో ప్రస్తుత తెలంగాణా ఐక్య వేదిక నాయకుడైన కేశవరావ్ జాదవ్ కూడా పాల్గొన్నారు. అప్పుడు జరిగిన సమావేశంలో వక్తలందరూ విద్యార్థుల డిమాండు సరైనదేనని మద్దతు తెలిపారు. ఉద్యోగాల్లో స్థానికులకే స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు మహదేవ్ సింగ్ కూడా పాల్గొన్నారు

## తొలి అమరుడు శంకర్

జనవరి 24 న సదాశివపేటలో జరిగిన పోలీసుల కాల్పుల్లో 14 మంది గాయపడగా, అందులో 17 ఏండ్ల శంకర్ అనే యువకుడు ప్రాణాలు వదిలాడు. అయితే ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా ఆంధ్రా ఉద్యోగులు సుప్రీంకోర్టులో కేసు వేసారు. ముల్కీ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ తెలంగాణాలోని ఆంధ్రప్రాంత ఉద్యోగులను వెనక్కి పంపే ప్రభుత్వ ఉత్తర్వులను సుప్రీంకోర్టు 1969 మార్చి 29న రద్దు చేసింది. దీంతో తెలంగాణా అంతటా నిరసనలు, నిరహార దీక్షలు మొదలయ్యాయి. నల్లగొండలో రంగాచారి అనే ఆంధ్ర ఉద్యోగిపై పెట్రోలు పోసి తగులబెట్టారు. నాగార్జున సాగార్ జరిగిన కాల్పుల్లో ఒకరు మరణించారు. ఒకరు గాయపడ్డారు.

## ఉద్యోగ నాయకుడు ఆమోస్ అరెస్టు- బర్త్ రఫ్

ఉద్యోగుల సభలో ఉద్యోగుల నాయకుడైన కె.ఆర్.ఆమోస్ మాట్లాడుతూ తెలంగాణా ఏర్పాటుచేయక పోతే రక్తపాతం జరుగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించాడు. దాంతో ప్రభుత్వ ఉద్యోగి అలా రాజకీయ హెచ్చరిక చేయటం చట్టవిరుద్ధం అంటూ పోలీసులు అరెస్టు చేశారు. గవర్నర్ అతన్ని ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేసారు. అలాగే సదాలక్ష్మి, రాజారామ్, గోవింద్ సింగ్ లను కూడా అరెస్టు చేసి గుర్తు తెలియని చోటుకు తరలించారు.

ఆమోస్ ను ఉద్యోగం నుంచి తొలగించడం, అరెస్టు చేయడానికి నిరసనగా విద్యార్థులు, ఉద్యోగులు నిరవధిక నిరహారదీక్షలు మొదలు పెట్టారు. జూన్ 24 న తెలంగాణా లో రైళ్ళ రాకపోకలను స్థంబింపజేశారు. అనేక రైల్వే స్టేషన్లను తగులబెట్టారు. దాంతో 25న తెలంగాణా లోని ప్రముఖ నాయకులను అరెస్టుచేసి రాజమండ్రి జైలుకు తరలించారు. వారిలో మర్రి చెన్నారెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ, బద్రి విశాల్ పిత్తి,  అచ్చుత రెడ్డి, సి. మాణిక్యరావు, ఇ.వి. పద్మనాభన్, సంతపురి రఘువీరారావు, శంకర్రావు, బితాలికర్లు ఉన్నారు. వీరందరి అరెస్టును నిరసిస్తూ 226 జూన్ నాడు హైదరాబాద్ బంద్ కూడా జరిగింది. ఆ తరువాత కాంగ్రెస్ అద్యక్షుడు నిజలింగప్ప రాక సందర్భంగా కూడా హైదరాబాద్ బంద్ జరిగింది. పోలీస్ కాల్పులు, లారీచార్జీలు కూడా జరిగాయి. మేల్కోటే, సంగం లక్ష్మీబాయమ్మ లను అరెస్టు చేశారు. మొదటిసారిగా బొంబాయి, బెంగుళూరు పట్టణాలలో కూడా తెలంగాణా ఏర్పాటు చేయాలన్న డిమాండుకు మద్దతుగా సభలు, సమావేశాలు జరిగాయి. తెలంగాణా ఏర్పాటు చేయాలంటూ తీర్మాణాలు కూడా చేశాయి. తెలంగాణా ఉద్యమకారులతో వరంగల్ కారాగరం కిక్కిరిసి పోయింది

## తెలంగాణ పతాక దినోత్సవం

జులై 12 న తెలంగాణా అంతటా ఫ్లాగ్ డే ను పాటించారు. తెలంగాణా అంతటా వీధి, వీదిలో చారిస్తాల్లో, కార్లకు, సైకిళ్లకు, బస్సులకూ ఆఖరుకు జైళ్ళల్లో కూడా పతాకాలను ఆవిష్కరించారు. చివరికి దార్మినార్ పై కూడా తెలంగాణా పతాకం ఎగురవేసారు. ఆగస్టు 10 న వరంగల్ లో సత్యాగ్రహం జరుగగా కాళోజీ నారాయణ రావును, విద్యార్థి నాయకుడు చిరంజీవిని పోలీసులు అరెస్టు చేశారు.

ఇలా తెలంగాణా ప్రాంతమంతా జరిగిన ఉద్యమాలు అంతర్జాతీయ దృష్టికి వచ్చాయి. ఆ తరువాత అప్పటి ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీతో జరిపిన చర్చలు ఆనాడే విఫలమవడంతో, 1971 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణా ప్రజా సమితి పోటీచేసి 10 లోకసభ స్థానాల్లో విజయం సాధించింది. అయితే ఇందిరాగాంధీ ప్రభుత్వానికి చెన్నారెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజాసమితి మద్దతు తెలిపింది. ఆ తరువాత తెలంగాణా ఉద్యమం చల్లారినా..... ప్రజల్లో మాత్రం ప్రత్యేక తెలంగాణా ఏర్పడాలన్న ఆకాంక్ష మాత్రం తగ్గలేదు. దానికి ముఖ్య కారణం పాలకులు అనుసరించిన నిర్లక్ష్య, వివక్షపూరిత విధానాలు మాత్రమేనని ఘంటాపథంగా చెప్పవచ్చు.

## మలిదశ తెలంగాణా ఉద్యమం - మలుపు తిప్పిన కేసీఆర్

తెలంగాణా ప్రాంతంలో ఉవ్వెత్తున ఎగిసిన ప్రజా ఉద్యమాన్ని 1969 పాలకులు అణచివేసిన ప్రజలు మాత్రం అవకాశం వచ్చినప్పుడల్లా ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు చేయాలన్న తమ ప్రగాఢ కోరికను వ్యక్తపరుస్తూనే ఉన్నారు. తెలంగాణా ఆవిర్భావ చరిత్రలో ఉద్యమ పంథాను మలుపు తిప్పిన ముఖ్య ఘట్టాల్లో కల్వకుంట్ల చంద్రశేఖర రావు రాజీనామా ఒకటి అని చెప్పవచ్చు. 2001 లో ఆయన తెలంగాణా ఏర్పాటుపై ప్రజలో ఉన్న కోరిక, దాని సాధ్యాసాధ్యాలపై వివిధ సంఘాల నాయకులు, మేధావులు, తదితర విద్యార్థి సంఘాల నాయకులే కాక తెలంగాణా రాష్ట్రం ఏర్పాడాలని భావించే వివిధ వర్గాల వారితో విస్తృత చర్చలు జరిపిన అనంతరం కేసీఆర్ తన శాసన సభ్యత్వానికి, డిప్యూటీ స్పీకర్ పదవికి, తెలుగుదేశం పార్టీకి రాజీనామా. చేశారు. దాంతో పాటుగా తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను ప్రజలకు వివరించడానికి, సీమాంధ్ర పాలకుల అక్రమాలను విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరాన్ని గుర్తించి రాజకీయ ఉద్యమాన్ని నిర్మించాలని పూనుకున్నారు. అందులో భాగంగానే కేసీఆర్ తెలంగాణా రాష్ట్ర సమితిని ప్రారంభించారు. అంతేకాకుండా ఆ భావజాల వ్యాప్తి చేయడంతో పాటు ఇతర నాయకులనూ ఉద్యమంలోకి రాబట్టారు. ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్‌తో విస్తృత చర్చలు జరిపి ఉద్యమ పంథా పట్ల అనుసరించబోయే వ్యూహాలను రూపొందించారు. ప్రొఫెసర్ జయశంకర్ ను ఓ సిద్ధాంత కర్తగా ఫోకస్ చేసి విద్యార్థులను, ప్రజలను ఉద్యమంలో భాగస్వామ్యులను చేయడంలో కృతకృత్యులయ్యారు.

ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ నుండి విడపోయిన ఆలె నరేంద్రను తమ వైపుకు ఆకర్షించి ఆయన పెట్టిన తెలంగాణ ప్రజా సమితిని కూడా టిఆర్ఎస్ లో విలీనం చేయించి మరో విజయం సాధించారు స్థానిక ఎన్నికల్లో కూడా ఘనవిజయం సాధించిన టిఆర్ఎస్ ఆ తరువాత జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ తో పొత్తు కలిసి 42 అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసి 27 స్థానాల్లో విజయం సాధించింది.

తెరాస ప్రజాందోళన కొనసాగుతున్నా అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, అప్పటి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుదీర్ఘకాలం తెలంగాణా పదాన్ని కనీసం ఉచ్చరించకుండా, ఈ ప్రాంతాన్ని వెనుకబడిన ప్రాంతంగా అభివర్ణిస్తూ వచ్చారు. ఎన్నో రాజకీయ ఒత్తిడులను కుట్రలను ఎదుర్కొంటూనే కేసీఆర్ కాంగ్రెస్ తో పాటుగా స్వయంగా చంద్రబాబునాయుడే (తెలుగుదేశం పార్టీ) టీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసేట్టు రాజకీయ అనివార్య పరిస్థితులు కల్పించడంలో కృతకృత్యులయ్యారు.

2009 లో ఎన్నికల్లో వివిధ పార్టీలతో జతకట్టినా కాంగ్రెస్ పార్టీని ఓడించలేక పోయిన తెలుగుదేశం టీఆర్ఎస్ తో సంబంధాలు ఎంతో కాలం నిలుపుకోలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ కుతంత్రాలను తట్టుకోవడంలో ఎంతో కష్టపడాల్సి వచ్చిన కేసీఆర్, ఒకానొక సందర్భంలో తాను తెలంగాణా రాష్ట్ర సమితి అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లుకూడా ప్రకటించాల్సి వచ్చింది. అయినా ఎన్నో కుతంత్రాలకు ఎదరొడ్డి నిలిచిన కేసిఆర్ కు వైఎస్ఆర్ హెలికాప్టర్ దుర్మరణం కలిసి వచ్చినట్లయింది. అతని దుర్మరణం కేసీఆర్ కే కాదు తెలంగాణా రాష్ట్ర కాముకలకు కలిసి వచ్చినట్లయింది.

## జలదృశ్యంపై పోలీసుల దాడి

2002 ఫిబ్రవరి రెండవ వారంలో తెలంగాణ రాష్ట్ర సమితి ప్రజా ప్రతినిధులకు తెలంగాణలోని వివిధ అంశాలపై శిక్షణ తరగతులు శ్రీరాంసాగర్ వద్దగల గిస్టహౌస్ అవరణలో రెండు రోజులు నిర్వహించింది. టిఆర్ఎస్ అధ్యక్షులు కెసిఆర్ ప్రధాన ప్రసంగరి చేయడంతోపాటు ఈ తరగతులను సమన్వయపరిచారు. ప్రొ. జయశంకర్, బి.జనార్ధనరావు, వి. ప్రకాశ్, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్లు

కొందరు ఈ శిక్షణా తరగతుల్లో వివిధ అంశాలపై ప్రసంగించారు. ముఖ్యనేతలంతా శ్రీరాంసాగర్ వద్ద ఉన్న సంగతి గ్రహించిన చంద్రబాబు టిఆర్ఎస్ కార్యాలయం వున్న జలదృశ్యంపై రెవెన్యూ పోలీసు అధికారులను పంపి దాడి చేయించి తన అక్కసు వెళ్లగక్కాడు. అంతకు ముందు జలదృశ్యం స్థలం తమదని ప్రభుత్వం కోర్టులో కేసు వేసింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందే జలదృశ్యం స్థలాన్ని కొనుక్కొని మున్సిపల్ నిబంధనల ప్రకారం ఇల్లు కట్టుకున్న కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణలో పుట్టినందుకు ఆంధ్రబాబు ఓర్వలేకపోయారు. 45 ఏళ్లుగా నివాసం వున్న బాపూజీ ఇంటిని, విశాలమైన స్థలాన్ని తప్పుడు రికార్డులు సృష్టించి ప్రభుత్వ స్థలముని ఉన్నత న్యాయస్థానాన్ని నమ్మించి తీర్పు అనుకూలంగా తెచ్చుకున్నది రాష్ట్ర ప్రభుత్వం. కనీస గడువైనా ఖాళీ చేయడానికి బాపూజీకి ఇవ్వలేదు. జలదృశ్యంలో ఏడాదిగా ఉంటున్న టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయాన్ని ఖాళీ చేయాలని ఏ హెచ్చరికా చేయలేదు. బాపూజీ ఢిల్లీలో ఉన్నారు కెసిఆర్, పార్టీ నేతలంగా శ్రీరాంసాగర్ గెస్ట్ హౌస్ లో వుండగా సెలవురోజు అకస్మాత్తుగా దాడిచేసి ఆఫీసు సామానంతా గోషామహల్ స్టేడియంకు తరలించారు. అడ్డుకున్న టీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేసి అరెస్ట్ చేశారు.

పార్టీ కార్యాలయం రికార్డులన్నీ చిందరవందర చేశారు. బాపూజీ భార్య మిలటరీకి సేవలందించిన ఒక వైద్యురాలు, వృద్ధురాలని కూడా కనికరం లేకుండా ఇంటి బయటకు బలవంతంగా గెంటివేశారు. ఇంటి సామాను, విలువైన పుస్తకాలన్నింటిని చిందరవందర చేసి గోషామహల్ కు తరలించారు. ఇది ఆంధ్రా బాబు సంస్కృతి, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ కోసం మంత్రిపదవి వదులుకున్న మొదటి త్యాగమూర్తి, సమైక్య రాష్ట్ర శాసనసభలో తొలి డిప్యూటీ స్పీకర్, 1969లో తెలంగాణ కోసం చెన్నారెడ్డితో చాలాకాలం రాజమండ్రి సెంట్రల్ జైలులో గడిపారు. జలదృశ్యంతో సహా తన ఆస్తులన్నీ ట్రస్ట్ గా మార్చి బలహీన వర్గాల ప్రయోజనాల కోసం అంకితమైన అరుదైన వ్యక్తి. హైదరాబాద్ రాష్ట్రంలో శాసనసభ్యునిగా ఉన్నారు. అలాంటి తెలంగాణ మహనీయునికి జరిగిన అవమానం తెలంగాణ ప్రజల రక్తాన్ని మరిగించింది. అనతికాలంలోనే తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో మట్టి కరిపించడం ద్వారా ప్రజలు తెలుగుదేశం పై తమ ఆగ్రహాన్ని చూపించారు. కసితో బదులు తీర్చుకున్నారు.

జిల్లా పరిషత్ ఎన్నికల్లో టిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లాలో ఒకే ఒక్క జడ్పిటిసి స్థానాన్ని గెలువడంతో ఆంధ్ర మీడియా రంగారెడ్డి జిల్లాలో టిఆర్ఎస్కు ప్రజల

మద్దతు లేదని ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ 2002 మార్చి 27న వికారాబాద్ శంఖారావం పేరుతో వికారాబాద్ లో జరిగిన బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. మార్చి 28న నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఎత్తిపోతల పథకాల సమస్యలను పరిష్కరించాలని టిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగారు.

## నిజాం కాలం నుంచే ముల్కీ ఉల్లంఘనలు

హైదరాబాద్ సంస్థానంలో విద్యాభివృద్ధికి పునాదులు పడ్డాయి. ఈ క్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ మీర్ ఉస్మాన్ ఆలీ హయాంలో పురుడు పోసుకుంది. అయితే తెలంగాణలో ఉర్దూ ప్రాబల్యం ఉన్న టైంలోనే ఉత్తరాది, దక్షిణాది ఉర్దూ పేరిట వివక్షత ఉండేది. ఆలీ ఘడ్ యూనివర్సిటీ నుంచి విద్యావేత్తలు హైదరాబాద్ కు రావడంతో నిరుద్యోగులు, విద్యావంతులు అభద్రతా భావానికి లోనయ్యారు. స్థానికేతరులు అంతా కలిసి డానిమేట్ చేయడం మొదలుపెట్టారు. ఇది అంగీకరించని నిజాం ప్రభుత్వంలో పనిచేసే ఓ చిరుద్యోగి ఉర్దూలో రాసిన కవిత అప్పట్లో దుమారం రేపింది. దాంతో అతడిని ఉద్యోగంలో నుంచి తొలగించారు. అప్పటి నుంచి ముల్కీ, నాన్ ముల్కీల పేరిట తెలంగాణవాసులకు అన్యాయం జరుగుతూనే ఉంది. 1952లో వచ్చిన గైర్ ముల్కీ గో బ్యాక్ గానీ, 1969లో వచ్చిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండానే కేవలం విద్యార్థులు, యువకులు, ఉ ద్యోగులు మాత్రమే భాగస్వామ్యంతో నడిచాయి.

## తెలంగాణ ప్రజా సమితి ఆవిర్భావం

1969 ఫిబ్రవరి 28న హైదరాబాద్ లోనే తెలంగాణ ప్రజా సమితి ఆవిర్భవించింది. యువకులు, మేథావులే స్థాపించారు. వీరికి ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. లాయర్లు, టీచర్లు, జర్నలిస్టులుగా పనిచేస్తున్నవారే తెలంగాణ ప్రజా సమితిని ఏర్పాటు చేశారు. తొలి అధ్యక్షుడిగా సిద్ధిపేటకు చెందిన ప్రముఖ లాయర్ మదన్ మోహన్ నియమితులయ్యారు. మార్చి 3న తెలంగాణ బంద్ తో తొలి ఉద్యమానికి తెరతీశారు. ఆ రోజు బొల్లారం రైల్వే స్టేషన్ ను ఉద్యమకారులు దాడి చేసి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ

ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాల్సిందేనని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామంటూ చేసిన హెచ్చరికలు జారీ చేశారు. వీటికి తలొగ్గిన ఈ ఘటన అప్పటి ఎమ్మెల్యేలలో కదలిక తీసుకువచ్చేలా చేసింది. 52 మంది తెలంగాణ ఎమ్మెల్యేలు సహాయ నిరాకరణ చేస్తామంటూ స్పష్టం చేశారు.

## ఐక్యత చాటిన విద్యార్థి లోకం

అయితే రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్న క్రమంలోనే విద్యార్థులు, విద్యావంతులు ఉద్యమ తీవ్రతను ప్రపంచానికి చాటిచెప్పారు. రెడ్డి హాస్టల్ లో జరిగిన తెలంగాణ సదస్సుకు 30వేలకు పైగా మంది హాజరై స్ఫూర్తినింపారు. శ్రీమతి సదాలక్ష్మి, రావాడ సత్యానారాయణ, వందేమాతరం రాంచంద్రారావు, ఎస్బీ గిరి వంటి రాజకీయ నేతలు సైతం విద్యార్థులతో కలిసి ముక్తకంఠంతో ప్రత్యేక తెలంగాణ ఒక్కటే పరిష్కారమంటూ స్పష్టం చేశారు. రెండో రోజు సదస్సులో ప్రత్యేక తెలంగాణ ఏర్పడేంత వరకు విద్యార్థులు నిరవధిక సమ్మె చేయాలని తీర్మానించారు.

## ఉద్యమంలోకి ఉద్యోగులు, టీచర్లు

1969 మార్చిన 17న ఉద్యోగులు పోరాట దినం పాటించారు. విద్యార్థులు ప్రజాస్వామ్య రక్షణ దినం పాటిస్తూ ప్రభుత్వ కార్యాలయాల ముందు బైఠాయించారు. ఇదే సమయంలో ఆంధ్రాలో ఎన్జీ రంగా ప్రత్యేక తెలంగాణకు సంపూర్ణ మద్ధతు ప్రకటించారు. అప్పటి నుంచి తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు వెన్నుముకగా నిలిచారు. మలి దశ ఉద్యమంలోనూ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారు.

## ఉల్లంఘనలకు ఆజ్యం పోసిన నీలం

ఉమ్మడి రాష్ట్రంలో తొలుత తెలంగాణ హక్కులకు ఆజ్యం పోసింది అప్పటి సీఎం నీలం సంజీవరెడ్డినే. పెద్ద మనుషుల ఒప్పందంలోని డిప్యూటీ సీఎం పోస్టును హేళన చేస్తూ, ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో వివాదానికి తెరలేపాయి. ఆ పోస్టును చేతికున్న ఆరో వేలుగా అభివర్ణించడంతో తెలంగాణ సంక్షేమం, ప్రయోజనాలకు తూట్లు పడినట్లుగా మారింది. దీంతో వరుసగా పెద్ద మనుషుల ఒప్పందంలోని లోకల్(ముల్కీ) ఇష్యూ, లక్షల ఎకరాల భూములకు తక్కువ ధరకు కొనుగోలు చేసి

పట్టాలు పొందడం, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం, ఇక్కడి విద్యా సంస్థల్లో ఇక్కడి విద్యార్థులను మాత్రమే చేర్చుకోవాలనే నిబంధనను కాలరాస్తూ ఆంధ్ర విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడం, తెలంగాణ మిగులు నిధులను ఆంధ్ర ప్రాంతానికి తరలించడంతో, ఖాళీ ఉద్యోగాల్లో ప్రాంతేతరుల నియామాకం ఇలా పెద్ద మనుషుల ఒప్పందంలో రాసుకున్న ఎన్నో అంశాలకు కాలనుగుణంగా అప్పటి ఆంధ్ర నేతలు నీరుగారుస్తూ తెలంగాణ ప్రాంతానికి అన్యాయం చేశారు. ఇక ఇచ్చిన హామీలన్నీ కాగితాలకే పరిమితమైతున్న కొద్దీ, ప్రాంతీయ వైరుధ్యాలు, వైషమ్యాలు క్రమక్రమంగా పెరుగుతూ వచ్చాయి. గైర్ ముల్కీ గో బ్యాక్ అంటూ నీళ్లు, నిధులు, నియామాకాలే ప్రధాన అజెండా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ఆకాంక్ష దశాబ్ధాల కాలం పాటు కొనసాగుతూ వచ్చింది. దీనికి ఉమ్మడి రాష్ట్రంలోని నీలం సంజీవరెడ్డి నుంచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వరకు ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తు వచ్చారు. అయితే విశాలాంధ్ర నినాదం వెనుక దురాక్రమణ ప్రేరిత క్యాపిటలిజం ఉందంటూ అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చేసిన వ్యాఖ్యలు నగ్నసత్యమనే విషయాన్ని ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలోని చాలా సందర్భాలు స్పష్టం చేశాయి. అప్పటికే ఖాళీగా ఉన్న ఉన్నత స్థానాలతో స్థానికేతరులు తిష్ట వేశారు. వారందరి నియామాకాలు చెల్లవంటూ, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు చేసిన గైర్ ముల్కీ గో బ్యాక్ ఉద్యమం, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మరింత బలాన్నిచ్చింది. 1972 అక్టోబర్ 3న సర్వోన్నత న్యాయ స్థానం ముల్కీ రూల్స్ రాజ్యాంగబద్ధమేనంటూ చేసిన వ్యాఖ్యలతో సమైఖ్యవాదులు రెచ్చిపోయారు. తీర్పు వెలుబడిన వెంటనే అప్పటి పీవీ నరసింహారావు ప్రభుత్వం, ఆదేశాలను అమలు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీంతో దాదాపు లక్షకు పైగా ఉన్న నాన్ ముల్కీ ఉద్యోగస్తులు ఆ స్థానాలను వదిలేశారు. ఆ తీర్పును నిరసిస్తూ జై ఆంధ్ర ఉద్యమం ముందుకు వచ్చింది. ఈ ఉద్యమం ప్రధానంగా ముల్కీ నిబంధనలను, తెలంగాణ ప్రాంతీయ మండలిని రద్దు చేయాలని డిమాండ్లతో తీవ్ర రూపం దాల్చింది. కేంద్రప్రభుత్వం పీవీ ప్రభుత్వాన్ని రద్దు చేస్తూ 1973 జనవరి 18న రాష్ట్రపతి పాలన విధించింది. ఉద్యమాన్ని చల్లార్చడానికి కేంద్రం ఆరు సూత్రాల స్కీంను తీసుకురావడం, వెనువెంటనే రాష్ట్రపతి ఆర్డర్ రావడం జరిగిపోయాయి.

అయినా తెలంగాణకు అడుగడుగునా దోపిడీ జరుగుతూనే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడ ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వకుండానే కేవలం అర్హత

ప్రాతిపదికన సెక్రటేరియట్ లోని ఉద్యోగాలను భర్తీ చేశారు. అక్రమ బదిలీలు, తప్పుడు ముల్కీ సర్టిఫికేట్లతో తెలంగాణేతరులు కూడా ఉద్యోగాలు పొందే స్థాయికి చేరుకుంది. ఇక నియామాకాల్లో జరుగుతున్న అన్యాయాలను భరించలేక ఉద్యోగులు రోడ్డెక్కారు. అప్పటి నుంచి 1985 నాటికి 59వేల మంది నాన్ లోకల్స్ నియామాకాలు జరిగినట్లుగా తేలింది. వీరందరిని వెనక్కి పంపించాలంటూ జయభారత్, అమర్ నాథ్, ఉమాపతి ముగ్గురు సభ్యుల కమిటీ సూచనల మేరకు 1985 డిసెంబర్ 30న 610 జీవోను జారీ చేసింది. ఈ జీవో ప్రకారం సూపర్ న్యూమరీ పోస్టులను క్రియేట్ తెలంగాణేతరులను ఆ ప్రాంతానికి తరలించాలని, ఖాళీ అయిన ఉద్యోగాలను స్థానిక నిరుద్యోగులతో భర్తీ చేస్తామంటూ అప్పటి సీఎం ఎన్టీ రామారావు ప్రకటించారు. కానీ ఆచరణలోకి రాలేదు. దాదాపు మరో రెండున్నర దశాబ్దాల వరకు నియామాకాల్లో అక్రమాలు జరుగుతూనే వచ్చాయి. ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని, ఆంధ్రా పాలకులు చేసిన దోపిడీ తీరును ఆ పాలకులు నియమించిన గిర్ గ్లానీ కమిటీ కూడా కుండబద్ధలు కొట్టినట్లుగా పేర్కొంది. కమిటీ నివేదికలోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ జనాభా ప్రాతిపదికన తెలంగాణ ఉద్యోగులు 40 శాతంగా అంటే 5.5లక్షల మంది లేరని తెలిపింది.

## కాంగ్రెస్ తో టీఆర్ఎస్ పొత్తు

టీఆర్ఎస్ పార్టీకి ఆదరణ పెరగడంతో పాటు ప్రజల్లో భావజాలానికి అనుకున్న దానికంటే ఎక్కువ స్పందన వస్తోంది. ఇదీ గమనించి విపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ టీఆర్ఎస్‌తో కలిసి ఎన్నికల్లో పోటీ చేయాలని భావించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా ఉంటే కాంగ్రెస్‌తో తాము కలవడానికి సిద్ధమని టీఆర్ఎస్ ప్రకటించింది. దానికి కాంగ్రెస్ అధిష్టానం ఒప్పుకోవడంతో 2004 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్, కమ్యూనిస్ట్ పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీకి దిగితే ఒంటరిగా టీడీపీ బరిలోకి దిగింది.

ఈ ఎన్నికల్లో 42 అసెంబ్లీ స్థానాల నుంచి పోటీచేసిన టీఆర్ఎస్ 26 స్థానాలు గెలుచుకుంది. 6 లోక్ సభ స్థానాల నుంచి పోటీ చేసి మహబూబ్ నగర్ మినహాయిస్తే మిగిలిన 5 చోట్ల గెలుపొందింది. కేంద్రం, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. యూపీఏ కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో తెలంగాణ అంశం చేర్చడంలో

టీఆర్ఎస్ విజయం సాధించింది. యూపీఏ అధ్యక్షురాలు సోనియా గాంధీ కోరడంతో టీఆర్ఎస్ కేంద్ర మంత్రివర్గంలో చేరింది. షిప్పింగ్ శాఖ మంత్రిగా కేసీఆర్, మరో శాఖకు సహాయ మంత్రిగా ఆలే నరేంద్ర బాధ్యతలు చేపట్టారు. కూటమిలో ఉంటూనే రాష్ట్ర ఏర్పాటుపై కేంద్రం మీద ఒత్తిడి తెచ్చేందుకు ఏ ఒక్క అవకాశాన్ని కెసిఆర్ వదులుకోలేదు. రాష్ట్ర ఏర్పాటుపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రణబ్ ముఖర్జీ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ అన్ని తెలంగాణ ఏర్పాటుపై అన్ని పార్టీల అభిప్రాయాన్ని కోరితే, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా 36 పార్టీలు లేఖ ఇవ్వడంలో టీఆర్ఎస్ పార్టీ, కెసిఆర్ పాత్రనే ప్రధానంగా చెప్పుకోవాలి. అయితే కమిటీలు, కార్యక్రమాలతో రాష్ట్ర ఏర్పాటు అంశంలోనూ జాప్యం జరుగుతూ వచ్చింది. అప్పటికి యూపీఏ 1 చివరి దశకు చేరినా కాంగ్రెస్ నుంచి ప్రకటన రాకపోవడం తెలంగాణవాదులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రమంలోనే రాజకీయ ఒత్తిడి పెంచేందుకు కూటమి నుంచి టీఆర్ఎస్ పార్టీ వైదొలుగుతుందని, మంత్రి పదవులకు రాజీనామా చేస్తున్నట్లుగా కేంద్రమంత్రులుగా ఉన్న కేసీఆర్, ఆలె నరేంద్ర ప్రకటించారు.

## కేసీఆర్ రికార్డ్ విజయం

ఎంపీ స్థానానికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలంటూ కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.సత్యనారాయణరావు విసిరిన సవాలు, తెలంగాణ ఉద్యమాన్ని మళ్లీ ఉరకలెత్తేలా చేసింది. ఆ సవాలును తీసుకున్న కేసీఆర్ కరీంనగర్ ఎంపీ పదవికి కూడా రాజీనామా చేశారు. ఉపఎన్నికల సందర్భంలో కరీంనగర్ ఫలితం తెలంగాణకు రెఫరెండం అని నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఉపఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ప్రజలు భారీ మెజారిటీని కట్టబెట్టారు. కేసీఆర్ దాదాపు 2 లక్షల మెజారిటీతో మరోసారి ఎంపీగా గెలిచారు. కానీ, తెలంగాణ ఏర్పాటు విషయంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా నాన్చుడి విధానాన్నే అమలు చేసింది.

## టీడీపీతో కూటమిగా..

కాంగ్రెస్ హయాంలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో 2009 ఎన్నికల్లో టీడీపీతో టీఆర్ఎస్ జతకట్టింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, ప్రజారాజ్యం

పార్టీ ఒంటరిగా పోటీ చేస్తే, టీడీపీ, టీఆర్ఎస్ కలసి మహాకూటమిగా బరిలోకి దిగాయి. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. కేవలం 10 అసెంబ్లీ స్థానాల్లో, 2 ఎంపీ స్థానాల్లోనే గెలుపొందింది. కేసీఆర్ మహబూబ్ నగర్ నుంచి ఎంపీగా గెలుపొందారు.

## చీలికలు, వైఫల్యాలపై రాజీనామాస్త్రం

ప్రజల్లో తమ పార్టీకి ఆదరణ తగ్గుతోంది. తెలంగాణవాదం బలహీన పడుతోందని భావించిన ప్రతీసారి టీఆర్ఎస్ పార్టీ రాజీనామాలే అస్త్రంగా ప్రయోగించేది. కొన్ని సార్లు ఈ వ్యూహం బెడిసికొట్టింది. ఈ కారణంగానే టీఆర్ఎస్ పార్టీలో చీలికలకు గురైంది. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం ఎంతో కాలం కొనసాగలేదు. రాష్ట్ర మంత్రివర్గం నుంచి బయటకు రావాలనుకున్న టీఆర్ఎస్ నిర్ణయం ఆ పార్టీలో తొలిసారి చీలికలకు దారితీసింది. మంత్రి శనిగరం సంతోష్ రెడ్డి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారు. తర్వాత వచ్చిన మండలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను బలపరుస్తూ టీఆర్ఎస్ ఎమ్మెల్యే సంతకాలు చేసి పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు.

2009 తర్వాత తెలంగాణ కోసం 10 మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఉపఎన్నికలకు వెళ్లారు. ఈ ఎన్నికల్లో తిరిగి ఏడుస్థానాల్లోనే టీఆర్ఎస్ విజయం సాధించింది. ఈ వైఫల్యాలు టీఆర్ఎస్ పార్టీని భారీగా దెబ్బతీశాయి. పార్టీకి అండగా ఉన్న అనేక మంది కీలక నేతలపై టీఆర్ఎస్ అనేకసార్లు బహిష్కరణ వేటు వేసింది.

విబేధాల కారణంగా పార్టీలో నెంబర్ 2 స్థాయిలో ఉన్న ఆలె నరేంద్రను టీఆర్ఎస్ పార్టీ బహిష్కరించడంతో రియల్ టీఆర్ఎస్‌పేరుతో గ్రూపు కట్టినా తర్వాత కాలంలో కాంగ్రెస్‌లో చేరారు. తల్లి తెలంగాణ పార్టీని స్థాపించిన విజయశాంతి టీఆర్ఎస్ లో విలీనం చేసి ఎంపీగా పనిచేశారు. 2014 ఎన్నికల వరకు ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. ఆమెపై కూడా టీఆర్ఎస్ పార్టీ బహిష్కరణ వేటు వేసింది. దాంతో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్ టీఆర్ఎస్‌ను వీడి తెలంగాణ విమోచన సమితి పేరుతో సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ తరువాత ఆ పార్టీని రద్దుచేసి టిజెఎస్‌లో ఆ తరువాత బిజెపిలో చేరారు.

## కాంగ్రెస్ వంచన బుద్ధులు

టీఆర్ఎస్ పార్టీకి జనాల్లో పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మార్చుకునేందుకు, అధికార కాంక్షతో పరితపిస్తున్న టీడీపీని దెబ్బకొట్టేందుకు తెలంగాణ పార్టీతో జతకట్టింది. 2004లో టీఆర్ఎస్ పార్టీని కలుపుకొని లబ్ధి పొందాలని భావించింది. అయితే కేసీఆర్ నిర్ణయాన్ని తెలంగాణవాణులు, మేథావులు తప్పటడుగు వేశారంటూ విమర్శలు గుప్పించినట్లుగానే, ఫలితాలతో తేటతెల్లమైంది. భారీ మెజార్టీతో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో తెలంగాణ వాదం బలహీనపడింది. ఈ క్రమంలోనే టీఆర్ఎస్ ను, తెలంగాణవాదుల రాజకీయ జీవితాలను డైలామాలో పడేసేలా, కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రుల పదవులను కట్టబెట్టింది. ఇటు రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారంతో టీఆర్ఎస్ పునాదులు కూలుతాయనే అనుమానాలు అందరిలో వ్యక్తమైంది. ఈ క్రమంలో ఆపరేషన్ ఆకర్ష్ ప్రయోగంతో తెలంగాణవాదులమంటూ చెప్పుకున్న నేతలు ఒక్కొక్కరు ఆ పార్టీలో చేరారు. స్వప్రయోజనాలు, రాజకీయ భవిష్యత్తుకు ఇదే దిక్కు అన్నట్లుగా తెలంగాణ నేతలు అటు వైపు వెళ్లిపోవడంతో తెలంగాణ గొంతులకన్నీ మూగబోతుండగా, రాజకీయ పరిణామాలు మారాయి. ఇక టీఆర్ఎస్ పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వామిగా ఉండటంతో నోరెత్తలేని పరిస్థితికి వచ్చింది. జరుగుతున్న రాజకీయ వలసలను నిలవరించే చర్యలు తీసుకునే స్థితిని కోల్పోయి నైరాశ్యంలో నెట్టేసిన కాంగ్రెస్ నేతలు వ్యూహం ఫలించింది. అందరూ అనుకున్నట్లుగానే వంచన బుద్ధులు బట్టబయలు కావడంతో, ఉద్యమ పంథా మార్చాల్సిన పరిస్థితులు వచ్చాయి.

## కేసీఆర్ ఆమరణ దీక్ష

అనుకోకుండా జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మృతి, ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సంఘటనలు, టీఆర్ఎస్‌కు కలిసివచ్చాయి. రోశయ్య హయాంలో హైదరాబాద్ ఫ్రీ జోన్ వివాదం తెర ముందుకు రావడం ఉద్యమానికి ఆజ్యం పోసింది. 'కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో' అంటూ కేసీఆర్ ఆమరణ నిరహార దీక్షకు దిగారు. ఆయన దీక్షతో తెలంగాణలో ఉద్యమం ఉధృతం అయింది. దీంతో దిగివచ్చిన యూపీఏ2 ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు దిశగా ప్రక్రియ ప్రారంభిస్తామంటూ

2009 డిసెంబర్ 9న ఒక ప్రకటన చేసింది. కానీ, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి నిరసనలు వెల్లువెత్తడంతో డిసెంబర్ 23న ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

తెలంగాణ ఏర్పాటుపై అందరి అభిప్రాయాలను సేకరించేందుకు శ్రీకృష్ణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ దశలో టీఆర్ఎస్ మిగిలిన పార్టీలతో కలిసి తెలంగాణ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడింది. పొలిటికల్ జేఏసీ ప్రత్యేక తెలంగాణ కోసం కేంద్రంపై ఒత్తిడిని తీవ్రం చేసింది. టీజాక్ చేపట్టిన అన్ని ఉద్యమాల్లో టీఆర్ఎస్ కీలకభూమిక పోషించింది.

సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, వంటా వార్పు, సాగరహారం తదితర ఉద్యమాల్లో ముందుండి నడిచింది. ఉమ్మడి పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై శ్రీకృష్ణ కమిటీకి ప్రత్యేక నివేదికలను తయారు చేసి ఇచ్చింది.

## మృత్యువును ముద్దాడిన కేసీఆర్

తెలంగాణ ఉద్యమంలో ప్రతి పుట్టమూ చరిత్రాత్మ కమే. అయినా కేసీఆర్ ఆమరణ దీక్ష మాత్రం కచ్చితంగా ఉద్యమానికి కీలక మలుపేనని చెప్పవచ్చు. అప్పటిదాకా ఎన్నికలు పార్టీ ఆందోళనలకు పరిమితమైన ఉద్యమం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఈ ఆమరణదీక్ష ఫలితంగానే. తెలంగాణ సాధన కేవలం కల కాదు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు వాస్తవ రూపం తీసుకురావడం అసాధ్యం మాత్రం కాదన్న విశ్వాసాన్ని ప్రజల్లో ప్రోదిచేసింది. ఈ దీక్ష.. దాని ఫలితమే. “ఏక్ ఔర్ ధక్కా – తెలంగాణ పక్కా”, అన్న మాట తెలంగాణ ఇంటింటా మార్మోగడానికి కారణం ఈ దీక్షే. అందుకే ఈ దీక్ష తక్షణ ఫలితాన్ని కాకుండా దీర్ఘకాల దృష్టితోనే విశ్లేషించాలి. దీక్ష జరిగిన 11 రోజుల పాటు తెలంగాణ అగ్నిగుండం అయింది. ‘మా ఉద్యమ నాయకుడిని కాపాడండి…మాకు తెలంగాణ ఇవ్వండి’.. అంటూ ప్రజలు నడిరోడ్ల మీదకొచ్చి నిరసన తెలిపారు. రాష్ట్ర సరిహద్దులు దాటి ఖండాలు అధిగమించి, కార్యక్రమాలు చేపట్టారు.

## ఆ 11 రోజుల ఘట్టాల క్రమం ఇది.

### నవంబర్ 29, 2009

కేసీఆర్ సిద్ధమైన రోజు అది. ఉదయానికల్లా కేసీఆర్ ఇంటి ముందు భారీగా గుమి గూడిన కార్యకర్తలు.. కరీంనగర్ను పోలీసు బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. కేసీఆర్ ఇంటి నుండి బయలుదేరే సమయానికి పోలీసులు రౌండప్ చేశారు. కార్యకర్తల ఆందోళన తో పోలీసులు కొంచెం వెనక్కి తగ్గారు.. ఆ తరువాత పోలీసులు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో కేసీఆర్ ఎక్కారు. కేసీఆర్ ఇంటి నుండి బయలుదేరే సమయానికి కనీసం రెండువేల వాహనాలు ర్యాలీలో ఉన్నాయి. కానీ పోలీసులు ఎక్కడి వాహనాలను అక్కడే ఆపుతూ టైర్లలో గాలితీస్తూ పక్కకు తప్పించారు. కేసీఆర్ ఇంటి నుండి అల్గునూరు చౌరస్తాకు వచ్చే దారి నాలుగు కిలో మీటర్లు మాత్రమే. అల్గునూరు చౌరస్తాకు చేరక ముందే మొత్తం వాహనాలను పోలీసులు కంట్రోల్లోకి తీసుకున్నారు. వాహనాలను అడ్డుగా పెట్టి కేసీఆర్ను ఆయన వాహనం నుండి దింపారు. ఈ సమయంలో కేసీఆర్ ప్రతిఘటించినా చుట్టు ముట్టిన పోలీసులు ఆయన్ను, నాయకులు నాయిని నర్సింహారెడ్డిని, విజయరామారావును, కెప్టెన్ లక్ష్మీకాంతరావును,ప్రొఫెసర్ జయశంకర్ను ఎలాంటి అరెస్టు వారెంట్ లేకుండా పోలీసుల వాహనాల్లో ఎక్కించి ఖమ్మంకు తరలించారు.

### నవంబర్ 30, 2013

కేసీఆర్ను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ తెలంగాణ బందుకు సిద్ధమైంది. కేసీఆర్ అరెస్టై 24 గంటలు గడుస్తుం డటతో మొత్తం బంద్ విజయవంతం చేయడంలో నిమగ్న మైంది. కేసీఆర్ అరెస్టు రోజు శ్రీకాంతాచారి ఆత్మాహుతి జరి గింది. అదే సమయంలో తెలంగాణ లోని యూనివర్సిటీలు, ప్రధానంగా ఉస్మానియా యూనవర్సిటీ ఉద్వేగభరితంగా మారింది. ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్ప డ్డారు. కాంగ్రెస్ పెద్దలే కారణమంటూ మరణ వాగ్మూలాలు రాశారు. ఈ దశలో కేసీఆర్ దీక్ష విరమించాడని ఆస్పత్రిలోని డాక్టర్లు, పోలీసులు ప్రకటనలు గుప్పించారు. తీవ్ర గందర గోళం చెలరేగింది. ఆ తర్వాత కొద్ది సమయానికే కేసీఆర్ ప్రకటన చేశారు. తాను దీక్ష విరమించలేదని స్పష్టం చేశారు.

## 1 డిసెంబర్, 2013.

క్షీణిస్తున్న ఆరోగ్యం. టీఆర్ఎస్ నేతల్లో, కార్యకర్తల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్న పరిస్థితి. పరిస్థితి రోజు రోజుకు ఉద్రిక్తంగా మారింది. అదే సమయంలో ఖమ్మంలో దీక్ష చేస్తున్న కేసీఆర్తో పోలీసుల దురుసు ప్రవర్తన. ఈ సమ యంలోనే కేసీఆర్ మీడియాతో మాట్లాడుతూ 'నేను లేకున్నా ఉద్యమం నడవాలి' అని ప్రకటించారు. యావత్తు తెలంగాణ సమాజం భగ్గుమంది. తెలంగాణ వాదులమీద కాల్పులు జరపలేక కానిస్టేబుల్ కిష్టయ్య ఆత్మహత్య. అదే సమయంలో ఢిల్లీలో సోనియాతో ప్రధాని, మంత్రుల భేటీ జరిగింది.

## 2డిసెంబర్, 2013.

నాలుగో రోజుకు కేసీఆర్ నిరాహార దీక్ష. ఆరోగ్యం రోజు రోజుకు క్షీణిస్తోంది. సెలైన్ ఎక్కించడానికి డాక్టర్ల తీవ్ర ప్రయ త్నాలు. అదే సమయంలో ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు. ఢిల్లీలో కేంద్రంపై ఒత్తిడి. పార్లమెంట్లో అద్వానీ కూడా మాట్లాడారు. కేసీఆర్ను హైదరాబాద్ తరలించడా నికి ఏర్పాట్లు. రాస్తారోకోలు, బంద్ లు, ధర్నాలతో తెలం గాణ ఉద్రిక్తం. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు దిగజా రుతోంది. మరోవైపు కేంద్రం స్థాయిలో తెలంగాణపై చర్చ మొదలైంది. ఐబీ ఆఫీసర్లను హైదరాబాద్కు పంపించారు.

## 3డిసెంబర్,2013.

కేసీఆర్ ను ఆదరాబాదరాగా హైదరాబాద్కు తరలించారు. తెల్లవారుజామున 3.10 నిమిషాలకు కాన్వాయ్ తో నిమ్స్ కు తరలించారు. ఖమ్మంలో వైద్య సదుపాయాలు అంతగాలేవనే కేసీఆర్ను హైదరాబాద్కు షిఫ్ట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేసీఆర్ను స్ట్రెచ్చర్పై నిమ్స్ ఆస్పత్రి లో పలికి తీసుకెళ్లారు. కేసీఆర్ నాకు ట్రిట్మెంట్ వద్దు... దీక్ష కొనసాగిస్తున్నా అని నిమ్స్ వైద్యులకు తేల్చి చెప్పారు. టీఆర్ఎస్ పొలిట్ బ్యూరో సమావేశం. ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తులు చేశారు. ఉస్మానియా రణరంగమైంది. డిసెంబర్ 10వ తేదీలోపు తెలంగాణ ఇవ్వకుంటే అసెంబ్లీ ముందు శాంతియాత్ర చేస్తామని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ప్రకటించారు. విగ్రహాల విధ్వంసం కూడా ప్రారంభ మైంది. కనిపించిన ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పొట్టిశ్రీరా ములు, ఎన్టీఆర్ విగ్రహాలను ధ్వంసం చేశారు.

## 4డిసెంబర్, 2013.

తెలంగాణ వస్తే జైత్రయాత్ర, లేకుంటే నా శవయాత్ర అని ఐదు రోజుల దీక్ష తరువాత చేసిన ప్రకటన ఇది. కేసీఆర్ సచ్చుడో.... తెలంగాణ వచ్చుడో... నినాదం నుండి ప్రారం భమైన కేసీఆర్ దీక్ష జైత్రయాత్ర, శవయాత్ర నినాదానికి చేరుకుంది. కేసీఆరే స్వయంగా ఈ ప్రకటన చేయడంతో ప్రజల్లో ఆందన పెరిగిపోయింది. కేంద్రంలో మాత్రం కద లిక కనిపించ లేదు. రోజుకు 10 మంది బలిదానాల ఘట నలు చోటుచేసుకున్నాయి. కేసీఆర్ పరిస్థితి విషమిస్తుండ టంతో కేసీఆర్ ను నిమ్స్ లో  ఇంటెన్సివ్ కేర్ విభాగానికి తరలించారు.

## 5 డిసెంబర్,2013.

కేసీఆర్ చావుబతుకుల్లో ఉన్నారన్న విషయం ప్రజలకు అర్థం అవుతోంది. నిమ్స్ ఆస్పత్రి జనంతో కిటకిటలాడు తోంది. కేసీఆర్ను ఐసీయూ నుండి బయటకు తేవడం లేదు. సోడియం, పొటాషియం తక్కువగా ఉండటంతో మెదడు, గుండెపై ప్రభావం చూపే అవకాశం ఉందని డాక్టర్లు చెప్పి వెళ్లారు. కేసీఆర్ను పరామర్శించేందుకు వచ్చిన కాకా, చిరంజీవి,  చంద్రబాబు, కాంగ్రెస్ ఎంపీలు దీక్ష విరమించాలని నచ్చచెపుతున్నా కేసీఆర్ మాత్రం మొండిపట్టు విడవడం లేదు. ఉద్యమం ఉధృతం కావడంతో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రభుత్వంలో వణుకు ప్రారంభమైంది. హైదరాబాద్ జై తెలంగాణ నినాదాలతో హోరెత్తుతోంది.

## 6,డిసెంబర్ 2013

కేసీఆర్ దీక్ష ప్రాణం మీదికి వస్తోంది. టీఆర్ఎస్ పార్టీ 48 గంటల బందు పిలుపునిచ్చింది. ప్రజలు నేతల ఇళ్లను ముట్టడించారు. తెలంగాణ మంత్రులు ఢిల్లీకి వెళ్లొద్దని ముఖ్యమంత్రి హుకుం జారీ చేశారు. అయినా కేంద్రం నుండి కదలిక రాలేదు. బీజేపీ నేతలు రాజభవనన్ను ముట్టడించారు. కేసీఆర్ వద్దకు ముఖ్యమంత్రి రోశయ్య వస్తే ఆయన్నుప్రజలు అడ్డుకున్నారు. కానీ అదే రోజు జరిగిన అసెంబ్లీలో14ఎఫ్ ను రద్దు చేస్తూ తీర్మానం చేశారు. ఈ విషయాన్నే కేసీఆర్ కు రోశయ్య చేరవేశారు. ఢిల్లీ నుండి ఆర్ఎల్డీ అధ్యక్షుడు అజిత్ సింగ్ హైదరాబాద్ కు వచ్చారు. ఆయన కోరికను సున్నితంగా తిరస్కరించారు. అదే సమయంలో సోనియాగాంధీ రాజకీయ వ్యవహారాల కార్యదర్శి అహ్మద్ పటేల్ కేసీఆర్ కు ఫోన్ చేశారు. ఎలాంటి హామీని

ఇవ్వలేదు.

## 7డిసెంబర్,2013.

కేవలం సెలైన్ల మీదే దీక్ష చేస్తున్న కేసీఆర్ కు వంట్లో బలంతగ్గిపోతోంది. బంద్ కొనసాగుతూనే ఉంది. ఇదే రోజు చంద్రబాబు కూడా వచ్చి కేసీఆర్ను పరామర్శించి వెళ్లారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బంద్ జరిగింది. ప్రభుత్వం షాక్కు గురైంది. ఎమ్మెల్యేలపై, జర్నలిస్టులపై, విద్యార్థులపై దాడులు జరిగాయి. కాంగ్రెస్ అధిష్టానానికి కేసీఆర్ దీక్ష సెగ తాకింది. సుష్మాస్వరాజ్ పార్లమెంట్లో మాట్లాడారు. తెలంగాణ బిల్లు పెట్టండి మేం మద్దతిస్తామని అన్నారు. వెంటనే పార్టీ హైకమాండ్ ఢిల్లీలో సమావేశమైంది. చర్చలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో కూడా ముఖ్యమంత్రి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. దాదాపు అన్ని పార్టీలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ప్రకటించాయి.

## 8డిసెంబర్, 2013

కేసీఆర్ చలనం తక్కువైంది. మాట పోయింది. చేయి కదపడం లేదు. ఈ సమయంలో తెలంగాణ దిశగా సోనియా గాంధీ నిర్ణయం తీసుకున్నారు. దానికి అందరూ కట్టు బడి ఉండాలనే పద్ధతిలో వీరప్పమొయిలీ సమాచారం ఇచ్చారు. ఒకవైపు కేంద్రం హడావిడి, మరోవైపు కేసీఆర్ దీక్ష, ఇంకోవైపు తెలంగాణలో సాగుతున్న ఆత్మహత్యలు. కేసీఆర్ పరిస్థితిపై డాక్టర్లు వాస్తవాలు దాస్తున్నారని తెలంగాణ డాక్టర్లు పంచాయతీ పెట్టుకున్నారు.

## 9 డిసెంబర్, 2013

తెలంగాణ గతి మార్చిన డిసెంబర్ 9 రానే వచ్చింది. ఆ ఒక్కరోజే కాంగ్రెస్ కోర్ కమిటీ ఐదుసార్లు సమావేశమైంది. పార్లమెంట్లో ఆందోళనలు సాగుతున్నాయి. తెలంగాణపై నిర్ణయం తీసుకోవాలని అన్ని పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. కేసీఆర్ పరిస్థితి మరింత దిగజారింది. ఐబీ నుండి కేంద్రానికి ప్రతిరోజు నివేదికలు వెళు తున్నాయి. 9 డిసెంబర్ న సోనియా గాంధీకి పంపిన ఐబీ నోట్ కీలకంగా మారింది. తెలంగాణలో పరిస్థితి చేయి దాటుతోందని, ప్రజలంతా రోడ్లమీదికి వచ్చి తెలంగాణ కావాలంటున్నారని ఇక్కడున్న వాస్తవ పరిస్థితిని వివరిస్తూ నోట్ రాశారు. తెలంగాణ ఇవ్వకుంటే చలో ఢిల్లీ అని టీఆర్ఎస్ కార్యక్రమం తీసుకుంది. విద్యార్థులు శాంతి

యాత్ర చేస్తామని ప్రకటించారు. పార్లమెంట్లో స్పీకర్ మీరా కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆ తరువాత పార్లమెంట్ హాల్లో జరిగిన మీటింగ్ లో ఒక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఇస్తున్నట్లుగా ప్రకటన చేయాలని చిదంబరానికి సోనియా సూచిం చారు. దీంతో కేంద్ర హోంమంత్రి హోదాలో చిదంబరం అర్ధరాత్రి ప్రకటన చేశారు. మొత్తానికి11 రోజుల పాటు సాగిన దీక్షకు తెరపడింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని చిదంబరం ప్రకటించారు.

## తెలంగాణ జేఏసీ

ఎట్టకేలకు 2013లో యూపీఏ 2 ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. 2014 మే నెలలో జరిగిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఎన్నికల్లో టీఆర్ఎస్ పక్కా పొలిటికల్ పార్టీగా ఎన్నికల బరిలోకి దిగింది. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్, తెలంగాణ తెచ్చిన పార్టీగా టీఆర్ఎస్ మధ్యనే పోటీ నెలకొని ఉంది. అప్పటివరకు ఎంతో కీలకంగా వ్యవహరించిన టీడీపీకి తెలంగాణలో చెలామణిలో లేని రూపాయి మాదిరిగా ప్రజాక్షేత్రంలో నిలిచింది. ఈ ఎన్నికలలో తెలంగాణ ప్రజానీకం టీఆర్ఎస్ పార్టీకే పట్టం కడితే, 2014 జూన్ 2న కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైంది. బంగారు తెలంగాణ నినాదంతో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్  పాలనలో ఇక్కడి భౌగోళిక, సాంస్కృతిక అంశాలను మేళవించి పాలన సాగించింది.

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన తెలంగాణ జేఏసీ 2009 లో ఏర్పడింది. యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఇస్తానని 2009 లో చెప్పి మాట తప్పడంతో ప్రొఫెసర్ కోదండరాం చైర్మన్ గా తెలంగాణ జేఏసీ ఏర్పాటైంది. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్, బీజేపీ, న్యూ డెమోక్రసీ పార్టీలు, మేధావుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు మొదలైనవి దీనిలో చేరాయి. 2011 నుండి ఉద్యమాన్ని తెలంగాణ జేఏసీ ఉధృతం చేసింది. అంతకు ముందు టీఆర్ఎస్ ఒక్కటే ఉద్యమ వేదికగా ఉ ండేది. దీని రాకతో ఉద్యమంలో బలమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఫిబ్రవరి 17, 2011 న మొదలైన సహాయనిరాకరణ మార్చి 4 వ తేదీన విరమించారు. అన్ని రంగాల్లో స్తబ్దత చోటుచేసుకుని ప్రజా జీవనం ఆగిపోయింది. సింగరేణి సంస్థ

మూతబడి విద్యుత్ రంగం దెబ్బతింది. దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా ఈ ఉద్యమం సాగింది. తర్వాత జరిగిన మిలియన్ మార్చ్ లో వేలాదిమంది ట్యాంక్ బండ్ పై ప్రదర్శన చేశారు. ట్యాంక్ బండ్ పై ఉన్న సీమాంధ్ర నాయకుల విగ్రహాలను తొలగించి హుస్సేన్ సాగర్ లో పడేశారు. హైదరాబాద్ ఫ్రీ జోన్ అని చెప్పే 14 ఎఫ్ ను తొలగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయడానికి మరోసారి ఉద్యమం ప్రారంభించింది. సకల జనుల సమ్మె తెలంగాణ జేఏసీ చరిత్రలో లిఖించదగ్గ ఉద్యమం. 2012, సెప్టెంబర్ 30 న జరిగిన సాగరహారంలో వేలాదిమంది తెలంగాణవాదులు హైదరాబాద్ వచ్చి భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా సభలో పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమాన్ని డిల్లీలో వినిపించేందుకు ప్రత్యేక రైలులో తెలంగాణ వాదులు చలో పార్లమెంట్ 'సంసద్ యాత్ర' చేశారు. తర్వాత బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు నినాదంతో యాత్ర చేపట్టి విజయవంతం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు ఛలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో టీఆర్ఎస్ పార్టీ పాల్గొని కీలక పాత్ర పోషించింది. జాతీయ పార్టీల నేతలతో డిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిపి మొదటిసారి అన్ని పార్టీలనుండి అనుకూలత వచ్చేలా జేఏసీ కృషి చేసింది. తెలంగాణ అంశాన్ని ముందుకు తీసుకెళ్లనందుకు నిరసనగా నిజాం కాలేజీ గ్రౌండ్ లో నిర్వహించిన సకలజనభేరి సభకు భారీ సంఖ్యలో తెలంగాణ ప్రజలు వచ్చి విజయవంతం చేశారు. తెలంగాణ బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడానికి అన్ని పార్టీల జాతీయనేతలను కలిసి బిల్లుకు మద్దతు తెలిపేలా తీవ్ర కృషి చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగడంలో ముఖ్యపాత్ర పోషించింది.

తెలంగాణ రాష్ట్రం 2014లో ఆవిర్భవించింది మొదలు అక్కడ అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) రెండు దశాబ్దాల చరిత్ర గల పార్టీ. తెలంగాణ ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్న వేళ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన అనే ఏకైక లక్ష్యంతో 2001లో పురుడుపోసుకున్న ఈ పార్టీ ఉద్యమానికి నిర్ణయాత్మకమైన, విలక్షణ రాజకీయ నాయకత్వాన్నిఅందించింది.

టీఆర్ఎస్ ఏర్పాటుకు ముందు ఆ పార్టీ అధినేత కె.చంద్రశేఖరరావు (కేసీఆర్) తెలుగుదేశం పార్టీలో, ఆ ప్రభుత్వంలో ఉన్నారు. అక్కడ తనను ఎదగనివ్వడంలేదన్న అసంతృప్తితో ఉన్న ఆయనకు ఈ తెలంగాణ ఉద్యమం ఒక అవకాశంగా కనిపించింది.

నిజానికి కొద్దిమంది నిబద్ధత గల వ్యక్తులు, ప్రజాసంఘాల కృషి ఫలితంగా నిర్మితమైన ఈ మలిదశ ఉద్యమం అంత వరకు పూర్తిగా రాజకీయేతరంగా మొదలైంది.

రాజకీయేతర సంయుక్త కార్యాచరణ వేదికైన 'తెలంగాణ ఐక్య వేదిక' ద్వారా సమష్టి ప్రయత్నాలు సాగుతున్నప్పటికీ ఉద్యమానికి నిర్ణయాత్మక సంస్థాగత ఆకృతి ఇవ్వడానికి ఒక నిర్దిష్ట పార్టీ, రాజకీయ రూపం కావాలని భావించారు.

## ఇంద్రారెడ్డి పార్టీ కాంగ్రెస్‌లో విలీనం

ఉమ్మడి రాష్ట్రంలో మాజీ హోం మంత్రి పి.ఇంద్రారెడ్డి ఛైర్మన్‌గా తెలంగాణ ఉద్యమ కమిటీ 1997 జూన్ 18న ఏర్పాటైంది. ప్రొ.జయశంకర్, ప్రొ. కేశవరావు జాదవ్, మాజీ మంత్రి మేచినేని కిషన్ రావు, జస్టిస్ కొండా మాధవరెడ్డి, పండిట్ నారాయణరెడ్డి, టి.ప్రభా చుంచు లక్ష్మయ్య, సయ్యద్ మహమూద్ అలీ, ముత్యాలు యాదవ్, మాజీ రాజ్యసభ సభ్యుడు పుట్టపాగ రాధాక్రిష్ణ, సతీష్ మహాజన్, కె. తిరుపతయ్య, పాశం యాదగిరి వంటి తదితరులు ఇంద్రారెడ్డిని ప్రోత్సహించారు, వెంట నడిచారు. మూడు నెలల్లోనే మహబూబ్ నగర్, ఖమ్మంలోని ఇల్లందు, కరీంనగర్, మెదక్, సికింద్రాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్ ఆదిలాబాద్ లోని నిర్మల్ పట్టణాలలో పర్యటనలు జరిపి సమావేశాలు నిర్వహించారు. సుమారు 250 గ్రూపు సమావేశాలను ఇంద్రారెడ్డి నిర్వహించారు. విద్యార్థి, ఉద్యోగ, కార్మిక ప్రతినిధులను, అనేక సంస్థలను, వేలాది మంది ప్రజలు కలుసుకొని సమాజంలోని వివిధ వర్గాలతో విస్తృతంగా చర్చించారు. తెలంగాణ ఉద్యమ కమిటీ ఏర్పడిన తర్వాత తెలంగాణ నినాదం రాజకీయ ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తెలంగాణ పోరాటానికి మద్దతు ప్రకటించాయి.

ఇది తెలంగాణ ప్రజల తొలి విజయంగా ఉద్యమ కమిటి సెప్టెంబర్ 1997లో ప్రచురించిన కరపత్రంలో పేర్కొన్నది. దాదాపు అన్ని జిల్లాలలో ఉద్యమ కమిటీలను ప్రకటించి ప్రణాళిక, ఉద్యమ నిర్మాణం కోసం ఇంద్రారెడ్డి సన్నాహాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్ చంపాపేటలోని సామ నర్సింహారెడ్డి గార్డెన్ లో తెలంగాణ ఉద్యమ ప్రతినిధుల సదస్సును నిర్వహించింది.

ఈ సదస్సు ఏర్పాటుకు పూర్వమే ఉద్యమ కమిటీ జిల్లా కన్వీనర్లను నియమించింది. వీరితోపాట తెలంగాణ ఉద్యమ కళామండలిని ఏర్పాటుచేస్తూ దాని కన్వీనర్‌గా జి.రాజేశ్వర్ ను నియమించారు. ఉద్యమ కమిటీ ఉద్యోగులు విభాగానికి 1969 ఉద్యమకారుడు ముత్యాలు యాదవ్ ను కన్వీనర్ గా ఇంద్రారెడ్డి నియమించారు. తెలంగాణ ఉద్యమ కార్మిక విభాగానికి పి. విఠల్ రావును కన్వీనర్‌గా నియమించారు. తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక పి.సి.సి ఏర్పాటు చేయాలని జాతీయ కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రాంత కాంగ్రెస్ నాయకులు కోరడం పట్ల ఇంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేసారు.

చంపాపేటలో నిర్వహించిన ఉద్యమ కమిటీ ప్రతినిధుల సదస్సుకు శిబూసోరెన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి సుమారు 2 వేల మంది జనం ఈ సదస్సుకు హాజరైయ్యారు.

ఉద్యమ కమిటీ ప్రారంభమైన నాటి నుండి ఇంద్రారెడ్డితో పనిచేసిన జయశంకర్, జాదవ్, జస్టిస్ మాధవరెడ్డి ఈ సదస్సుకు హాజరు కాకపోవడం ప్రతినిధులను తీవ్ర నిరాశకు గురిచేసింది. దీనికి కారణం తెలంగాణ మహాసభ ఏర్పడిన తర్వాత తెలంగాణ ఉద్యమంలో 'దళిత బహుజన తెలంగాణ', 'ప్రజాస్వామిక తెలంగాణ' నినాదాలు ప్రారంభం కావడమే.

ఇంద్రారెడ్డి హోం మంత్రిగా ఉన్నకాలంలో తెలంగాణలో ఎన్ కౌంటర్లు జరగడం, గతంలో చెన్నారెడ్డి తెలంగాణకు ద్రోహం చేశాడనే అపవాదు విపరీతంగా ప్రచారం కావడం వలన ఇంద్రారెడ్డి పట్ల తెలంగాణలో సానుకూలత రాలేదు ఆయన ఏకపక్షంగా ఉద్యమ కమిటీని ఏర్పాటు చేయడం కూడా వెంట నడిచిన మేధావులకు అసంతృప్తిని మిగిల్చింది. దీనితో ఆయన ఏకాకి అయ్యారు. ఉద్యమ కమిటీ ప్రత్యామ్నాయంగా తెలంగాణ మహాసభ, తెలంగాణ ప్రగతి వేదిక, తెలంగాణ ఐక్యవేదిక వంటి సంస్థలు ఆవిర్భవించినవి.

చంపాపేటలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించిన ప్రతినిధుల సదస్సు తర్వాత ఇంద్రారెడ్డి "జై తెలంగాణ పార్టీ ని ప్రారంభించారు. హైదరాబాద్ లోని కాచిగూడలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని తెలంగాణ ఉద్యమ

పునర్నిర్మాణం కోసం ఆయన చేయగల్గినంతా చేశారు. ఇంద్రారెడ్డి విద్యార్థి నాయకునిగా ఉన్నప్పటి నుండి కూడా బాగా డామినేటింగ్ వ్యక్తిత్వం కలవాడు. పాలక పార్టీలలో అలాంటి వ్యక్తిత్వం వుంటేనే నిలబడడం సాధ్యం. కానీ ఉద్యమ రాజకీయాల్లో ఇది పనిచేయదు. దీనితో ఉద్యమ కమిటీలోని సహచరులు, మేధావులు ఒక్కరుగా ఆయనకు దూరమయ్యారు. ఇంద్రారెడ్డితో సహకరించిన ప్రొ.జయశంకర్, ప్రొ.కేశవరావు జాదవ్లు తెలంగాణ ఐక్యవేదికను ఏర్పాటు చేసుకొని 28 సంఘాలతో ప్రత్యామ్నాయ వేదికను ప్రారంభించి ఉద్యమ కార్యక్రమాలను కొనసాగించారు. తెలంగాణను కోరుతున్న కుల సంఘాలు తమ తమ స్వంత సంస్థలను ఏర్పాటు చేసుకున్నాయి. పీపుల్స్ వార్ సానుభూతి పరులు తెలంగాణ జనసభను ఏర్పాటు చేసుకొని ఉధృతంగా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర బిజెపి, ఏబీవీపీ కూడా తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ను భుజాన ఎత్తుకున్నాయి. ఉస్మానియా విద్యార్థులు, ప్రొఫెసర్లు కూడా ఇంద్రారెడ్డితో కొనసాగకుండా స్వంత సంస్థలు పెట్టుకోవడంతో చేయగలిగేదేమి లేక ఆయన తన రాజకీయ మనుగడ కోసం ఆనాటి ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్.రాజశేఖరరెడ్డితో చేతులు కలిపి కాంగ్రెస్ లో చేరారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేల లేఖాస్త్రం

తెలంగాణ రాష్ట్రం కోరుతూ సోనియాగాంధీకి 41 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేఖాస్త్రాన్ని సంధించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలోనే ఇదొక మలుపుగా భావించాలి. ఆ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సహకరించాల్సిందిగా కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.

దీనిపై 38 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేయగా మరో ముగ్గురు శాసనసభ్యులు అందుబాటులో లేకపోయినా తమ ఆమోదాన్నీ తెలిపారు. మాజీ సీఎల్పీ నేత పీజేఆర్ సలహాపై తెలంగాణ ఐక్య వేదిక నాయకుడు వి.ప్రకాశ్ ఈ మెమొరాండం తయారు చేశారు. దీనిపై పీజేఆర్ చొరవతో మొదటి సంతకాలు బస్వరాజు సారయ్య, పోదెం వీరయ్య, చేర్యాల రాజలింగంలు చేశారు. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ కార్యదర్శిగా ఉన్న వనపర్తి శాసనసభ్యులు జి.చిన్నారెడ్డి ఇతర శాసనసభ్యుల సంతకాలు తీసుకున్నారు. (ఈ కారణంతోనే 2004లో వై.ఎస్ క్యాబినేట్ లో చిన్నారెడ్డికి చోటు దక్కలేదనే

ప్రచారం ఉండగా, ఆ తదుపరి విస్తరణలో ఆయన స్థానం దక్కింది.

లేక్ వ్యూ అతిథిగృహంలో ఆగస్టు 11 సాయంత్రం 5 గంటలకు చిన్నారెడ్డి, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, ఇతర శాసనసభ్యులు సోనియాను కలిసి ఆమెకు మెమొరాండం ఇచ్చి తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని వివరించారు. ఇదీ జరిగిన కొద్ది రోజులకే తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యులను సోనియా ఢిల్లీకి పిలుపించుకున్నారు.

తెలంగాణ పై కాంగ్రెస్ అధిష్టానంలోని పెద్దలకు అర్థమయ్యేలా వివరించడానికి ప్రొ.జయశంకర్, ప్రొ.బియ్యాల జనార్ధనరావు, పండిట్ నారాయణరెడ్డిలను శాసనసభ్యులు ఢిల్లీకి అప్పటికప్పుడు పిలిపించుకున్నారు.

వీరు ఢిల్లీకి చేరే ముందే సోనియాగాంధీ తెలంగాణ సమస్యపై, ఇతర చిన్న రాష్ట్రాలతో త్రిసభ్య కమిటీని నియమించారు. ప్రణబ్ ముఖర్జీ, మన్మోహన్ సింగ్ గులాంనబీ ఆజాదద్ లతో కూడిన ఈ త్రిసభ్య కమిటీకి విన్నవించారు. పండిట్ నారాయణరెడ్డి రాసిన వివరణాత్మకమైన మెమొరాండంను ప్రణబ్ ముఖర్జీకి అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గురించి ప్రొ.జయశంకర్, పండిట్ నారాయణరెడ్డి ప్రణబ్ ముఖర్జీకి మిగతా సభ్యులకు వివరించారు

ఆ తర్వాత ఏఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ తెలంగాణ, చిన్న రాష్ట్రాల ఏర్పాటుకై రెండవ రాష్ట్రాల పునర్విభజన కమిషన్ ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ  ఆమె రాసిన లేఖకు... చిన్న రాష్ట్రాల ఏర్పాటు అవసరం లేదనీ బీజేపీ హోంమంత్రి ఎల్.కె. అద్వాని వివరణనిచ్చారు. ఆ తర్వాతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 'తెలంగాణ కాంగ్రెస్ ఫోరమ్ ను ఏర్పాటు చేశారు.

## తెలంగాణపై కాంగ్రెస్, బిజెపిల యత్నాలు

తెలంగాణ కాంగ్రెస్ ప్రయత్నాలు తెలంగాణ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ శాసనసభ్యులు 1987, 89లో తెలంగాణ సమస్యల పై, జరుగుతున్న అన్యాయాలపై నినదిస్తూనే ఉన్నారు. శాసనసభ్యుడు జగపతిరావు చొరవతో జానారెడ్డి చైర్మన్ గా తెలంగాణ శాసన సభ్యుల ఫోరం ఏర్పడింది. అనంతరం శాసనసభలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలపై సుదీర్ఘమైన చర్చ జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి నేదురమల్లి జనార్ధనరెడ్డి ఈ చర్చపై సమాధానం చెప్తూ తెలంగాణ

ప్రాంతానికి జరిగిన అన్యాయాలను సవరిస్తామని, భవిష్యత్తులో అన్యాయాలు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలు కూడా ఎప్పటిలాగే అమలు జరగలేదు. తెలంగాణకు చెందిన వివిధ పార్టీల శాసనసభ్యులు సుమారు వందమంది దాకా ఢిల్లీకి వెళ్ళి తెలంగాణ సమస్యల పరిష్కారం కోసం అప్పటి ప్రధాని పి.వి. నరసింహరావుకు మెమొరాండం ఇచ్చారు. వెలిచాల జగపతిరావు చొరవతోనే ఇది సాధ్యమైంది. తదనంతరం జరిగిన రాజకీయ పరిణామాలలో ముఖ్యమంత్రి అయిన కోట్ల విజయభాస్కరరెడ్డి తన మంత్రివర్గంలోకి జానా రెడ్డిని తీసుకోవడంతో తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యుల ఫోరం కార్యక్రమాలు నిలిచిపోయాయి.

2001 ఏప్రిల్ 27న అప్పటి శాసనసభ డిప్యూటీ స్పీకర్ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలంగాణ రాష్ట్ర సమితిని ప్రారంభించిన కొద్ది రోజుల తర్వాత తెలంగాణ కాంగ్రెస్ ఎం.ఎల్.ఏలు చిన్నారెడ్డి నాయకత్వంలో సికింద్రాబాద్లో ఒకసభ నిర్వహించి తెలంగాణ కాంగ్రెస్ ఫోరంను స్థాపించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో 2004 వరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోరుతూ అనేక సభలు, సమావేశాలు నిర్వహించారు. ఈ కొనసాగింపే 2004 ఎన్నికల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ పొత్తుకు దారి తీసింది.

1998లో లోక్ సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల సందర్భంగా ఏపీ బీజేపీ నాయకత్వంలో కాకినాడలో ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ కు మద్దతు తెలిపారు. అప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం కోసం ముందుకు వచ్చిన మొదటి జాతీయ పార్టీ బీజేపీనే. కాకినాడ సభలో "ఒక్క ఓటు రెండు రాష్ట్రాలు" నినాదంతో బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టింది.

వారు ఆశించినట్లే తెలంగాణ ప్రాంతంలో అనూహ్యంగా బి.జె.పి అభ్యర్థులను మహబూబ్ నగర్, సికింద్రాబాద్, కరీంనగర్ నియోజక వర్గాలలో ఎం.పి.లుగా ప్రజలు గెలిపించారు.

మరోవైపు బీజేపీ 2000 సంవత్సరంలోనే చత్తీస్ ఘడ్, జార్ఖండ్, ఉత్తరాంచల్ రాష్ట్రాలను ఏర్పాటు చేసింది. అద్వానీ హెం మంత్రిగా రాజ్యసభలో చిన్నరాష్ట్రాలపై జరిగినప్పుడు సమాధానం చెప్తూ దేశంలో అనేక రాష్ట్రాల డిమాండ్ వున్నా ఏకాభిప్రాయం ఉన్న ప్రాంతాలనే రాష్ట్రాల ప్రతిపాదికన ఎంపిక చేశామన్నారు. రాష్ట్ర అసెంబ్లీలు తీర్మానం చేస్తూ పరిశీలిస్తామన్నారు.

తెలంగాణ రాష్ట్ర డిమాండ్ పై బి.జె.పి. నాయకత్వ వైఖరికి నిరనసనగా ఆలె నరెంద్ర లోకసభలో తెలంగాణపై ప్రైవేట్ మెంబర్ బిల్లును 2000లో ప్రవేశ పెట్టారు.

అయినా ఫలితం లేకపోవడంతో 2001లో ఆ పార్టీనీ వీడి తెలంగాణ సాధన సమితిని ఏర్పాటు చేసారు. ఆయనతోపాటు ఆ పార్టీలోని ముఖ్య నాయకులు మాజీమంత్రి మేచినేని కిషన్ రావు, శ్రీమతి శమంతకరెడ్డి, మాజీ కార్పోరేటర్ గోవింద్ గిరి, రాష్ట్ర నాయకులు కొక్కుల దయానంద్ తదితరులు సాధన సమితిలో చేరారు. 2002 ఆగస్టు 11న తెలంగాణ సాధన సమితి టి.ఆర్.ఎస్.లో విలీనమైనది. నరేంద్రతో వున్న సమరసింహారెడ్డి కూడా టీఆర్ఎస్ లో చేరిపోయారు.

2004 ఎన్నికల్లో మెదక్ ఎం.పి.గా నరేంద్ర టీఆర్ఎస్ నుంచి గెలిచారు. సోనియాగాంధీ కోరికపై టీఆర్ఎస్ కేంద్ర మంత్రివర్గంలో చేరగా నరేంద్రకు కేంద్రమంత్రి వర్గంలో గ్రామీణ ఉపాధి శాఖ సహాయమంత్రి పదవి లభించింది. 2005లో కేసీఆర్, ప్రొ జయశంకర్, ఇతర టీఆర్ఎస్ ఎంపీలను వెంట పెట్టుకుని ఆలే నరేంద్ర నాగ్పూర్ లోని ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయానికి వెళ్ళారు.

చిన్ననాటి నుండి తనకు ఆర్.ఎస్.ఎస్.తో ఉన్న సంబంధంతో నరేంద్ర చొరవ తీసుకుని సంఘ్ నాయకత్వాన్ని తెలంగాణ డిమాండ్ కు మద్దతు తెలిపేలా ఒప్పించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని కే.సి. ఆర్., జయశంకర్ ఆర్.ఎస్. ఎస్." నాయకులకు వివరించారు. ఆర్.ఎస్.ఎస్. తెలంగాణకు మద్దతు తెలపడంతో టి.ఆర్.ఎస్. నాయకులు మాజీ ప్రధాని బిహారీ వాజ్ పాయి, అద్వానీలను కలిసి తెలంగాణ రాష్ట్ర డిమాండ్ కు మద్దతును తెలపాలని కోరినారు. దానికి వారు సానుకూలంగానే స్పందించారు. ఆ తర్వాత బి.జె.పి కేంద్ర నాయకత్వం తమ పూర్వ వైఖరిని మార్చుకుని తెలంగాణకు అనుకూలంగా వ్యవహరించింది. బీజేపీ కేంద్ర నాయకత్వాన్ని తెలంగాణకు అనుకూలంగా ఒప్పించడానికి టి.ఆర్.ఎస్. ఒకవైపు ప్రయత్నించగా మరోవైపు రాష్ట్ర బి.జె.పి. నాయకులు బండారు దత్తాత్రేయ, సి.హెచ్. విద్యాసాగర్‌రావు, కిషన్ రెడ్డి, లక్ష్మణ్, చింతల రామచంద్రారెడి ఎన్వీఎస్ ప్రభాకర్, అడ్వకేట్ రాంచందర్ రావు, బద్దం బాల్ రెడ్డి తదితరులు 1998 నుండి ప్రయత్నాలు కొనసాగిస్తునే వచ్చారు.

# టీఆర్ఎస్ తో రాజకీయ పునరేకీకరణ

తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని ఏర్పాటు చేస్తున్నామని కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 27 ఏప్రిల్ 2001న హైదరాబాద్ ట్యాంక్ బండ్ సమీపంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యంలో ప్రకటించారు. అదే రోజు తన ఉప సభాపతి పదవికి, సిద్దిపేట నియోజకవర్గ శాసనసభ్యత్వానికి మరియు తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చంద్రశేఖర్ రావు రాజీనామా చేశారు. నానాటికి తెలంగాణ ప్రాంతంలో ప్రజల జీవన పరిస్థితులు దుర్భరంగా మారుతున్నవి. 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత తెలంగాణ ప్రాంతంపై వివక్ష మరింత ఎక్కువైంది. ఆంధ్ర వలస పాలకులతో దోపిడి మరింతగా పెరిగింది. ఆర్థిక సరళీకృత విధానాల పేరుతో, సంస్కరణల పేరుతో తెలంగాణలోని అనేక ప్రభుత్వరంగ పరిశ్రమలను నష్టాల సాకు చూపి ప్రభుత్వం మూసివేసింది. లాభాల్లో ఉన్న నిజాం షుగర్స్ వంటి కొన్ని పరిశ్రమలను ఆంధ్ర ప్రాంత పెట్టుబడిదారులకు నామమాత్రపు ధరకు అమ్మివేసింది.

చంద్రబాబు అనుసరించిన ఇలాంటి విధానాల వలన వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఎన్ కౌంటర్ల పేరుతో నిరాయుధులైన వందలాది మంది యువకులను పోలీసులు కాల్చి చంపారు.

తెలంగాణలోని సిరిసిల్ల, గజ్వేల్, దుబ్బాక, పోచంపల్లి తదితర ప్రాంతాల్లోని చేనేతకారులు అప్పులపాలై బతకలేని పరిస్థితుల్లో సుమారు వారానికొక్కరు ఆత్మహత్యలు చేసుకున్నారు. నక్సలైట్లకు సహకరిస్తున్నారన్న పేరుతో వేలాది మందిని పోలీస్ స్టేషన్లలో హింసించడం, అక్రమ కేసుల్లో కోర్టు పాలు చేయడం

సాదారణమైపోయింది. తెలుగుదేశం పార్టీని వ్యతిరేకించిన వారిని కూడా నక్సలైట్లకు సహకరిస్తున్నారని పోలీసులు వేధించారు. తెలంగాణలో నూటికి 70శాతం రైతాంగం వ్యవసాయం పైనే ఆధారపడి ఉన్నారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల పట్ల 1956నుండి ఆంధ్ర పాలకులు అనుసరిస్తున్న దారుణమైన వివక్షను, నిర్లక్ష్యాన్ని చంద్రబాబు ప్రభుత్వం కూడా కొనసాగించింది. అప్పటికే తెలంగాణలో గొలుసు కట్టు చెరువుల వ్యవస్థ శిథిలమైంది. చెరువులు, కుంటల్లో పూడిక తీయకపోవడం

వల్ల తెలంగాణ గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి.

1956లో చెరువులు, కుంటల కింద సుమారు పదకొండు లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందగా 2001 నాటికి చెరువులు, కుంటల కింద సాగు రెండున్నర లక్షల ఎకరాలకు పడిపోయింది. నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను కేటాయించకపోవడం వలన దశాబ్దాల తరబడి తెలంగాణ ప్రాజెక్టులన్నీ అసంపూర్తిగానే ఉన్నవి.

శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, మూసీ, కడెం వంటి భారీ ప్రాజెక్టుల కింద ఆంధ్రపాలకులు అనుసరించిన వివక్ష వల్ల ఆశించిన ఆయకట్టుకు సాగునీరు అందలేదు. ఒక పక్కన వర్షాభావ పరిస్థితులు మరోపక్క బోర్లు, బావుల్లో నీరు లేకపోవడం రైతులను సంక్షోభంలోకి నెట్టింది. అప్పుల భారంతో తెలంగాణ వ్యాప్తంగా 1997- 2000 మధ్య కాలంలో కొన్ని వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వ్యవసాయం భారమైందని, బతుకలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు భాదపడుతున్న సమయంలో చంద్రబాబు ప్రభుత్వం కరెంట్ ఛార్జీలు పెంచింది. ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా అసెంబ్లీని ముట్టడికి పిలుపునిచ్చిన తొమ్మిది వామపక్ష సంఘాల ఊరేగింపు పై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు మరణించారు. ఈ సంఘటన తెలంగాణలో నెలకొన్న

పరిస్థితులు, అసెంబ్లీలో ఉప సభాపతిగా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కలిచివేయగా, ఎంతో ఆవేదనతో సెప్టెంబర్ మొదటి వారంలో చంద్రబాబుకు ఒక లేఖ రాస్తూ అందులో తెలంగాణ రైతుల దయనీయ పరిస్థితిని వివరించారు. ఈ కరెంట్ ఛార్జీల పెంపు వలన "తెలంగాణ రైతుల ఉన్న గోచి కూడా ఊడిపోతుందని" ఆ లేఖలో ప్రస్తావించారు.

సీమాంధ్ర పాలనలో తెలంగాణ సమస్యలు పరిష్కరించబడవని, ఈ ప్రాంతానికి న్యాయం జరగదని కనుక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఆహ్వానించారు. 2000లో తొలిసారి జయశంకర్ ను కేసీఆర్ కలిశారు.

తొలి భేటీలోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించగలడనే నమ్మకాన్ని ప్రొ. జయశంకర్ వ్యక్తం చేయడం విశేషం. సుమారు ఏడు నెలలు ప్రతిరోజూ తెలంగాణ

వాదులతో చర్చలు, అన్యాయాల గురించి వివరంగా తెలుసుకున్న కెసిఆర్.. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పెట్టాలనే నిర్ణయం 2000 నవంబర్లోనే తీసుకున్నా సరియైన సమయం కోసం పార్టీ ఏర్పాటుకు వాయిదా వేశారు. ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు కొంచెం ముందుగా ముహూర్తం ఖరారు చేశారు. అప్పటికే ప్రముఖ తెలంగాణ ఉద్యమ మార్గదర్శి ఆచార్య కొత్తపల్లి జయశంకర్, మధుసూదనాచారి, వి. ప్రకాష్, గాదె ఇన్నయ్య, ప్రొ. బియ్యాల జనార్ధనరావు, నిమ్మ నర్సింహారెడ్డి, బి.హనుమంతరావు, హరీష్ రావు, ఎస్. రఘువీర్రావు, ఎస్. నిరంజన్ రెడ్డి కె.కె. మహేందరెడ్డి తదితరులతో చర్చించి పార్టీ ఏర్పాటుకు, ఉద్యమ నిర్మాణానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. పార్టీ ఆవిర్భావాని కంటే ముందే తెలంగాణ వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న శాసనసభ్యులను, మాజీ శాసనసభ్యులను, ప్రజా ప్రతినిధులను, తెలుగుదేశం పార్టీలోని తన సహచరులను, ప్రముఖ కాంగ్రెస్ నాయకులను ఎంతో మందితో కెసిఆర్

సంప్రదించి వారిని ఉద్యమంలోనికి ఆహ్వానించారు. 1997 నవంబర్ నుండి తెలంగాణ ఐక్య వేదికకు కార్యాలయంగా ఉన్న జలదృశ్యంను తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయానికి ఇవ్వడానికి కొండా లక్ష్మణ్ బాపూజీగారు అనుమతించారు. పర్యవసానంగా 2001 ఏప్రిల్ 27న టిఆర్ఎస్ ఆవిర్భావం జలదృశ్యం ఆవరణలో జరిగింది.

## కరీంనగర్ "సింహగర్జన" సభ

తెలంగాణపై తమ ప్రారంభ సభను కరీంనగర్ లో 2001 మే 17న నిర్వహించాలని టిఆర్ఎస్ నాయకత్వం నిర్ణయించింది. 1969-70లలో అణగదొక్కబడిన తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతంగా పునరుద్ధరించాలంటే యావత్ తెలంగాణ ప్రజలకు నమ్మకం కలిగించే విదంగా కనీవినీ ఎరుగని రీతిలో హైదరాబాద్ నుండి కరీంనగర్ వరకు జైత్రయాత్రను తలపెట్టారు. వందలాది వాహనాలతో వేలాదిమంది ప్రజలతో ముఖ్యంగా విద్యార్థులు, డాక్టర్లు, న్యాయవాదులు, ఉద్యోగులు, మహిళలతో ర్యాలీతో ఒక మంచి ప్రారంభాన్ని ఇవ్వాలని కెసిఆర్ భావించారు. దీనికోసం పార్టీ ఏర్పాటుకన్నా

మూడు, నాలుగు నెల్లు ముందు నుంచే కెసిఆర్ సన్నాహాలు ప్రారంభించారు.

దీనిలో భాగంగానే తెలంగాణ ప్రజలను ఉత్తేజపర్చడానికి అద్భుతమైన పాటలను, జానపద గేయాల బాణీలలో ప్రముఖ తెలంగాణ సినీ కవి సుద్దాల అశోక్ తేజతో పాటల క్యాసెట్ ను తయారు చేయించారు. ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీ జెండాలో గానీ, ఏ జాతీయ పతాకంలో కనిపించని గులాబీ రంగులో టిఆర్ఎస్ పార్టీ జెండాను రూపొందించారు. నాలుగున్నర దశాబ్దాల సీమాంధ్ర పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను, వివక్షను తెలిపే కరపత్రాన్ని సిద్ధం చేశారు.

2001 మే 4న తెలంగాణలోని అన్ని జిల్లాల నుండి ప్రతినిధులను పిలిపించి జలదృశ్యంలో జిల్లా, మండల కన్వీనర్లను నియమించారు. మే 17న జరుగనున్న సింహగర్జన సభకు చేయవలసిన సన్నాహాలు, జన సమీకరణ, పార్టీ నిర్మాణం గురించి కెసిఆర్ ప్రతినిధులకు సూచనలిచ్చారు. ప్రతి నియోజకవర్గానికి పార్టీ జెండాలు, కరపత్రాలు, పాటల క్యాసెట్లు ఇచ్చారు. జలదృశ్యంలోని పార్టీ సమావేశానికి హాజరైన ప్రతినిధులంతా ఎంతో ఉత్సాహంతో తమ నియోజకవర్గాలకు తిరుగు ప్రయాణమయ్యారు.

1969లో తెలంగాణ ఉద్యమానికి కేంద్రమైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2001 మే 5న ఓయు ఫోరమ్ ఫర్ తెలంగాణ రాగూర్ ఆడిటోరియంలో ప్రొ.లక్ష్మణ్, ప్రొ.మధుసూదన్ రెడ్డి తదితరులు నిర్వహించిన తెలంగాణ సదస్సుకు కెసిఆర్, టిఆర్ఎస్ నాయకులు నాయిని నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సదస్సులో కెసిఆర్ ప్రసంగం ఉస్మానియా ప్రొఫెసర్లను, విద్యార్థులను ఎంతో ఉత్తేజపర్చింది.

2001 మే 11న తెలంగాణలోని వేలాది గ్రామాలలో ఒకే సమయానికి ఉ దయం 11 గంటలకు టిఆర్ఎస్ నాయకులు గులాబీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాలలో తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గురించి టిఆర్ఎస్ నాయకులు ప్రజలకు వివరించారు.

2001 మే 17న ఉదయం 10గంటలకు జలదృశ్యం నుంచి సుమారు రెండువందల వాహనాలలో టిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్, పార్టీ నేతలు కరీంనగర్ సింహగర్జన సభకు బయలుదేరారు. నగర పొలిమేర దాటే వరకు నాలుగైదు వందల

వాహనాలు కేసీఆర్ కార్ల ర్యాలీలో కలిశాయి. ఎందరో న్యాయవాదులు, డాక్టర్లు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు తమ సొంత వాహనాలలో కరీంనగర్ కు బయలుదేరారు.

ఈ సభకు ముఖ్య అతిథిగా వచ్చిన జార?ండ్ ముక్తి మోర్చ అధ్యక్షుడు శిబూసోరెన్ అనూహ్యమైన ప్రజల స్పందనను చూసి ఎంతో ఆశ్చర్యపోయి "తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతంగా కేసీఆర్ పునరుద్ధరిస్తున్నారని అభినందించారు. ప్రొ. కొత్తపల్లి జయశంకర్ కు పాదాభివందనం చేసి కెసిఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తెలంగాణకు జరిగిన అన్యాయాలపై, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరం గురించి కెసిఆర్ సుమారు గంటసేపు పల్లె ప్రజలకు అర్థమయ్యే భాషలో సామెతలతో ప్రసంగించారు.

సభకు వచ్చిన ప్రజలను కెసిఆర్ ప్రసంగం ఎంతో ఆకర్షించింది. అంతకు ముందు ఈ సభలో ప్రసంగించిన ప్రొ.జయశంకర్ సమైక్య రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి తెలంగాణకు జరిగిన అన్యాయాలను కళ్లకు కట్టినట్టు వివరించారు. రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన కళాకారులు సుమారు ఐదు గంటలు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఇక అప్పటినుంచి వరుసగా జూన్ 1 నుంచి 5 వరకు మహబూబ్ నగర్, నల్గొండ, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో టీఆర్ఎస్ ఆధ్వర్యంలో బహిరంగ సభల తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును విశ్వవ్యాప్తం చేశాయి. ఈ సభలకు అంచనాలకు మించి జనం హాజరయ్యారు.

సమైక్య రాష్ట్రంలో జరిగిన ఈ సభలలో కెసిఆర్‌తో పాటు ప్రొ.జయశంకర్, గాదె ఇన్నయ్య ఇరిగేషన్ అన్యాయాలపై చేసిన ఆరోపణలపై చంద్రబాబు కదిలారు. ఎంతో ఆందోళన చెందిన చంద్రబాబు నాయుడు అప్పటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి కడియం శ్రీహరి సలహాపై గోదావరి అన్యాయాల గురించి పర్యావసానంగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యల గురించి ఎక్కువగా ప్రస్తావించారు. నది మీద దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని 18 నెలల్లో నిర్మిస్తామని ప్రకటించారు. ఎలాంటి సర్వేలు, ప్రాజెక్టు నివేధికలు రూపొందించకుండానే రోడ్డు మార్గం కూడా సరిగాలేని వరంగల్ జిల్లా ఏటూరు నాగారానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవాదుల గ్రామానికి హెలికాప్టర్‌లో వెళ్లి ఆగమేఘాల మీద వెళ్లి శంకుస్థాపన చేశారు. గోదావరిపై

ఎలాంటి బ్యారేజీని నిర్మించకుండా పారేనది నుండి నీటిని ఎత్తిపోసుకుని లక్షల ఎకరాల్లో పంటలు పండించుకోవచ్చునన్నారు. ఆ సమయంలోనే వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికలల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్ కు ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు జరిగే నాటికి పార్టీ స్థాపించి మూడు నెలలు కూడా కాలేదు. అయినా అన్ని జిల్లాల్లో టిఆర్ఎస్ తన అభ్యర్థులను జడ్పిటిసి, ఎంపీటీసీ స్థానాల్లో పోటీకి నిలిపింది. ఈ ఎన్నికల్లో ప్రచారానికి సమయం తక్కువగా ఉన్నందున కెసిఆర్ హెలికాప్టర్ను ఉపయోగించి వివిధ జిల్లాల్లో ఒక్కో రోజు ఎనిమిది నుంచి పది సభలలో ప్రసంగించారు. పార్టీ కార్యాలయమైన జలదృశ్యం ఆవరణ నుంచే హెలికాప్టర్ లో కెసిఆర్ బయలుదేరడం చూసి చంద్రబాబునాయుడు ఉడికిపోయారు. ఏడాదిలో జలదృశ్యం భవనాన్ని నేలమట్టం చేయడానికి సిద్ధమయ్యారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికలలో టిఆర్ఎస్ రైతు నాగలి గుర్తుపై పోటీ చేసింది. టీఆర్ఎస్ పార్టీకి 6 జడ్ పిటిసి స్థానాలు, 100కు పైగా ఎంపిటిసి స్థానాలు మరియు నిజామాబాద్, కరీంనగర్ జిల్లా పరిషత్లను గెలుచుకుంది. మాజీ ఆర్థికమంత్రి సంతోష్ రెడ్డి నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ గా, కె.వి. రాజేశ్వరరావు కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మన్ బాధ్యతలు స్వీకరించారు.

ఆగస్టులో గ్రామ పంచాయతీల ఎన్నికలు జరిగాయి. వంద గ్రామాల్లో టిఆర్ఎస్ పార్టీ బలపర్చిన వ్యక్తులే సర్పంచులుగా గెలిచారు. 2001 ఆగస్టు 18న టీఆర్ఎస్ పార్టీ ఒక రాజకీయ పార్టీగా ఎన్నికల కమిషన్ వద్ద రిజిస్టర్ అయింది. సెప్టెంబర్ 22న కెసిఆర్ రాజీనామాతో జరిగిన సిద్దిపేట శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికలో టిఆర్ఎస్ పార్టీ తరుపున భారీ మెజారిటీతో కెసిఆర్ తిరిగి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రచారం సందర్భంగా తెలంగాణలోని అన్ని జిల్లాల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణవాదులు, కళాబృందాలు సిద్ధిపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లి ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవసరం గురించి వివరించారు. ఎలాగైనా కెసిఆర్ ను ఓడించాలని తెలుగుదేశం పార్టీ కోట్ల రూపాయలను, మద్యాన్ని విచ్చలవిడిగా పంచి ప్రజలను ప్రలోభపర్చడానికి ప్రయత్నించింది. అయినా గతంకంటే ఎక్కువ మెజారిటీతో సిద్దిపేట ప్రజలు కెసిఆర్ను గెలిపించారు.

## ఉద్యోగుల పోరుబాట

మలిదశ తెలంగాణ ఉద్యమంలో చర్చకు వచ్చిన ప్రధానాంశాలలో జీవో 610 కూడా ఒకటి. కేసీఆర్ పదే పదే ఈ జీవోను, సిక్స్ పాయింట్ ఫార్ములా వైఫల్యాన్ని ప్రస్తావిస్తుండటంతో చంద్రబాబు ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోక తప్పలేదు. ఇదే విషయంపై తెలంగాణలోని ఉద్యోగ సంఘాలన్నీ ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడ్డాయి. జీవో 610 అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. దీనితో ప్రభుత్వం 2001 జూన్ 15న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి సీనియర్ ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్) అధికారి జె.ఎం. గిర్ గ్లాని తో ఏకసభ్య కమీషన్ ఏర్పాటు చేసింది.

రాష్ట్రంలోని 134 మంది శాఖాధిపతులలో ఒక్కరు తప్ప మిగిలిన వారంత తెలంగాణేతరులే కావడం వల్ల వారిలో చాలా మంది కమీషన్ కు సహకరించలేదు. కమీషన్ కోరిన ఉద్యోగుల సర్వీసు రికార్డులను సమర్పించలేదు. దీనితో కమీషన్ కాలపరిమితి పెంచగా, తుది నివేదికను 30 సెప్టెంబర్ 2004న అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించారు.

## తెలంగాణలో మారిన రాజకీయసమీకరణాలు

టీఆర్ఎస్ ఆవిర్భావం తరువాత తెలంగాణ ప్రాంతంలోని రాజకీయ సమీకరణాలు శరవేగంగా మార్పు చెందాయి. టిఆర్ఎస్ కు భవిష్యత్ లేదని కాంగ్రెస్, టీడీపీ అగ్ర నేతలు ఎద్దేవా చేశారు. కేసీఆర్ సిద్దిపేటలో లభించిన భారీ మెజారిటీ ఈ నాయకులను దిగ్భ్రాంతికి గురి చేసింది. గతంలో తెలుగుదేశం పార్టీలో కేసీఆర్ కు సన్నిహితంగా ఉన్న జి.విజయరామరావు, సురేందర్‌రెడ్డి (మేడ్చల్), నాయిని నర్సింహారెడ్డి, మాజీ ఎంఎల్ఏ సిరికొండ మధుసూదనాచారి, రంగారెడ్డి పరిషత్ మాజీ చైర్మన్ కె. ఎస్.రత్నం, పెద్దపల్లి నేతలు సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడుగా పనిచేసిన సుదర్శన్ రావు, తెలుగు విద్యార్థి అధ్యక్షుడుగా పనిచేసిన ఎర్ర సత్యనారాయణ, ఖాదీ బోర్డు చైర్మన్ గా పనిచేసిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి చెందిన సిరిసిల్లా ఎమ్మెల్యే పాపారావు, హుజురాబాద్ ఎంఎల్ఏగా పోటీ చేసిన ఆ పార్టీ నాయకుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కెసిఆర్ పై పోటీ చేసిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు స్వామిచరణ్, మాజీ మంత్రి సంతోష్ రెడ్డి, అరవిందరెడ్డి, ఆదిలాబాద్

నుండి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపి పండిట్ నారాయణరెడ్డి, మిర్యాలగూడ నుంచి విజయసింహా రెడ్డి వంటి తదితరులు టీఆర్ఎస్ పార్టీలో చేరారు.

తెలంగాణ వ్యాప్తంగా పార్టీని నిర్మించడం కోసం కెసిఆర్, టిఆర్ఎస్ నాయకులు అన్ని జిల్లాలలో కార్యక్రమాలు చేపట్టారు. వీటిలో భాగంగా 2001 నవంబర్ 17న ఖమ్మం ప్రజాగర్జన నిర్వహించారు. వామపక్షాల ప్రాబల్యం అధికంగా ఉందనుకున్న ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ సభకు అనూహ్యంగా ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డా.గోపీనాథ్ అధ్యక్షతన ఈ సభ జరిగింది మాజీ డిఆర్ఓ రామారావు, మహమ్మద్ నబి, కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరులలోని సింగరేణి కార్మికులు, విద్యార్థులు ఈ సభలో పాల్గొన్నారు.

జనవరి 22న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు జరిగిన మేయర్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ తరుపున పార్టీ ప్రధానకార్యదర్శి, మాజీ ఎంఎల్ఏ నాయిని నర్సింహారెడ్డి మేయర్‌గా పోటీ చేశారు. టీఆర్ఎస్ చాలా డివిజన్లలో పోటీ చేసింది కానీ కేవలం మాణిక్యేశ్వర్ నగర్ లోనే యాదయ్య, మొండా మార్కెట్ డివిజన్ నుండి పద్మారావులు కార్పోరేటర్లుగా ఎన్నికయ్యారు. అప్పటికి కొద్ది నెలల ముందే బిజెపి సీనియర్ నాయకుడు, మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఆలె నరేంద్ర ఆధ్వర్యంలో తెలంగాణ సాధన సమితి నుండి గౌలిపుర డివిజన్ అభ్యర్థి గెలుపొందారు. 2002 ఆగస్టు 11న ఆలె నరేంద్ర తెలంగాణ సాధన సమితి టిఆర్ఎస్ లో విలీనం చేసారు.

భారతీయ జనతా పార్టీనుండి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఆ పార్టీ శాసనసభ్యుడు రావుల రవీంద్రనాథ్రెడ్డి, గతంలో కెసిఆర్ పై పోటీచేసిన నిమ్మ నర్సింహారెడ్డి, వరంగల్ నుండి ఆ పార్టీ మాజీ జిల్లా కన్వీనర్ కోల జనార్ధన్, రాష్ట్ర నాయకుడు మందాటి సత్యనారాయణరెడ్డి, సిపిఐ పార్టీ నుంచి బోయిన్పల్లి వినోద్ కుమార్, ఆ పార్టీ మాజీ శాసనసభ్యుడు దేశిని చినమల్లయ్య, జన్ను జకార్యా, మాజీ శాసనసభ్యుడు బండి పుల్లయ్య, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన సంతపురి రఘువీర్ రావు, హజ్జర్ హుస్సేన్, కళ్ళెం యాదగిరిరెడ్డి తదితర నాయకులంతా పార్టీలో చేరారు. టి.ఆర్.ఎస్. ఏర్పడిన వంద రోజుల్లోపే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 87 జడ్.పి.టి.సి. స్థానాలను, 229, పరిషత్తులలో జయకేతనం ఎగురవేసినా పార్టీ కేవలం రెండున్నర జిల్లాలకే పరిమితమైందని తెలుగుదేశం నేతలు ప్రచారం చేసారు. 2003లో వరంగల్ లో టిఆర్ఎస్ ద్వితీయ

వార్షికోత్సవాలకు చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా సుమారు 15 లక్షల మంది హాజరు కావడంతో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పునరాలోచనలో పడ్డారు. ఈ సభ తర్వాత 2004 ఎన్నికలలో మధ్యకాలంలో టీ.ఆర్.ఎస్.లోకి చేరికలను పెరిగేలా చేసింది. పార్టీ అవిర్భావం తర్వాత నాయకుల చేరికలతో తెలంగాణలో రాజకీయ సమీకరణలు మారాయి.

## చేనేత కార్మికుల కోసం బిక్షాటన

భూదాన్ పోచంపల్లి గ్రామంలో కొందరు చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మరణించిన వారి కుటుంబాలను, ఆదుకోవడానికి కెసిఆర్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు బిక్షాటన చేసి ఒక్కో కుటుంబానికి రూ. 50వేలు అందించారు. 2002 ఆగస్టు 11న ఆలె నరేంద్ర నాయకత్వంలోని తెలంగాణ సాధన సమితి టిఆర్ఎస్ లో విలీనమైంది. పార్టీలో సెక్రెటర్ జనరల్ గా ఆలె నరేంద్ర నియమితులయ్యారు. నరేంద్ర తో పాటు మాజీ మంత్రులు సమరసింహారెడ్డి, మేచినేని కిషన్ రావు, గుత్తా మోహన్ రెడ్డి, బిజెపి నాయకులు దయానంద్, మాజీ కార్పొరేటర్ గోవింద్ గిరిలు చేరారు. అప్పటిదాకా పార్టీలో ప్రధాన కార్యదర్శిగా చురుకుగా పనిచేసిన గాదె ఇన్నయ్య, టీఆర్ఎస్ మహిళా నాయకురాలు నంది నిర్మల కెసిఆర్ తో వచ్చిన మనస్పర్ధలతో పార్టీని వదిలిపెటారు.

2002 అక్టోబర్ 26న నాగార్జునసాగర్ కుడి కాలువకు నీరు వదిలి, ఎడమ కాలువ ఆయకట్టును ఎండబెడుతున్న చంద్రబాబు ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ కెసిఆర్, టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు వేల సంఖ్యలో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముగించుకొని కెసిఆర్ హైదరాబాద్ చేరకముందే అధికారులు ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సంఘటనతో టీఆర్ఎస్ కి ప్రజల్లో మరింత ఆదరణ పెంచింది. 2002 సెప్టెంబర్ 28 నుండి అక్టోబర్ 7వరకు రెండు వారాల పాటు తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని, ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి టిఆర్ఎస్ పార్టీ పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం అన్ని జిల్లాల్లో విజయవంతమైంది.

ఒక విషాదాన్ని కూడా మిగిల్చింది. పార్టీ ఉపాధ్యక్షుడు నిమ్మ నర్సింహారెడ్డి

కరీంనగర్ జిల్లాలో పల్లెబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మరణించారు. ఆయనను ఒక అన్నలా ఎంతో ఆత్మీయతతో కెసిఆర్ చూసుకునేవారు. తెలంగాణలో విద్యుత్ ఉత్పాదన ప్రాజెక్టుల నిర్మాణంలో చంద్రబాబు ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కొత్త పవర్ ప్రాజెక్టు డిమాండ్ తో వరంగల్ జిల్లా భూపాలపల్లిలో టిఆర్ఎస్ బహిరంగ సభ నిర్వహించింది. కెసిఆర్, ఆలె నరేంద్ర, వినోద్ కుమార్, మధుసూదనాచారి, వి.ప్రకాశ్, మందాటి సత్యనారాయణరెడ్డి, వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు కోల జనార్ధన్, పరకాల కిషన్ రావు, వెంకటేశ్వర్లు తదితర నాయకులంతా ఈ సభకు హాజరయ్యారు.

## తెలంగాణ జలసాధన సభ

నవంబర్ 25 నుండి 2003 జనవరి 6 వరకు తెలంగాణ జలసాధన ఉద్యమాన్ని రోజుకొక కార్యక్రమం చొప్పున టీఆర్ఎస్ పార్టీ నిర్వహించింది. తెలంగాణ జిల్లాలో తెలంగాణకు సాగునీటి రంగంలో జరిగిన అన్యాయాలను పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. తెలంగాణ కళాకారులు, తెలంగాణ కవులైన డా. అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ, గోరటి వెంకన్న, గూడ అంజయ్య, జయరాజ్, వరంగల్ శ్రీను తమ గేయాల్లో తెలంగాణ సాగునీటి రంగ సమస్యలను వివరించారు. రసమయి బాలకిషన్, తెలంగాణ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు కుమారి కవిత, అంతడుపుల నాగరాజు, నేర్నాల కిషోర్ తదితర గాయకులు జనం భాషలో పాడిన పాటలను క్యాసెట్ల రూపంలో ప్రజల మధ్యకు తీసుకువెళ్లారు. టిఆర్ఎస్ కార్యకర్తలు సాగునీటి రంగ సమస్యలపై వి.ప్రకాశ్ రాసిన స్క్రిప్టులను కెసిఆర్ మాటల్లో రికార్డు చేయడం జరిగింది. జలసాధన ఉద్యమంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా జనవరి మొదటివారంలో సామూహిక నిరాహార దీక్షలు జరిగాయి. మరో రోజు విద్యార్థులు తమ తరగతులను బహిష్కరించారు. జలసాధన ఉద్యమంలో రాస్తారోకోలు, దీపాల వెలిగింపు, మహిళాశక్తి ప్రదర్శన తదితర కార్యక్రమాలను టిఆర్ఎస్ నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో లక్షలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

జలసాధన ఉద్యమం సందర్భంగా తెలంగాణ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు చాలా చురుగ్గా పాల్గొన్నారు. తమ ప్రతిభను ఈ ఉద్యమానికి జోడించారు. రిటైర్డ్ చీఫ్

ఇంజనీర్ కేంద్ర జల సంఘం ఆర్.విద్యాసాగర్ రావు టీఆర్ఎస్ లో ముఖ్య భూమికను నిర్వహిస్తున్నారు.

రిటైర్డ్ ఎస్.ఇ. దేవరుప్పల భీమయ్య, ప్రభాకర్, శ్యాంప్రసాద్ రెడ్డి తదితర ఇంజనీర్లు కెసిఆర్ కు తెలంగాణ శ్రేణులకు ఎప్పటికప్పుడు నీటి పారుదల రంగం తీరు తెన్నులను, జరిగిన అన్యాయాలను వివరిస్తూ వచ్చారు.

2003 జనవరి 6న జల సాధన ఉద్యమం ముగింపు సభ లక్షలాది మందితో సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో జరిగింది. ఈ సభకు కేంద్రమంత్రి రామ్ విలాస్ పాశ్వాన్, శిబూసోరెన్, నేషనల్ అలియన్స్ ఫర్ పీపుల్స్ మూమెంట్ నాయకురాలు మేధాపాట్కర్ కేసీఆర్, నరేంద్రలతోపాటు టిఆర్ఎస్ నాయకులంతా హాజరయ్యారు.

## వెయ్యి కార్లతో ఢిల్లీ యాత్ర

టిఆర్ఎస్ ఆవిర్భవించిన తరువాత తొలిసారి కెసిఆర్ ఢిల్లీకి బయల్దేరిన సందర్భం. లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షులు, జాతీయ నాయకులు, కేంద్ర మాజీమంత్రి రాం విలాస్ పాశ్వాన్ ఆహ్వానాన్ని స్వీకరించి వెయ్యి కార్లతో తన పార్టీ పది జిల్లాల ముఖ్య నేతలతో, కార్యకర్తలతో ర్యాలీగా రోడ్డు మార్గంలో సాహసయాత్రకు 2003 మార్చి 27న శ్రీకారం చుట్టారు. కెసిఆర్ జై తెలంగాణ నినాదాలతో దేశ రాజధాని ప్రధాన వీధులన్నీ మార్మోగినవి. గులాబీ జెండాల రెపరెపలను, వెయ్యి కార్ల ర్యాలీని ఢిల్లీ జనం, పోలీసులు ఆసక్తిగా తిలకించారు.

రాంలీలా మైదానానికి వెళ్లేసరికి పాశ్వాన్ సభ సాగుతున్నది. కెసిఆర్ ను వేదిక పైకి ఆహ్వానించి పాశ్వాన్ ఆలింగనం చేసుకున్నారు. తెలంగాణ సెగ ఢిల్లీకి పాకింది. కెసిఆర్ ప్రసంగం అందరినీ ఆకట్టుకున్నది. మరునాడు ఢిల్లీ పత్రికలు తెలంగాణ గురించి, కెసిఆర్ గురించి తొలిసారి ప్రముఖంగా ప్రచురించాయి. అజిత్ సింగ్ తో తొలిసారి సమావేశమయ్యారు.

మొదటి రాత్రి ఝాన్సీలో బస రాత్రి 8గంటలకు బుందేల్ ఖండ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బాబూలాల్ తివారీని కలిశారు. ఆ రాత్రి సుదీర్ఘ చర్చల తరువాత తెల్లవారి ఝాన్సీలో ప్రెస్ మీట్ పెట్టి బుందేల్ ఖండ్ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. కెసిఆర్ ఆ మళ్లీ ప్రయాణం. విదర్భనేత, మాజీ ఎంపి, లోక్మత్ పత్రిక సంపాదకులు

బస్వర్ లాల్ పురోహిత్ తో కలిసి ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి విదర్భ ఉద్యమానికి టిఆర్ఎస్ మద్దతు ప్రకటించింది.

## వరంగల్ జైత్రయాత్ర : దేవెగౌడ

2008 ఏప్రిల్ 22న టిఆర్ఎస్ 2వ వార్షికోత్సవ సభ "వరంగల్ జైత్రయాత్ర" పేరుతో హన్మకొండ పట్టణంలో జరిగింది. దేశంలో ఇంత పెద్ద సభను మునుపెన్నడూ తాను చూడలేదని మాజీ ప్రధాని దేవెగౌడ అన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా దేవెగౌడతోపాటు అప్పటి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అజిత్ సింగ్ కూడా హాజరైనారు: విదర్భ' ప్రత్యేక రాష్ట్ర ఉధ్యమ నాయకులు బస్వర్ లాల్ పురోహిత్, బుందేల్ ఖండ్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నాయకులు ప్రొ.బాబూలాల్ తివారి ఈ సభకు హాజరైయ్యారు.

## వరంగల్ సభకు సైకిల్ పై కే.సి.ఆర్

ఈ సభ సన్నాహాల్లో భాగంగా చుట్టుపక్కల జిల్లాలనుండి అన్ని రకాల పద్ధతుల్లో వరంగల్కు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలని టీఆర్ఎస్ ప్రజలకు పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా కొన్ని వేల మంది వరంగల్ కు సైకిల్ ర్యాలీగా వచ్చారు. టిఆర్ఎస్ నాయకుల కృషి వల్ల ఈ సభకు సుమారు పదిహేను లక్షల మంది తరలివచ్చారు. రాబోయే ఎన్నికల్లో టిఆర్ఎస్ తెలంగాణలో విజయభేరి మోగిస్తుందని మాజీ ప్రధాని దేవెగౌడ జోస్యం చెప్పారు. సిద్ధిపేట నుండి టిఆర్ఎస్ అధ్యక్షులు కెసిఆర్గారు ఒక రోజు ముందు సైకిల్ తొక్కుతూ కొన్ని వందలమందితో ర్యాలీగా వచ్చారు. ఈ సభలో వచ్చిన అతిథులతోపాటు ప్రొ.జయశంకర్, కేసీఆర్ ప్రసంగించారు.

ఈ సభ వివరాలను సోనియాగాంధీ అడిగి తెలుసుకున్నారు. ఏపీకి చెందిన ఎంపీ వరంగల్ లో జరిగిన సభ గురించి వివరించారు. కొద్ది రోజుల తరువాత సోనియా కర్నాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్.ఎం. కృష్ణ గారిని రహస్యంగా హైదరాబాద్ కు పంపించి ప్రజల్లో టిఆర్ఎస్ ఉన్న ఆదరణ గురించి విచారణ చేశారు. ఆ కారణంగానే 2004లో కాంగ్రెస్, టీఆర్ఎస్ మధ్య పొత్తు కుదిరిందనే ప్రచారం నడిసింది. టీఆర్ఎస్ తో పొత్తు లేకున్నా గెలుస్తామన్న వైఎస్ఆర్ మాటలను ఆమె విశ్వసించలేదు.

## రాజోలిబండ పాదయాత్ర

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా ప్రజా సమస్యలపై టిఆర్ఎస్ దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా చాలాకాలం రాజోలిబండ ప్రాజెక్టు కింద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సంకల్పించారు. కెసిఆర్ 2003 మే 20నుండి 25 తేది వరకు రాజోలిబండ ఆయకట్టు ప్రాంతంలో మహబూబ్ నగర్ జిల్లాలోని ఆలంపూర్ నుండి గద్వాల వరకు పాదయాత్ర చేశారు

దాదాపు నాలుగు దశాబ్దాల నుండి రాజోలిబండ తూములకు నీరు అందనివ్వకుండా రాయలసీమ రైతులు దౌర్జన్యంగా 21 కెనాల్ కు నీటిని తరలించుకుపోతున్నారు. రాజోలిబండ దగ్గర నదికి అడ్డంగా వున్న బ్యారేజీ తూములను బాంబులతో బద్దలుకొట్టి అక్రమంగా ఈ నీటిని తరలిస్తున్నారు

బద్దలు కొట్టబడిన షెట్టర్స్ ను మూసివేయాలని రాజోలిబండ రైతులు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నారు. ఈ సమస్యపై ఇరు ప్రాంతాల రైతులు తుంగభద్ర నదిపై ఘర్షణకు దిగారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతానికి సంబంధించిన టీఆర్ఎస్ శాసనసభ్యుడు డా.రవీంద్రనాథ రెడ్డి 2003 జూలై 18నుండి మూడు రోజుల పాట మహబూబ్ నగర్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరాహారదీక్ష చేశారు.

రాజోలిబండ సమస్యపై 2003 ఆగస్టు 15న కెసిఆర్ తన పార్టీ సహచరులతో కలిసి ఢిల్లీకి వెళ్లి భారత రాష్ట్రపతి అబ్దుల కలాం, అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి, ఇతర ఎంపిలను కలిసి తూములు మూయించాలని విజ్ఞప్తి చేశారు.

## నాగార్జున సాగర్ ఎడమ కాలువపై కెసిఆర్ పాదయాత్ర

2003 ఆగస్టు 25 నుండి 30వ తేది వరకు నాగార్జునసాగర్ ఎడమ కాలువపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నల్గొండ జిల్లాలోని కోదాడ నుండి హాలియాకు కె.సి.ఆర్. పాదయాత్ర చేశారు.

## దేశంలో కొత్త రాష్ట్రాల కోసం జాతీయ ఫ్రంట్

సెప్టెంబర్ 9న కెసిఆర్ ఢిల్లీలో కొత్త రాష్ట్రాల ఏర్పాటుకోసం జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు అజిత్ సింగ్, బన్వర్ లాల్ పురోహిత్, ప్రొ. బాబూలాల్ తివారీ, సినీనటుడు రాజా బుందేల్ మరియు ఇతర రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. సుదీర్ఘకాలం పోరాడిన తరువాత జార?ండ్ రాష్ట్రాన్ని సాధించుకున్న శిబుసోరెన్ ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రాల ఏర్పాటు కోసం ఎన్డీఏపై ఒత్తిడి తేవాలని ఈ సదస్సుల్లో నిర్ణయించారు. ఈ లక్ష్యంకోసం ప్రతినిధులందరూ కలిసి “”నేషనల్ ఫ్రంట్ ఫర్ న్యూ స్టేట్స్” సమాఖ్యను ఏర్పాటు చేశారు. ఈ సమాఖ్య కన్వీనర్ గా టీఆర్ఎస్ అధినేత కెసిఆర్ ను ఎన్నుకున్నారు.

పాలమూరులో పార్టీ బలోపేతానికి దృష్టిపెట్టిన టిఆర్ఎస్ దక్షిణ తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడానికి టిఆర్ఎస్ పాలమూరు, నల్గొండ జిల్లాలపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగానే గతంలో కెసిఆర్ ఈ రెండు జిల్లాల్లో పాదయాత్రను నిర్వహించారు. 2003 ఆగస్టు 24న “కొల్లాపూర్ కోలాహాలం” పేరుతో కొల్లాపూర్ లో బహిరంగ సభను, 2003 సెప్టెంబర్ 15న “నాగర్ కర్నూల్ నగారా” పేరుతో బహిరంగ సభలను నిర్వహించారు.

## అమలుకాని ఎన్టిఆర్ 610 జీవో

1985 డిసెంబర్ 30న ఎన్.టి.రామారావు ప్రభుత్వం జారీ చేసిన జీవో 610 1986 మార్చి 31నాటికే అమలు చేయాల్సివుంది. 2003 వరకు కూడా కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు ఆ జీవోను అమలు చేయలేదు. 59 వేలకు పైగా వున్న స్థానికేతరులను తమ స్వస్థలాలకు పంపి ఆ ఉద్యోగ ఖాళీలలో తెలంగాణ ప్రాంతం వారిని నియమించాలనేది ఆ జిఓ సారాంశం.

ఈ సమస్యపై పలుమార్లు కెసిఆర్ శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీశారు. అయినా ఫలితం లేకపోవడంతో 2003 జూన్ 11న హైదరాబాద్ లోని బాబూజగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద టిఆర్ఎస్ పార్టీ ధర్నా నిర్వహించింది. ఈ సమస్యపై 2003 జూన్ 28న అఖిలపక్ష సమావేశమయ్యారు. అప్పటికే ఈ సమస్య పై కెసిఆర్, టీఆర్ఎస్, టీఎన్జీఒలు చేసిన ఉద్యమం వల్ల 2001 జూన్ 15న చంద్రబాబు ప్రభుత్వం అఖిలపక్ష

సమావేశాన్ని నిర్వహించింది.

2001 జూన్ 25న జిఒ నెంబర్ 270 ద్వారా సీనియర్ ఐఎఎస్ అధికారి అయిన గిర్ గ్లానీ అధ్యక్షతన ఏకసభ్య కమిషన్ పై 610 అమలు గురించి నియమించింది. ఈ కమిషన్ 90రోజులలో ఒక తాత్కాలిక నివేధికను కూడా ప్రభుత్వానికి సమర్పించింది. కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం అమలుపర్చకపోవడమే కాకుండా వివిధ ప్రభుత్వశాఖలు గిర్ గ్లానీ కోరిన సమాచారాన్ని అందించకుండా సహాయ నిరాకరణ చేసినారు.

గిర్ గ్లానీ ప్రాథమిక నివేదికను సమర్పించి తర్వాత దాని అమలుపై తెలుగుదేశం పార్టీ ఎంఎల్ రేపూరి ప్రకాశిరెడ్డి అధ్యక్షతన శాసనసభా సంఘాన్ని కూడా శాసనసభ స్పీకర్ నియమించారు. ఈ హౌస్ కమిటీ మొదటి సమావేశం 2002 ఫిబ్రవరి 28న జరిగింది, ఈ శాసనసభా సంఘానికి కూడా వివిధ ప్రభుత్వ శాఖలు అవసరమైన సమాచారాన్ని అందించలేదు. 2003న రేపూరి ప్రకాశరెడ్డి ఆధ్వర్యంలోని శాసనసభా సంఘం జిఒ 610 పై మధ్యంతర నివేదికను ఇచ్చింది. ఆరు సూత్రాల పథకాన్ని, రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించి తెలంగాణ ప్రాంత ఉద్యోగాల్లో నియమించిన నాన్ ముల్కి ఉద్యోగుల్ని వెనక్కి పంపించాలని హౌస్ కమిటి సిఫారసు చేసింది.

పోలీస్ శాఖలో 1975 తరువాత జరిగిన నియామకాలలో 563 మంది సివిల్ ఎస్ఐ లసు నియమించగా అందులో 273 మంది స్టానికేతరున్నట్లుగా గిరిగ్లాని కమిషన్ ద్వారా నిర్ధారణ అయ్యిందని హౌస్ కమిటి పేర్కొన్నది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో ఆరు జోన్లే ఉన్నాయని గతంలో హైదరాబాద్ ను ఏడవ జోన్గా పరిగణించి ఫ్రీజోన్ పేరుతో స్థానికేతరులను వేల సంఖ్యలో నియమించారు. హైదరాబాద్ ఫ్రీజోన్ కాదని హైకోర్టు నిర్ధారించినందున స్థానికేతరులను వారి ప్రాంతాలకు బదిలీ చేయాలని హౌస్ కమిటీ ముందు కెసిఆర్ వాదించారు. ఈ వాదనలతో హౌస్ కమిటీ సభ్యులు అంగీకరించారు.

## గోదావరి పుష్కరాలు

గోదావరి పుష్కరాలు పన్నెండేండ్లకు ఒకసారి జరిగే పుష్కరాలను ఆంధ్ర పాలకులు రాజమండ్రిలోనే ఘనంగా నిర్వహిస్తుండేవారు. గోదావరి నది పరివాహక ప్రాంతం 79శాతం తెలంగాణలో ఉన్నది. వందలాది కిలో మీటర్లు నిజామాబాద్, ఆదిలాబాద్,

కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో గోదావరి ప్రవహిస్తున్న ఎక్కడ కూడా పుష్కరఘాట్ల నిర్మాణం చేయలేదు. 2003 వరకు ఈ వివక్షను కొనసాగించారు ఆంధ్రపాలకులు. టీఆర్ఎస్ ఆవిర్భావం తరువాత కెసిఆర్ ఈ వివక్షను ప్రశ్నించడంతో మొదటిసారి 2003 జూలై నెలలో ప్రారంభమైన పుష్కరాల సందర్భంగా తెలంగాణ జిల్లాల్లో కూడా పుష్కరఘాట్లను ప్రభుత్వం నిర్మించింది.

## 2004 ఎన్నికల కోసం టిఆర్ఎస్ సన్నాహాలు

తెలంగాణలోని వివిధ వర్గాల ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను, టీఆర్ఎస్ పార్టీకి ఉన్న విజన్ ను వివరించడం. కోసం 2003 అక్టోబర్ నెలలో ఎస్సి, ఎస్టి, బిసి పాలసీని టిఆర్ఎస్ విడుదల చేసింది. 2003 అక్టోబర్ 17న హైదరాబాద్ లోని గ్రీన్ పార్క్ హెటల్ లో కత్తి పద్మారావు, అర్జున్ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య దళిత మేధావులతో ““దళిత్ ఎంపవర్మెంట్” సమావేశాన్ని టిఆర్ఎస్ నిర్వహించింది.

ఈ సమావేశంలోనే ఎస్సీ, ఎస్టీ పాలసీని రూపొందించడం జరిగింది. ప్రముఖ న్యాయవ్యాది జల్లి సిద్ధయ్య ఆధ్వర్యంలో కన్నెబోయిన రాజయ్య యాదవ్, టిఆర్ఎస్ లోని కొందరు బిసి నాయకులతో కెసిఆర్ ఏర్పాటు చేసిన కమిటి టిఆర్ఎస్ బిసి పాలసీని రూపొందించింది. ఎన్నికల సన్నాహ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా టిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడం. కోసం 2003 అక్టోబర్ 22న ప్రముఖ పుణ్యక్షేత్రమైన మేడారంలో పల్లెబాట కార్యక్రమాన్ని కెసిఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం నవంబర్ 2 వ నిర్వహించబడింది. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా టీఆర్ఎస్ 2003 నవంబర్ 19న సంగారెడ్డిలో సింగూరు సింహగర్జన, 21న మహబూబ్ నగర్ లో పాలమూరు సింహగర్జన, డిసెంబర్ 3న నిజామాబాద్లో ఇందూరు సింహగర్జన, డిసెంబర్ 5న జనగాంలో ఓరుగల్లు వీరగర్జన డిసెంబర్ 16న సిరిసిల్లలో కరీంనగర్ కథనభేరి బహిరంగ సభలను టిఆర్ఎస్ నిర్వహించింది.

## 2004 ఎన్నికల్లో వివిధ పార్టీల మధ్య పొత్తులు

2004లో రాష్ట్ర శాసనసభకు, లోక్ సభకు ఎన్నికలు జరిగాయి. 2004 మే 10 తేదీన తెలంగాణలో ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలకు ముందు వరంగల్

లో టి.ఆర్.ఎస్. నిర్వహించిన భారీ బహిరంగ సభకు సుమారు 15 లక్షల మంది హాజరు కావడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న సోనియాగాంధీ ఎలాగైన టి.ఆర్, ఎలో ఎన్నికల పొత్తు పెట్టుకోవాలని భావించింది.

## కేసిఆర్ వద్దకు సోనియా దూత ఆజాద్

తెలంగాణలో టి.ఆర్.ఎస్. పలుకుబడిని, కాంగ్రెస్ కు ఒంటరిగా పోటీ చేస్తే గెలవడానికి ఉన్న అవకాశాలను పరిశీలించడానికి రహస్యంగా పార్టీ సీనియర్ నాయకులను పంపించింది. తెలంగాణ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుల అభిప్రాయలను పరిగణలోకి తీసుకుని టి.ఆర్.ఎస్ తో చర్చలకోసం ఆంధ్రప్రదేశ్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి, కే.సి.ఆర్ కు గతంలో సన్నిహితంగా ఉన్న గులాం నబీ ఆజాద్ ను పంపించింది.

ఆయన కేసీఆర్ ఇంటికి వచ్చి ఎన్నికల్లో పొత్తు గురించి సోనియా అభిప్రాయాలను కేసీఆర్ కు తెలిపారు. కొద్ది రోజులు ఇరువర్గాల మధ్య చర్చలు జరిగిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించే షరతుపై టి.ఆర్.ఎస్ కాంగ్రెస్ తో పొత్తుకు అంగీకరించింది.

ఎన్నికల ప్రణాళికలో అస్పష్టంగానే “తెలంగాణ విషయంలో మొదటి ఎస్.ఆర్.సి. స్టేట్స్ రీ ఆర్గనైజేషన్ కమీషన్ నివేదికలో వెల్లడించిన అభిప్రాయాలను గౌరవిస్తామ”ని కాంగ్రెస్ ప్రకటించింది. దీనిపైన కేసీఆర్ అభ్యంతరం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని స్పష్టంగా ప్రకటించాలని కోరినారు. దీనిపై అప్పటి పీసీసీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్ స్పందించి ఎస్.ఆర్.సి. తెలంగాణ పై వెల్లడించిన అభిప్రాయాలను గౌరవించడం అంటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సుముఖంగా ఉన్నట్లే అర్థం అని అన్నారు.

సీమాంధ్ర ప్రాంతంలో కూడా కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్నందున పరిస్థితిని టి.ఆర్.ఎస్. నాయకులు అర్థం చేసుకోవాలని కేసీఆర్ ను కోరారు. దీనితో ఆ అంశంపై మరింత ఒత్తిడి పెంచకుండా సీట్ల సర్దుబాటుకు టి.ఆర్.ఎస్. సిద్ధపడింది. కాంగ్రెస్ టి.ఆర్.ఎస్ కూటమిలో వామ పక్షాలైన సి.పి.ఐ., సి.పి.ఎం, కూడా ఉండడంతో టి.ఆర్.ఎస్.కు కేవలం 42 శాసన సభా స్థానాల కేటాయించబడ్డాయి.

అసెంబ్లీకి 26, లోక్ సభకు 5గురు టిఆర్ఎస్ నుండి ఎన్నిక వీటిలో కూడా కొన్ని పాతబస్తీ, టి.ఆర్.ఎస్.కు ఏ మాత్రం పట్టులేని స్థానాలు కావడంతో ఎన్నికల్లో ఆ పార్టీ 26 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. తెలంగాణలోని మెజారిటీ శాసనసభ స్థానాలు ఈ కూటమి వశమైనాయి. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ సమైక్య నినాదాన్ని వినిపించడంతో తెలంగాణలో కేవలం 10 స్థానాల్లో మాత్రమే తమ అభ్యర్థుల్లో గెలిపించుకోగలిగింది.

పొత్తులో భాగంగా 6 లోక్ సభ స్థానాలకు టిఆర్ఎస్ పోటీ చేయగా, 5 లోక్సభ స్థానాలను గెలుచుకున్నది. కెసిఆర్ కరింనగర్ నుండి నరేంద్ర మెదక్ నుండి బోయినపల్లి వినోద్‌కుమార్ హన్మకొండ నుండి రవీంద్రనాయక్ వరంగల్ నుండి మధుసూదన్‌రెడ్డి ఆదిలాబాద్ నుండి లోక్ సభకు ఎన్నికైనారు.

6వ స్థానంలో టిఆర్ఎస్ నుండి పోటీ చేసిన కె.ఎస్. రత్నం ఎలక్షన్ కమిషన్ కు  సమర్పించిన నిర్ణీత ఫారాలలో పార్టీ గుర్తు కారును రాయకపోవడంతో వేరే గుర్తుతో పోటీ చేసినందున కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయారు.

సిద్దిపేట నుంచి కూడా శాసనసభ్యునిగా గెలిచిన కేసీఆర్ ఆ స్థానానికి రాజీనామా చేసినారు. కొద్ది నెలల తరువాత సిద్ధిపేట శాసనసభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో టి.హరీశ్రావు గెలుపొందారు. 2004 మే నెలలో ఏర్పడిన యుపిఎ ప్రభుత్వంలో కేసీఆర్, నరేంద్ర కేంద్ర మంత్రులుగా నియమించబడినారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ పదే పదే విజ్ఞప్తి చేయడంతో కే.సి.ఆర్. చేరారు .

రాష్ట్ర మంత్రివర్గంలో టి.ఆర్.ఎస్. ఎం.ఎల్.ఏలను చేర్చుకోవడానికి ఆమోదం తెలిపారు. 2004 జూన్ 23న టిఆర్ఎస్ పార్టీ నుండి ఎన్నికైన శాసనసభ్యుల్లో ఆరుగురిని వైఎస్ఆర్ కేబినెట్లో మంత్రులుగా నియమించబడినారు. వీరు టి.ఆర్.ఎస్. లెజి స్లేచర్ పార్టీ నాయకుడు జి.విజయరామారావు, నాయని నరసింహారెడ్డి, సంతోష్ రెడ్డి, కెప్టెన్ లక్ష్మీ కాంతారావు, డా.చంద్రశేఖర్ టి. హరీష్ రావు యుపిఎలో టిఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర సాధనకు ఈ ఎన్నికలను ఒక సాధనంగా ఉపయోగించుకోవాలనుకున్నారు కెసిఆర్. ఎన్నికల నోటిఫికేషన్ కన్నా ముందే మద్రాసు నగరానికి వెళ్లి అక్కడ పార్టీల పరిస్థితి బలాబలాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి డిఎంకె, అన్నాడిఎంకే పార్టీల నేతలను కలిసారు. రేపు కేంద్రంలో ఏర్పడబోయే

ప్రభుత్వంలో ఏ పార్టీ ఎవరితో జతకడుతుందో వారి గెలుపు అవకాశాలు ఎలా ఉన్నాయో అంచనా వేసినారు.

అదేవిధంగా దేశంలోని వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల, జాతీయ పార్టీల బలాబలాలను అంచనా వేసిన టిఆర్ఎస్ నాయకత్వం రాబోయే ఎన్నికల తరువాత ఏర్పడేది కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వమేనని అంచనాకు వచ్చింది.

తెలంగాణ రాష్ట్రం ఇవ్వాల్సింది. కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వమే కనుక కాంగ్రెస్ తో సయోధ్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్య సాధనకు దోహదపడుతుందని భావించింది.

పక్కా వ్యూహంతో కాంగ్రెస్ తో ఎన్నికల పొత్తుకు సిద్ధపడింది. అప్పటికే కాంగ్రెస్ ప్రముఖనేత గులాంనబీ ఆజాద్ సోనియాగాంధీ దూతగా కెసిఆర్ తో ఎన్నికల పొత్తుల గురించి సంప్రదింపులు జరిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో తెలంగాణ ఏర్పాటుకు స్పష్టమైన హామి ఇచ్చినట్లయితే పొత్తు పెట్టుకుంటామని టిఆర్ఎస్ ప్రకటించింది.

ఆ ప్రకారమే కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో ప్రభుత్వం ఏర్పడితే తెలంగాణ రాష్ట్రం ఇస్తామని ఎన్నికల ప్రణాళికలో స్పష్టం చేసింది. దానితో ఇరు పార్టీల మధ్య ఎన్నికల పొత్తు కుదిరింది. కేంద్రంలో యుపిఎ ప్రభుత్వం ఏర్పడే ముందు తమ ప్రభుత్వంలో చేరాల్సిందిగా సోనియాగాంధీ కెసిఆర్‌ను కోరారు.

దీనితో కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని యుపిఎ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ ద్వారా ప్రకటిస్తే మంత్రివర్గంలో చేరడానికి తమకు అభ్యంతరం లేదని అన్నారు. అందుకు అంగీకరించిన సోనియాగాంధీ యుపిఎ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ లో తెలంగాణ రాష్ట్రం ఇస్తామని ప్రకటించారు.

దీంతో కెసిఆర్, నరేంద్రలు కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కేసీఆర్ కు కేంద్రంలో షిప్పింగ్ మంత్రిత్వశాఖ లభించగా, నరేంద్రకు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పదవి లభించింది. తమిళనాడుకు చెందిన డిఎంకె పార్టీ యుపిఎలో

ముఖ్య భాగస్వామిగా ఉన్నది. ఆ పార్టీ నేత కరుణానిధి తమకు షిప్పింగ్ మంత్రిత్వశాఖ కావాలని సోనియాపై ఒత్తిడి తెస్తున్న విషయాన్ని తెలుసుకున్న కెసిఆర్

ఛార్జి తీసుకున్న రోజే స్వచ్ఛందంగా ఆ పోర్టు పోలియోను సోనియా తనను అడగకుండానే త్యాగం చేశారు. సుమారు ఆరునెలలు ఏ పోర్టుఫోలియా లేని మంత్రిగా కేంద్ర కేబినెట్ లో కొనసాగారు. తనకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి తప్పా మరే అంశంపై ఆసక్తి లేదని కెసిఆర్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఆహ్వానంపై టిఆర్ఎస్ వైఎస్ ఆర్ కేబినెట్లో చేరడానికి అంగీకరించింది. టీఆర్ఎస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు డా.జి.విజయరామారావు, వికారాబాద్ శాసనసభ్యుడు డా. చంద్రశేఖర్, మాజీ ఆర్థికమంత్రి సంతోషరెడి కెప్టెన్ లక్ష్మీకాంతరావు, టి. హరీష్ రావు, నాయిని నర్సింహారెడ్డిలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు టిఆర్ఎస్ అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని మంత్రివర్గాల్లో చేరడాన్ని కొందరు తెలంగాణావాదులు కానీ అనాడు ఉన్న పరిస్థితిని గమనించినపుడు టిఆర్ఎస్ అంతకన్నా మించిన మరో మంచి దారి లేదు.

ఆనాడు ఉన్న పరిస్థితుల్లో దక్షిణ తెలంగాణలో టీఆర్ఎస్ కొంత బలహీనంగా ఉన్నమాట నిజం. ఇతర జిల్లాల్లో కూడా చాలా నియోజకవర్గాల్లో టిఆర్ఎస్ కు ఒంటరిగా పోటీ చేస్తే ఎంఎల్ఎలను గెలిపించుకునేంత బలం లేదు.

మరోపక్క అప్పటికే మూడు సంవత్సరాలనుండి కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ ఫోరం సంస్థను పెట్టుకొని నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అటు కాంగ్రెస్, ఇటు టిఆర్ఎస్ పార్టీలు తెలంగాణ అంటూ ప్రజల్లోకి వెళితే ఓట్లు చీలిపోయి తెలుగుదేశం పార్టీకి లాభం చేకూరుతుందనని సంశయించింది. ఈ కారణంగానే కాంగ్రెస్ తో ఎన్నికల పొత్తుకు టిఆర్ఎస్ అంగీకరించింది.

## పార్లమెంటులో తెలంగాణం

కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం 2004 మే 26న యుపిఎ ప్రభుత్వ కామన్ మినిమమ్ ప్రోగ్రాక్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయాన్ని ప్రస్తావించారు. 2004 జూన్ 7న పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి అప్పటి భారత రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ తమ ప్రసంగంలో "అవసరమగు సంప్రదింపుల

ద్వారా  సరియైన సమయంలో యుపిఎ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అంశాన్ని చేపడుతుందని అన్నారు. ఆ రోజు ఢిల్లీలోని నరేంద్ర నివాసమైన నెంబర్ 6 విండ్సర్ ప్లేస్ లో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి ఆనందోత్సాహాలతో గడిపారు.

ఇక్కడ కన్ సెన్సస్ అంటే ఒక విస్తృత స్థాయిలో కుదిరే అంగీకారం కానీ దీన్ని తప్పుగా వక్రీకరిస్తూ దేశంలోని వందకోట్ల ప్రజల అభిప్రాయం, అన్ని రాజకీయ పార్టీల ఏకాభిప్రాయం కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి వివాదాన్ని లేపి తెలంగాణ ఏర్పాటు ప్రయత్నాలకు అడ్డుతగిలినారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై యుపిఎ ప్రభుత్వం ఆలస్యం చేయడంతో కెసిఆర్, నరేంద్రలు యుపిఎ సమావేశాలలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకి, ప్రధాని మన్మోహన్ సింగ్ కు పదేపదే తమ నిరసనను తెలియజేశారు. చివరకు మార్చి 2005లో యుపిఎ ప్రభుత్వం ప్రణబ్ ముఖర్జీ అధ్యక్షతన ఉపసంఘాన్ని నియమించింది. ఈ కమిటీని నియమిస్తూ విడుదల చేసిన నోటిఫికేషన్లో ఉప సంఘం తన నివేదికను 8 వారాల్లో ఇస్తుందని తెలిపినారు.

## ప్రణబ్ ముఖర్జీ కమిటీ

యుపిఎ ప్రభుత్వం వివిధ పార్టీలతో సంప్రదింపులు జరిపి “విస్తృత స్థాయిలో అంగీకారం” కోసం ప్రయత్నించడానికి సీనియర్ మంత్రి ప్రణబ్ ముఖర్జీ ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీలో డిఎంకె పార్టీకి సంబందించిన మంత్రి దయానిదిమారన్, రాష్ట్రీయ జనతాదల్ కు సంబందించిన మంత్రి రఘువంశప్రసాద్ సింగ్ ప్రణబ్ ముఖర్జీ కమిటీలో సభ్యులుగా నియమించబడినారు.

ఈ కమిటీ తెలంగాణపై తమ అభిప్రాయం తెలుపవలసిందిగా అన్ని రాజకీయ పార్టీలకు ప్రణబ్ ముఖర్జీ కమిటీ లేఖలు రాసింది. తెలంగాణ మార్గదర్శి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆ సమయంలో కేంద్రప్రభుత్వంలోని అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ఏర్పడ్డ ఒక కమిషన్లో సభ్యులుగా ఉన్నారు. కెసిఆర్ కు తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో ఎప్పటికప్పుడు అవసరమైన సలహాలను, సహకారాన్ని అందించవచ్చుననే ఉద్దేశంతో ఆయన ఆ పదవిని అంగీకరించినారు. కెసిఆర్,

నరేంద్రలతోపాటు జయశంకర్ సార్ మిగిలిన ఎంపిలు స్వయంగా పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే అన్ని రాజకీయ పార్టీల నేతలను కలిసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని వివరించారు. వీరి కృషివల్ల మాజీ ప్రధానమంత్రులు దేవె గౌడ్, చంద్రశేఖర్, అటల్ బిహారి వాజ్ పేయి, ఐ.కె.గుజ్రాల్, వి.పి.సింగ్ తో సహ యుపిఏ కూటమిలోని 13 పార్టీలలోని 11 పార్టీలు, యుపిఏ ప్రభుత్వాన్ని బయటనుండి సమర్థిస్తున్న 6 పార్టీలు, ప్రతిపక్షమైన ఎన్డిఏ కూటమిలోని 8 పార్టీలు, పలువురు స్వతంత్రం (ఇండిపెండెంట్లు) సభ్యులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల తమ సమ్మతిని స్పష్టంగా రాతపూర్వకంగా తెలియ పరిచాయి. పాలకపక్షమైన యుపిఏ కూటమిలోని కాంగ్రెస్ పార్టీ "ఈ ప్రక్రియ అంతా తమ ఆధ్వర్యంలోనే జరుగుతున్నందున తమ సమ్మతిని ప్రత్యేకంగా రాసి ఇవ్వవలసిన అవసరం లేదని తెలిపింది. మరో పార్టీ డిఎంకె తమ సమ్మతిని రాత పూర్వకంగా ఇవ్వకపోయినా 2006 ఆగస్టు 24 రోజు జరిగిన యుపిఏ సమావేశంలో తెలంగాణ అంశాన్ని చర్చించినప్పుడు తమ పూర్తి మద్దతును ప్రకటించింది. కనుక యుపిఏ కూటమికి చెందిన మొత్తం 13 పార్టీలలోని 222 మంది ఎంపిల మద్దతు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు లభించింది భావించవచ్చు. అదేవిధంగా యుపిఏకు మద్దతుగా ఉన్న మిత్రపక్షాలకు సంబందించిన 11 పార్టీలలో తెలంగాణకు రాత పూర్వకంగా అంగీకారం తెలిపిన బిఎస్పి, జనతాదళ్ (ఎస్), రాష్ట్రీయ లోక్ దళ్, ఫార్వర్డ్ బ్లాక్, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్, ఈ పార్టీలన్నింటికి కలిపి 31 మంది సభ్యులున్నారు. మిత్రపక్షాలలోని 35 మంది సభ్యులున్న సమాజ్ వాది పార్టీ తెలంగాణపై స్పందించిన దాఖలాలు లేవు. యుపీఏను సమర్థిస్తున్న 59మంది సభ్యులున్న 4 వామపక్ష పార్టీలలో ముగ్గురు సభ్యులున్న ఫార్వర్డ్ బ్లాక్ తమ సమర్థతను

తెలుపగా మరో ముగ్గురు సభ్యులున్న ఆర్ఎస్ పి వ్యతిరేకించింది. 43 మంది సభ్యులున్న సిపిఎం పార్టీ సిద్ధాంతారీత్యా భాషాప్రయుక్త రాష్ట్రాల విభజనకు విరుద్ధమని తెలుపుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తెలంగాణ సమస్యకు ఏకైక పరిష్కారం కాక పోవచ్చునని అభిప్రాయపడింది. అంతేకాని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును వ్యతిరేకిస్తున్నట్టు స్పష్టంగా మార్క్సిస్ట్ పార్టీ చెప్పలేదు. పార్టీలతో కూడిన ప్రతిపక్ష కూటమిలో బిజెపి, శిరోమణి అకాలీదల్, జెడియు, ఇండియన్ ఫెడరల్ డెమక్రటిక్ పార్టీ మిజోరాం నేషనల్ ఫ్రంట్, నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్, భారతీయ నవ శక్తి,

బిజెపి ఏ నిర్ణయం తీసుకుంటే తాము కూడా అదే నిర్ణయాన్ని తీసుకుంటామని 12 మంది సభ్యులును శివసేన, 11 మంది సభ్యులున్న వాగ్దానం చేసినవి. ఇద్దరేసి సభ్యులున్న అస్సాం గణ పరిషత్, నేషనల్ కాన్ఫరెన్స్ తో పాటు ప్రతిపక్షంలో ఉన్న ముగ్గురు స్వతంత్ర సభ్యుల మాటకూడా అదే. ఈవిధంగా 196 మంది సభ్యులున్న ప్రతిపక్ష కూటమిలో కేవలం ఐదుగురు సభ్యులు గల తెలుగుదేశం పార్టీ మాత్రమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించింది. ఈ విధంగా 543 మంది సభ్యులున్న లోక్ సభలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సమర్థించే వారి సంఖ్య 440కి పైనే ఉంటుంది.

వై.ఎస్. తెలంగాణ వ్యతిరేక నిర్ణయాలకు విసిగి ప్రభుత్వం నుండి వైదొలిగిన టిఆర్ఎస్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకునే లక్ష్యంతో టిఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ అధిష్టానానికి మధ్య దూరం పెంచే ప్రయత్నం చేశారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఆరుగురు టిఆర్ఎస్ మంత్రులున్న తరువాత కూడా వారితో మాట మాత్రం చెప్పకుండా, మంత్రివర్గంలో చర్చించకుండా తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు నష్టం కలిగించే అనేక చర్యలకు పూనుకున్నారు.

కృష్ణాజలాలను అత్యంత ఎక్కువ పరిమాణంలో రాయలసీమలోని అక్రమ అనుమతిలేని ప్రాజెక్టులకు తరలించడానికి పోతిరెడ్డిపాడు కాలువను నాలుగురెట్లు పెంచారు. అదేవిదంగా తెలంగాణ ప్రజలు వ్యతిరేకిస్తున్న పోలవరం, పులిచింతల ప్రాజెక్టుల నిర్మాణ పనులను మొదలు పెట్టారు. చర్చల పేరుతో నక్సలైట్లను పిలిచి మొదటి విడత చర్చల తరువాత వారికి హామీ ఇచ్చినవి ఏవీ జరుపకపోగా అర్థాంతరంగా చర్చలను నిలిపివేశారు. మరో ప్రక్కన బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రారంభించి జనశక్తి పార్టీ చర్చల ప్రతినిధి ఆయిన రియాజ్ ను కాల్చిచంపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కుట్రలకు విసుగుచెందిన టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పార్టీకి సంబందించిన మంత్రులతో రాజీనామా చేయించారు. 5గురు టి.ఆర్.ఎస్. మంత్రులు 4-7-2005న రాజీనామా చేశారు. మరో మంత్రి సంతోష్రెడ్డి 13-7-2005న రాజీనామా చేయగా 16-7-2005న సి.ఎం. సలహాపై గవర్నర్ ఈ రాజీనామాలను ఆమోదించారు.

## లక్షలాదిమందితో వరంగల్ లో టిఆర్ఎస్ సభ - హాజరైన శరద్ పవార్

2005 జూలై 17న వరంగల్ లో టిఆర్ఎస్ భారీ బహిరంగ సభను నిర్వహించింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శరద్ పవార్ హాజరైనారు. తెలంగాణ అన్ని జిల్లాల నుండి ఈ సభకు లక్షలాదిగా జనం తరలివచ్చారు. వైఎస్ ప్రభుత్వం నుండి టిఆర్ఎస్ మంత్రులు రాజీనామా చేయడానికి దారితీసిన పరిస్థితులను ప్రజలకు వివరించడానికి, తెలంగాణ యెడ ముఖ్యమంత్రి వైఎస్ అనుసరిస్తున్న వ్యతేరేక ధోరణిని ప్రజలకు తెలుపడానికి ఈ సభను టిఆర్ఎస్ నిర్వహించింది. సభలో ప్రసంగించిన కేంద్రమంత్రి శరద్ పవార్ యుపిఎ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నది తాను యుపిఎ ప్రతినిధిగా ఈ సభలో మాట్లాడుతున్నానని అంటూ తెలంగాణ రాష్ట్రం త్వరలో ఏర్పడుతుందని హామీ ఇచ్చారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తాను హైదరాబాద్ కు వచ్చినానని, ఆనాటి పోరాటం ప్రపంచ చరిత్రలోనే అరుదైన పోరాటాల్లో ఒకటని ఏనాడో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడివుండాల్సిందని ఆయన అన్నారు. సభలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్, కేంద్రమంత్రులు కెసిఆర్, నరేంద్రలు ప్రసంగించారు.

తెలంగాణా ఢిల్లీలో కెసిఆర్, వైఎస్ఆర్ మధ్య ఉన్నతస్థాయి సమావేశం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఆరుగురు టీఆర్ఎస్ మంత్రుల రాజీనామా వలన వైఎస్ఆర్ కు, టిల్ఆర్ఎస్ నాయకత్వానికి నడుమ దూరం పెరుగుతున్న విషయాన్ని గమనించి ఇద్దరి మధ్య సయోధ్యకుర్చుడానికి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ చొరవ తీసుకున్నారు. రాజశేఖర్ రెడ్డిని ఢిల్లీకి పిలిపించి కెసిఆర్ తో సమావేశాన్ని ఏర్పాటు చేసినారు. ఇరువురి మధ్య దూరం పెరగదానికి కారణంగా భావిస్తున్న ఆరు అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ ఆరు అంశాలను టిఆర్ఎస్ ఎజెండాగా నిర్ణయించింది. ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయ ప్రాజెక్టు స్థలాన్ని ఎంపిక చేసే వరకు పులిచింతల పనులను తక్షణమే ఆపాలి. బచావత్ ట్రిబ్యునల్ తీర్పును ఉల్లంఘిస్తూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టుకు అక్రమంగా ఇస్తున్న నీటిని నిలిపివేయాలి.

ఏ అనుమతులు లేకుండా చేపట్టిన పోలవరం ప్రాజెక్టు అక్రమనిర్మాణాన్ని తక్షణమే

నిలిపివేయాలి. ఈ ప్రాజెక్టు వల తెలంగాణలోని విస్తారమైన ప్రాంతం, అటవీ భూములు, గిరిజన ఆవాసాలు ముంపుకు గురవుతాయి.

హైదరాబాద్ నగర త్రాగునీటి అవసరాల కోసం కృష్ణానది నీటిని అందించడానికి ఏర్పాటు చేసి ప్రస్తుతం నగరానికి సరఫరా చేస్తున్న మంజీరా నీటిని సింగూరు ప్రాజెక్టులో ఆదాచేసి మెదక్, నిజామాబాద్ జిల్లాల సాగునీటి అవసరాలకు అందించాలి.

గిరిగ్లానీ కమీషన్ 610 జీ.వో. అమలు కోసం చేసిన సిఫార్సులను తక్షణమే అమలు చేయాలి. ఈ విషయమై నియమించబడ్డ శాసనసభ ఉపసంఘం పోలీసుశాఖలో వందలాది స్థానికేతరుల బదిలీలకై చేసిన సిఫార్సులను వెంటనే అమలు చేయాలి.

గత నాలుగైదు నెలల కాలంగా ప్రభుత్వం నక్సలైట్లను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపుతూ తీవ్రమైన హింసను అమలు చేస్తున్నది. ఈ ఎన్ కౌంటర్ హత్యలను తక్షణమే ఆపుతూ నక్సలైట్లతో శాంతి చర్చలను వెంటనే పునరుద్ధరించాలి.

ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్లో సుమారు 3గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో టీఆర్ఎస్ తరుపున కెసిఆర్ తోపాటు నీటిపారుదల రంగ నిపుణులు ఆర్. విద్యాసాగర్ రావు కూడా పాల్గొన్నారు. ఈ చర్చలు ఫలప్రదం కాలేదు. పులిచింతల, పోలవరం ప్రాజెక్టుల పనులను వైఎస్ఆర్.మరింత వేగంగా కొనసాగించారు. జీ.వో. 610 అమలును ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు మొక్కుబడిగా కొన్ని బదిలీలు జరిగినవి. అవి కూడా తెలంగాణ వారికి నష్టం కలిగించే విధంగా 6వ జోన్ నుండి 5వ జోన్ కు మాత్రమే జరిగినవి. బూటకపు ఎన్కౌంటర్లను విచ్చలవిడిగా కొనసాగించి ప్రభుత్వం, నక్సలైట్లతో శాంతి చర్చలను పునరుద్దరించలేదు. మరోపక్క టిఆర్ఎస్ కు సంబందించిన 10మంది ఎంఎల్ఎలను ప్రలోభపెట్టి వారిని తనవైపు తిప్పుకొని పార్టీని చీల్చడానికి కుట్ర చేశాడు. ముఖ్యమంత్రి వైఎస్. టిఆర్ఎస్ ను చీల్చడానికి ముఖ్యమంత్రి, ఆయన సహచరుడు కె. వి.పి. రామచంద్రరావు కుట్ర చేస్తున్నట్లు టిఆర్ఎస్ ఎంఎల్ఏ కాజీపేట లింగయ్య 2005 అక్టోబర్ 24న మీడియా ముందు వెల్లడించారు. వైఎస్ఆర్ తో చేతులు కలిపి పార్టీకి ద్రోహం చేసినందుకు టిఆర్ఎస్ తిరుగుబాటు ఎంఎల్ఏ లైన తూర్పు జయప్రకాశ్రెడ్డి, దుగ్యాల శ్రీనివాసరావు, బండారు శారారాణిలను

2005 డిసెంబర్ 28న టీఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేసి వారిని తెలంగాణ ద్రోహులుగా ప్రకటించింది. మరో ఆరుగురు శాసనసభ్యులు కూడా వై.ఎస్, కెవిపి రామచంద్రరావు క్యాంపులో చేరిపోయారు వీరంతా కౌన్సిల్ ఎన్నికల్లో బాహాటంగానే వైఎస్ ఆశీస్సులతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిల్చిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి బలపర్చారు. కాసాని జ్ఞానేశ్వర్ కౌన్సిల్ కు ఎన్నికైనారు.

## తెలంగాణ జాగరణ సేన

విద్యార్థి, యువకుల్లో తెలంగాణ ఉద్యమం పట్ల అంకితభావాన్ని, నిబద్ధతను కలిగించే ప్రయత్నాన్ని గతంలో కూడా ఒకసారి టీఆర్ఎస్ చేపట్టింది. 2005 సెప్టెంబర్ 10న హైదరాబాద్ లోని సోమా ఫంక్షన్ హాలులో 3 రోజుల పాటు సుమారు 500 మంది ఎంపిక చేసిన (తెలంగాణ వ్యాప్తంగా) కార్యకర్తలకు తెలంగాణ లోని వివిధ అంశాలపై అవగాహన తరగతులను నిర్వహించి తెలంగాణ సోయి కల్పించటంతో పాటు సుశిక్షితులైన సైనికులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసింది.

తెలంగాణ జాగరణ సేన పేరుతో ఈ కార్యక్రమం వి.ప్రకాశ్ పర్యవేక్షణలో జరిగింది. ఉమాకాంత్ దీనికి చీఫ్ కమాండర్ గా వ్యవహరించారు. హాజరైన కార్యకర్తలకు యూనిఫాం, కర్ర, మెడకు స్కార్ఫ్ తదితర సామాగ్రి ఇచ్చారు. శారీరక శిక్షణలో భాగంగా కవాతు చేయించారు. 3 రోజులు ఎంతో ఆసక్తి కలిగించిన ఈ కార్యక్రమం తదనంతరం కొన్ని కారణాల వల్ల నిలిపివేశారు.

జాగరణ సేన కార్యక్రమాలు తెలంగాణ అంతా విస్తరించి వుంటే 2006లో కేంద్ర ప్రభుత్వ ద్రోహం తరువాత ఉద్యమ గమనం మరో దిశలో ముందుకు సాగి వుండేది. విద్యార్థులను తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేలా నిర్ణయం తీసుకున్న తరువాత టిఆర్ఎస్ తన దృష్టిని యుపిఎ పై తెలంగాణ రాష్ట్రం కోసం ఒత్తిడి పెంచే కార్యక్రమాలవైపు మళ్లించింది.

## జంతర్ మంతర్ వద్ద కేసీఆర్ నిరాహారదీక్ష

పార్లమెంటులో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై దాదాపు అన్ని పార్టీలు తమ

అభిప్రాయాన్ని రాత పూర్వకంగా లేదా మౌళికంగా ప్రణ ముఖర్జీ కమిటీకి, యుపిఏ నాయకత్వానికి స్పష్టంగా తెలిపాయి. 2006 మే నెల నాటికి ఉప సంఘం నివేదికును రూపొందించాల్సి ఉండగా వారాలలో తయారుకావాల్సిన నివేదిక సుమారు 80 వారాలు కావస్తున్నా నివేదిక జాడ లేకపోవడంతో కెసిఆర్ కేంద్ర ప్రభుత్వం నుండి తాము వైదొలగవలసి వస్తుందని కాంగ్రెస్ అధిష్టానానికి 2006 మేలో చెప్పడం జరిగింది. ఈ లోపు ప్రణబ్ కమిటీ నివేదిక కూడా పూర్తవుతుందని మాట ఇచ్చింది. ప్రణబ్ ముఖర్జీ నివేదికను రూపొందిచకపోవడానికి అసలు కారణం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డినని తెలంగాణ నేతలతో సంభాషణల వల్ల వెల్లడైంది. దీనితో 2006 ఆగస్టు 23న యుపిఎ మంత్రివర్గం నుండి టీఆర్ఎస్ మంత్రులు కెసిఆర్, నరేంద్ర రాజీనామా చేశారు.

వీరి రాజీనామాల విషయాన్ని టిఆర్ఎస్ భవిష్యత్ కార్యక్రమాన్ని కే.సి.ఆర్. ఆదేశంతో ఆదే రోజు సాయంత్రం ఢిల్లీలోని తుగ్లక్ రోడ్డులో టీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి, అధికార ప్రతినిధి వి.ప్రకాశ్, జాతీయ, అంతర్జాతీయ మీడియాకు వివరించారు. ఆ తరువాత కే.సి.ఆర్. నరేంద్రలు మీడియాతో మాట్లాడినారు. మరుసటి రోజు కెసిఆర్ డిరీలోన జంతర్ మంతర్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం యుపిఎ పై ఒత్తిడి తేవడానికి నిరవదిక నిరాహారదీక్షను ప్రారంభించారు. లోక్ సభలో నరేంద్రతోపాటు టిఆర్ఎస్ ఎంపిలు సభను నడవనీయకుండా జై తెలంగాణ నినాదాలు చేస్తూ కార్యక్రమాలకు అడ్డుతగిలినారు. ఆ మరునాడు 2006 ఆగస్టు 25న నిరవదిక నిరాహారదీక్షను విరమించాలని లోకసభ కెసిఆర్ కు విజ్ఞప్తి చేసింది. ఆ తరువాత కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శరద్ పవార్ దీక్ష శిబిరం దగ్గరకు వచ్చి రాత్రి 10గంటలకు కెసిఆర్ ను ఒప్పించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తామంతా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చి పండ్లరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

## కరీంనగర్ ఎంపీకి కెసిఆర్ రాజీనామా

కేంద్రమంత్రి పదవులకు రాజీనామా చేసి తెలంగాణ కార్యక్షేత్రానికి తిరిగి వచ్చిన కెసిఆర్ ను "రాజీనామా చేసి మళ్లీ గెలవాలని కాంగ్రెస్ నేతలు ఎం.సత్యనారాయణరావు, కె.కేశవరావు సవాల్ విసరడంతో దాన్ని స్వీకరించి తన

ఎంపి పదవికి 2006 సెప్టెంబర్ 12న రాజీనామా చేశారు. గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రం ఇస్తామని టిఆర్ఎస్ తో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ తమ అవసరం తీరగానే ఏ విధంగా తెలంగాణ ప్రజలను మోసగించిదీ అర్థం చేసుకున్న కరీంనగర్ ఓటర్లకు కసితీర్చుకునే మంచి అవకాశాన్ని కెసిఆర్ ఇచ్చారు

## కరీంనగర్ ఓటర్లకు తెలంగాణపై సోనియా ఇచ్చిన హామీ ....

తెలంగాణ మనోభావాల పట్ల నాకు పూర్తి అవగాహన ఉన్నది. ఇక్కడ ఎంత అభివృద్ధి జరగవలసి వుండెనో అంత జరగలేదని నాకు తెలుసు. ఉపాధి రంగంలో లభించవలసిన అవకాశాలు దక్కకుండా పోయినవి. మీ భావోద్వేగాలను నేను గౌరవిస్తాను. ఒక వేళ ఈ రాష్ట్రంలో మరియు కేంద్రంలో మా ప్రభుత్వాలు ఏర్పడితే, మీ ఆకాంక్షలను సఫలం చేయడానికి అన్ని ప్రయత్నాలు టిఆర్ఎస్ మద్దతుతో మెజారిటీ సీట్లు గెలిచిన కాంగ్రెస్ రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి వచ్చి కేవలం మాటలు చెప్తూ కమిటీ పేరుతో కాలయాపన చేసిందే తప్ప తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయలేదు. పైగా టిఆర్ఎస్ను ఉద్యమాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు వై.ఎస్. పాల్పడుతున్నాడు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు, ప్రజా ప్రతినిధులు అధికారాన్ని అనుభవిస్తూ చేసిన తెలంగాణ విషయాన్ని పక్కన పెట్టి వై.ఎస్.కు "ఊడిగం" చేస్తున్నరు.

తెలంగాణ కోసం రాష్ట్ర కేంద్ర మంత్రి పదవులను గడ్డిపోచల్లా విసిరేసి త్యాగమంటే ఎలా వుంటుందో చాటిన టీఆర్ఎస్ నేతలను సూటిపోటి మాటలతో నిందిస్తూ, సవాళ్లు విసురుతున్న తెలంగాణ కాంగ్రెస్ నేతలపై తెలంగాణ ప్రజలతో పాటు కరీంనగర్ ఓటర్లూ కోపంతో వున్నరు

కెసిఆర్ రాజీనామా మాట విన్న వెంటనే ఎఐసిసి సమావేశాల్లో వున్న ముఖ్యమంత్రి వై.ఎస్. "రాబేయే కరీంనగర్ ఉప ఎన్నిక తెలంగాణకు రెఫరెండం" అని విలేకర్లతో అన్నారు.

వై.ఎస్. మాటలు నేరుగా తెలంగాణ ప్రజల గుండెలను తాకినది. తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి తెలంగాణ వాదులు కళాకారులు, టిఆర్ఎస్ నేతలు కరీంనగర్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు, పట్టణాలకు బాటపట్టారు. విదేశాల్లో వున్న తెలంగాణ వాదులు కూడా కరీంనగర్ ఎన్నికల ప్రచారానికి తమ

ఉద్యోగాలకు, వ్యాపారాలకు సెలవులు పెట్టి ప్రయాణమైనారు పార్టీలకతీతంగా, మతాలకు అతీతంగా, భావజాలాలకు అతీతంగా తెలంగాణ వాదులకు – తెలంగాణ వ్యతిరేకులకు నడుమ పోటీగా ఈ ఎన్నిక జరిగింది. 2006 డిసెంబర్ 4న పోలింగ్ జరిగింది. 7వ తేదీన ఓట్ల ఎక్కింపు, 2,01,582 ఓట్ల ఆధిక్యంతో కెసిఆర్ గెలిచారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మరోమారు ప్రపంచానికి తెలిపారు. వై.ఎస్, ఈ ఎన్నికల్లో కెసిఆర్ ను ఓడించడానికి తన వద్ద ఉన్న అస్త్రశస్త్రాలన్నీ వాడినా నిష్ఫలం కాక తప్పలేదు. కరీంనగర్ ఫలితం వై.ఎస్. చెంప చెళ్లుమనిపించింది తెలంగాణ జిందాబాద్ కెసిఆర్ గెలుపు తెలంగాణ వ్యాప్తంగా టిఆర్ఎస్ కార్యకర్తల్లో, తెలంగాణ వాదుల్లో నూతనోత్తేజాన్ని నింపింది.

## సిద్దిపేట 'సమర శంఖారావం

కెసిఆర్, నరేంద్రలు కేంద్రమంత్రి పదవులకు రాజీనామా చేసి హైదరబాద్ చేరుకున్న తరువాత తామెందుకు రాజీనామా చేయాల్సి వచ్చింది, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో యుపిఎ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ లో చేర్చి కూడా ఎలా వంచించినది తెలంగాణ ప్రజలకు వివరించాలనుకొని 2006 అక్టోబర్ 8న సిద్ధిపేటలో 'సమర శంఖారావం' సభ జరుపాలని నిర్ణయించారు కెసిఆర్, నరేంద్రలు కేంద్రమంత్రి పదవులు వదిలిపెట్టి తెలంగాణ ఉద్యమంపై మళ్లీ దృష్టి పెట్టడంపై ప్రజా సంఘాలు స్వాగతించాయి 2006 అక్టోబర్ 8న సిద్దిపేటలో 'సమర శంఖారావం' సభకు సుమారు 4 లక్షల మంది హాజరైనారు. ఈ సభలో కెసిఆర్ నరేంద్ర, ఆచార్య జయశంకర్లు ప్రసంగించారు. టిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి వి.ప్రకాశ్ ఈ సభలో వ్యాఖ్యాతగా వ్యవహరించారు వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి తెలంగాణకు ఏ విధంగా అడ్డుపడ్డది ప్రజలకు వివరిస్తూ మళ్ళీ ఉద్యమానికి సన్నద్ధం కావాలని కెసిఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు

ఈ సభకు ప్రజలు ఎంతో ఉత్సాహంగా కదలివచ్చారు. జై తెలంగాణ నినాదాలతో సభా ప్రాంగనమంతా మారుమరోగింది రసమయి బాలకిషన్, కళాబృందాల తెలంగాణ పాటలకు, ప్రదర్శనలు ప్రజలను అమితంగా ఆకట్టుకున్నాయి. మోసం చేసిన కాంగ్రెస్ పై కసి తీర్చుకోవాలన్న ఆవేశం ప్రజల్లో కనిపించింది. ఈ సభలో పది జిల్లాల నుండి తెలంగాణ న్యాయవాదులు నల్లకోట్లు వేసుకొని వందల సంఖ్యలో పాల్గొన్నారు

## నల్లగొండ "తెలంగాణ ఆత్మగౌరవసభ"

2006 డిసెంబర్ 22న నల్లగొండ పట్టణంలో టిఆర్ఎస్ "తెలంగాణ ఆత్మగౌరవ సభ" నిర్వహించింది. ఈ సభ యావత్తూ ఎంతో ఉత్తేజపూరిత వాతావరణంలో సాగింది

ప్రొ.జయశంకర్ ప్రసంగంలో మునుపెన్నడూ కానరాని కరుకుదనం, ఆవేశం తెలంగాణవాదుల్లో మరింత నిబద్ధతను పెంచింది. సభకు హాజరైన వారిలో సుమారు 80 శాతానికి పైగా యువకులే. కేసీఆర్ యువకులను ఉద్దేశించి ఆవేశపూరిత ప్రసంగం చేశారు. దేశపతి శ్రీనివాస్ "పాట–మాట"కు యువకులు ఉత్సాహంగా స్పందించారు. కళాకారుల ప్రదర్శనలు, తెలంగాణ పాటలతో ఆత్మగౌరవసభ విజయవంతమైంది. దక్షిణ తెలంగాణ జిల్లాల నుండి ఎక్కువగా జనం ఈ సభకు తరలివచ్చారు. ఈ సభ నిర్వహణలో చకిలం అనిల్ కుమార్, చాడ కిషన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, కళ్ళెం యాదగిరిరెడ్డి, బండ నరేందర్ రెడ్డి, తిప్పన విజయసింహా రెడ్డి చురుకైన పాత్ర నిర్వహించారు

## నిజాం కాలేజిలో తెలంగాణ సంబురాలు

హైదరాబాద్ లోని నిజాం కళాశాల గ్రౌండ్స్ లో 2007 మార్చి 23 నుండి 27వరకు తెలంగాణ సంబురాలను ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలు జంటనగరాల పౌరులను అమితంగా ఆకర్షించినవి. ఐదు రోజుల పాటు సాయంత్రం నాలుగు గంటల నుండి అర్ధరాత్రి దాకా తెలంగాణ కళారూపాల ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు, ఆట–పాటతో కూడిన తెలంగాణ ధూం..ధాం.. కార్యక్రమాలు, జై తెలంగాణ నినాదాల నడుమ విజయవంతంగా నిర్వహించారు. కాలేజీ గ్రౌండ్ కు ఒకవైపు తెలంగాణ మహనీయుల, పోరాటయోధుల, వైతాళికుల తైవవర్ణ చిత్ర పటాలనుంచారు. మరోవైపు తెలంగాణ ఉద్యమ సాహిత్యం, చరిత్ర మొదలైన పుస్తకాలను, ఆడియో, వీడియో సీడీలు, క్యాసెట్లను విక్రయించే దుకాణాలున్నాయి. స్టేజీకి అభిముఖంగా తెలంగాణ సంస్కృతిని, పల్లె జీవితాన్ని ప్రతిబింబించే సజీవ దృశ్యాలు కళాకారులచే సాంస్కృతిక రూపాల ప్రదర్శన, తెలంగాణ

ఎల్లమ్మ సజీవరూపం మొదలైనవి ఏర్పాటు చేశారు. స్టేజీకి వెనక వైపు నోరూరుంచే తెలంగాణ వంటలు, రుచికరమైన తెలంగాణ ఆహార పదార్థాలను అందుబాటులో వుంచారు.

నిజాం కిచెన్, హైదరాబాద్ బిర్యానీ వంటి చారిత్రక నగర వంటకాలతో బాటు తెలంగాణ పల్లెల్లో సామాన్యుల గుడిసె వండుకునే పచ్చిపులుసు, సర్వపిండి, గారెలు, మలాయి ముద్దల దాకా అన్ని రకాల (36) తెలంగాణ వంటలను జూబ్లీహిల్ ది.ఆర్.ఎస్. అధినేత ప్రవీణ్ రావు సారథ్యంలో నగర ప్రజలకు, తెలంగాణ వాదులకు రుచి చూపించారు. జంటనగరాలలో ని తెలంగాణ వారినే కాకుండా వందలాది ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు కూడా ఈ రుచికరమైన తెలంగాణ వంటలను తిన్నారు. తమ కుటుంబ సభ్యుల కోసం 'పార్సిల్స్' తీసుకుపోయేవారు. కొందరైతే ఈ ఐదు రోజులు ఇంట్లో వంటలు మానుకొని కుటుంబ సభ్యులందరినీ వెంటబెట్టుకొని ఇక్కడే డిన్నర్ చేసి కళారూపాలు తిలకించి అర్థరాత్రికి ఇళ్లకు చేరేవారు.

ఈ సంబరాల సందర్భంగా కే.సి.ఆర్, తెలంగాణ కళాకారులైన రసమయ బాలకిషన్ కు, తెలంగాణ సాంస్కృతి విభాగానికి అధ్యక్షురాలిగా పనిచేసిన ప్రజా గాయని కవితకు, తెలంగాణ తల్లి రూపకర్తలైన బి.ఎస్. రాములుకు, ఫైనార్ట్స్ కళాశాల ప్రొ.గంగాధర్ కు స్వర్ణ కంకణాలను తొడిగారు

టిఆర్ఎస్ అధ్యక్షులు కెసిఆర్ కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులంతా ప్రతి రోజూ ఈ సంబురాలకు వచ్చి అందరినీ పలకరిస్తూ ఐదు రోజులూ ఎంతో ఆహ్లాదంగా గడిపారు. ఇసుక ఎడారిలో చందనాల చిరుజల్లులు కురిసినట్లు, మండు వేసవి సంధ్యవేళ మల్లెపూల పరిమళాల శీతల పవనాల్లో మనసులు, శరీరాలు సేదదీరిన అనుభూతి తెలంగాణ ఉద్యమకారులకు సంబురాల ద్వారా కలిగింది.

## నల్లగొండ నగారా

ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో కెసిఆర్ పాదయాత్ర 2007 ఏప్రిల్ 6వ తేది నుండి 12 వరకు వారం రోజులు నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత గ్రామాల్లో కెసిఆర్ పర్యటించారు సమైక్యాంధ్ర పాలకుల ఐదున్నర దశాబ్దాల ముదనష్టపు పాలన

తెలంగాణకు అందించిన దుష్ఫలితాల్లోకెల్లా అత్యంత దారుణమైనది. మరెన్నో దశాబ్దాలు గడిచినా సరిదిద్దుకోలేకపోయాం. డాజ.రాజారెడ్డి (న్యూరోసర్జన్) ఫ్లోరైడ్ సమస్యపై విస్తృతంగా అధ్యయనం చేసి ఎన్నో విలువైన సూచనలిచ్చారు

నాగార్జునసాగర్ నిర్మించి నాలుగు దశాబ్దాలు దాటింది. ఏ ప్రాజెక్టు జలాలు వినియోగంలోనైనా తాగునీటికే మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని జాతీయ, అంతర్జాతీయ జల విధానాలు చెప్తున్నవి. 200 టి.ఎం.సిల నాగార్జునసాగర్లో నిల్వవుండే నీళ్ల నుంచి 600 టి.ఎం.సి.లు పారే నీళ్ల నుంచో ఒకటో రెండో టి.ఎం.సిలను నలభై ఏండ్ల నుంచి నల్లగొండ కిస్తే ఈ గోస మా బిడ్డలకుండేదా

ఫ్లోరైడ్ సమస్యపై టిఆర్ఎస్ ఆవిర్భావం నాటి నుంచే ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ వచ్చింది. ఏ జిల్లాలో, తెలంగాణల ఏ మూలన కెసిఆర్ మాట్లాడినా ఫ్లోరైడ్ బాధితుల ప్రస్తావన లేని ప్రసంగం లేనే లేదు. హైకోర్టు అక్షింతలు, కెసిఆర్ నల్లగొండ నగారా పాదయాత్ర ఫలితంగా చాలినన్ని ఇవ్వకపోయిన మంచినీళ్లు ఫ్లోరైడ్ బాధితుల గ్రామాలకు రెండు మూడేళ్ల నుండి ఇస్తున్నదీ సీమాంధ్ర ప్రభుత్వం.

తాగునీరిచ్చినంత మాత్రన ఈ సమస్య తీరేది కాదు. దశాబ్దాలుగా ఫ్లోరైడ్ నీళ్లను బోర్ల నుండి తోడి ఆ నీళ్లతో భూములను సాగుచేసిన ఫలితంగా మట్టి పెళ్లలు పుట్టెడు ఫ్లోరైడ్ విషం నిండింది. జొన్న గింజలల్ల, బియ్యంల ఏ పంట పండిస్తే ఆ పంటలలో ఫ్లోరైడ్ విషం వుంటది. ఇన్నాళ్లు కడుపులకు నీళ్లతోని పోయింది. ఇప్పుడు తిండితోని పోతున్నది. తాగటానికి గుక్కెడు నీళ్లిస్తే తీరేదా ఈ శోకం

ఊరూరికి పంట కాల్వలతోని నీళ్లను పొలాలల్ల పారిస్తే తప్ప పోయేది కాదీ పాపం. సమైక్య రాష్ట్రంలో ఆంధ్ర పాలకులు సాగునీళ్లిస్తరా? నలభై ఏండ్ల నుండి ఎస్ఎల్బిసి నాన్చుతనే వున్నరు. సొరంగం తవ్వుతనే వున్నరు. తెలంగాణ వస్తే తప్పా సొరంగం పనులు పూర్తికావు.

## సచార్ కమిటీ సిఫార్సుల అమలుకై...

ముస్లిం సోదరుల దయనీయ స్థితిగతులను, దిగజారిన జీవన ప్రమాణాలను, ఛిద్రమైన జీవితాలను ప్రజల ముందు యధాతథంగా వుంచింది. సచార్ కమిటీ

రిపోర్టు, ఆంధ్ర పాలకుల ఏలుబడిలో ఏ ఒక్క సంవత్సరం బడ్జెట్లోనూ 0.1 శాతం నిధులను కూడా మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించలేదు. సచార్ కమిటీ మైనారిటీల అభివృద్ధికోసం, సంక్షేమం కోసం అనేక సిఫార్సులు చేసింది.

వీటిని వెంటనే అమలు చేయాలని 2007 జూలై 15న కెసిఆర్ ఇందిరాపార్కు వద్ద ఒకరోజు నిరాహారదీక్ష చేశారు. శాసనసభలో టిఆర్ఎస్ ఎంఎల్ఎలు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఫలితంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది.

## సింగరేణి బొగ్గుగని కార్మికుల సమస్యలపై

తెలంగాణలో వందేళ్లకు పైగా చరిత్ర కలిగి, ఐదుతరాలుగా వేలాది జనానికి ఉపాధి చూపుతున్న నల్ల బంగారం తెలంగాణ కొంగు బంగారం.. మన సింగరేణి, ఆంధ్రుల స్వార్థబుద్ధికి, దోపిడీ ప్రవృత్తికి, అవినీతికి నిలువెత్తు సాక్ష్యం మన సింగరేణి

ఒకప్పటి సింగరేణి తెలంగాణ పల్లె ప్రజల బతుకుల్లో వెలుగులు నింపింది. ఈనాటి సింగరేణి పల్లెపై దుమ్మును చిమ్మి బతుకులను ఛిద్రం చేస్తున్నది.

## ఓపెన్ కాస్టులపై సమరం

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికై టిఆర్ఎస్ నేతృత్వంలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం 2004లో ఏర్పడింది. గత ఆరేళ్లుగా గని కార్మికుల అపరిష్కృత సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నది. రామకృష్ణాపూర్ ఓపన్ కాస్ట్ కు వ్యతిరేకంగా కార్మిక సంఘం ఆధ్వర్యంలో టిఆర్ఎస్ చేసిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సింగరేణి సూపర్వైజర్ల పోస్టుల్లో 610 జి.ఒ, అమలు చేయాలని ఆందోళన చేసి సాధించుకున్నారు. కెసిఆర్ అనేకసార్లు సింగరేణి గనులున్న ప్రాంతంలో పర్యటించి కార్మికులను చైతన్య పరిచారు. వారిలో తెలంగాణ సోయిని కలిగించారు. తెలంగాణ రాష్ట్రం కోసం అనేకసార్లు గని కార్మికులు బంద్ లలో పాల్గొన్నారు.

## నవ తెలంగాణా ప్రజా పార్టీ :

తెలుగుదేశం పార్టీలో తెలంగాణా ప్రాంత మొదటి శ్రేణి నేతగా కొనసాగుతున్న

మాజీమంత్రి టి.దేవేందర్ గౌడ్ 23-6-2008న టి.డి.పి. అనుసరిస్తున్న తెలంగాణా వ్యతిరేక ధోరణికి నిరసనగా పార్టీకి, ఎం.ఎల్.ఏ. పదవికి రాజీనామా చేశారు. టి.డి.పీ.కి చెందిన మరో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి కూడా పార్టీకి రాజీనామా చేసి గౌడ్ కు జత కలిసినారు. గతంలో గోదావరి జల సాధన కోసం 2006 28 నుండి ఫిబ్రవరి 21 వరకూ గౌడ్ తెలంగాణాలో పాదయాత్ర చేశారు. తెలంగాణాపై నిర్ణయం తీసుకోవడానికి టి.డి.పి. నియమించిన 5గురు సభ్యుల కమిటీలో దేవేందర్ గౌడ్ కూడా ఉన్నారు. ఈ కమిటీ ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన చేసిందే తప్ప తెలంగాణాపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గౌడ్ కు చికాకు కలిగించింది. 2008 జూలై 11న దేవేందర్ గౌడ్ తెలంగాణా సాధన కోసం 'నవ తెలంగాణా ప్రజా పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పాలపిట్ట రంగు జెండా ఆవిష్కరించారు. దానిలోని తెలంగాణపటంలో పుస్తకం, కాగడా, నాగలి, పార గుర్తులు ఉన్నాయి ఆగస్టు 27న గౌడ్ నిజాం కాలేజీలో భారీ బహిరంగ సభను జరిపి పార్టీని అధికారికంగా ప్రకటించారు.

తెలంగాణాలోని 56 శాసనసభా నియోజక వర్గాల్లో దేవేందర్ గాడ్ తెలంగాణ ఆత్మ గౌరవ యాత్ర సనిర్వహించారు,. సెప్టెంబర్ 2 2008 నుండి అక్టోబర్ 2 వరకూ 2,500 కి. మీ. ఈ యాత్ర సాగింది. 2009 ఫిబ్రవరి 26న రాష్ట్ర శాసన సభకు ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా దేవేందర్ గడ్ తన నవ తెలంగాణ ప్రజా పార్టీ ప్రారంభించిన ఏడు నెలల్లోపే సినీ నటుడు చిరంజీవి అధ్యక్షతన 26-8-2008న ప్రారంభమైన ప్రజారాజ్యం పార్టీలో విలీనం చేశారు. సరైన సమయంలో తెలంగాణాకు మద్దతును ఇస్తామనే చిరంజీవి హామీతో గౌడ్ తన పార్టీని ప్రజారాజ్యం పార్టీలో విలీనం చేశారు. ఒంటరిగా ఎన్నికల బరిలో దిగదం ఆత్మహత్యా సదృశ్యంగా ఆయన భావించారు.

## చేతులు కలిపిన చంద్రబాబు - మహాకూటమి ఏర్పాటు

2009లో రాష్ట్ర శాసనసభకు, లోక్ సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించబడినవి. ఈ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి, తెలుగుదేశం, సిపిఐ, సిపిఎం మహాకూటమిగా ఏర్పడి సీట్ల పంపిణీ చేసుకున్నాయి. ఈ ఎన్నికలకు కొంచెం ముందు దేవెందర్ గౌడ్

అధ్యక్షతన నవ తెలంగాణ పార్టీ, సినీనటుడు చిరంజీవి అధ్యక్షతన ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటైంది. ఆ తర్వాత నవ తెలంగాణ ప్రజా పార్టీ ప్రజారాజ్యం పార్టీలో విలీనమైంది. ఈ పార్టీ అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలకు ఒంటరిగానే పోటీ చేసింది.

తెలంగాణలో ప్రజలనాడిని చంద్రబాబు పసిగట్టారు. దేవేందర్ గౌడ్ తెలుగుదేశంలో ఉన్న రోజుల్లోనే తెలంగాణ పై ఒత్తిడి తెచ్చారు. చంద్రబాబును తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని పలుమార్లు సూచించారు. చంద్రబాబు తెలంగాణపై సరైన వైఖరిని వెలడించకపోవడంతో తెలుగుదేశానికి దేవేందర్ గౌడ్ దూరమయ్యారు. “జై తెలంగాణ” అనకుంటే తెలంగాణలో ప్రజల వద్దకు వెళ్లలేమని చంద్రబాబుకు అర్థమైంది.

2004 ఎన్నికల్లో తమ పార్టీని గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుని ప్రజలను నమ్మించి ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన తరువాత దారుణంగా మోసం చేసింది. ప్రజలు కాంగ్రెస్ను క్షమించరు కసి తీర్చుకుంటారు. తెలంగాణ ప్రజల కసి ఎలా ఉంటుందో 2004 ఎన్నికల్లో తెలంగాణలో తన పార్టీకి “సింగిల్ డిజిట్ (9)

ఈసారి అది కాంగ్రెస్ పార్టీ వంతవుతుందనుకున్నాడు. ఎలాగైనా అధికారంలోకి రావాలి కాబట్టి “జై తెలంగాణ” అంటే నష్టమేమిటి తెలంగాణ' నిర్ణయం కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలి. తన చేతుల్లో వుండదు. గతంలో కాంగ్రెస్ 'జై తెలంగాణ' అని టీఆర్ఎస్ తో చేయి కలిపినా ఆంధ్రలో ఆ పార్టీకి ఏ మాత్రం నష్టం జరుగలేదు. సీమాంధ్ర ప్రజలు సీరియస్ గా తీసుకోలేదు.

ఇలా ఆలోచించి తెలంగాణకు సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని ముందే నిర్ణయించుకొని ఆంధ్రలో వున్న ఆ పార్టీ నేతలను దారికి తెచ్చుకోవడానికి “ఐదుగురు సభ్యుల కమిటీ”ని ప్రకటించారు. విచారణ తంతు ముగిసిందనిపించి ప్రజల కోరిక మేరకు తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటించారు చంద్రబాబు, ఎలాగైతేనేం కరడుగట్టిన తెలంగాణ వ్యతిరేకి తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నందుకు టిఆర్ఎస్తో సహ తెలంగాణ వాదులంతా స్వాగతించారు.

చంద్రబాబు తన స్వార్ధ రాజకీయం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారనే సంగతి తెలంగాణ ప్రజలందరికీ తెలుసు.

## టి.ఆర్.ఎస్.లో విలీనమైన తల్లి తెలంగాణ పార్టీ

పార్లమెంటుకు, శాసనసభకు ఒకేసారి ఎన్నికలు. నోటిఫికేషన్ విడుదలైంది. అంతకు ముందే "తల్లి తెలంగాణ పార్టీ"ని విజయశాంతి టిఆర్ఎస్ లో విలీనం చేశారు. ఆమెను కెసిఆర్ మనస్ఫూర్తిగా పార్టీలోకి ఆహ్వానించారు. అంతేగాక తాను పోటీ చేయాలనుకున్న మెదక్ స్థానాన్ని ఆమెకిచ్చి తాను మహబూబ్ నగర్ స్థానంలో పోటీ చేశారు.

## అన్ని పార్టీల మేనిఫెస్టోల్లో తెలంగాణం

2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, తెలుగుదేశం, టి. ఆర్.ఎస్., ప్రజరాజ్యం ప్రధాన రాజకీయ పార్టీలు, ఈ పార్టీలన్నీ తమ ఎన్నికల మేనిఫెస్టోలలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని తమ విధానంగా ప్రకటించాయి.

## మళ్ళీ కాంగ్రెస్ దే అధికారం

2009 ఎన్నికల్లో టి.ఆర్.ఎస్., టి.డి.పి., వామపక్షాలు ఒక్కటై పోటీ చేసినా అధికారాన్ని చేజిక్కించుకున్నది మాత్రం మళ్ళీ కాంగ్రెస్. ముఖ్యమంత్రిగా మరోసారి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసారు. ప్రజారాజ్యం పార్టీ తెలంగాణలో కేవలం రెండు స్థానాల్లోనే గెలిచింది (నిర్మల్, బాల్కొండ) అనేక స్థానాల్లో మహాకూటమి (టీఆర్ఎస్, తెలుగుదేశం, వామపక్షాలు) అభ్యర్థుల గెలుపు అవకాశాలను దెబ్బతీసింది. తెలంగాణ ఓట్లు పలు పార్టీలకు చీలిపోయినది.

ఈ చీలిక వల్ల కాంగ్రెస్ బాగా లాభపడింది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడానికి ప్రజారాజ్యం పార్టీని పరోక్షంగా ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రోత్సహించారని విశ్లేషకుల అభిప్రాయం. టి.డి.పి., టి.ఆర్.ఎస్. మధ్య వివాదాలు తలెత్తడంతో టి.ఆర్.ఎస్.కు కేటాయించిన దాదాపు అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులకు టి.డి.పి. బీఫారాలు ఇచ్చింది. టిఆర్ఎస్ ఓట్లు తెలుగుదేశం అభ్యర్థులకు పడినాయి. కానీ

తెలుగుదేశం ఓట్లు టీఆర్ఎస్ అభ్యర్థులకు పడలేదు. టి.ఆర్.ఎస్ అభ్యర్థులు కేవలం పదిమంది మాత్రమే ఎన్నికైనారు. తెలంగాణలో తెలుగుదేశం 39 స్థానాలు గెలుచుకుంది. అడుగడుగునా మోసం, దగా సీమాంధ్ర నేతల కుట్రలు, కుతంత్రాలకు తెలంగాణ మరోసారి మోసపోయింది.

## తెలంగాణా విమోచన సమితి :

టి.ఆర్.ఎస్. పార్టీకి చెందిన ఎం.ఎల్.సి కపిలవాయి దిలీప్ కుమార్, తెలంగాణా వాదులైన వి. ప్రకాశ్, తేజావత్ బెల్లా నాయక్, బి.ఎస్. రాములు, ప్రజా కవి గూడ అంజయ్య, ప్రజాతంత్ర సంపాదకులు దేవులపల్లి అజయ్, డా.పద్మ శ్రీమతి దుర్గాబాయి తదితరుల ఆధ్వర్యంలో ఉద్యమసంస్థ 'తెలంగాణా విమోచన సమితి' 2009 జూన్ 18న సికింద్రాబాద్ లోని కాళోజీ ప్రాంగణం (హరిహర కళా భవన్)లో ప్రారంభించబడింది. టి.ఆర్.ఎస్. పొలిటికల్ లాబీయింగ్ ఆశించిన ఫలితాలు సాధించనందుకు తెలంగాణ వాదులను, సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఉద్యమాన్ని ముందుకు నడిపించడానికి ఈ వేదికను ఏర్పాటు చేసినట్లుగా దిలీప్ కుమార్ ప్రకటించారు.

తెలంగాణ విమోచన సమితి ఆవిర్భావ సభలో ప్రొ. ఘంటా చక్రపాణి, ప్రొ.హరగోపాల్, ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య, ప్రొ. నాగేశ్వర్, ప్రముఖ తెలంగాణా నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ, భూపతి కృష్ణమూర్తి తదితరులు ప్రసంగించారు. తెలంగాణా విమోచన సమితిని ప్రారంభించడానికి 10 రోజుల ముందు జూన్ 7 నుండి ఎం.ఎల్.సి. దిలీప్ కుమార్ ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో పాదయాత్ర చేసి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకున్నారు. 35 ఉద్యమ సంస్థలతో, నాయకులతో సంప్రదింపులు జరిపారు.

తెలంగాణ విమోచన సమితి ఆధ్వర్యంలో 2009 డిసెంబర్ 25న ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ వివిధ సంఘాలు భాగస్వామ్యంతో, ప్రొ. తిరుమల్ వంటి మేధావులతో ఏర్పాటైంది. ప్రొ. కోదండరాం ఆధ్వర్యంలోని తెలంగాణా జాక్ కు సమాంతరంగా ఈ ప్రజా సంఘాల జాక్ కార్యక్రమాలు నిర్వహించింది. తెలంగాణా విమోచన సమితిని విడిచి వి.ప్రకాశ్, కోదండరాం ఆధ్వర్యంలోని టీ–జాక్ లో

స్టీరింగ్ కమిటీ సభ్యునిగా కొంతకాలం కొనసాగారు. తేజావత్ బెల్లయ్య నాయక్, గూడ అంజయ్య, బి. ఎస్. రాములు, ప్రజాతంత్ర అజయ్ తదితరులు తెలంగాణా విమోచనా సమితిని విడిచి పెట్టడంతో ఆ సంస్థ కార్యక్రమాలు 2010లో నిలిచిపోయినాయి. దిలీప్ కుమార్ ఆ తరువాత అరుణోదయ విమలక్కతో కలిసి తెలంగాణా ఉద్యమంలో పాల్గొన్నారు.

## ఫ్రీ జోన్ కు వ్యతిరేకంగా పోరాటం

రాష్ట్రపతి ఉత్తర్వుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లాలన్నింటిని 6 జోన్లుగా విభజించి హైదరాబాద్ నగరాన్ని 6వ జోన్లో చూపించారు. ఈ ఉత్తర్వుల్లో ఎక్కడ కూడా హైదరాబాద్ నగరం ఫ్రీ జోన్ అనే పదం కానీ, లేదా 7వ జోన్ అనే పదం కానీ లేదు. ఉత్తర్వుల్లో ఈ అంశాలు లేనప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం అధికారిక పరిపాలన విధానాల్లో, ఉత్తర ప్రత్యుత్తరాల్లో హైదరాబాద్ నగరాన్ని ఫ్రీ జోగా, 7వ జోన్ గా పరిగణించి నియామకాలు యథేచ్ఛగా చేశారు.

ఉద్యోగాల నియామకాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తాన్ని ఆరు జోన్లుగా విభజించారు. ఆరు జోన్లకు మినహాయించిన భూ భాగం లేదు. ఈ విషయాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తమ తీర్పులో స్పష్టం చేసింది రాష్ట్రపతి ఉత్తర్వుల నుంచి మినహాయించిన 14వ పేరాలోని రాష్ట్ర స్థాయి కార్యాలయాల సంఖ్యను పెంచి వాటికి స్థానిక రిజర్వేషన్ వర్తించదని వాటిలో ఇష్టానుసారంగా నియామకాలు జరిపారు. 1975లో శాఖాధిపతుల కార్యాలయాలు 51 ఉంటే వాటి సంఖ్యను 204కు పెంచి స్థానికేతరులతో నింపారు. రాష్ట్రపతి ఉత్తర్వులలో పేరా 14లో మినహాయింపు పొందిన ఈ కార్యాలయాలన్నింటిలో తగిన వాటా స్థానికులకు ఇవ్వాలి. ఉద్యోగ నియామకాల్లో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానిక రిజర్వేషన్ పాటించి నియామకాలు జరగాలి. కానీ జిల్లా పోస్టులను జోనల్ పోస్టులుగా మార్చి, జోనల్ పోస్టులను రాష్ట్ర స్థాయి పోస్టులుగా చేసి స్థానిక రిజర్వేషన్ కు భంగం వాటిల్లే విధంగా గత 30 ఏండ్లలో నియామకాలు జరిగాయి. ఈ రకమైన చర్య రాజ్యాంగ వ్యతిరేకం ఐటీడీఏ, రంగారెడ్డి జిల్లా డీఎస్సీ, గవర్నమెంట్ హాస్పిటళ్లలోని నర్సుల నియామకాల్లో, కాలేజి సర్వీస్ కమిషన్ నియామకాల్లో, సింగరేణి కాలరీస్ కు

సంబంధించిన విద్యాసంస్థలు, హైదరాబాద్ అర్బన్ డెవలప్మెంటు అథారిటీ, కులీకుతుబ్ షాహీ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల్లో రాష్ట్రపతి ఉత్తర్వులు పాటించకుండా నియామకాలు చేస్తున్నారు. ఇది తప్పని గిర్ గ్లాని అభిప్రాయపడ్డారు.

కారుణ్య నియామకాల్లో ఆంధ్రప్రాంతంలో ఉద్యోగులెవరైనా మరణిస్తే వారి పిల్లలకు తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగాలు కల్పించారు. ఈ కారణంగా తెలంగాణ స్థానికులకు ఉద్యోగాలు దొరకకుండా పోయాయి.

గిర్ గ్లానీ కమిషన్ నివేదికను పరిశీలిస్తున్నామని, వీలైనంత త్వరలో దాన్ని అమలు చేస్తామని 610 జీవో అమలును జాప్యం చేయాలని ఆంధ్రప్రాంత ఉద్యోగులు, అధికారుల ఒత్తిడి మేరకు ప్రభుత్వం జీవో 72ను జారీ చేసింది. కానీ తెలంగాణ ఉద్యోగుల పోరాటంతో దానిని నిలిపివేసింది.

## ఉత్తమ్ కమిటీ

ప్రభుత్వం 2006 డిసెంబర్ 26న ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో 610 జీఓ అమలు గిర్ గ్లానీ సిఫార్సుల అమలుకై ఒక హౌస్ కమిటీని నియమించారు. కానీ ఈ కమిటీలేవీ తెలంగాణ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయాయి. ఈ కమిటీలో కాంగ్రెస్ నుండి బస్వరాజు సారయ్య, ఎస్. శైలజానాథ్, వి. సునీతా లక్ష్మా రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, దారా సాంబయ్య, గాడె వెంకటరెడ్డిలను టి.డి.పి. నుండి డి దేవేందర్ గౌడ్, వై రామకృష్ణుడు, డి.సి. గోవిందరెడ్డిలను, జూలకంటి రంగారెడ్డి సి.పి.ఐ.ఎం, చాడ వెంకటరెడ్డి సి.పి.ఐ, అక్బరుద్దీన్ ఓవైసీ ఎం.ఐ.ఎం, టి. హరీష్ రావు టి.ఆర్.ఎస్ లుగా నియమించారు. ఈ కమిటీ 610 జీ.ఓ అమలు స్థానికేతరులను వెనక్కి పంపించాలనే ఉద్దేశంతో పనిచేయాలనుకుంటే అప్పటి కాంగ్రెస్ నాయకులు గాదె వెంకటరెడ్డి నేతృత్వంలో రాజశేఖర్ రెడ్డి పరోక్ష సహకారంతో లేని వివాదాలను సృష్టించారు. సమస్యను జటిలం చేసి, సీమాంధ్ర ఉద్యోగుల తెరవెనుక రాజకీయాలతో కమిటీ నడపకుండా గాదె వెంకట్‌రెడ్డి సీమాంధ్ర దుర్బుద్ధిని ప్రదర్శించారు.

7న ఈ హౌజ్ కమిటీకి సీమాంధ్ర ఎం. ఎల్.ఏలు రాజీనామా చేసి 610 జీఓ అమలుపై విఘాతం కల్పించారు. 1975లో రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లోకి వచ్చినప్పటి నుంచి న్యాయస్థానాలను ఉద్యోగులు ఆశ్రయించారు.

ఉద్యోగ నియామకాలు, సీనియారిటీ, పదోన్నతులు–బదిలీల్లో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం విధిగా పాటించాలిన ఆ నిబంధనల గురించి. హైదరాబాద్ ఫ్రీ జోనా? ఏదో జోనా? అనే వివాదం, హైదరాబాద్ సిటీ పోలీస్ రిక్రూట్మెంటుకు సంబంధించిన సమస్యలు, నియామకాలు, సీనియారిటీ, పదోన్నతులు, బదిలీల విషయంలో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జిల్లా స్థాయి ఉద్యోగా జిల్లాను యూనిట్ గా తీసుకోవాలి. నియామకాలు, సీనియారిటీ, పదోన్నతి, వంటివన్నీ ఆ యూనిట్ పరిధిలోనే జరగాలని, జిల్లా ఒక యూనిట్గా ఉన్న ఉద్యోగాలు ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు చేయకూడదు. అదేవిధంగా జోనల్ స్థాయి ఉద్యోగాల్లో జోన్ యూనిట్ గా శ్రీకృష్ణ కమిటీ నియామాకం, సీనియారిటీ, పదోన్నతి, బదిలీలు ఆ జోన్ పరిధిలోనే చేయాలని, ఒక జోన్ నుంచి ఇంకొక జోన్ కు చేయకూడదని న్యాయస్థానాలు అభిప్రాయపడ్డాయి. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ మొదలుకొని సుప్రీం ధర్మాసనం వరకు అన్ని కోర్టులు కూడా హైదరాబాద్ సిటీ ఏడో జోన్, ఫ్రీజోన్ కానీ కాదని, అది ఆరో జోన్ లో భాగమని, ఉద్యోగాల నియామకాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొత్తాన్ని ఆరు జోన్లుగా విభజించారని, ఆరు జోన్లకు మినహాయించిన భూభాగం లేదని స్పష్టం చేశాయి.

## సిద్దిపేటలో తెలంగాణ ఉద్యోగ గర్జన సభ

2009 అక్టోబర్ 9న ఉద్యోగుల నియామకాల విషయంలో హైదరాబాదు ఫ్రీజోన్గా నిర్ధారిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు (సివిల్ అప్పీల్ నెం. 5141/2002) వలన తెలంగాణ ఉద్యోగుల్లో, నిరుద్యోగుల్లో తీవ్రమైన అభద్రతా భావనలు ఏర్పడినవి.

ఈ తీర్పు అమలైతే హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలలోని అన్ని ఉ ద్యోగాలలో ఆంధ్ర ప్రాంతం వారిని నియమించే అవకాశం ఉన్నది. వాస్తవానికి ఆరుసూత్రాల పథకం అమలులో భాగంగా వెలువడిన రాష్ట్రపతి ఉత్తర్వులలో హైదరాబాద్ ను అరవ జోన్లో భాగంగా పేర్కొన్నారు. ఆ ఉత్తర్వుల్లోనే 14వ పేరాలోని క్లాజ్ “ఎఫ్”లో పోలీసుశాఖలో నియామకాలకు సంబంధించి హైదరాబాద్ నగరాన్ని ఫ్రీజోన్గా పరిగణించారు. దీనిపై హైదరాబాద్ ను ఫ్రీజోన్ గా పేర్కొంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేయగా 2009 అక్టోబర్

9న సుప్రీంకోర్టు గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే ఖరారు చేస్తూ ఈ అప్పీలును కొట్టివేసింది. తెలంగాణాలోని ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఈ తీర్పును దృష్టిలో పెట్టుకొని 14 'ఎఫ్' రద్దు చేయాల్సిందిగా ఆందోళన మొదలుపెట్టింది ఉద్యోగుల ఆందోళనను, సుప్రీంకోర్టు తీర్పు వల్ల తెలంగాణ ప్రాంత నిరుద్యోగులకు జరుగబోయే అన్యాయాన్ని అర్థం చేసుకున్న టిఆర్ఎస్ అధ్యక్షులు కెసిఆర్ 14 'ఎఫ్' రద్దు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి సిద్ధిపేటలో ఉద్యోగ గర్జన సభను నిర్వహించారు

ఈ సభకు పెద్ద ఎత్తున ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, టిఆర్ఎస్ కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సభలోనే కెసిఆర్ 14 'ఎఫ్' ను రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని లేకుంటే "కెసిఆర్ సచ్చుడో..తెలంగాణ వచ్చుడో.. జరుగుతుందన్నారు. అవసరమైతే 14 ఎఫ్' రద్దు కోసం తాను ఆమరణ దీక్షకు సిద్ధమేనని కేసీఆర్ ఈ సభలో ప్రకటించారు సిద్దిపేట సభలో 14 'ఎఫ్' ను రద్దు చేయాలని కెసిఆర్ చేసిన ప్రకటనను కేంద్రప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో కెసిఆర్ 2009 నవంబర్ 29న సిద్ధిపేట పక్కనే ఉన్న రంగదామపల్లిలో ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధపడ్డారు. తెలంగాణ అంశం క్లయిమాక్సు చేరుకునే గొప్ప నిర్ణయం.

కెసిఆర్ ఆరోగ్యం గురించి తెలిసిన సన్నిహితులు ఎందరు వారించినా వినకుండా పార్టీ నేతలతో, తెలంగాణ వాదులతో సంప్రదించి కెసిఆర్ తనకు తాను తెలంగాణ కోసం సమిధగా మారడానికి నిర్ణయించుకున్నారు.

## ఉస్మానియా విద్యార్థుల ఆందోళన

2009 నవంబర్ మూడో వారంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని విద్యార్థి సంఘాలన్నీ విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడినవి. టి.ఆర్.ఎస్.వి అధ్యక్షుడు బాల్కసుమన్, పిడమర్తి రవి, కైలాష్ నేత బాలరాజు తదితర విద్యార్థి నాయకుల ఆధ్వర్యంలో 14ఎఫ్ కు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళనలు మొదలైనవి.

## ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ కెసీఆర్ ఆమరణ దీక్ష

కరీంనగర్ నుండి సిద్దిపేటలోని నిరాహార దీక్షాస్థలికి బయలుదేరిన కెసిఆర్ ను

అల్లునూరు దగ్గర పోలీసులు అరెస్ట్ చేసి ఖమ్మంకు తరలించారు. కెసిఆర్ వెంట ఉన్న ప్రొ. జయశంకర్ ను అల్లునూరులో దించివేశారు. కెసిఆర్ వాహనం వెంట డజన్ల కొద్ది పోలీస్ వాహనాలు కాన్వాయ్ గా వెల్లినాయి. ఆ రోజు ఆదివారం కావడంతో సెకండ్ క్లాస్ స్పెషల్ మెజిస్ట్రేట్ చదలవాడ శ్రీరామ మూర్తి ఇంటికి కెసిఆర్ ను, ఇతర నాయకులను హాజరుపరిచారు.

అప్పుడే ఖమ్మం ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 209/09 కింద కేసు నమోదైంది. కెసిఆర్తోపాటు మరో పదిమందిపై సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. అంతకు ముందు రోజు ఖమ్మం అంబేద్కర్ సెంటర్లో స్థానిక టిఆర్ఎస్ నాయకులు తెలంగాణ రాష్ట్రం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

ఆ ప్రదర్శన సందర్భంగా కార్యకర్తలు చేసిన నినాదాలు, వారి వెంట ఉన్న కరపత్రాలు, పోస్టర్లు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయన్నది. పోలీసుల ఫిర్యాదు కొవ్వొత్తుల ప్రదర్శనలో కెసిఆర్ స్వయంగా పాల్గొనకపోయినా కుట్రదారుడిగా ఆయన పేరును చేర్చారు. కెసిఆర్ తోపాటు మాజీ మంత్రులు కెప్టెన్ వడితల లక్ష్మీకాంతారావు, విజయరామరావు, నాయిని నర్సింహరెడ్డి, టిఆర్ఎస్ నాయకులు రాజయ్య యాదవ్, సుబ్బారావు, జూపల్లి రాంజోగారావు, బత్తుల సోమయ్య. గోపగాని శంకర్ రావు, మైనేని రాంబాబు, ఎండి అబ్దుల్ నబీ లను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.

మెజిస్ట్రేట్ శ్రీరామమూర్తి అడిగిన మాటలకు కెసిఆర్ స్పందిస్తూ "నన్ను వరంగల్ సెంట్రల్ జైలుకు గానీ, హైదరాబాద్ చంచల్గూడ జైలుకు గాని పంపండి" అని కోరారు. తెలంగాణ జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులున్నాయి. ఇక్కడి నుంచి తరలించడం సాధ్యం కాదు" అని ఏఎస్పీ పరిమళ మెజిస్ట్రేట్ కు వివరించారు. లోపల విచారణ జరుగుతుండగా బయట వాతావరణం ఉద్రిక్తంగా మారింది. మెజిస్ట్రేట్ ఇంటి సమీపంలో న్యూడెమోక్రసీ కార్యకర్తలు, తెలంగాణ వాదులు జై తెలంగాణ నినాదాలు చేస్తున్నారు.

కెసీఆర్తో పాటు మిగతా 10మందికి 14 రోజుల రిమాండ్ విధించారు.

కెసిఆర్ ను మిగతా పదిమందిని పోలీసులు మళ్లీ బుల్లెట్ ప్రూఫ్ వాహనాల్లో ఎక్కించి దానవాయిగూడెంలోని జిల్లా జైలుకు తరలించారు. కెసిఆర్ సమీప బంధువు, వ్యక్తిగత సహాయకుడు సంతోష్ జైలుదాక వచ్చి ఆయనకు బట్టలు, మందులు ఇచ్చి వెళ్లాడు. కెసిఆర్ ఆమరణ దీక్షలో ఉండడంతో 24 గంటలు ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని అధికారులు నిర్ణయించారు. అందుకోసం అప్పటికే జైలులోనే నిర్మాణం పూర్తయి కూడా ప్రారంభం కాని హాస్పిటల్ బ్లాక్ కు కెసిఆర్ ను తరలించారు. ఆ బ్లాక్ లో ఉన్న రెండు బ్యారక్ లో ఒక దాంట్లో కెసిఆర్ ను, మాజీ మంత్రులను ఉంచారు. ఇంకొక దాంట్లో ఇతర కార్యకర్తలను ఉంచారు.

ఉదయం ప్రారంభించిన దీక్ష రోజంతా కొనసాగింది. తెలంగాణ భగ్గుమన్నది. ఉస్మానియా విద్యార్థులపై లాఠీలు విరిగినవి టిఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్ ను ఆరుగురు పోలీసులు గొడ్డును బాదినట్టు కింద పడేసి 28 దెబ్బలు లాఠీలతో కొట్టినారు. ఈ దృశ్యాన్ని టివి ఛానళ్లన్నీ ప్రత్యక్ష ప్రసారం చేశాయి.

సుమన్ మీద పడిన ఒక్కొక్క లాఠీ దెబ్బను లెక్కబెడుతూ టెలివిజన్ తెరపై ఆ రోజంతా ప్రసారం చేసింది. ఒక పక్కన కెసిఆర్ అరెస్ట్, మరోపక్క సుమన్ తో పాటు లింగస్వామి, మంగేష్ మరికొందరు విద్యార్థులపై పోలీసులు తీవ్రంగా దాడి చేయడం తెలంగాణ ప్రజలను కలిచివేసింది.

ఈ సంఘటనలతో విద్యార్థులు మరింత ఆవేశపరులైనారు. ఉద్యమకారుల కోపాగ్నికి ఆరు ఆర్టీసీ బస్సులు కాలి బూడిదయ్యాయి. బస్సులు ధ్వంసమైనాయి తెలంగాణ వ్యాప్తంగా కెసిఆర్ దీక్షకు సంఘీభావంగా సుమారు 50 చోట్ల నిరాహార దీక్షా శిబిరాలు వెలిశాయి. 13 చోట్ల మహిళలు సెల్ టవర్లు ఎక్కి నిరసన తెలిపారు.

హైదరాబాద్ ఎల్.బి.నగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శ్రీకాంతాచారి అనే విద్యార్థి ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని మంటలతో 'జై తెలంగాణ' అని అరుస్తూ రోడ్డుపైకి రావడం తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలను కంటతడి పెట్టించింది. తీవ్ర ఆవేశాన్ని రగిల్చింది. శ్రీకాంతాచారిని అపోలో డిఆర్డిఒ (కంచన్ బాగ్) ఆసుపత్రికి తరలించారు పోలీసులు కెసిఆర్ తో సహ 2167 మంది తెలంగాణవాదులను అధికారికంగానే అరెస్ట్ చేసిన పోలీసులు రెండవరోజు

1600మందిని అరెస్ట్ చేశారు. అనధికారికంగా తెలంగాణ వ్యాప్తంగా వేలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. టీఆర్ఎస్, తెలంగాణ సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు (సోమవారం) విజయవంతమైంది.

హోటళ్లు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, సినిమాహాళ్లు మూత పడగా ఉ ద్యోగులు పెన్డౌన్ చేశారు. బిజెపి, న్యూడెమాక్రసీ పార్టీ బంద్ కు మద్దతును ప్రకటించాయి. రవాణా వ్యవస్థ స్తంభించింది. విద్యార్థులు రైళ్లను కూడా అడ్డుకున్నారు. కాజీపేట-ఢిల్లీ మార్గంలో రైళ్ల రాకపోకలు సాగలేదు, బీబీనగర్-నడికుడి రైలు మార్గంలో పట్టాల బోల్టులు తొలగించారు.

## విద్యార్థుల ఆత్మహత్యలు

తెలంగాణ కోసం ప్రజలంతా ఒక్కటై ఉద్యమం చేస్తుంటే, ఎవరూ ఊహించని, కోరుకోని మరో పరిణామం అందరినీ బాధ పెట్టింది. అవే ఆత్మహత్యలు. కెసిఆర్ అరెస్ట్, పోలీసుల లాఠీచార్జిలతో కలత చెందిన ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఓ పోలీసు కానిస్టేబుల్ రివాల్వర్ తో కాల్చుకుని చనిపోయాడు. కరీంనగర్ జిల్లా మల్లాపూర్ మండలం వాల్గొండకు చెందిన 22 ఏళ్ల దండిగ పృథ్విరాజ్ ఊరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలం గోపాతండాకు చెందిన 23 ఏళ్ల భూక్యా ప్రవీణ్ కూడా ఉరేసుకుని ప్రాణం తీసుకున్నాడు. ప్రవీణ్ సోమవారం జరిగిన బందులో పాల్గొని ఇంటికొచ్చి ఈ దారుణానికి పాల్పడ్డాడు.

చనిపోయే ముందు తల్లిదండ్రులకు రాసిన లేఖలో కెసిఆర్ అరెస్టును తట్టుకోలేక ఈ పనిచేస్తున్నట్లు ప్రకటించాడు. మెదక్ జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన పద్దెనిమిదేళ్ల శ్రీకాంత్ కూడా ఉరేసుకుని మరణించాడు.

తెలంగాణ ఉద్యమంలో బలిదానాల పర్వం మొదలైంది. విద్యార్థుల ప్రాణత్యాగాలు అవసరం లేకుండా తెలంగాణ రాష్ట్రం సాధించాలని కెసిఆర్ కన్న కలలు భగ్నమై, ఆయనకు తీరని మనోవేదనను కలిగించినవీ ఆత్మార్పణలు, పోలీసుల కస్టడీలో, జైల్లో, ఆసుపత్రిలో అంతటా కెసిఆర్ నిరాహార దీక్షను కొనసాగిస్తూ వచ్చారు.

ఖమ్మం హాస్పిటల్లో పోలీసు అధికారులు, డాక్టర్లు కెసిఆర్ కు టాబ్లెట్ ఇచ్చినారు.

అది గొంతులో అడ్డుపడగా నీళ్లు త్రాగండని చెబుతూ పండ్లరసం గ్లాసును ఆయన చేతికి అందించారు. దాన్ని మఫ్టీలో ఉన్న ఒక పోలీస్ వీడియోలో రికార్డు చేశాడు. అప్పుడే లోపలికి వచ్చిన హరీష్ రావు ఇక్కడేం జరుగుతుందని గద్దిస్తూ వీడియో తీస్తున్న కానిస్టేబుల్ చెంప చెల్లుమనిపించాడు. వీడియోతో చిత్రించిన ఆ క్లిప్పింగ్ ను అప్పటికప్పుడు మీడియాకు విడుదల చేసి "కెసిఆర్ దీక్ష విరమించార"ని ప్రభుత్వం తప్పుదు ప్రచారం చేసింది. ఆ కుట్రను పటాపంచలు చేస్తూ తన దీక్ష కొనసాగుతుందని కెసిఆర్ ప్రకటించారు.

అప్పటికే టివి ఛానళ్లలో కెసిఆర్ జూస్ తాగే వీడియో క్లిప్పింగ్లు చూసి ఉస్మానియా యూనివర్శిటీలోని కొందరు విద్యార్థులు ఆవేశంతో కెసిఆర్ దిష్టిబొమ్మను తగులబెట్టారు. దీన్ని అదనుగా తీసుకొని కొన్ని సీమాంధ్ర టివి ఛానళ్లు గద్దర్ విమర్శను, విద్యార్థుల చర్యలను రెండు రోజులపాటు పదే పదే చూపించారు. ఈ విషయం తెలిసి ఆసుపత్రిలో ఉన్న కెసిఆర్ అదే రాత్రి మీడియా సమావేశాన్ని నిర్వహించి పోలీసులు చేసిన కుట్రను ప్రజలకు వివరించి దీక్ష కొనసాగుతుందని, ఎవరూ ఆవేశాలకు లోనుకావద్దని, ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

ఖమ్మం ఆసుపత్రిలో సదుపాయాల్లేవని ఖమ్మంలో ఉన్న సి క్లాస్ జైల్లో మాజీ కేంద్రమంత్రి, ఎంపి కెసిఆర్‌ను ఉంచడం నిబంధనలకు విరుద్ధమని, పోలీసులు ఆసుపత్రిలో ఉన్న కెసిఆర్ పై దౌర్జన్యం చేస్తున్నారని ఆయన కూతురు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మానవ హక్కుల కమీషన్ ముందు పిటిషన్ దాఖలు చేసింది.

మరొకవైపు ఖమ్మం ఆసుపత్రి నుంచి కెసిఆర్ స్వయంగా తనకు సహాయకునిగా ఉన్న వ్యక్తి సెల్ఫోన్ ద్వారా మానవ హక్కుల కమీషన్ చైర్మన్ సుభాషణ్ రెడ్డి, ముఖ్యమంత్రి రోశయ్య, డిజిపి గిరిష్ కుమార్, ఇంటలిజెన్స్ ఐజి మహేందర్ రెడ్డితో తనను నిబంధనల ప్రకారమే వరంగల్ జైలుకుకానీ, లేదా చంచల్గూడ జైలుకు మార్చాలని, పోలీసులు వదిలేస్తే తప్ప తనంతతానుగా బెయిల్ పిటిషన్ పెట్టుకోనని, నిరాహార దీక్షను విరమించనని తేల్చిచెప్పారు.

కెసిఆర్ కోరిక పై ఖమ్మం జిల్లా టిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు డా.గోపీనాథ్

పర్యవేక్షణలో ఆయనకు అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించారు. 3వ తేది అర్ధరాత్రికల్లా కెసిఆర్ కు ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ వచ్చింది. ఈ విషయాన్ని స్థానిక మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి, హెూం మంత్రి సబితా ఇంద్రారెడ్డికి చెప్పారు.

ఏ క్షణంలోనైనా ప్రమాదం జరిగే అవకాశముంది కాబట్టి నిమ్స్ కు తరలించడం ఉత్తమమని వైద్యులు సూచించినట్లుగా వెంకట్రెడ్డి హోంమంత్రికి చెప్పారు. ఆమె ముఖ్యమంత్రి రోశయ్యతో మాట్లాడి అప్పటికే జారీ అయిన మానవ హక్కుల కమీషన్ ఆదేశాలను అమలు చేయాలని నిర్ణయించారు.

## కెసిఆర్‌ను నిమ్స్‌కు తరలించిన పోలీసులు

పోలీసులు కెసిఆర్ ను అంబులెన్స్ లో ఇద్దరు డాక్టర్లు, మరో ముగ్గురి సిబ్బంది సహాయంతో 3వ తేది తెల్లవారు జామున హైదరాబాద్ నిమ్స్ కు తరలించారు. కెసిఆర్ భార్య శోభ, కొడుకు కెటీఆర్, మేనల్లుడు హరీష్ రావు అంబులెన్స్ ను అనుసరించారు. కెసిఆర్ తరలింపు విషయాన్ని పోలీసులు చాలా రహస్యంగా ఉంచారు. మీడియాకు కూడా చెప్పలేదు. కెసిఆర్ ను అరెస్ట్ చేసి ఖమ్మం తీసుకొచ్చినప్పుడు ఎంత పెద్ద కాన్వాయ్ వాడినారో అదే స్థాయి కాన్వాయ్ ని నిమ్స్ కు తరలించేటప్పుడు వాడినారు. ఖమ్మంలో తెలంగాణవాదం లేదని కెసిఆర్ ను పోలీసులు అక్కడికి తరలిస్తే అది "అబద్ధమని" ఖమ్మం జనం నిరూపించారు.

కెసిఆర్ ను హైదరాబాద్ తరలించే దాకా ఆ తరువాత కూడా ఖమ్మం వీధుల్లోకి వేల సంఖ్యలో ప్రజలు వచ్చి 'జై తెలంగాణ నినాదాలిచ్చారు. రాస్తారోకోలు చేశారు. ఖమ్మం ఉద్యమంలో న్యూడెమాక్రసీ పార్టీ కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిమ్స్ లోని పాత బ్లాకులోకి కెసిఆర్ ను తీసుకెళ్లారు.

నిమ్స్ డైరెక్టర్ ప్రసాదరావు, డా.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సెలైన్ ఎక్కించడానికి ప్రయత్నించగా కెసిఆర్ తిరస్కరించారు. అప్పుడు ఆయన బరువు కేవలం 42 కిలోలు మాత్రమే. వైద్య పరీక్షల తరువాత వీఐపిల తాకిడి ఎక్కువ కావడంతో ఇతర పేషంట్ల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మిలినియం బ్లాక్ లోని 228 గదికి మార్చారు. కెసిఆర్ తోపాటు అరెస్టయిన మాజీ మంత్రులు కెప్టెన్

లక్ష్మీకాంతరావు, నాయిని నర్సింహారెడ్డి, విజయరామరావు, టిఆర్ఎస్ నేత రాజయ్యయాదవ్ ను ఖమ్మం జైలులోనే ఉంచారు. ఆ తరువాత బెయిల్ పై విడుదల అయ్యారు.

## అపోలోలో మరణించిన శ్రీ కాంతాచారి

కెసిఆర్ ను నిమ్స్ లో చేర్చిన రోజు రాత్రి అపోలో డిఆర్డివో కంచన్ బాగ్ హాస్పిటల్లో శ్రీకాంతాచారి మరణించారు. ప్రభుత్వ డి.సి.పి కమలహసన్ రెడ్డి ద్వారా శ్రీకాంతాచారి బంధువులకు శవాన్ని నేరుగా ఊరికి తీసుకెళ్లే షరతు పెట్టి 5లక్షలు అందజేశారు. ఈ విషయాన్ని బంధువుల ద్వారా తెలుసుకున్న టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు వి.ప్రకాశ్ అవసరమైతే టిఆర్ఎస్ ఎంపీల ఒక్క నెల జీతం మీకిస్తరు ఆ డబ్బు వాపస్ చేయమని చెప్పడంతో వారు ఆ డబ్బును కమల్ హసన్ రెడ్డికి తిరిగి ఇచ్చారు. పోలీసులను ధిక్కరించి

తెలంగాణవాదులు శ్రీకాంతాచారి శవాన్ని గన్ పార్కుకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. టీఆర్ఎస్ ఎంఎల్ఏలు హరీష్ రావు, కెటీఆర్, ఇతర తెలంగాణవాదులు కూడా గన్‌పార్క్ వద్ద శ్రీకాంతాచారికి, ఇతర అమరవీరులకు నివాళులు అర్పించారు. తర్వాత శ్రీకాంతాచారి శవాన్ని ఆయన స్వగ్రామానికి తరలించారు. గన్‌పార్క్ దగ్గర నివాళి అర్పించిన తర్వాత విద్యార్థులు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది ఆదిలాబాద్ జిల్లా భైంసాకు చెందిన యాభై ఏళ్ల స్వర్ణకారుడు భాస్కరాచారి గడ్డెన్నవాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.

గోదావరిఖనిలో గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకి ఒకరు ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. మహబూబ్నగర్ జిల్లా మాగనూరులో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యకు ప్రయత్నించారు. వరంగల్ జిల్లా బోల్లోనిపల్లిలో యువకుడు కరెంటు తీగలు పట్టుకుని ఆత్మహత్యాయత్నం చేశారు.

## పంజగుట్టలో విధ్వంసం

ఆ రాత్రి నిమ్స్ లో కెసిఆర్ తో సహ ఏడ్వని తెలంగాణ బిడ్డలేదు. ఉద్యమం మరింత తీవ్రమైంది. కెసిఆర్ ఆరోగ్యం మరింత క్షీణించిందని నిమ్స్ డాక్టర్లు

వెల్లడించడంతో నిమ్స్ నుండి అమీర్ పేట దాకా దుకాణాలపై విధ్వంసం జరిగింది. తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థులు, జనం రోడ్లపైకి వచ్చారు. ఉద్యోగులు పెన్డౌన్ చేశారు. కార్యాలయాల్లో పనులు స్థంభించాయి. ప్రభుత్వం పనిచేయడం ఆగిపోయింది.

## క్షీణిస్తున్న కే.సి.ఆర్. ఆరోగ్యం

రవాణా వ్యవస్థ స్థంభించింది. బంద్లు, రాస్తారోకోలతో తెలంగాణ అట్టుడికింది. విద్యార్థుల బలిదానాలు రోజు రోజుకూ ఎక్కువైతున్నవి. కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ కాంగ్రెస్ ఎంపిల ఒత్తిడి పెరిగింది. ప్రజలు కాంగ్రెస్ నేతలను, ప్రజా ప్రతినిధులను, ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. ఉస్మానియా, కాకతీయ విద్యార్థులు వేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశారు.

పార్టీలకతీతంగా సంస్థలకు, రాజకీయాలకు అతీతంగా విద్యార్థులు, అన్ని రంగాల ప్రజలు, నేతలు స్పందించారు. కెసిఆర్ ప్రాణాలు కాపాడుకోవాలని ఇష్టదైవాలకు మొక్కుకున్నారు. బలిదానాలు ఆగిపోవాలని ప్రార్థించారు. కెసిఆర్ సొంత ఊరు సిద్దిపేట నియోజకవర్గంలోని చింతమడక గ్రామం నుంచి చాలా మంది మహిళలు నిమ్స్ కు వచ్చి కెసిఆర్ ను చూసి కంటతడి పెట్టారు.

"మా ఊరి బిడ్డ ఇంత పెద్ద ఉద్యమం నడుపడం మాకు గర్వంగా ఉన్నది. కాని తెలంగాణ కోసం ప్రాణాల మీదకి తెచ్చుకుంటాండు ఆయన ఇక్కడ ఉపాసం ఉంటే ఊర్లళ్ళా మాకు నిద్రపట్టడం లేదు. తిండి సహించడం లేదు. తొందర్లోనే తెలంగాణ ఇచ్చి మా సార్ ను కాపాడాలి. కెసిఆర్ కు ఏమన్నయితే మేం ఊరుకోం" అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సిద్దిపేట నియోజకవర్గం నుండి, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి రాజకీయాలకతీతంగా వందలాది మంది వార్డు మెంబర్ మొదలుకొని ముఖ్యమంత్రి దాకా కెసిఆర్ను పరామర్శించి వెళ్లారు. నిమ్స్ ఆవరణలో మీడియా పాయింట్ ఏర్పాటు చేసుకొని పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు 24 గం.లు వచ్చి పోయే వారి ప్రతిస్పందనను బయటి ప్రపంచానికి ఎప్పటికప్పుడు తెలియజేశారు.

దీక్షకు మద్దతుగా ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. ఈ విద్యార్థి నాయకులంతా

కెసిఆర్ ను కలిసి తమ సంఘీభావం తెలిపారు. నిమ్స్ లో పరామర్శలు మొదలయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి కెసిఆర్ ను పరామర్శించారు. ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు చిరంజీవి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎర్రబెల్లి దయాకర్ రావు, మోత్కుపల్లి నర్సింహులు, గాలి ముద్దుకృష్ణమనాయుడు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు, ఆ పార్టీ ఎంఎల్ జూలకంటి రంగారెడ్డిలు కెసిఆర్ ను పరామర్శించారు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎండి వేమూరి రాధాకృష్ణ, ఎడిటర్ కె. శ్రీనివాస్ లూ కెసిఆర్ ను కలిసి దీక్ష విరమించాలని కోరారు. కేంద్రం చాలా స్పష్టంగా చెబుతోంది. ముఖ్యమంత్రి రోశయ్య, పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ చేతుల్లోనే పరిష్కారం ఉందని చెబుతున్నారు. వీరిద్దరూ ఢిల్లీ వెళ్లి తెలంగాణ ప్రకటన చేయమంటే కేంద్రం చేస్తుంది" అని కెసిఆర్ వారితో చెప్పారు. రోజురోజుకూ కెసిఆర్ ఆరోగ్యం క్షీణిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉప్పెనలా వ్యాపించింది. తెలంగాణలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తెలంగాణకు వ్యతిరేక పార్టీల నాయకులు బయట తిరిగే పరిస్థితి దాటి పోయింది. దీంతో మేధావులు రంగంలోకి దిగారు.

## మేధావుల పరామర్శ

ఎమ్మెల్సీ చుక్కారామయ్య, సీనియర్ పాత్రికేయులు పొత్తూరు వెంకటేశ్వరరావు, కె.రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ సచివాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి రోశయ్యని కలిశారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ "ప్రధానమంత్రితో, సోనియాతో మాట్లాడతా, ఆ తర్వాత మళ్లీ మీకు కబురు చేస్తా. అప్పుడు ఏమి చేద్దామో నిర్ణయిద్దాం" అని అన్నారు కెసిఆర్ దీక్షకు ప్రజల మద్దతు పెరుగుతోంది.

తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమం ఉప్పెనలా విస్తరించింది. ఉద్యమ వేడికి కాంగ్రెస్ మంత్రులు, నాయకులు సొంత ఊర్లకు కూడా పోలేని పరిస్థితి నెలకొంది. దీంతో కాంగ్రెస్ నాయకులకు భవిష్యత్ కనబడుతోంది తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకటిరెడ్డి, డి. కె.అరుణ, శ్రీధర్ బాబు, సునితా లక్ష్మారెడ్డి పొద్దున్నే పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ తో సమావేశమయ్యారు.

డి.ఎస్ సలహా తీసుకొని సచివాలయానికి వచ్చారు. హోంమంత్రి సబితా

ఇంద్రారెడ్డి చాంబర్లో తెలంగాణకు చెందిన 10మంది మంత్రులు సమావేశమయ్యారు. తర్జన భర్జనల తర్వాత సోనియాగాంధికి నేరుగా లేఖ రాయాలని నిర్ణయించుకున్నారు. మూడు పేజీల లేఖలో తెలంగాణ రాష్ట్రం ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు "2001లో 41 మంది కాంగ్రెస్ ఎంఎల్ఏలు తెలంగాణ ఏర్పాటు కోరుతూ మీకు లేఖ ఇచ్చారు. మీరు ఈ విన్నపాన్ని మన్నించి చిన్న రాష్ట్రాల ఏర్పాటు కోసం వేసిన కమిటీకి అప్పగించారు. తర్వాతే కెసిఆర్ తెలంగాణ కోసం రాజకీయపార్టీ పెట్టారు.

2004లో ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్నాం. తెలంగాణ అంశాన్ని పరిశీలించడానికి ప్రణబ్ ముఖర్జీ నేతృత్వంలో కమిటీ వేశారు. అయినా నిర్ణయం ఆలస్యమైంది. ఇప్పుడు కెసిఆర్ దీక్ష చేస్తున్నారు. దీని వల్ల ప్రజల్లో తెలంగాణ సెంటిమెంట్ ఎన్నడూ లేనంత బలంగా వచ్చింది. విద్యార్థుల్లో భావోద్వేగాలు అధికంగా ఉన్నాయి. దీక్ష ఏడోరోజుకు చేరుకోవడంతో ప్రజల్లో ఓపిక నశిస్తోంది. శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. మీ పట్ల తెలంగాణ ప్రజలకు ఎంతో విశ్వాసం ఉంది. ఇటీవలి లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలో 17 స్థానాలకు 12 స్థానాలు కాంగ్రెస్ గెలిచింది. ప్రజలు మీపై నమ్మకంతో ఓట్లేశారు. వారి నమ్మకం వమ్ముకాకుండా చూడండి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వడానికి

ఇదే మంచి సమయం. దయతో సముచిత నిర్ణయం తీసుకోండి" అని ఈ లేఖలో పేర్కొన్నారు. ఉస్మానియా జెఏసి నాయకులు మోకాళ్లపై నడుచుకుంటూ పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ ఇంటికి వచ్చారు.

తెలంగాణ భవన్ లో టిఆర్ఎస్ పొలిట్ బ్యూరో సమావేశమైంది. నవంబర్ 29 నుంచి జరుగుతున్న పరిణామాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు. సమావేశం అనంతరం ఈటెల రాజేందర్ విలేకరులతో మాట్లాడుతూ "శనివారం అర్ధరాత్రి 12గంటల నుండి 48 గంటల పాటు బంద్ పాటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై నిరసన తెలపాలని ప్రజలను కోరుతున్నాం" అని ప్రకటించారు.

జిల్లాల్లో ఆందోళనలు జరిగినా, ఉస్మానియాలో ఉద్రిక్తతలున్నా ఆరు రోజులపాటు ప్రశాంతంగానే ఉన్న హైదరాబాద్ నగరం మొదటిసారి ఉద్యమ సెగకు అంటుకుంది.

విద్యార్థులు, యువకులు రోడ్లపైకి వచ్చి వీరంగం సృష్టించారు. కెసిఆర్ ప్రాణాపాయంతో ఉన్నాడనే వార్తలతో నిమ్స్ వద్ద ఉన్న ఉద్యమకారులు చేపట్టిన ఆందోళన నగరమంతా పాకింది. నిమ్స్ నుంచి జై తెలంగాణ నినాదాలు చేసుకుంటూ బయటకు వచ్చిన ఉ ద్యమకారులు ఆర్టిసి బస్సులు, ఆంధ్రా హెరిటల్స్, షాపింగ్ మాల్స్ పై పడ్డారు. అమీర్ పేట వరకు విధ్వంసం సృష్టించారు.

ఆ ప్రాంతంలో దాదాపు 70షాపులు ధ్వంసమయ్యాయి. కొందరు గాయపడ్డారు. విద్యార్థులను చెదరగొట్టడానికి పోలీసులు లాఠీచార్జి చేశారు. పెద్ద ఎత్తున పోలీసు బలగాలు అక్కడికి చేరుకుని విద్యార్థులను చెదరగొట్టాయి. నగర పోలీస్ కమిషనర్ ప్రసాదరావు కూడా నిమ్స్ కు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. మెదక్ జిల్లా కొండపాక వద్ద 50 ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేశారు. మెదక్ జిల్లాలో చాలా మంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేశారు, నల్లగొండలో ఎంపి గుత్తా సుఖేందర్ రెడ్డి, కోదాడలో ఎంఎల్ఏ చందర్ రావు ఇద్దర్ని జనం ముట్టడించారు.

ఆలేరు, రాజుపేట, నూతనకల్ మండలాల్లో కనిపించిన ప్రతి బస్సు అద్దాలు పగులగొట్టారు. చాలా మండలాల్లో తెలంగాణ ఇవ్వాలని తీర్మానాలు చేశారు. రాయగిరిలో జరిగిన రాస్తారోకోలో విప్లవ రచయితల సంఘం బాధ్యుడు పెండ్యాల వరవరరావు పాల్గొన్నారు.

నిజామాబాద్ లో మంత్రి సుదర్శన్ రెడ్డి ఇంటి ముందు పసుపు, కుంకుమ, గాజులు పెట్టి ప్రజలు నిరసన తెలిపారు, పీసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ ఇంటి ముందు ఎబివిపి విద్యార్థులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. వరంగల్ జిల్లా జనగామతో మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఇంటిని టిఆర్ఎస్ కార్యకర్తలు చుట్టుముట్టారు.

## కొండా సురేఖ ఇల్లు ముట్టడి

పరకాల ఎంఎల్ఎ కొండా సురేఖ ఇంటిని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు ముట్టడించారు. టి.ఆర్.ఎస్. నేత వాసుదేవరెడ్డి వరంగల్ విద్యార్థుల ఉద్యమానికి నాయకత్వం వహించారు. భూపాలపల్లి ఎంఎల్ఎ, డిసిసి అధ్యక్షుడు గండ్ర వెంకట రమణారెడ్డి ఇంటి ముందు నిరసన ప్రదర్శన జరిపారు.

పాలకుర్తి ఎంఎల్ఏ ఎర్రబెల్లి దయాకర్ రావు ఇంట్లో చొరబడి పూలకుండీలు ధ్వంసం చేశారు. మహబూబ్నగర్ జిల్లా కొల్లాపూర్ లో స్థానికులు మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటిని ముట్టడించారు. ఆదిలాబాద్ జిల్లాలో అన్ని పాఠశాలల్లో పిల్లలు మధ్యాహ్న భోజనాన్ని బహిష్కరించారు. సిర్పూర్ కాగజ్నగర్లో ఎంఎల్ఏ కావేటి సమ్మయ్య కెసిఆర్ ఆరోగ్యం బాగుండాలని అపమృత్యు హెమం నిర్వహించారు. శ్రీరాంపూర్, ఉట్నూర్ లో అయ్యప్ప భక్తులు, నాయీ బ్రాహ్మణులు, స్వర్ణకారులు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో ఎంఎల్ఏ అరవిందరెడ్డి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆసిఫాబాద్ లో ఎంఎల్ఏ ఆత్రం సక్కును విద్యార్థులు అడ్డుకున్నారు. బెల్లంపల్లిలో మహిళలు ప్రదర్శన జరిపారు. కరీంనగర్ జిల్లాలో ఓడెలలో ఎస్ఆర్ఎస్పై కార్యాలయాన్ని కాలబెట్టారు. ఎల్లారెడ్డి పేటలో తహసీల్దార్ కార్యాలయంలో టేబుళ్లు, కుర్చీలను విరగొట్టారు.

## కరీంనగర్‌లో ప్రజా ఉద్యమం

కరీంనగర్ లో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. బతుకమ్మ, బోనాలు ప్రదర్శించారు. ఆర్టీసీ చైర్మన్ ఎం.సత్యనారాయణరావు కరీంనగర్ ఎంఎల్ గంగుల కమలాకర్ ఇళ్లను ఉద్యమకారులు ముట్టడించారు. కమాన్ పూర్ లో ఆటో కార్మికులు ఆటోలలో ర్యాలీ జరిపారు.

వల్మిడిలో 32 ఏళ్ల చెరుకు అంజయ్య ట్రాన్స్ఫార్మర్ ఎక్కి కరెంటు తీగలు పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జహీరాబాద్ లో టిఆర్ఎస్ కార్యకర్త శివకుమార్ ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. దుగ్గొండిలో ముగ్గురు యువకులు సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యకు ప్రయత్నించారు.

## విద్యార్థులచే సిటీ ఎం.ఎల్.ఏల ఇండ్ల ముట్టడి

హైదరాబాద్ లో ఎల్.బి.నగర్ ఎంఎ డి. సుదీర్ రెడ్డి, సనత్ నగర్ ఎంఎల్ మర్రి శశిధర్ రెడ్డ, మల్కాజిగిరి ఎంపఎల్ఏ అకుల రాజేందర్, మేయర్ బండ కార్తీకరెడ్డి ఇండ్లను విద్యార్థులు ముట్టడించారు. జూబ్లిహిల్స్ లో కేంద్రమంత్రి ఎస్.జైపాల్రెడ్డి ఇంటి ముందు తెలంగాణవాదులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పార్లమెంటులో

తెలంగాణవాదం వినిపించాలని డిమాండ్ చేశారు. గన్ పార్క్ దగ్గర తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో జర్నలిస్టులు దీక్ష చేశారు.

## ప్రధానిని కలిసిన ఎం.పిలు

2009 డిసెంబర్ 4న కాంగ్రెస్ ఎంపిలు పొన్నం ప్రభాకర్, మధుయాష్కీ మందా జగన్నాథం, గుత్తా సుఖేందర్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, ఎంఎల్సి పొంగులేటి సుధాకర్ రెడ్డిలు తెలంగాణలో పరిస్థితులను నేరుగా అధిష్టానానికి వివరించేందుకు ఢిల్లీ వెళ్లారు. పార్లమెంటు ఆవరణలోని ప్రధాని మన్మోహన్ సింగ్ ను కలిశారు. ఎంపిలను చూడగానే ప్రధానికి విషయం అర్థమైంది. "కెసిఆర్ గారి ఆరోగ్యం ఎలా ఉంది. ఆయన దీక్ష విరమించాడా?" అని ప్రశ్నించారు. తెలంగాణ విషయంలో మనం స్పష్టమైన ప్రకటన చేస్తే తప్ప కెసిఆర్ దీక్ష విరమించే పరిస్థితి లేదు. ఉద్యమం విద్యార్థుల చేతుల్లోకి పోయింది. గ్రామాల్లో కూడా జనం రోడ్ల మీదకొచ్చి మనల్నే తిడుతున్నరు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నరు.

ఇప్పుడు ఏదో ఒకటి చేయకుంటే కష్టం" అని ప్రధానికి చెప్పారు. ఈ విషయం సోనియాకు చెప్పారా?" అని ఎంపిలను అడిగారు. "ఆమె మాకు సమయం ఇవ్వలేదు. సోమవారం కలుద్దామన్నారు మీరే చొరవ తీసుకోవాలి. ఉద్యమం 55 ఏళ్లుగా నడుస్తోంది. మనం కూడా ఎన్నికల ముందు హామీ ఇచ్చాం. దాన్ని నిలబెట్టుకోవాలి లేకుంటే తెలంగాణలో మనుగడ కష్టం" అని ఎంపిలు ప్రాదేయపడ్డారు.

## కాంగ్రెస్ నేతలను ఒప్పించడానికి కె.కె. పాట్లు

మరోపక్క రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు ఢిల్లీలో తనకున్న పరిచయాలను మేరకు తిప్పలు పడుతూనే ఉన్నారు. కలకత్తా ఉన్న ప్రణబ్ ముఖర్జీతో మాట్లాడడానికి కేశవరావు అక్కడికి ప్రయాణమయ్యారు. "తెలంగాణ సమాజాన్ని ఒక్కతాటిపైకి తేవడంలో కెసిఆర్ దీక్ష ఉపయోగపడింది. కెసిఆర్ లక్ష్యం నెరవేరినట్లే" అని కేశవరావు ఢిల్లీ మీడియాతో అన్నారు.

## అధ్వానితో టి.ఆర్.ఎస్. నేతల చర్చలు

ఢిల్లీలోనే మకాం వేసిన టీఆర్ఎస్ బృందం ఉదయాన్నే పార్లమెంటు ఉదయాన్నే

పార్లమెంటు ఆవరణలో బిజెపి అగ్రనేత ఎల్.కె. అద్వానిని కలుసుకున్నారు. మాజీ ఎంపిలు వినోద్ కుమార్, చందూలాల్, ఎంఎల్ ఏనుగు రవీందర్ రెడ్డి, నీటి పారుదల రంగం నిపుణుడు విద్యాసాగర్ రావు తదితరులు అద్వానితో తెలంగాణ ఉద్యమం, కెసిఆర్ దీక్ష, కాంగ్రెస్ హామీలు అన్ని అరగంటపాటు వివరించారు. ఓ నోట్ కూడా ఆయనకిచ్చారు.

కాంగ్రెస్ తెలంగాణ విషయంలో మోసం చేసింది. హామీ ఇచ్చి నిలబెట్టుకోవడం లేదు. ప్రధాన ప్రతిపక్షంగా మీరు పార్లమెంటులో మాకు మద్దతివ్వండి. కాంగ్రెస్ ను అడగండి" అని టిఆర్ఎస్ మాజీ ఎంపి వినోద్ విజ్ఞప్తి చేశారు. ఆ తరువాత ప్రతిపక్ష నాయకురాలు సుష్మాస్వరాజ్ ను కలిసారు. బిజెపి సీనియర్ నేతలు అరుణ్ జైట్లీ, ప్రకాశ్ జవదేకర్లతోనూ సమావేశమై తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ సమైక్యంగానే ఉండాలని మొదటి నుంచి కోరుతున్న సిపిఎం కూడా మొదటిసారి కెసిఆర్ దీక్షపై స్పందించింది. ఆ పార్టీ జాతీయ నాయకుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి పార్లమెంటు భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఓ నిర్ణయం చెప్పాలి. ప్రత్యేక రాష్ట్రం ఇస్తారో, ఇవ్వరో తేల్చాలి. కేంద్రంలో, ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఆ పార్టీయే విషయాన్ని తేల్చాలి" అని డిమాండ్ చేశారు.

## సి.ఎం. ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం

2009 డిసెంబర్ 7న కేంద్రం స్పందించింది. తెలంగాణ పై కెసిఆర్ దీక్షపై అఖిలపక్ష నేతల అభిప్రాయాలు తెలుసుకోవ ముఖ్యమంత్రి రోశయ్యను ఆదేశించింది. శాసనసభలోని ఎనిమిది పార్టీలను రోశయ్య ఆహ్వానించారు. ఈ సభ్యుడున్నా సిపిఎం తప్ప ఇతర పార్టీలన్నీ తెలంగాణ బిల్లు పెడితే మద్దతిస్తామని చెప్పాయి.

## జయశంకర్ చిదంబరం చర్చలు

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయానికి బద్దులమై వుంటమన్నారు. హెరీంమంత్రి చిదంబరం నేరుగా ప్రొ.జయశంకర్తో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు తప్ప మరేదీ తమకు కెసిఆర్ కు ఆమోదయోగ్యం కాదని ప్రొ.జయశంకర్ తేల్చిచెప్పారు. ఆ

సమయంలో ప్రొ.జయశంకర్ కెసిఆర్ పక్కనే నిమ్స్ ఆసుపత్రిలో ఉన్నారు. డిసెంబర్ 9న సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనవలసిన సోనియా తన నివాసంలో, ప్రధాని నివాసంలో అనేక పర్యాయాలు సీనియర్ నేతలతో, ప్రధానితో సమావేశమయ్యారు. మంత్రివర్గ సమావేశం జరిగింది.

## చిదంబరం ప్రకటనలు

డిసెంబర్ 9 కాంగ్రెస్ అధ్యక్షురాలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల అత్యంత ఆసక్తిని పట్టుదలను కనబరిచారు. డిసెంబర్ 9, 2009న ఆమె తన జన్మదినం సందర్భంగా, కే.సి.ఆర్.కు గతంలో ఇచ్చిన మాట ప్రకారం"తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రక్రియను ప్రారంభిస్తున్నామ"ని హెూం మంత్రి చిదంబరం ద్వారా ప్రకటన చేయించారు. దీనితో కే.సి.ఆర్. నిమ్స్ హాస్పిటల్ 12 రోజులుగా చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను విరమించారు.

చిదంబరం ప్రకటనను రూపొందించే ముందు తెలంగాణ మార్గదర్శి జయశంకర్తో పలుమార్లు ఫోనులో చర్చించి ఆ ప్రకటన పాఠాన్ని రూపొందించారు. చిదంబరం ప్రకటన వెలువడగానే తెలంగాణ అంతట ఆ రాత్రి దీపావళి పండగను తలపించే విధంగా బాణాసంచా కాల్చారు.

ఈ సంతోషం ఎక్కువ కాలం నిలువలేదు. మరునాడే ఆంధ్రప్రాంత ప్రజా ప్రతినిధులంతా మూకుమ్మడిగా తమ పదవులకు రాజీనామాలు చేయడంతో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ఉనికికే ముప్పు ఏర్పడింది. ఆంధ్రలో కృత్రిమ సమైక్య ఉద్యమాన్ని టి.డి.పి, కాంగ్రెస్ పార్టీల నేతలు డబ్బులు గుమ్మరించి సృష్టించారు.

## డిసెంబర్ 23

దీనితో 23-12-2009 రాత్రి చిదంబరం మరో ప్రకటన చేస్తూ "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన తర్వాత మారిన పరిస్థితులపై సంప్రదింపులను జరపాల్సిన అవసరం ఉంద"ని అన్నారు. దీనితో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ అటకెక్కింది.

## రాజకీయ ఐకాస ఆవిర్భావం

2009 డిసెంబర్ 23 రాత్రి హోంశాఖ మంత్రి చిదంబరం గతంలో చేసిన తెలంగాణ ఏర్పాటు ప్రకటనను పక్కనపెట్టేశారు. మళ్ళీ ఆంధ్రప్రదేశ్ లోని వివిధ రాజకీయ పార్టీలతో, గ్రూపులతో తెలంగాణ కోసం సంప్రదింపులు జరుపుతామని ప్రకటించడంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై యుపిఏ ప్రభుత్వం వెనక్కి మళ్ళుతున్నదని స్పష్టమైంది. తెలంగాణ ఒక్కసారిగా భగ్గుమన్నది. టిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రొ.జయశంకర్ ను వెంటబెట్టుకొని అర్ధరాత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జానారెడ్డి ఇంటికి వెళ్ళి తెలంగాణపై మారిన యుపిఏ వైఖరి గురించి చర్చించారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అన్ని పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమించాలని నిర్ణయించారు. దీనికి సారధ్య బాధ్యతలను స్వీకరించాలని ప్రొ.జయశంకర్ ను అభ్యర్థించగా ఆయన తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు ప్రొ.కోదండరామకు అప్పగించాలని సూచించారు. అప్పటికప్పుడే ప్రొ.కోదండరామ్ తో సంప్రదించారు.

నవంబర్ 29న దీక్షను భగ్నం చేసి కెసిఆర్ ను అరెస్టు చేయగానే మొట్టమొదటిసారిగా ఎల్బీనగర్ చౌరస్తా, హైదరాబాద్ లో నల్గొండ జిల్లా మోత్కూర్ కు చెందిన కాసోజు శ్రీకాంతా చారి తన ఒంటిపై కిరోసిన్ పోసుకుని కాలిన గాయాలతో డిఆర్డిఓ అపోలో హాస్పటల్ లో చేరగా, 30 నవంబర్ 2009న మెదక్ జిల్లాకు చెందిన శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. నల్గొండ జిల్లాక చెందిన శ్రీకాంతాచారి డిసెంబర్ 3, 2009న మరణించాడు.

తొలి ఆత్మహత్యా ప్రయత్నం చేసిన శ్రీకాంతాచారి మరణించడానికి ముందే తెలంగాణలో ఇతర జిల్లాలకు చెందిన 9 మంది ఆత్మహత్యలు చేసుకుని మరణించారు.

## సమైక్యవాదం - సీమాంధ్ర నేతల సాయం

తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వ ప్రకటన, కాంగ్రెస్ పార్టీ నిర్ణయం అనంతరం సీమాంధ్రలో సమైక్య ఉద్యమం ఉవ్వెత్తున్న ఎగిసిబడింది. దీనికి అప్పటి సీఎం కిరణ్ కుమార్ మరియు టీడీపీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, సీమాంధ్ర పెట్టుబడిదారులు సహకరించారని విమర్శలు ఉన్నాయి. వీరంతా ఆంధ్రాలో తమకు తాము సమైఖ్యవాదులమని, రాష్ట్ర విభజనకు వ్యతిరేకులమని ప్రజల మద్ధతు కూడగట్టుకునేందుకు పోటీ పడ్డారు. ప్రజల్లో భావావేశాలు రెచ్చగొట్టారు. ఆంధ్రాలోని అనంతపురం, విశాఖ, గుంటూరు లాంటి ప్రాంతాల్లో సమైక్య ఉద్యమం పేరిట ఆందోళనలు జరిగినా, ఆ తర్వాత అవన్నీ రాజకీయ ప్రేరేపిత ఉద్యమాలుగా మిగిలిపోయాయి. తెలంగాణ ఉద్యమంలా అక్కడ సమైక్య ఉద్యమం తీసుకురావాలని ప్రయత్నించినా, ప్రజల నుంచి పెద్దగా సహకారం రాలేదు. కానీ ప్రత్యేక తెలంగాణ ఇవ్వడంపై ఆక్రోషం మాత్రం వెలిబుచ్చారు. కొన్ని చోట్ల సోనియా , తెలంగాణ ఉ ద్యమకారుల దిష్టిబొమ్మ లను దహనం చేశారు. ఇందులో ఏపీఎన్జీవోల సంఘం నేతలను రాజకీయ పార్టీలు వాడుకున్నాయి. ఎల్బీ స్టేడియంలో సేవ్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో ఏపీ ఉద్యోగుల ఆధ్వర్యంలో సభను ఏర్పాటు చేస్తే కిరణ్ కుమార్ ప్రభుత్వం పూర్తిగా సహకరించింది. ఏపీఎన్జీవో సంఘం నాయకుడు అశోక్ బాబు పేరును తెలంగాణ వ్యతిరేక ఉద్యమానికి వాడుకున్నారు. ఢిల్లీలో ఆయన ఆధ్వర్యంలో రకరకాల దీక్షలు, ఆందోళనలు జరిగాయి. స్వయంగా అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి కూడా జంతర్ మంతర్ లో జరిగిన ఉద్యోగుల దీక్షలో పాల్గొని నిరసన తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ నేత జగన్ కూడా తానేమి తక్కువ కాదన్నంటూ హైదరాబాద్ లో సమైక్య వాదాన్ని వినిపించారు. తమ పార్టీకి చెందిన తెలంగాణ నేతలు గట్టు రాంచంద్రరావు తదితరులతో సమైక్య వాణిని అందుకున్నారు. విజయవాడ ఎంపీ లగడపాటీ రాజగోపాల్ రకరకాల కుప్పిగుంతలేస్తూ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించారు. రాష్ట్ర విభజనతో రాజకీయ సన్యాసం తీసుకుంటానంటూ శపథం చేశారు. బిల్లు సమయంలో పార్లమెంట్ లో తెలంగాణ వాదులు, ఎంపీలపై పేపర్ స్ప్రే ప్రయోగించి పార్లమెంట్ వేదికగా దిగజారిపోయారు. తెలంగాణపై ఏదో ఒక నిర్ణయం తీసుకోమని, కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చిన సీమాంధ్ర నాయకులందరూ, తెలంగాణను ఏర్పాటుకు అంగీకరించిన తర్వాత వ్యతిరేకించారు.

## తెరమీదకు రాయల తెలంగాణ

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర తుది నిర్ణయానికి రాగానే, సీమాంధ్ర నేతల కుయుక్త రాజకీయాలు తెరమీదకు తీసుకువచ్చారు. ముఖ్యంగా రాయలసీమ, కోస్తాంధ్ర నేతలు బాహాటంగానే వ్యతిరేకించారు. ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి అధిష్టానాన్ని ధిక్కరిస్తూ పార్టీని వీడారు. అయితే కొందరు రాయలసీమ నాయకులు రాయల తెలంగాణ ప్రతిపాదనలు చేశారు. దానికి కాంగ్రెస్ సీనియర్ నేత జేసీ దివాకర్ రెడ్డి, టీడీపీ నేత పయ్యావుల కేశవ్ వంటి నేతలు సానుకూలత వ్యక్తం చేశారు. టీజీ వెంకటేష్, ప్రతాప రెడ్డి సీమ నాయకులు మంత్రి జానారెడ్డితో సంప్రదింపులతో హడావుడి చేశారు. కేంద్రం కూడ ఈ ప్రతిపాదనపై సీరియస్ గానే చర్చించింది. ఒకానొక సమయంలో కేసీఆర్ కూడా దీనికి సానుకూలంగా ఉన్నారనే ఊహాగానాలు వచ్చాయి. కానీ జేఏసీ నేతలు మాత్రం సంపూర్ణ తెలంగాణకే కట్టుబడి ఉన్నామని తేల్చిచెప్పారు. మరోవైపు కోస్తాంధ్ర, కడప, చిత్తూరు జిల్లాలను కలిపితే చెరిసగం 147 నియోజకవర్గాలు వస్తాయని, రెండు రాష్ట్రాలు సమంగా ఉంటాయని వాదించారు. మరోవైపు తెలంగాణకు ఉత్తరాంధ్ర జిల్లాలను కూడా కలపాలని, అప్పుడూ సముద్రం కూడా తెలంగాణకు వస్తుందని వాదించారు. కానీ వీటన్నింటిని ఎవరూ సీరియస్ గా పట్టించుకోలేదు.

## కేంద్రపాలిత ప్రాంతంగా హైదరాబాద్

రాయల తెలంగాణ వాదనలు నీరుగారిపోవడంతో.. హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేయాలంటూ సమైఖ్య వాదులు మరో చర్చను లేవదీశారు. హైదరాబాద్ లో సీమాంధ్ర నేతల పెట్టుబడులకు రక్షణగా ఈ ప్రతిపాదన తీసుకువచ్చారు. హైదరాబాద్ అభివృద్ధిలో సీమాంధ్ర నేతల పాత్ర ఉందని, ఇక్కడి ఆదాయంలో ఆంధ్రులకు హక్కు ఉందని వాదించారు. కేంద్రంలో టూరిజం శాఖ మాత్యులైన చిరంజీవి కూడా ఈ అంశాన్ని సమర్ధించారు. ఈ విషయంపై ఆయన సోనియా గాంధీతో కూడా చర్చించినట్లుగా తెలిసింది. ఆమెను కూడా ఒప్పించడానికి ప్రయత్నించగా, ఆమె సానుకూలంగా ఉన్నారంటూ ప్రచారం చేశారు. దాంతో మరోసారి ప్రత్యేక తెలంగాణపై సీమాంధ్రులు కుట్రలు పన్నుతున్నారని తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్

కేంద్ర పాలిత ప్రాంతంగా హైదరాబాద్ జిమ్మికులు విఫలం కావడంతో... ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ను చేయాలంటూ డిమాండ్ లేవనెత్తారు. అయితే దీనికి రాజ్యాంగం అనుమతిస్తుందా అనే చర్చ నడిచింది. ప్రత్యేక కారణాలరీత్యా సీమాంధ్ర రాజధాని ఎంపిక జరిగేంత వరకు పదేళ్లు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ను ఉంచడానికి నిర్ణయం జరిగింది. సమస్యలేమైనా ఉంటే గవర్నర్ పరిష్కరించాలని చట్టంలో పొందుపరిచారు. శాంతిభద్రతలపై గవర్నర్ కు అధికారం ఇవ్వాలనే ప్రతిపాదనకు తెలంగాణ నేతలు వ్యతిరేకించారు. ఇదీ తెలంగాణ ప్రజలను అవమానపరిచినట్లే అవుతుందని కేంద్రానికి స్పష్టం చేశారు.

## ఉద్యమంలో ఉస్మానియా...

తెలంగాణ ఉద్యమంలో అప్పుడూ... ఇప్పుడూ... ఉస్మానియా యూనివర్సిటి ప్రత్యేక పాత్రను పోషించింది. ఉద్యమం ఊపందుకోవడానికి రాజకీయ నాయకులు ఉస్మానియా విద్యార్థులను భాగస్వామ్యం చేశారు. కానీ ఒకానొక సమయంలో ఉస్మానియా విద్యార్థులు వారి చేయి దాటిపోయారు. వర్సిటీలో పలు సార్లు సభలు, సమావేశాలు పెట్టి నాయకులను స్వాగతించిన విద్యార్థులే, తర్వాత తరిమికొట్టారు. ఆందోళనలను చేయిదాటిపోయే పరిస్థితి వచ్చినప్పుడు పోలీసులు అనేకసార్లు ముళ్ల కంచెలను ఏర్పాటు చేసి దిగ్బంధం చేశారు. పలు సార్లు పోలీసులకు విద్యార్థులకు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు విద్యార్థులపై టీయర్ గ్యాస్, రబ్బరు బుల్లెట్లను కురిపించే పరిస్థితులు వచ్చాయి. శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలు ప్రకటించిన తర్వాత తెలంగాణ ఎమ్మెల్యేలందరూ రాజీనామాలు చేయాలని విద్యార్థులు ఆందోళనలు చేశారు. అప్పుడూ కాల్పుల వరకు పరిస్థితి వెళ్లింది. మీడియాపై కూడా పోలీసులు దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ సమయంలోనే విద్యార్థులు, నాయకులను వర్సిటీ ప్రాంగణంలోకి అనుమతించలేదు. 2010 జులై నెలలో ఉస్మానియా విద్యార్థి ఇషాన్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో వర్సిటీ ఆందోళన బాట పట్టింది. తెలంగాణ కోసం 1200 నుంచి 1500 మంది యువకులు, విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని పలు సార్లు రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నేతలు ప్రకటించారు.

## గవర్నర్ నరసింహాన్ పై విమర్శలు

తెలంగాణ ఉద్యమ సమయంలో గవర్నర్ గా ఉన్న నరసింహన్ కూడా పలు విమర్శలను ఎదుర్కొన్నారు. గవర్నర్ తెలంగాణ వ్యతిరేకి అని కూడా తెలంగాణ ఉ ద్యకారులు ఆరోపించారు. ఫిబ్రవరి 17 2011న అసెంబ్లీలో గవర్నర్ నరసింహన్ ప్రసగించడానికి వచ్చారు. ఆయన ప్రసంగం ప్రారంభానికి ముందే సభలో గందరగోళం నెలకొంది. ఆయన కుర్చీని కూడా లాగేశారు. ఈ సంఘటనలో హరీష్ రావు, విద్యాసాగర్, రేవంత్ రెడ్డి, మహేంధర్ రెడ్డిలను అసెంబ్లీ నుంచి బహిష్కరించారు.

## శ్రీకృష్ణ కమిటీ 8వ చాప్టర్ వివాదం

తెలంగాణ ఏర్పాటుపై రెండు ప్రాంతాల ప్రజాభిప్రాయ సేకరించాలని నియమించిన శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదికలో 8వ చాప్టర్ వివాదంగా మారింది. తెలంగాణ రాష్ట్రం ఇస్తే శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమవుతాయని ఈ చాప్టర్ లో నివేధించారు. అయితే తెలంగాణలో ఉన్న పరిస్థితులరీత్యా 8వ చాప్టర్ నివేదికను కేంద్రహెూం మంత్రికి వేరుగా ఇవ్వడం జరిగింది. నిజామాబాద్ మాజీ ఎంపీ నారాయణరెడ్డి ఆ నివేదికను బహిర్గతం చేయాలని హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై హైకోర్టు తీర్పునిస్తూ రహస్యంగా ఉంచాల్సిన అంశాలేవి ఆ చాప్టర్ లో లేవని, రెండు వారాల్లో బహిర్గతం చేయాలని పేర్కొంది. అయితే ఆ రిపోర్టులో టీఆర్ఎస్ శ్రేణులను కట్టడి చేయాలని, మీడియా మేనేజ్ మెంట్ చేయాలంటూ కొన్ని కామెంట్లు చేయడం పలు వివాదాలకు దారితీసింది. తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయడానికే ఇలాంటి సూచనలు చేశారని జేఏసీ చైర్మన్ కోదండరాం ఆరోపించి, శ్రీకృష్ణ కమిటీపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## రాజీనామాల తిరస్కరణ

పది మంది కాంగ్రెస్ ఎంపీలు, టీడీపీ ఎంపీలిద్దరూ, టీఆర్ఎస్ ఎంపీలైన కేసీఆర్, విజయశాంతిల రాజీనామాలను స్పీకర్ మీరాకుమారి తిరస్కరించారు. ఎంతో కాలం పెండింగ్ లో ఉంచి రాజీనామాలను తిరస్కరించామని చెప్పడంతో తెలంగాణ ప్రజల్లో మరింత ఆగ్రహాం వ్యక్తమైంది. అయితే వీరంతా రాజీనామాలు చేశామంటూ ప్రకటిస్తూ అన్ని కమిటీల మీటింగులకు హాజరు కావడం విడ్డూరంగా మారింది.

## రాజ్యసభలో గందరగోళం

లోక్ సభలో తెలంగాణ బిల్లుకు ఆమోదం పొందిన తర్వాత రాజ్యసభకు చేరింది. అక్కడ యథా ప్రకారం సీమాంధ్రకు చెందిన టీడీపీ, కాంగ్రెస్ ఎంపీలూ ఒక్కటై బిల్లును వ్యతిరేకించారు. టీడీపీ ఎంపీలూ సుజన చౌదరి, సీఎం రమేష్ లూ పోడియంలోకి చొచ్చుకెళ్లి సభలో గందరగోళం సృష్టించారు. ఒక దశలో రాజ్యసభ జనరల్ సెక్రటరీ నుంచి బిల్లు పత్రాలను లాక్కునేందుకు కలియపడ్డారు. కాంగ్రెస్ ఎంపీ కేవీపీ కూడా పోడియంలో కూర్చొని ప్లకార్డును ప్రదర్శించి బిల్లును వ్యతిరేకించారు. ఆఖరుకు సీఎం రమేష్ తన ప్రవర్తనకు రాజ్యసభ జనరల్ సెక్రటరీకి క్షమాపణ కూడా చెప్పారు.

## ప్రొఫెసర్ జయశంకర్ మరణం

తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్తగా వ్యవహరించిన ప్రొఫెసర్ జయశంకర్ 2011 జూన్ 21న కన్నుమూశారు. దాంతో ఉద్యమకారుల్లో నిరాశకు గురైయ్యారు. పార్టీలకతీతంగా నివాళులర్పించారు. అయితే వరంగల్ లో జయశంకర్ పార్థివ దేహానికి నివాళులర్పించేందుకు వెళ్లిన కాంగ్రెస్, టీడీపీ నాయకులకు ఉద్యమ కారుల నుంచి నిరసన ఎదురైంది. కొందరు విద్యార్థులు తెలంగాణ ద్రోహులంటూ నినాదాలు చేశారు. మంత్రి పొన్నాల లక్ష్మయ్యపై మట్టి కొట్టగా, వరంగల్ ఎంపీ రాజయ్య చొక్కా చింపివేశారు. టీడీపీ నాయకుడు ఎంపీ గుండు సుధా రాణి, ఎంపీ రేవూరి ప్రకాష్ రెడ్డిలూ నివాళులర్పించకుండానే వెనక్కి రావాల్సి వచ్చింది. కాంగ్రెస్ నాయకులు చీఫ్ విప్ గండ్రా వెంకట రమణారెడ్డి ఇంటిపై రాళ్ల వర్షం కురిసింది. మంత్రి శంకర్రావుపై దాడి జరిగింది. వీరందరినీ పదవులకు రాజీనామా చేసి రావాలని పంపించారు. ఈ సందర్భంగా పోలీసులు ఆందోళనకారులపై లాఠీ చార్జీ చేశారు. అక్కడితో ఆగిపోకుండా ఎన్టీఆర్ విగ్రహంపై చెప్పులు విసిరారు. కేసీఆర్, కోదండరాంలూ జయశంకర్ పాడెను మోశారు.

## తెలంగాణ ప్రకటనలు... సీమాంధ్రుల కుట్రలు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనేది సాధ్యమవుతుందని గట్టిగా విశ్వసిస్తున్న సమయంలో కేంద్ర హోం మంత్రి పి. చిదంబరం సంప్రదింపులు, ఏకాభిప్రాయంతోనే

తెలంగాణ సాధ్యమైతుందంటూ చేసిన ప్రకటన తెలంగాణ ఉద్యమ తీరును కుదిపేసింది. ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయ నాయకులను ఉలిక్కి పడేలా చేసింది. దీంతో తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) అధ్యక్షుడు కె.చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్షకు ఆందోళన చెంది, భయపడి చిదంబరం తానొక్కడే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారనే అపోహలు వ్యక్తమయ్యాయి. తెలంగాణ ఏర్పాటు పై కాంగ్రెసు అధిష్టానం, యుపిఎ ప్రభుత్వం కలిసి చేసిన ప్రకటనగానే భావించాల్సి ఉంటుంది. ఇదే విషయాన్ని చిదంబరం పదే పదే చెప్పారు. తన ప్రకటనలో అస్పష్టత లేదని, దాని నుంచి వెనక్కి పోలేదని కూడా వివరించారు. కానీ అలా అంగీకరించడానికి రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు సిద్ధంగా లేవు. అయితే తెలంగాణ విషయంలో మాత్రం చిదంబరం ప్రకటన చాలా ముందడుగుగానే భావించాల్సి ఉంటుంది. కాంగ్రెసు అధినాయకత్వం తెలంగాణ ఏర్పాటుకు సుముఖంగానే ఉన్నది. ప్రక్రియను ప్రారంభించడానికి అనువైన సందర్భం దొరక లేదు. కెసిఆర్ నిరాహార దీక్ష ఆ సందర్భాన్ని తెచ్చి పెట్టింది. నిజానికి, కెసిఆర్ తో మన్మోహన్ సింగ్ మాట్లాడి ఉంటే ఆయన దీక్ష విరమించేవారే. దీక్ష విరమిస్తే మొదట్లో విద్యార్థుల నుంచి వచ్చిన ఒత్తిడి కూడా ఆ తర్వాత వచ్చే పరిస్థితి లేదు. విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు కేంద్రం నుంచి ప్రకటన రాకున్నా సరే విరమించాలని విజ్ఞప్తి చేశారు. కానీ కెసిఆర్ అందుకు అంగీకరించలేదు. కెసిఆర్ ఆరోగ్య పరిస్థితి 2009 డిసెంబర్ 7 నాటికి పూర్తిగా క్షీణించింది. నిమ్స్ వైద్యులు ఆయన ఆరోగ్యం గురించి వాస్తవాలను బయటి ప్రపంచానికి వెల్లడించకుండా కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెచ్చారు. కెసిఆర్ ఆరోగ్యంపై తీవ్ర ఆందోళనకు గురైన ముఖ్యమంత్రి రోశయ్య విషయాన్ని కాంగ్రెసు అధిష్టానానికి వివరించారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలు తెలంగాణకు అనుకూలంగా ఉన్నందున అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి మరోసారి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని రోశయ్యకు కబురు అందింది. ఆ మేరకు డిసెంబర్ 7న రోశయ్య అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి సమావేశ వివరాలను కేంద్రానికి పంపారు. దాని ఆధారంగా కాంగ్రెసు కోర్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుని చిదంబరం రోశయ్య హైదరాబాద్ చేరుకునే లోగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన చేశారు. తెలంగాణ ఏర్పాటుకు సంబంధించి 8న పార్టీ అధిష్టానం నాయకులు రోశయ్యకు కూడా చెప్పారు. చిదంబరం ప్రకటన వచ్చేలోగానే కెసిఆర్ చేత దీక్ష విరమింపజేయడానికి రంగం

సిద్ధమైంది. చిదంబరం నుంచి ప్రకటన వెలువడే ఆవకాశం ఉండడంతో దీక్షను తెరాస నాయకులు, తెలంగాణ మేధావులు వాయిదా వేస్తూ వచ్చారు. ముఖ్య నేతలైన హరీష్ రావు, ఈటెల రాజేందర్ ద్వారా ఢిల్లీలోని ఓ ఎంపీ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూనే ఉన్నారు. చిదంబరం ప్రకటన వెలువడగానే కెసిఆర్ చేత దీక్ష విరమింపజేశారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ రాకుండానే దీక్ష విరమింపజేయడానికి అన్ని వైపుల నుంచి కెసిఆర్ కుమారుడు, శాసనసభ్యుడు కెటి రామారావుపై, కూతురు కవితపై తీవ్రంగా వచ్చింది. అయితే, ఖమ్మం వ్యవహారంతో తీవ్రంగా మనస్తాపం చెందిన కెసిఆర్ ఓ వైపు దీక్ష విరమించడానికి మొండి పట్టు పట్టారు. కానీ అనుహ్యంగా చిదంబరం ప్రకటన చేయడంతో సీమాంధ్రలో ఆందోళనలు చెలరేగడం, సీమాంధ్ర ప్రజాప్రతినిధుల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో, అన్నింటినీ మించి తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, ప్రజారాజ్యం అధ్యక్షుడు చిరంజీవి మాట మార్చడంతో చిదంబరం కాస్తా సవరణలతో డిసెంబర్ 23న మరో ప్రకటన చేయడానికి కారణమైంది. రెండు ప్రాంతాల్లోనూ ఉద్యమాలు చల్లారకపోవడంతో చిదంబరం మరోసారి 31వ తేదీన మరో ప్రకటన చేశారు. తాను 9న గానీ, 23న గానీ చేసిన ప్రకటనల్లో వ్యత్యాసం లేదని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని, రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ప్రాంతాలవారీగా చీలిపోవడంతో ముందుకు అడుగు వేయడం కాస్తా ఇబ్బందిగా ఉందని చిదంబరం స్పష్టం చేశారు. చాలా స్పష్టంగా తెలంగాణ విషయంలో తాము కట్టుబడి ఉన్నామనే విషయాన్ని కూడా ఆయన చెప్పారు. అప్పటి పరిణామాల నేపథ్యంలో 2010 జనవరి 5న రాష్ట్ర రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశాన్ని చిదంబరం నిర్వహించారు. ఈ సమావేశంలోనూ చిదంబరం తెలంగాణ ప్రక్రియ ముందుకు సాగుతుందని, రాజకీయ పార్టీలు సహకరిస్తే మరో అడుగు ముందుకు పడుతుందని ఆయన అన్నారు. చిదంబరం వరుసగా చేస్తున్న ప్రకటనలు యుపిఎ ప్రభుత్వం తెలంగాణకు కట్టుబడి ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పెద్దల ప్రకటనల బట్టి ఎక్కువ కాలం ఈ వ్యవహారాన్ని సాగదీయడానికి కూడా సిద్ధంగా లేనట్లు అర్థమైంది. అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపి చర్చల ప్రక్రియ పూర్తికి కాల పరిమితి విధిస్తామని కూడా చిదంబరం చెప్పారు. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాల పరిమితి విధించడానికి మాత్రం ఆయన అంగీకరించడం లేదు. అలా అంగీకరించకపోవడానికి

కేంద్రానికి ఉండాల్సిన కారణాలు ఉన్నాయి. రాష్ట్ర ఏర్పాటుకు కాల పరిమితి విధిస్తే ఊహించని ఆటంకాలు ఎదురైతే దాన్ని పాటించడం కష్టమవుతుంది. అలాంటి పరిస్థితి వచ్చినప్పుడు మాట నిలబెట్టుకోనట్లవుతుంది. ఆ తర్వాత తెలంగాణలో వచ్చే ఉద్యమాలను నియంత్రించడం సాధ్యం కాదు. ఈ విషయం తెలంగాణ విద్యార్థులకు, మేధావులకు, రాజకీయ నాయకులకు స్పష్టంగానే అర్థమైంది. ఇదే సమయంలో చర్చలను బట్టి కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తోందని సిపిఐ రాష్ట కార్యదర్శి నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తప్ప దేశంలో మరో కొత్త రాష్ట్రం ఏర్పాటుకు సిద్ధంగా ఉండకూడదనే పట్టుదలతో కూడా కేంద్ర ప్రభుత్వం ఉంది. ఇది కేవలం ఒక్క చిదంబరం వ్యవహారం కాదని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. కాంగ్రెసు అధ్యక్షురాలు సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్, కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీకి, రక్షణ మంత్రి ఆంటోనీకి తెలియకుండా, వారి సమ్మతి లేకుండా అవుతుందని అనుకోవడం పూర్తిగా పిచ్చితనమే అవుతుంది. ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, ప్రజారాజ్యాలను నడ్డి విరిగేలా కొట్టడం కూడా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వెనక ఉంది. మరో వైపు వైయస్ జగన్ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు సంకెళ్లు వేయడం కూడా ఇందులో భాగమే. పైగా, మాట నిలబెట్టుకున్న ఖ్యాతి తెలంగాణ నుంచి దక్కుతుంది. అన్నీ ఆలోచించిన తర్వాతనే కాంగ్రెసు పెద్దలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారనేది తెలిసిపోయింది. రాష్ట్ర ఏర్పాటుకు ఎక్కువ కాలం కూడా పట్టకపోవచ్చు. పట్టు విడిస్తే సీమాంధ్ర లాబీ పుంజుకోవచ్చుననే అనుమానంతో, కాంగ్రెసు తన మాట నుంచి వెనక్కి తగ్గి కాలయాపన చేయవచ్చుననే భయంతో, సీమాంధ్ర లాబీకి అవకాశం దక్కనీయకూడదనే ఉద్దేశంతో తెలంగాణలో ఉద్యమాలను కొనసాగించాలనే ఉద్దేశంతో విద్యార్థులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

తెలంగాణ ఏర్పాటుకు అడుగడునా అడ్డం పడుతున్న సీమాంధ్ర నేతలు, సీఎం కిరణ్ ముసాయిదా బిల్లు వచ్చిన వెంటనే కుట్రలకు తెరలేపారు. సకాలంలో అసెంబ్లీ సమావేశాలకు బిల్లు చేరకుండా అడ్డుకునేందుకు ఉన్నతాధికారులను మొబిలైజ్ చేస్తున్నారని సమాచారం లీకైంది. దీంతో అప్రమత్తమైన టీ కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ తెలంగాణకు చెందిన నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రెండున్నర గంటల పాటు సాగిన ఈ

సమావేశం నుంచి నేరుగా సీఎస్ కు ఫోన్ లో మాట్లాడి బిల్లు జాప్యానికి గల కారణాలను, ఆటంకాలపై ఎప్పటికప్పుడు ఆరా తీశారు. ఇదే సందర్భంలో మూకుమ్మడి రాజీనామాలతో ముసాయిదా బిల్లును అడ్డుకోవాలని చూస్తున్న సీఎం కిరణ్ పన్నిన కుట్రను భగ్నం చేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు చాకచక్యంగా వ్యవహారించారు. బిల్లును అసెంబ్లీలో వెంటనే ప్రవేశపెట్టేలా టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చేసిన కామెంట్ తో కుట్రలపై ప్రతి ఒక్కరిలో మరింత ఉత్కంఠతను పెంచింది. 2013 డిసెంబర్ 16న శాసన సభలో సభాపతి నాదెండ్ల మనోహర్, శాసనమండలిలో చక్రపాణి ఏపీ పునర్వ్యవస్తీకరణ బిల్లును ప్రవేశపెట్టారు. 65 పేజీలతో 13 అంశాలు ఉన్న బిల్లును ప్రవేశపెట్టడంతో తొలి ఘట్టం ఉద్వేగంగా సాగింది. ఇక అప్పటి వరకు తెర వెనుక కుట్రలు, కుతంత్రాలు చేస్తున్న ఏపీ నేతల కడుపులో విషం బట్టబయలైంది. టీడీపీ నేతలు శాసన సభ సాక్షిగా ముసాయిదా బిల్లును చించివేయగా... వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు దగ్ధం చేశారు. టీఆర్ఎస్ పరకాల ఎమ్మెల్యే కుర్చీ విసిరి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ తోపులాట మరింత ఉద్రిక్త వాతావరణానికి దారితీసింది. అయితే చర్చలు సాగుతాయని భావించినా... తెలంగాణ ముసాయిదా బిల్లుపై ఎలాంటి చర్చ జరగకుండానే రెండు సభలను డిసెంబర్ 19న వాయిదావేశారు. రెండో విడత సమావేశాలు 2014 జనవరి 3 నుంచి 10 వరకు , మూడో విడత జనవరి 16%––%23 వరకు జరిగాయి. సభను వాయిదా వేయడాన్ని నిరసిస్తూ టీటీడీపీ, టీఆర్ఎస్, బీజేపీ నేతలు ఆందోళనలకు దిగారు. పొడియం ముందు బైఠాయించి దీక్షకు చేపట్టారు. ఇక ముసాయిదా బిల్లు విధివిధానాలపై అభ్యంతరాలు తెలుపుతూ కేంద్రానికి సీమాంధ్ర ఎమ్మెల్యేలు లేఖ రాశారు. ఇదే సందర్భంలో హైదరాబాద్ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఎదుట తెలంగాణ ఏర్పాటును నిరసిస్తూ, బిల్లుకు వ్యతిరేకంగా సీమాంధ్ర నేతలు ఏకరవుపెట్టారు. గల్లీ స్థాయి నేతల నుంచి ఎంపీల వరకు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో తెలంగాణకు చెందిన మంత్రి శ్రీధర్ బాబును శాసన సభ వ్యవహారాల శాఖను మార్చి సీఎం కిరణ్ మరో కుట్రకు తెలపారు. ఇదే సందర్భంలో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీతో గంటన్నర భేటీ అయి ముసాయిదా బిల్లు, బిల్లుకు వ్యతిరేకంగా కేంద్రానికి లేఖ రాశారు. మూడో దఫా అసెంబ్లీ సమావేశాల లోపు సీఎం పదవీకి రాజీనామా చేయాలని కిరణ్ రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే గనుక జరిగితే, తెలంగాణ ముసాయిదా బిల్లుపై అభిప్రాయం చెప్పకుండా ఆపివేయాలని

రాజకీయ అనిశ్చితలోకి నెట్టేందుకు తెరలేపారు. కానీ కేంద్ర పెద్దల డైరెక్షన్, తెలంగాణ నేతల ఒత్తిడి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల తెలంగాణ ఉద్యమ ప్రభావం ముందు కిరణ్ కుట్రలేవి నిలువలేదు. బిల్లుకు ఆమోదం తెలుపుతూ కేంద్రానికి ముసాయిదా బిల్లు చేరింది.

## ఢిల్లీ వేదికగా ఆల్ పార్టీ మీటింగ్...

తెలంగాణపై అన్ని రాజకీయ పార్టీలతో జరిగే హెూం మంత్రిత్వ శాఖ సమావేశానికి ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా 2010 జనవరి 5న ఉ త్కంఠభరితమైన పరిస్థితులు నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీల నేతలే కాకుండా ప్రజలు కూడా ఈ సమావేశం ఫలితంపై ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. తెలంగాణ వ్యతిరేక, అనుకూల రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు ఢిల్లీలో మోహరించారు. ఈ సమావేశానికి కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ 8 రాజకీయ పార్టీల నుంచి ఇద్దరేసి ప్రతినిధులను అహ్వానించారు. కాంగ్రెసు తరఫున కావూరి సాంబశివర రావు, ఉత్తమకుమార్ రెడ్డి, తెలుదేశం తరఫున రేవూరి ప్రకాష్ రెడ్డి, యనమల రామకృష్ణుడు, బిజెపి తరఫున బండారు దత్తాత్రేయ, హరిబాబు, తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) తరఫున కె. చంద్రశేఖర రావు, జయశంకర్, ప్రజారాజ్యం తరఫున చిరంజీవి, సి. రామచంద్రయ్య పాల్గొన్నారు. మజ్లీస్ తరఫున అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీ, సిపిఐ తరఫున కె. నారాయణ, గుండా మల్లేష్, సిపిఎం తరఫున బివి రాఘవులు, జూలకంటి రంగారెడ్డి ఉన్నారు. హెూం మంత్రిత్వ శాఖ సమావేశం ఉదయం పదిన్నర గంటలకు మొదలైంది. అభిప్రాయ సేకరణ జరిపి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు విధివిధానాలను ఖరారు చేసేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లుగా అంతా భావించారు. ఏకాభిప్రాయ సాధన కోసం విస్తృత స్థాయి చర్చల్లో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లుగా చిదంబరం చెప్పారు. రాష్టానికి చెందిన రాజకీయ నాయకులు పార్టీలకు అతీతంగా ప్రాంతాలవారీగా విడిపోయి తెలంగాణ అనుకూల, వ్యతిరేక విధానాలను వ్యక్తీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల అభిప్రాయాల కన్నా ప్రాంతాలవారీగా రాజకీయ నాయకుల అభిప్రాయం ముఖ్యంగా మారిపోయింది. కాగా, రాష్ట్రంలో ఇటు తెలంగాణలో, అటు సీమాంధ్రలో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇరు

ప్రాంతాల ఆందోళనకారులు తమ తమ వైఖరులను కేంద్రానికి తెలియజేయడానికి రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు.

తెలంగాణ సమస్య కాంగ్రెసు నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం మెడకు చుట్టుకుంది. తెలంగాణ అంశం కేంద్రానికి ముందుకు కదల్లేని, వెనక్కి తగ్గలేని పరిస్థితిలో నెట్టేసింది. ఏం చేయాలో తోచక మన్మోహన్ సింగ్ ప్రభుత్వం గిలగిలా కొట్టుకుంది. అయితే ఈ సమస్య ఇలాగే, ఈ రూపంలోనే ఉండే అవకాశం లేదు. ఇది ముదిరి కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం పొంచి ఉండటంతో ఏదొక నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. తెలంగాణపై సీమాంధ్ర నేతలు ఒక వైపు, తెలంగాణ నేతలు మరో వైపు లాగుతూ కేంద్రాన్ని ఇరకాటంలో పెడుతున్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు పార్టీలకు అతీతంగా ప్రాంతాలవారీగా చీలిపోయి కేంద్ర ప్రభుత్వానికి ఊపిరి ఆడనీయడం లేదు. ఈ స్థితిలో అప్పటికే జరగాల్సిన కేంద్ర మంత్రివర్గ సమావేశం రెండు రోజులు వాయిదా పడింది. తెలంగాణపై కచ్చితమైన నిర్ణయం తీసుకుని ప్రకటన చేస్తే తప్ప ప్రస్తుత స్థితి నుంచి, రాబోయే ప్రమాదం నుంచి యుపిఎ ప్రభుత్వం బయటపడేట్లు లేదు. ఇందుకు సీమాంధ్ర కాంగ్రెసు నాయకులను ఒప్పించడం ఒక్కటే కాంగ్రెసు అధిష్టానం వద్ద మార్గం. డిసెంబర్ 9వ తేదీన కేంద్ర హోం మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు ప్రకటన చేయడంతో ముసలం మొదలైంది. ఈ వ్యవహారంపై కాంగ్రెసు, తెలుగుదేశం పార్లమెంటు సభ్యులు ప్రాంతాలవారీగా చీలిపోయి శీతాకాలం సమావేశాల్లో పార్లమెంటు ఉభయ సభలను స్తంభింపజేశారు. దీంతో పార్లమెంటు శీతాకాలం సమావేశాలను నిర్వహించలేని స్థితి ఏర్పడింది. లోకసభను స్పీకర్ మీరా కుమార్ అర్థాంతరంగా వాయిదా వేశారు. అయితే వచ్చే బడ్జెట్ సమావేశాలను అలా నిర్వహించడం, వాయిదా వేయడం సాధ్యం కాదు. మార్చి 1వ తేదీ లోగా కేంద్ర బడ్జెట్ కు ప్రభుత్వం ఆమోదం పొందాల్సి ఉంటుంది. బడ్జెట్ ఆమోదం పొందాలంటే పార్లమెంటు సమావేశాలు సజావుగా జరగాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 27వ తేదీన పార్లమెంటులో బడ్జెట్ ప్రతిపాదించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రకటించారు. అంటే తెలంగాణ సమస్యకు ఈలోగా పరిష్కారం వెతకాల్సి ఉంటుంది. తెలంగాణ సమస్యకు పరిష్కారం లభించాలంటే వచ్చే పార్లమెంటు సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు బిల్లు ప్రతిపాదించక తప్పదు. బిల్లు ప్రతిపాదించకపోతే

రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యుల నుంచే కాకుండా బిజెపి సభ్యుల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యే ప్రమాదం ఉంది. ప్రధాన ప్రతిపక్షం బిజెపి తెలంగాణ బిల్లుకు మద్దతిస్తామని ప్రకటించింది. శీతాకాలం సమావేశాల్లోనే తెలంగాణపై చర్చ జరిగింది. తెలంగాణపై పార్లమెంటులో చేసిన ప్రకటన కట్టుబడాలని బిజెపి సభ్యులు తీవ్రంగా పట్టుబట్టే అవకాశం ఉంది. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ కు చెందిన పార్లమెంటు సభ్యులు తెలంగాణకు, సమైక్యవాదాలకు అనుకూలంగా రాజీనామాలు చేసే ప్రమాదం కూడా లేకపోలేదు. ఈ కారణాలతో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం సంక్షోభంలో పడే ప్రమాదం ఉంది. ఆంధ్రప్రదేశ్ సభ్యులతో పాటు బిజెపి సభ్యులు తోడైతే ఈ సంక్షోభం తప్పదు. ఈ సంక్షోభం నుంచి బయటపడడానికి తెలంగాణపై అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అంటే, సీమాంధ్ర నాయకులను ఒప్పించి తెలంగాణకు బిల్లు ప్రతిపాదించడం లేదా తెలంగాణ ఏర్పాటుకు ప్రక్రియను ప్రారంభించి కాలపరిమితిని నిర్దేశించడం జరగాలి.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిర్దిష్టమైన కాల పరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ చేసిన రాజీనామాల ఆమోదానికి స్పీకర్ పై ఒత్తిడి తెస్తామని తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) అధ్యక్షుడు కె చంద్రశేఖర రావు చెప్పారు. పార్టీ పోలిట్ బ్యూరో సమావేశం తర్వాత రాజీనామాలను ఆమోదించాలని డిమాండ్ చేస్తూ 18వ తేదీన స్పీకర్ చేంబర్ వద్ద బైఠాయించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇద్దరు పార్లమెంటు సభ్యులం, పది మంది శాసనసభ్యులు, ఒక ఎమ్మెల్సీ రాజీనామాలకు కట్టుబడి ఉన్నామని ఆయన చెప్పారు. సంక్రాంతి పర్వదినం తర్వాత పార్టీ నాయకులంతా జిల్లాల్లో పర్యటించి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఆత్మహత్యలు చేసుకోవద్దని విద్యార్థులను కోరుతూ మరో తీర్మానం చేసినట్లు ఆయన చెప్పారు. ఉద్వేగానికి, మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆయన విద్యార్థులను కోరారు. పోరాటంలో భాగస్వాములు కావాలి తప్ప ప్రాణాలు తీసుకోవద్దని ఆయన అన్నారు. ప్రాణాలు ఇవ్వడానికి తాము ముందు వరుసలో ఉంటామని, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. తమ ప్రతిపాదనలను రాజకీయ, ప్రజా సంఘాల జెఎసి ముందుంచుతామని ఆయన చెప్పారు. ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో పార్లమెంటు సభ్యురాలు విజయశాంతి కూడా పాల్గొన్నారు.

## ఓయూ వేదికగా విద్యార్థి గర్జన

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను డిమాండ్ చేస్తూ ఉస్మానియా స్టూడెంట్ జెఎసి మహాగర్జనతో ఉద్యమాన్ని ఉరకలెత్తించారు. లక్షలాది మంది విద్యార్థులతో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణ పోటెత్తింది. తెలంగాణ నినాదాలతో ఉస్మానియా విశ్వవిద్యాలయం హెూరెత్తింది. రాజకీయ పార్టీల నాయకులు గానీ కార్యకర్తలుగానీ ప్రాతినిథ్యం లేకుండా తెలంగాణలోని పది జిల్లాలకు చెందిన విద్యార్థులు మాత్రమే సభను నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులను తొలుత పోలీసులు అనుమతించలేదు. అయితే వారిలో కొద్ది మందిని మాత్రమే అనుమతించారు. మందకృష్ణ మాదిగ, వరవరరావు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల జెఎసి కన్వీనర్ కోదండరామ్, బెల్లయ్య నాయక్ మాత్రమే హాజరయ్యారు. విద్యార్థులే తెలంగాణ ఉద్యమానికి ఎజెండా ఖరారు చేశారు. తెలంగాణకు వ్యతిరేకంగా వ్యవహరించే పార్టీలకు తీవ్ర హెచ్చరికలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాలని, తెలంగాణకు వ్యతిరేకంగా వ్యవహరించే పార్టీల కార్యాలయాలు కూల్చేస్తామని విద్యార్థి నాయకులు హెచ్చరించారు. చర్చలు అక్కర్లేదని, పార్లమెంటులో తెలంగాణ బిల్లు ప్రతిపాదించాలని డిమాండ్ చేశారు. గుజ్జర్ల తరహా ఆందోళనకు సిద్ధమైతామని వారించారు. 2010 ఫిబ్రవరి 5న రైలు రోకోకు, రాస్తా రోకోకు పిలుపునిచ్చారు. కోస్తాంధ్ర, రాయలసీమల నుంచి వచ్చే వాహనాలను, రైళ్లను అడ్డుకోవాలని విద్యార్థి నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిర్దిష్ట కాలపరిమితిని ప్రకటించకపోతే సంక్రాంతికి వెళ్లిన సీమాంధ్రులను తిరిగి రానివ్వమని హెచ్చరించారు.

## రోడ్లపై వంట వార్పు

తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన కాలపరిమితితో కూడిన కార్యాచరణ వెల్లడికి డిమాండ్ చేస్తూ తెలంగాణ రహదారులపై ప్రజలు వంటా వార్పూ కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు శాంతియుత ఉద్యమాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేశారు. జాతీయ రహదారులపై తెలంగాణవాదులు వంటలు వండుకుని సామూహికంగా భోజనాలు చేశారు. తెలంగాణ జెఎసి కన్వీనర్ కోదండరామ్ రంగారెడ్డి జిల్లా షామీర్ పేటలో ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగిన ఈ నిరసనలో

తెలుగుదేశం నాయకుడు టి. దేవేందర్ గౌడ్, ప్రజా సంఘాల నాయకులు విఠల్ కూడా పాల్గొన్నారు. తెలంగాణ ప్రజల సంఘటిత శక్తిని చాటడానికే ఈ కార్యక్రమం చేపట్టినట్లు కోదండరామ్ మీడియా ప్రతినిధులతో చెప్పారు. తెలంగాణ రాష్ట్రం సాధించే వరకు తెలంగాణ ప్రజలు సంఘటితంగా పోరాటం చేస్తారని తెలియజేయడానికి వంటా వార్పు కార్యక్రమం చేపట్టామని ఆయన అన్నారు. తెలంగాణ సాధించే వరకు ప్రజలు సంఘటితంగా ముందుకు సాగుతారని ఆయన అన్నారు. తెలంగాణకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన చెప్పారు. వంటావార్పు కార్యక్రమంలో భాగంగా మహిళలు రోడ్లపై బతుకమ్మ ఆడారు. ప్రజలు కళాప్రదర్శనలు ఇచ్చారు.

## శ్రీకృష్ణ కమిటీ తెలంగాణ పర్యటన

తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను కూలంకుషంగా తెలుసుకునేలా ఆంధ్రా నేతల ఒత్తిళ్లతో కేంద్రం శ్రీకృష్ణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి జస్టిస్ శ్రీకృష్ణ ప్రాతినిధ్యం వహించగా... కమిటీ సభ్యులుగా వికె దుగ్గల్, రణబీర్ సింగ్ రాజకీయ, చారిత్రక, పరిపాలన, న్యాయపరమైన అంశాలపై, సలే, రవీందర్ కౌర్ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలపై అధ్యయనం చేయడానికి నియమించారు. పార్టీల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు చర్యలు చేపట్టింది. పార్టీ అధ్యక్షుల అభిప్రాయం మాత్రమే వెల్లడించాలని కమిటీ స్పష్టం చేసింది. కమిటీ దఫాల వారీగా ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామని కమిటీ సభ్యులు చెప్పారు. తుది నివేదికను సెప్టెంబర్ 30వ తేదీ నాటికి రూపొందించే లక్ష్యంతో కమిటీ పనిచేయాలని కేంద్రం సూచించింది. కానీ 2010 ఫిబ్రవరి 3న శ్రీకృష్ణ కమిటీ పని ప్రారంభించింది. 10 నెలల పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన కమిటీ సమగ్ర నివేదికను డిసెంబరు10న నాటి కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరానికి సమర్పించింది. ఆ నివేదికలో మొత్తం 9 అధ్యాయాలతో ఆంధ్రప్రదేశ్ పరిణామాల చారిత్రక నేపథ్యం, ఆయా ప్రాంతాల ఆర్థిక పరిస్థితులపై విశ్లేషణ, విద్య – ఆరోగ్య రంగాలు, జలవనరులు–నీటిపారుదల – విద్యుత్, ఉద్యోగ విషయాలు, హైదరాబాద్ నగరం, సామాజిక – సాంస్కృతిక అంశాలు, శాంతిభద్రతల – పరిస్థితి, భవిష్యత్తు – పరిష్కార మార్గాలు వంటి అంశాలతో నివేదికను రూపొందించింది.

తెలంగాణలో శ్రీకృష్ణ కమిటీ పర్యటన నేపథ్యంలో... టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్, టీడీపీలకు సమాధానం చెప్పేలా, ఉప ఎన్నికల ఫలితాలతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులకు సూచించారు. అప్పటికే రాజకీయ పార్టీలను ఐక్యం చేయడంలో... ఉద్యమ బాధ్యతలను భుజనా వేసుకున్న జేఏసీ జెండాతో ప్రతి గ్రామంలో పర్యటిస్తామని, ప్రత్యర్థులకు డిపాజిట్లు దక్కకుండా పనిచేయాలని సూచించారు. ఈ క్రమంలోనే టీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ సవాల్ విసిరింది. తెలంగాణ ఇచ్చేది, తెచ్చేది కాంగ్రెస్ పార్టీయే నంటూ పీసీసీ చీఫ్ డీఎస్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని భావించి టీఆర్ఎస్ పార్టీని ఇరుకున పడేయాలని చూసినా... కాంగ్రెస్ సవాల్ ను స్వీకరించి వ్యూహాన్ని తిప్పికొట్టాలని టీఆర్ఎస్ బరిలో నిలిచింది.

## దద్దరిల్లిన తెలంగాణ పార్లమెంట్

శ్రీకృష్ణ కమిటీ పర్యటన, నివేదిక అనంతరం మొదలైన జరిగిన పార్లమెంట్ సమావేశాలు తెలంగాణ నినాదాలతో దద్దరిల్లింది. కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరుపై సొంత పార్టీ ఎంపీలే పార్లమెంట్ లో గళమెత్తారు. దీనికి బీజేపీ అగ్రనాయకత్వం మద్దతు తెలపడంతో... పార్లమెంట్ సమావేశాలు నిలిచిపోయాయి. తెలంగాణ అంశంపై చర్చ జరగాలని ఎంపీగా ఉన్న కేసీఆర్, విజయశాంతి వాయిదా తీర్మానానికి డిమాండ్ చేశారు. అయితే స్పీకర్ నిరాకరించడంతో... సభలో నిరసన తెలిపారు. దీనికి టీ కాంగ్రెస్ ఎంపీలూ కూడా మద్ధతు తెలపారు. పార్లమెంట్ లో తెలంగాణ ఎంపీలకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని బీజేపీ అగ్రనేత ఎల్ కే అద్వానీ, అక్కడి ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్నారని సుష్మా స్వరాజ్, తెలంగాణ పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తుందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు ప్రకాష్ జవదేకర్ మండిపడ్డారు. సమావేశాలను అడ్డుకుని తెలంగాణపై ప్రైవేటు సభ్యుల తీర్మానాన్ని ప్రవేశపెడతామన్నారు.

## తెగువ చూపిన టీ కాంగ్రెస్ ఎంపీలు

తెలంగాణ అంశంపై కేంద్రం స్పష్టమైన ప్రకటన చేసేంత వరకు సమావేశాలకు హాజరయ్యేది లేదని టీ కాంగ్రెస్ ఎంపీలు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కు తేల్చి చెప్పారు. పార్లమెంట్ సెషన్లు నడుస్తున్న క్రమంలోనే ప్రత్యేక సమావేశమై, తెలంగాణ

ఉన్న రాజకీయ పరిణామాలు, 14ఎఫ్ రద్దు చేయాలని సీఎం కిరణ్ కుమార్ రెడ్డి లేఖలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చేంత వరకు పార్లమెంట్ సమావేశాలకు హాజరు కాలేమన్నారు. నియోజకవర్గాల్లో పెరిగిన ఒత్తిళ్లతో రాజీనామాలు చేస్తున్నారని వివరించారు. కేంద్రం నాన్చుడు ధోరణి పార్టీకి మరింత నష్టం చేసేలా ఉందని తెగేసి చెప్పడంతో... తెలంగాణ అంశంపై పార్టీ నేతల్లో ఏకాభిప్రాయానికి ప్రయత్నాలు సాగుతున్నాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని గులాం నబీ ఆజాద్ సర్ది చెప్పడంతో... ఎంపీలు వెనుదిరిగారు.

పొలిటికల్ జెఏసీ ఓవైపు, టీఆర్ఎస్ పార్టీ మరోవైపు... కత్తికి రెండు వైపులా పదునుగా ఉద్యమాన్ని ఉరకలెత్తిస్తున్న సందర్భంలో... 2011 అక్టోబర్ 9 నుంచి మూడు రోజుల పాటు రైల్ రోకోకు పిలుపునిచ్చింది. తెలంగాణ ఏర్పాటులో జరుగుతున్న జాప్యానికి నిరసనగా, కాంగ్రెస్ వైఖరి ఎండగట్టేలా ఆందోళనలకు తెరలేపారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను టీఆర్ఎస్ వైపు లాక్కొనేలా టీఆర్ఎస్ ఆకర్ష్ మొదలుపెట్టింది. దీనిపై తెలంగాణవాదుల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమైయ్యాయి. ఒకనొక సందర్భంలో కేసీఆర్ నిర్ణయం తెలంగాణ ఏర్పాటుకు అడ్డంకిగా మారుతుందని భావించారు. కానీ మరో మూడేళ్ల తర్వాత 2014లో వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ జంప్ జిలానీలతో అత్యధికంగా సీట్లు గెలవాలనే రాజకీయ వ్యూహంతో కేసీఆర్ ఆపరేషన్ ఆకర్ష్ కు తెరలేపారని టీఆర్ఎస్ శ్రేణులు స్పష్టం చేశాయి. కానీ తెలంగాణను ఏర్పాటు చేసే కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడకపోతే, రాష్ట్ర ఏర్పాటులో జాప్యం జరుగుతుందననే రాజకీయ విశ్లేషణలను బ్రేక్ చేస్తూ కేసీఆర్ నిలబడ్డారు.

## తెలంగాణ తర్వాతే ఏదైనా...

తెలంగాణ విషయంలో కేసీఆర్ నిక్కచ్చిగా వ్యవహరించారు. రాష్ట్ర ఏర్పాటుకే తమ తొలి ప్రాధాన్యతనంటూ బల్లగుద్ది చెప్పారు. ఇదే సందర్భంలో కేంద్రమంత్రి వాయలార్ రవి ఇంటికెళ్లి మరీ కేసీఆర్ భేటీ అయ్యారు. దాదాపు అరగంట పాటు సాగిన సమావేశంలో... తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని వాయలార్ ను కోరారు. ఈ నేపథ్యంలో... ఉమ్మడి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, తెలంగాణకు వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయాలు, స్టేట్ మెంట్లు ఇవ్వొదన్నారు. 2012

సెప్టెంబర్ 11న జరిగిన ఈ భేటీలోనే లక్షలాది మందితో తెలంగాణ మిలియన్ మార్చ్ చేస్తామని అప్పుడే స్పష్టం చేశారు. ఈ క్రమంలో తెలంగాణ ఇచ్చిన తర్వాత ఎలాంటి ప్రతిపాదనలకైనా తాము సిద్ధమేనని క్లారిటీ ఇచ్చారు.

ఇదే సమయంలో కేంద్ర హోం మంత్రి సుశీల్ కుమార్ షిండే 2013 జనవరి 28 లోగా తెలంగాణపై తేల్చేస్తామని ఇచ్చిన ప్రకటన అప్పట్లో రాజకీయంగా పెనుదుమారం లేపింది. రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ గులాం నబీ ఆజాద్ పది రోజులు అటు, ఇటైన, విషయం లిక్కి వస్తుందంటూ చేసిన వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయ వర్గాలు ఆశలు చిగురించాయి. 2009 డిసెంబర్ 9 ప్రకటన చేసిన తర్వాత దాదాపు నాలుగేళ్ల పాటు సీమాంధ్ర ఒత్తిళ్లకు తలొగ్గి కేంద్రం ఎటూ తేల్చుకోలేకపోతున్న తరుణంలో... ఏఐసీసీ పెద్దలు, కీలక మంత్రుల వ్యాఖ్యలు టీఆర్ఎస్ వర్గాల ఆనందాన్ని మిన్నంటేలా చేశాయి. ఈ క్రమంలో పీసీసీ చీఫ్ బొత్స, సీఎం కిరణ్ కుమార్ రెడ్డితో సోనియా గాంధీ, సుశీల్ కుమార్ షిండే, ఏకే ఆంటోని వంటి నేతలు సుదీర్ఘంగా టెలి కాన్ఫరెన్స్ నిర్వహించడం, అందులో తెలంగాణ అంశం చర్చించడం, ఆ సాయంత్రమే ప్రధానితో సీఎం కిరణ్ కుమార్ రెడ్డి భేటీ అన్ని చకచకా జరిగిపోవడంతో... తెలంగాణ ఏర్పాటులో వేగం మరింత పుంజుకున్నది.

## ప్రత్యేక విమానంలో తెలంగాణ డ్రాఫ్ట్ బిల్లు

ఎన్నో ఆందోళనలు, మరెన్నో ముట్టడులు, కాంగ్రెస్ నేతల ఘెరావ్, ఉద్యమ కారుల ఆత్మ బలిదానాల తర్వాత ఎట్టకేలకు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రత్యేక రాష్ట్ర తెలంగాణ డ్రాఫ్ట్ బిల్లును రాష్ట్రానికి చేరవేశారు. కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన డ్రాఫ్ట్ బిల్లును ప్రత్యేక విమానంలో 2013 డిసెంబర్ 13న రాష్ట్రానికి చేరుకున్నది. రాష్ట్రపతి ఆమోదం తెలిపిన ఈ బిల్లును రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టి అభిప్రాయ సేకరణ చేయాలని భావించారు. ఇందుకు తగినట్లుగా కేంద్రహోం శాఖ జాయింట్ సెక్రటరీ సురేష్ కుమార్ నేతృత్వంలో హైదరాబాద్ కు డ్రాఫ్ట్ బిల్లు చేరుకున్నది. ముసాయిదా బిల్లు ప్రతులను వెంటనే సెక్రటేరియట్ కు చేరడంతోపాటు, మరో ప్రతిని గవర్నర్ నరసింహన్, సెక్రటరీ మహంతికి అందజేశారు. బిల్లు అందిన తర్వాత 2014 జనవరి 23లోపు సమగ్రమైన అభిప్రాయాలతో నివేదిక ఇవ్వాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ సమయంలోనే తెలంగాణ ప్రజానీకాన్ని అప్రమత్తం

చేయడంలో... ఉమ్మడి సీఎం కిరణ్ కుమార్ ఒత్తిళ్లకు తలొగ్గకుండా టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కట్టుబడి ఉండేలా టీఆర్ఎస్, ఉద్యోగ సంఘాలు, తెలంగాణ ఉద్యమకారులు చేసిన ఒత్తిడి సత్ఫలితాలనిచ్చింది. బిల్లు వచ్చిన వెంటనే సభలో ప్రవేశపెట్టి ఆమోదం తెలుపుతామంటూ టీ కాంగ్రెస్ నేతలు ప్రకటించడంతో... తెలంగాణవాదన, ఉద్యమ తీవ్రత తారా స్థాయికి చేరిందనేది స్పష్టమైంది. ఇదే సందర్భంలో బిల్లును నిరసిస్తూ పెద్ద ఎత్తున్న ఏపీఎన్జీవోలు అసెంబ్లీ బంద్ కు పిలుపునివ్వడంతో... హైదరాబాద్ నగరంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పోలీసు సిబ్బందితో పాటు కేంద్ర బలగాల పహారాలో అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యాయి.

## ఢిల్లీ వేదికగా తెలంగాణ ఉద్యమం

అసెంబ్లీ వేదికగా సీమాంధ్ర నేతలు కుట్రలు, ఆటంకాలు ఢిల్లీకి చేరుకున్నాయి. ముసాయిదా బిల్లుపై రూపొందించిన నివేదికను పార్లమెంట్ కు చేరడంతో, శీతాకాల సమావేశంలో బిల్లును ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా సీమాంధ్ర నేతలు అడ్డుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. అయితే హైదరాబాద్ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ముసాయిదా బిల్లు చేరడంతో... ఇక్కడే సంతకం చేసి పార్లమెంట్ కు పంపించారు. అనుకున్నట్లుగానే 2014 ఫిబ్రవరి 13న కేంద్రమంత్రి సుశీల్ కుమార్ షిండే లోక్ సభలో తెలంగాణ ముసాయిదా బిల్లు ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలోనే తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. తెలంగాణకు మొదటి నుంచి అడ్డుపడుతున్న లగడపాటి రాజగోపాల్ పేపర్ స్ప్రే చేయడంతో... సభ్యులు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. ఆందోళన పెరుగుతున్న క్రమంలో బిల్లు ప్రవేశపెట్టిన వెంటనే సభాపతి మీరాకుమార్ లోక్ సభను వాయిదావేశారు. సమైక్యంధ్రా నినాదాలతో అట్టడుకిన సభలో ఏపీ ఎంపీలు బీభత్సం సృష్టించారు. మరో వైపు రాజ్యసభలోనూ తెలంగాణ అంశం వేడి రాజేసింది. ఏపీ సభ్యులు చైర్మన్ మైక్రో ఫోన్ ను విరిచివేసే ప్రయత్నం చేయగా.. సమైక్యాంధ్ర ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు (తెలంగాణ ముసాయిదా బిల్లు) నేపథ్యంలో ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. నిరసనల మధ్యే కేంద్ర హోంమంత్రి సుశీల్

కుమార్ షిండే తెలంగాణ ముసాయిదా బిల్లు పైన చర్చను ప్రారంభించాలని కోరారు. దీంతో స్పీకర్ సభను 12.45 నిమిషాలకు వాయిదా పడింది. – తెలంగాణ బిల్లుకు మద్దతిస్తామని బిజెపి అధికార ప్రతినిధి ప్రకాశ్ జవదేకర్ ప్రకటించారు. కేంద్రమంత్రి జైరామ్ రమేష్‌తో భేటీ బిజెపి అగ్రనేతలు భేటీ అయ్యారు. ఎనిమిది కీలక సవరణలు చేశారు. – సీమాంధ్ర ఎంపీలు, మంత్రులు నిరసన వ్యక్తం చేయడంతో సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో సభను మూడు గంటల వరకు వాయిదా వేశారు. – సభలో బిల్లును తాము వ్యతిరేకిస్తామని సమాజ్‌వాది పార్టీ సీనియర్ నేత రామ్ గోపాల్ యాదవ్ తెలిపారు. రాష్ట్రాల విభజనతో సమస్యలు వస్తాయన్న తమ పార్టీ నిర్ణయానికి కట్టుబడే ఉన్నామని చెప్పారు. అందుకు అనుగుణంగా బిల్లును తాము వ్యతిరేకిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ విభజనకు తాము వ్యతిరేకమని, సీమాంధ్ర ఎంపీలకు తోడు మంగళవారం మార్క్సిస్టు పార్టీ, శివసేన, అకాలీదళ్, సమాజ్‌వాది పార్టీ సభ్యులు కూడా బిల్లును వ్యతిరేకించారు. లోకసభ స్పీకర్ మీరా కుమార్ ముందుగా ప్రకటించినట్టు సభ మళ్లీ పునఃప్రారంభమ్కెంది. అయితే సీమాంధ్ర సభ్యులకు తోడు మార్క్సిస్టు పార్టీకి చెందిన సభ్యులు కూడా తొలిసారిగా తెలంగాణ బిల్లుకు సభలో నిరసన వ్యక్తం చేశారు. వారు కూడా ప్లకార్డులు పట్టుకున్నారు. మార్క్సిస్టు పార్టీ సభ్యులు ఎన్నడూ లేనివిధంగా సేవ్ ఆంధ్రప్రదేశ్ అనే నినాదాలతో సభ వెల్‌లోకి వస్తూ నినాదాలు చేశారు. – ప్రతిపక్షాలవ్కెపు నుంచి ఎవ్వరూ సభ వెల్‌లోకి రాకుండా తెలంగాణ ఎంపిలు మందా జగన్నాథం, పొన్నం ప్రభాకర్ అడ్డుగా నిల్చుండగా, మార్క్సిస్టు పార్టీకి చెందిన సభ్యులు వారిని తోసుకుని ప్లకార్డులతో ముందుకు వచ్చి వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. సిపిఎంతో పాటు అన్నాడిఎం డిఎంకె, డిఎంకె పార్టీలకు చెందిన సభ్యులు కూడా వెల్‌లోకి వచ్చారు. అయితే సిపిఎం సభ్యులు అందరూ సేవ్ ఆంధ్రప్రదేశ్ అని నినాదాలు చేయగా, డిఎంకె, అన్నా డిఎంకె పార్టీల సభ్యులు మత్స్యకారుల సమస్యలపై నినాదారు చేశారు. – ఏవిధంగాన్కెనా తెలంగాణ బిల్లును పాస్ చేయించాలని ధృఢనిశ్చయంతో ఉన్నామని కేంద్ర హొంశాఖ సహాయమంత్రి ఆర్‌పిఎన్ సింగ్ స్పష్టం చేశారు. గందరగోళం మధ్య బిల్లు పాస్ చేయాలా వద్దా అనేది స్పీకర్ నిర్ణయిస్తారని ఆయన అన్నారు. – మరోసారి ప్రారంభమైన లోకసభ మరోసారి వాయిదా పడింది. సభ ప్రారంభం కాగానే సీమాంధ్ర ఎంపీలు, మంత్రులు వెల్లోకి వెళ్లారు. ఓ ఎంపీ మైక్ లాగారు.

సభలో గందరగోళం ఏర్పడటంతో మీరా కుమార్ సభను వాయిదా వేశారు. మరోవైపు తమిళనాడు ఎంపీలు కూడా ఆందోళన వ్యక్తం చేశారు.

సీమాంధ్ర ప్రాంత నేతల ఆందోళన మధ్యనే బిల్లుకు లోకసభ ఆమోదం తెలిపింది. అంతకు ముందు బిజెపి తీరుపై సస్పెన్స్ కొనసాగినా బిల్లుకు మద్దతు పలికింది. తాము అధికారంలోకి వచ్చాక సీమాంధ్రకు న్యాయం చేస్తామని ప్రకటించింది. తెలంగాణ ముసాయిదా బిల్లు పైన కేంద్ర హెూంమంత్రి సుశీల్ కుమార్ షిండే, లోకసభ ప్రతిపక్ష సభ్యురాలు సుష్మా స్వరాజ్, తెలంగాణ ప్రాంత కేంద్రమంత్రి జైపాల్ రెడ్డిలు మాట్లాడారు. లోకసభలో సవరణల వారీగా ఓటింగ్ కూడా జరుగుతోందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును చర్చకు ప్రవేశపెట్టిన నేపథ్యంలో తెలంగాణ ఏర్పాటుకు తాము సంపూర్ణంగా మద్దతిస్తామని బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బిఎస్పీ) అధ్యక్షురాలు మాయావతి అన్నారు. పార్లమెంట్ వాయిదా అనంతరం ఆమె లోక్‌సభ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు న్యాయపూరితమ్కెనదని ఆమె అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలోని బడుగు బలహీన వర్గాలు అత్యంత వెనుకపడ్డాయని ఆమె అన్నారు. ఉత్తర ప్రదేశ్‌ను కూడా నాలుగు రాష్ట్రాలుగా విభజించాలని మాయావతి డిమాండ్ చేశారు. తాము చిన్న రాష్ట్రాలకు ఎప్పుడు అనుకూలమని, కేంద్రం యూపిని కూడా విభజిస్తే పరిపాలన సుగమం అవుతుందని ఆమె అభివర్ణించారు. మహారాష్ట్రలో కూడా విదర్భా రాష్ట్ర ఏర్పాటుకు డిమాండ్లు ఉన్నాయని ఆమె అన్నారు.

## తెలంగాణకు అసలైన పండుగ

తెలంగాణ ఉద్యమ చరిత్రలో 2009 తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు కీలకమైనవి. మహాకూటమి నుంచి పార్లమెంట్ లో ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ బిల్లు ఆమోదం పొందేంత వరకు ఎన్నో సంఘటనలు, సంఘర్షణలు, ఉద్రేకాలు చోటుచేసుకున్నాయి. ఓవైపు 60 ఏళ్లుగా ప్రత్యేక రాష్ట్రాన్ని కాంక్షిస్తూ అంకుఠిత దీక్షతో సాగుతున్న ఉద్యమకారులు... ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి ద్రోహం చేసిన ఆంధ్రా పెట్టుబడిదారులకు మధ్య జరిగిన సంఘర్షణలో చివరకు తెలంగాణ రాష్ట్రం పురుడు పోసుకుంది. ఎంతో మంది ఆత్మ బలిదానాలకు అశ్రు నివాళిగా పార్లమెంట్ లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదం పొందేంత వరకు టీఆర్ఎస్ తోపాటు కాంగ్రెస్, బీజేపీ లతో సహా అన్ని రాజకీయ

పార్టీలు క్రియాశీలకంగా వ్యవహరించాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 30 రాజకీయ పార్టీలు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు వెన్నుదన్నుగా నిలిచి ఊపిరి పోశాయి. ఆంధ్రా పెట్టుబడిదారులైన కొందరి నేతల దౌర్జన్యాలు, దాడులను ధీటుగా ఎదుర్కొని తెలంగాణ ముందుకు వచ్చింది. ఉద్యమ కారులు ఓవైపు, తెలంగాణ సాధకుడు కేసీఆర్ మరోవైపు జోడెద్దులా 2014 ఫిబ్రవరి 14న ప్రత్యేక తెలంగాణ బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసేంత వరకు నిరంతరం శ్రమించారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో తెలంగాణ వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొంది. తెలంగాణ పది జిల్లాల్లో ప్రజలందరూ సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ ప్రజల కలలను సాకారం చేస్తూ తెలంగాణ బిల్లుకు ఆమోదం లభించడంతో న్యూఢిల్లీలోని ఏపిభవన్‌లో ఉన్న తెలంగాణ వాదులు అక్కడే నృత్యాలు చేస్తూ వారి ఆనందాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణ అన్ని జిల్లాల్లో టపాసులు పేల్చుతూ నృత్యాలు చేస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాంత నాయకులందరూ పార్టీలకతీతంగా మిఠాయిలు పంచుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తపరుచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ, భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్, నాయకులు సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీ మొదలగు జాతీయ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని వేడుకలు చేసుకున్నారు. జై తెలంగాణ నినాదాలు తెలంగాణ బిల్లుకు మంగళవారం లోక్‌సభ ఆమోదం తెలపడంతో తెలంగాణ వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో జై తెలంగాణ నినాదాలు చేస్తున్న ప్రజలు. హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద మిఠాయిలు పంచుకుంటున్న న్యాయవాదులు, విద్యార్థులు, ఉద్యమకారులు, తెలంగాణ రాజకీయ పార్టీల నేతల సంబరాలు అంబరాన్నంటాయి. దీంతో స్వతంత్ర భారత పోరాట స్ఫూర్తితో అహింసయుత రాజకీయ పోరులో తెలంగాణ ప్రజలు విజయం సాధించగా, దీంతో 60 ఏళ్ల తెలంగాణ కల సాకారామైంది. ప్రత్యేక తెలంగాణ సాధకుడిగా కేసీఆర్ చరిత్ర పుటల్లోకెక్కారు.

## ముక్తాయింపు

60 ఏండ్ల తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఎంతోమంది పోరాటయోధులు... ఎన్నెన్నో ఘట్టాలు... అవసరమని భావించిన వాటిని క్లుప్తంగా స్పృశించాను. ఈ పుస్తకం మొత్తం ఉద్యమానికి నిలువుటద్దం అని చెప్పను. కానీ, నా ప్రయత్నంగా క్లుప్తంగా రాసిన కరదీపికగా చెప్పగలను.

ఇంటర్‌నెట్ నుంచి గానీ, ఇతర రచయితలు రాసిన పుస్తకాలు, ప్రత్యక్ష సాక్షులు, ఉద్యమకారుల నుంచి సేకరించిన విషయాలన్నీ క్రోడీకరించాను అని చెప్పగలను. ఈ ప్రయత్నంలో ఉపయోగపడిన పుస్తకాల రచయితలకు, ప్రత్యక్షంగా, పరోక్షంగా చూసిన ఉద్యమ విషయాలను చెప్పిన వ్యక్తులకు నా హృదయపూర్వక వందనాలు...

స్వతంత్ర్య సంగ్రామాన్ని మించిన తెలంగాణ ఉద్యమాన్ని గ్రంథస్తం చేయడం ఆశామాషీ కాదు. అందుకే ఎంతో జాగ్రత్తగా ఈ మహాయజ్ఞాన్ని పూర్తిచేశాను.

అయినా ఏమైనా తప్పులుంటే సదభిప్రాయంతో సమాచారమిస్తే మలిముద్రణలో సవరించుకుంటానని సవినయంగా తెలియజేసుకుంటున్నాను.

**- ఎం. నాగశేష కుమార్**